19-02Pg1exHMNWJQETC.qxd:19-02Pg1exHMNWJQETC.qxd 01/01/01 9:55 AM Page 1

వాహిని
గత వారం రోజుల్లో వెలువడిన
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

గుంటూరు
fb.com/vaartha

Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

19-2-2025 బుధవారం సంపుటి: 31 సంచిక: 18 పేజీలు: 12 వెల: 6.50

మహాకుంభ్‌లో ఇప్పటికి 55 కోట్ల మంది పుణ్యస్నానం 9లో

లోయలో పడిన బస్సు: 51 మంది దుర్మరణం

# ఇక ఆక్వాలో అద్భుత ఫలితాలు

## ప్రకృతి సేద్యం ఉత్పత్తులకు ప్రపంచ వ్యాప్త డిమాండ్

## రాష్ట్ర జివిఎలో ఆక్వా వాటా 8.8శాతం: సిఎం చంద్రబాబు



మంగళవారం ఆక్వా టెక్ 2.0 కాన్ క్లేవ్‌లో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సిఎం చంద్రబాబు. చిత్రంలో మంత్రి అచ్చెన్నాయుడు,సిఎస్ విజయానంద్

**విజయవాడ, ఫిబ్రవరి 18,ప్రభాతవార్తప్రతినిధి:** ఆక్వారంగంలో సాంకేతికతను వినియోగించడంతో అద్భుత ఫలితాలు సాధించవచ్చని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిపుష్టికి ఆక్వారంగం అభివృద్ధి యంత్రం(గ్రోత్ ఇంజన్)గా నిలుస్తుందని సిఎం అన్నారు. టెక్నాలజీ వాడకం, నూతన పద్ధతులతో ఈ రంగంలో నిలకడగా 30 గ్రోత్‌రేట్ సాధ్యమేనన్నారు. మూడు రోజుల పాటు విజయవాడలోని ఓ హోటల్‌లో జరిగిన ఆక్వా టెక్ 2.0 కాన్ క్లేవ్ మంగళవారం చివరి రోజున ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరయ్యారు. జిఎఫ్ఎస్‌టి ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో ఆయన జ్యోతి ప్రజ్వలన అనంతరం కీలక ప్రసంగం చేసారు. ఆక్వారంగంలో వస్తున్న మార్పులు, అవకాశాలు, సమస్యలు, పరిష్కారాలు, పాలసీలు, టెక్నాలజీ సహకారం వంటి అంశాలపై చర్చించారు. రైతులు, ప్రాసెసింగ్ ఫ్యాక్టరీల యజమానులు, ట్రేడర్లుతో పాటు నిపుణులు ఈ కాన్‌క్లేవ్‌లో పాల్గొన్నారు. ఆక్వాలో ప్రకృతి సేద్యంతో ప్రపంచ వ్యాప్తంగా మన ఉత్పత్తులకు డిమాండ్ ఏర్పడుతుందని సిఎం వివరించారు. ప్రకృతి సేద్యంద్వారా వ్యవసాయంలో మంచి ఫలితాలు వస్తున్నాయన్నారు.ఆక్వాలో కూడా ఆ తరహా విధానాలు అమలు చేయాలన్నారు. ఆక్వా ఫీడ్‌విషయంలో తగు మార్పులు చేయాలని సిఎం అన్నారు. మన ఉత్పత్తులకు వ్యాల్యూ యాడ్ చెయ్యడం ద్వారా రైతులు ఎక్కువ ఆదాయం పొందవచ్చని సిఎం చెప్పారు. ప్రస్తుతం 4 లక్షల ఎకరాల్లో ఆక్వాను సాగు చేస్తున్నారని...202930నాటికి 10 లక్షల >>2



మంగళవారం న్యూఢిల్లీలో ప్రధాని మోడీతో భేటీ అయిన ఖతార్ ఎమిర్ షేక్ తమీమ్ 2లో

# ఖతార్, భారత్ మధ్య కొత్త వాణిజ్య ఒప్పందం

## వచ్చే ఐదేళ్లలో 28 బిలియన్ డాలర్ల ద్వైపాక్షిక వాణిజ్యం లక్ష్యం

## ప్రధాని మోడీతో ఖతార్ ఎమిర్ షేక్ తమీమ్ బిన్ అహ్మద్ భేటీ



మంగళవారం విజయవాడ సబ్‌జైల్‌లో వంశీతో ములాఖత్ తరువాత మీడియాతో మాట్లాడుతున్న మాజీ సిఎం వైఎస్ జగన్

# రాష్ట్రంలో ప్రజాస్వామ్యం కూలిపోతోంది..

## తీవ్రంగా విమర్శించిన మాజీ సిఎం జగన్

## విజయవాడ సబ్‌జైల్లో ఉన్న వల్లభనేనితో ములాఖత్

## టిడిపి కార్యాలయం తగలబడలేదు: మీడియాతో జగన్

**విజయవాడ.ఫిబ్రవరి18,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ప్రజాస్వామ్యం కూలిపోతోందని వైకాంగ్రెస్‌పార్టీ నేత,మాజీ సిఎం వైఎస్ జగన్మోహనరెడ్డి ఆరోపించారు.ఇందుకు వంశీ వంటి తమ పార్టీ నేతలపై పెట్టిన కేసులు నిదర్శనమన్నారు. ప్రభుత్వం తమ పార్టీనేతలపై పెట్టే ప్రతి కేసు ఇల్లీగల్ కేసే, ప్రతి కేసులోనూ వీరే బెదిరిస్తున్నారు. తిరిగి మమ్మల్నే బెదిరిస్తున్నారంటూ తప్పుడు కేసులు పెడుతున్నారు,అసలు ఎవరు, ఎవరిని బెదరిస్తున్నారు. ప్రతి విషయంలోనూ వారే తప్పుడు కేసులు పెడుతున్నారు. పారిశ్రామికవేత్తలను, రాజకీయనేతలను వదిలిపెట్టడం లేదు. ప్రతి ఒక్కరినీ వీరే బెదరించి, అవతలి వారు బెదిరిస్తున్నారంటూ అక్రమ కేసులు పెడుతున్నారు. ఇవ్వన్నీ ఊరికే పోవు. ఇవ్వన్నీ కూడా వీరికి చుట్టుకుంటాయన్నారు. అప్పుడు >>2

# మరిన్ని పర్యాటక ప్రాజెక్టులు



మంగళవారం ఢిల్లీలో కేంద్రమంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌తో భేటీ అయిన మంత్రి దుర్గేష్

## ఢిల్లీలో కేంద్రమంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌తో భేటీ అయిన మంత్రి దుర్గేష్

## పూర్తి సాయం అందిస్తామని షెకావత్ హామీ

**విజయవాడ,ఫిబ్రవరి18,ప్రభాతవార్తప్రతినిధి:** కొత్త ఆర్థిక సంవత్సరంలో ఏపీకి మరిన్ని పర్యాటక, సాంస్కృతిక ప్రాజెక్టులను కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నట్లు కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ వెల్లడించినట్లు రాష్ట్ర టూరిజం, కల్చరల్ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. మంగళవారం విజయవాడ నుండి ఢిల్లీకి వెళ్లిన రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ సాయంత్రం కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌కు శాస్కి స్కీమ్ ద్వారా అఖండ గోదావరి, గండికోట ప్రాజెక్టులకు నిధులు కేటాయించినందుకు స్వయంగా కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌ని కలిసి మంత్రి దుర్గేష్ ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ ఏపీకి సంబంధించిన పలు పర్యాటక, సాంస్కృతిక ప్రాజెక్టులకు ఆమోదం తెలపాలని కోరగా కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు. నూతన ప్రాజెక్టులకు ప్రతిపాదనలు సిద్ధం చేసుకొని వస్తే కొత్త ఆర్థిక సంవత్సరంలో మరిన్ని ప్రాజెక్టులకు ఆమోదం తెలిపేందుకు సంసిద్ధంగా ఉన్నామని కేంద్రమంత్రి గజేంద్రసింగ్ షెకావత్ తెలిపినట్లు మంత్రి దుర్గేష్ తెలిపారు.ఈ క్రమంలో దేశంలో ఏర్పాటు చేయనున్న బుద్ధిస్ట్ సర్క్యూట్‌లో భాగంగా ఎపికి ఒక సర్క్యూట్ కేటాయిస్తామని తెలిపారన్నారు. నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా సెంటర్ ఎపిలో ఏర్పాటు చేయమని మంత్రి దుర్గేష్ అడగగా అందుకు కేంద్ర మంత్రి షెకావత్ సానుకూలంగా స్పందించారన్నారు. ఎపిలో ఇండియన్ కౌన్సిల్ ఫర్ కల్చర్ రిలేషన్స్, లలిత కళా అకాడమీ ఏర్పాటు, జీవీఆర్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ కాలేజీలో కళాక్షేత్ర ఆడిటోరియం, సాహిత్య అకాడమీ రీజినల్ సెంటర్ ఏర్పాటు అంశాలను మంత్రి దుర్గేష్ ప్రస్తావించగా సానుకూలంగా స్పందించారన్నారు. అదే విధంగా శ్రీశైలం మెగా టూరిజం హబ్, సూర్యలంక బీచ్, మచిలీపట్నం, నెల్లూరు మైపాడ్ బీచ్‌లు అభివృద్ధి, మంగళగిరి లక్ష్మీ నర్సింహస్వామి ఆలయం, శ్రీకాకుళంలోని అరసవిల్లి దేవాలయం, నెల్లూరులోని వేదగిరి లక్ష్మీ నర్సింహస్వామి ఆలయం, శ్రీకాళహస్తిలోని శ్రీకాళహస్తీశ్వరాలయాలకు సంబంధించిన పలు ప్రాజెక్టులను కేంద్రమంత్రికి వివరించారు. అరకులో నేషనల్ అడ్వెంచర్ అకాడమీ, గుంటూరులో ఫుడ్ క్రాఫ్ట్ ఇన్ స్టిట్యూట్, అమరావతిలో సెంట్రల్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్ మెంట్, తిరుపతి ఐఐటీలో టూరిజం స్టార్టప్స్ కోసం ఇంక్యుబేషన్ సెంటర్ తదితర అంశాలను వెల్లడించగా కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించనట్లు తెలిపారు. త్వరలోనే ఎపికి పర్యాటక ప్రాజెక్టులు కేటాయించి కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా పర్యాటకాభివృద్ధికి తోడ్పాటు అందిస్తామని కేంద్ర మంత్రి తెలిపినట్లు మంత్రి దుర్గేష్ స్పష్టం చేశారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లు మంచి విజన్ ఉన్న నేతలుగా కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ అభివర్ణించినట్లు మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. రాష్ట్ర పర్యాటక రంగంలో పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యం న్యూఢిల్లీ పర్యటనకు వెళ్లిన మంత్రి దుర్గేష్ మంగళవారం బిజీబిజీగా గడిపారు. బుధవారం ద్వారకా ఢిల్లీలోని యశోభూమిలో జరిగే సౌత్ ఏషియా లీడింగ్ ట్రావెల్ అండ్ టూరిజం ఎగ్జిబిషన్2025 ప్రారంభోత్సవంలో పాల్గొననున్న మంత్రి దుర్గేష్ రాష్ట్ర పర్యాటకరంగంలో పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అవకాశాలను ఎస్ఎటీటీఈ2025 వేదికగా వివరించనున్నారు. ఈ క్రమంలో ఢిల్లీ వేదికగా 28 రాష్ట్రాలు, 50 దేశాల నుంచి వచ్చే ప్రతినిధుల సమక్షంలో కూటమి ప్రభుత్వం రాష్ట్ర పర్యాటకరంగానికి కల్పించిన పరిశ్రమహోదా, నూతన టూరిజంపాలసీ, రాష్ట్రంలో పర్యాటక రంగానికి అనుకూలమైన పరిస్థితులు తదితర వివరాలను వివరించనున్నారు.



# రేపు ఢిల్లీ బాద్‌షా ప్రమాణం

## రామ్‌లీలామైదాన్‌లో భారీ ఏర్పాట్లు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18:** రెండున్నరదశాబ్దాల తర్వాత దేశరాజధాని న్యూఢిల్లీరాష్ట్రంలో బిజెపి పాలన పగ్గాలుచేపడుతోంది. ఇందుకోసం ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసేందుకు సిద్ధం అవుతోంది. 20వ తేదీ రామ్‌లీలా మైదాన్‌లో ముఖ్యమంత్రి ప్రమాణస్వీకారంచేస్తారు. ఆయనతోపాటే ఎనిమిది మంది కేబినెట్ మంత్రులుగా ప్రమాణం చేస్తారని బిజెపి నేతలు చెపుతున్నారు. కాగాప్రమాణ స్వీకారానికి ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, పార్టీ చీఫ్‌లు ఇతర ముఖ్యులు హాజరవుతున్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ, రక్షణ మంత్రిరాజ్‌నాథ్; హోంమంత్రి అమిత్‌షాలతోపాటు కేంద్రకేబినెట్‌మంత్రులు కూడా హాజరవుతారని బిజెపి కేంద్ర కమిటీ చెపుతోంది. అలాగే భారీ ఎత్తున సినీతారలు, పారిశ్రామికవేత్తలకు కూడా ఢిల్లీసర్కారు ఇప్పటికే ఆహ్వానాలు పంపించింది. ప్రమాణస్వీకారానికి ముందు కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తుంది. 59 మంది సినీతారలు, ప్రముఖపారిశ్రామికవేత్తలతో పాటు ఇతర దేశాల దౌత్యవేత్తలు, రాయబారులు, 20 రాష్ట్రాలముఖ్యమంత్రులు, డిప్యూటిసీఎంలు, కేంద్రమంత్రులు,బిజెపి నాయకులు పలువురు పాల్గొంటున్నారు.

# ఆంధ్రా వర్సిటీ విసిగా ప్రొ. జిపి రాజశేఖర్

## మరికొన్ని వర్సిటీలకూ విసిల నియామకం

**విజయవాడ ఫిబ్రవరి 18 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్టంలోని పలు విశ్వవిద్యాలయాలకు వైస్ చాన్సలర్లను నియమిస్తూ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ నోటిఫికేషన్ విడుదల చేశారు. ఆంధ్రా వర్సిటీ విసిగా ప్రొఫెసర్ జి.పి రాజశేఖర్ నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన ఐఐటి ఖరగ్‌పూర్‌లో గణితశాస్త్ర అచార్యునిగా చేస్తున్నారు. కాకినాడ జేఎన్టీయూ విసిగా ప్రొఫెసర్ సి.ఎస్.ఆర్.కె. ప్రసాద్‌ను నియమించారు. ప్రస్తుతం ప్రసాద్ వరంగల్ నిట్‌లో సివిల్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్ ఉన్నారు. యోగి వేమన వర్సిటీకి విసిగా ప్రొపెసర్‌గా పి.ప్రకాశ్‌బాబును నియమితులయ్యారు. ప్రస్తుతం ఈయన హెచ్‌సియూ స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్‌లో బయో టెక్నాల >>2

# పిఎస్‌లలో సిసి కెమెరాల వివరాలివ్వండి

## ప్రభుత్వాన్ని ఆదేశించిన హైకోర్టు




**విజయవాడ ఫిబ్రవరి 18 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలోని అన్ని పోలీస్‌స్టేషన్లల్లో సిసి టీవి కెమెరాల పనితీరుపై నివేదిక ఇవ్వాలని ఎపి ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. 1392 పోలీస్‌స్టేషన్లు రాష్ట్రంలో ఉన్నాయి. వాటిలో1001 స్టేషన్లల్లో మాత్రమే కెమెరాలు ఏర్పాటు చేయడంపై వివరణ ఇవ్వాలని స్పష్టం చేసింది. 81 జైళ్లలో 1226 కెమెరాలు అమర్చగా 788 మాత్రమే పనిచేస్తున్నాయని, పాడైన వాటి మరమ్మతులకు ఎలాంటి చర్యలు తీసుకున్నారో చెప్పాలంది. సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు స్టేషన్ ప్రాంగణం మొత్తం కనిపించేలా సిసి కెమెరాలు ఏర్పాటు చేశారా,లేదా అనేది పరిశీలించి రాష్ట్ర ఐటీ విభాగ ఉన్నతాధికారికి నివేదికలు సమర్పించాలని డీఎస్పీలందరికీ సూచించింది. ఆ నివేదికలను తమ ముందుంచాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. పోలీస్‌స్టేషన్లు జైళ్లలో సిసి కెమెరాల ఏర్పాటు వీడియో స్టోరేజ్ సామర్థ్యం ఎంత? ఎన్ని రోజులు ఫుటేజ్‌ను భద్రపరుస్తున్నారు. తదితర వివరాలతో అఫిడవిట్ వేయాలంది. ఈ కేసులో విచారణను మార్చి 10కి వాయిదా వేసింది.హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఆర్.రఘునందన్‌రావు, జస్టిస్ కుంచం మహేశ్వరరావుతోకూడిన ధర్మాసనం సోమవారం ఈ ఉత్తర్వులిచ్చింది. అన్ని ఠాణాలు కారాగారాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలు రాష్ట్రంలో పూర్తిగా అమలు కాలేదంటూ న్యాయవాది తాండవ యోగేష్ గతంలో హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం వేశారు. సిసి కెమెరాల ఏర్పాటు ప్రక్రియ పూర్తి చేయాలంటూ 2019 జులై 15న కోర్టు ఉత్తర్వులిచ్చింది. వాటికి అధికారులు కట్టుబడలేదంటూ యోగేష్ వేసిన కోర్టుధిక్కరణ వ్యాజ్యంపై సోమవారం హైకోర్టు విచారణ జరిపింది. ప్రభుత్వ న్యాయవాది విష్ణుతేజ వాదనలు వినిపిస్తూ లాకప్ ఉన్న పోలీస్‌స్టేషన్లలో కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. పాడైన వాటిని బాగుచేసే బాధ్యతను రెండు ఏజెన్సీలకు అప్పగించామన్నారు. పిటిషనర్ వాదనలు వినిపిస్తూ ఇప్పటికీ 391 స్టేషన్లలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయలేదన్నారు. కటారు గోపిరాజు అనేవ్యక్తిని అక్రమంగా నిర్బంధించారంటూ పల్నాడు జిల్లా మాచవరం పోలీసులపై దాఖలైన పిటిషన్‌ను సైతం పైన పేర్కొన్న కోర్టుధిక్కరణ కేసుతో కలిసి విచారిస్తామని ధర్మాసనం పేర్కొంది. ఈ కేసులో సిసి టివి ఫుటేజ్ కాలిపోయిందంటూ మాచవరం పోలీసులు గతంలో కోర్టుకు నివేదించారు.

# బోర్డు సభ్యుడికి 'రూల్స్' వర్తించవా?

## తన కోసం మహద్వారం తెరవాలంటూ ఆలయ సిబ్బందితో దురుసుగా ప్రవర్తించిన కర్ణాటక మెంబర్ నరేశ్ కుమార్



**తిరుమల,ఫిబ్రవరి 18ప్రభాతవార్తప్రతినిధి:** ఏడు కొండల వేంకటేశ్వరస్వామి సన్నిధిలో విఐపిలూ సామాన్యభక్తులేనని, హడావిడి, ఆర్భాటం చేయొద్దని స్వయంగా ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు హితవుపలికినా మార్పుమాత్రం కనిపించడంలేదు. ఇందుకు తాజా నిదర్శనంగా దేవుని దర్శనం చేసుకుని ఆలయం వెలుపలకు రావడానికి పడికావలి ముందున్న మహద్వారం గేట్‌ద్వారా బయటకు వచ్చేందుకు బోర్డు సభ్యుడు రావడం, అక్కడ విధుల్లో ఉన్న ఉద్యోగి నిరాకరించడంతో రగడ చోటుచేసుకుంది. మంగళవారం ఉదయం ఈ సంఘటన ఆలయం ప్రాంగణంలోనే జరిగింది. అయితే ఆ బోర్డుసభ్యుడి వెనుకనే వచ్చిన ఇద్దరు అధికారులు కూడా ఈ తతంగంపై నోరుమెదపకపోవడం మరీ చోద్యంగా మారింది. కర్నాటకకు చెందిన బోర్డుసభ్యుడు నరేశ్‌కుమార్ మంగళవారం ఉదయం విఐపి బ్రేక్‌లో ఆలయంలోనికి వెళ్లాడు. స్వామివారిని దర్శనం చేసుకుని ఆశీస్సులందుకున్నాడు. వేదపండితుల వేదాశీర్వచనం అనంతరం ఆయన ఆలయం వెలుపలకు రావడానికి మహద్వారం గేట్ వద్దకు చేరాడు. ఆ సమయంలో గేట్‌లో విధుల్లో ఉన్న ఓ అటెండర్ స్థాయి ఉద్యోగి ఈ గేట్ తెరవడానికి లేదని, పై అధికారుల ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరూ ఆలయం వెలుపలగేట్‌ద్వారా వెళ్లాలని కోరాడు. అయితే తానూ బోర్డుసభ్యుడినని ఆయన సిబ్బందిపై విరుచుకుపడ్డాడు. తానే వచ్చినా గేట్ తెరవవా అంటూ >>2

# ఎర్రచందనానికి గ్లోబల్ టెండర్లు

## రూ. 500 కోట్ల ఆదాయంపై ప్రభుత్వం ఆదేశాలు



**రాజంపేట అర్బన్ ఫిబ్రవరి18 ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా అటవీ శాఖ వద్ద పేరుకుపోయి ఉన్న నిల్వలను విక్రయించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు మంగళవారం రాష్ట్రంలో స్మగ్లర్ల నుంచి స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం నిల్వలను గ్లోబల్ టెండర్ల ద్వారా విక్రయించేందుకు రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ ఎండి డాక్టర్ ఆర్.పి. ఖజురియ టెండర్ ఉత్తర్వులను జారీ చేశారు. 1990 నుంచి రాష్ట్రవ్యాప్తంగా అటవీ శాఖ వద్ద ఉన్న ఎర్రచందనం నిలువలను విక్రయించే ప్రక్రియకు రాష్ట్ర ప్రభుత్వాలు శ్రీకారం చుట్టాయి. తాజాగా కూటమి ప్రభుత్వం 21 సారి టెండర్లను ఆహ్వానించింది. గత ఏడాది నవంబర్లో కూడా విక్రయించాలని టెండర్లను పిలిచింది.అయితే ఆశించిన స్థాయిలో అంతర్జాతీయ స్థాయిలో స్పందన లభించలేదు. దీంతో అనుకున్న స్పందన లేకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం ఎర్రచందనం విక్రయించేందుకు వెనక్కు తగ్గింది. తాజాగా మరోసారి 905 మెట్రిక్ టన్నుల ఎర్రచందనం దుంగలను విక్రయించేందుకు టెండర్లను ఆహ్వానించడం జరిగింది. అంతర్జాతీయ మార్కెట్లో ఏ గ్రేడ్ ఎర్రచందనం విలువ 75 లక్షలకు తక్కువ లేదని సమాచారం. అయితే గత నవంబర్లో జరిగిన టెండర్లలోఅంతర్జాతీయ మార్కెట్లో గతంలో రాష్ట్రంలో నిలవలను కైవసం చేసుకునేందుకు కొందరు సిండికేట్‌గా మారినట్లు కూడా ప్రచారం ఉంది. అందుకే టెండర్లలలో ఎర్రచందనం నిల్వలను కొనుగోలు చేసేందుకు తక్కువ రేటు కోడ్ చేసినట్లు తెలుస్తోంది. తాజాగా టెండర్ ప్రక్రియ ప్రకారం ఈనెల 28న మొదటి విడత ఈ టెండర్ కం వేలం జరగనుంది. రెండో విడత మార్చి 13న నిర్వహిస్తారు. ఇప్పటికే రాజంపేట, భాకరాపేట, పీలేరు ప్రాంతాల నుంచి ఎర్రచందనం దుంగలను తిరుపతి సెంట్రల్ డిపోకు తరలించారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం వద్ద ఎర్రచందనం స్మగ్లర్ల నుంచి స్వాధీనం చేసుకున్న 5300 మెట్రిక్ టన్నులు ఉన్నాయని అధికారిక వర్గాల ద్వారా తెలిసింది. కనీసం ఈ ఏడాది 500 కోట్ల రూపాయల ఆదాయం లభించే అవకాశాలు ఉన్నట్లు శాఖ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అయితే ఏమాత్రం ఆదాయం వస్తుందో వచ్చే నెలకి గాని తెలియదు.

# హైకోర్టులో వల్లభనేని పిటిషన్

**విజయవాడ ఫిబ్రవరి 18 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీ హైకోర్టులో మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ పిటిషన్ దాఖలు చేశారు. రియల్ ఎస్టేట్ వ్యాపారి కాసరనేని వెంకట పాండురంగారావుపై గత ఏడాది జరిగిన దాడికి సంబంధించి నమోదైన కేసులో పోలీసులు తనను ఇరికించే అవకాశం ఉందని పిటిషన్‌లో పేర్కొన్నారు వంశీ ఈ కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని హైకోర్టును కోరారు. పాండురంగారావుపై దాడి ఘటనలో తనకు ఎలాంటి సంబంధంలేదు. పోలీసులు రాజకీయ కారణాలతో తనను నిందితునిగా చేర్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. తనతో పాండురంగారావుకు గతంలో ఉన్న రాజకీయ విభేదాలతో ఇప్పుడు తనను లక్ష్యంగా చేసుకుని ఈ కేసులో ఇరికించాలన్న ఉద్దేశంతో పోలీసులు ముందుకు వెళ్తున్నారని హైకోర్టు దృష్టికి తీసుకెళ్లారు వల్లభనేని వంశీ.

19-02pg2exHMNWJQE.qxd:19-02pg2exHMNWJQE.qxd 01/01/01 9:53 AM Page 1





మంగళవారం ప్రయాగ రాజ్ త్రివేణీ సంగమంలో పుణ్య స్నానాలు చేస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దంపతులు, కుమారుడు అకీరానందన్, మిత్రుడు త్రివిక్రమ్

# కుంభమేళా పవిత్ర సంగమంలో పుణ్య స్నానాలు చేసిన పవన్ దంపతులు

**విజయవాడ,ఫిబ్రవరి 18,ప్రభాతవార్తప్రతి:** డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ ప్రయాగ్‌రాజ్ త్రివేణి సంగమంలో మహాకుంభ మేళా సందర్భంగా కుటుంబ సమేతంగా పుణ్యస్నానాలు చేశారు. మంగళవారం ఉదయం హైదరాబాదు నుంచి నేరుగా ఆయన సతీసమేతంగా ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగరాజ్ వద్ద త్రివేణి సంగమం చేరుకున్నారు. పవన్ సతీమణి అన్నా లెజినోవా, కుమారుడు అకిరానందన్ తదితరులు అక్కడ పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం మహా కుంభమేళాలో... పితృదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.144 ఏళ్లకు ఒకసారి వచ్చే మహాకుంభమేళాకు రావడం తన అదృష్టమని ఆయన తెలిపారు. భారతీయ సాంస్కృతీక జీవనం అపూర్వమన్నారు. నదులు, నదాలను పూజించడం, పుణ్యస్నామాచరించడం భౌతికంగాను, ఆధ్యాత్మికంగా ఆనందాన్ని పంచుతాయన్నారు. సనాతన ధర్మాన్ని పాటించడమంటే మనని మనం గౌరవించుకోవడం, ఇతరులను కించపర్చడం కాదన్నారు.అది గ్రహిస్తే సనాతన ధర్మంపై ఎవ్వరు కువిమర్శలు చేయలేరన్నారు. ప్రతి ఒక్క హిందువు తప్పనిసరిగా పుణ్యస్నానం చేసి తరించాలని ఆయన సూచించారు. పవన్ కల్యాణ్ వెంట ఆయన సతీమణి అన్నా లెజినోవా,కుమారుడు అకీరానంద్‌తో పాటు మిత్రుడు, ప్రముఖ సినీ దర్శకుడు తివిక్రమ్ శ్రీనివాస్ కూడా ఉన్నారు.



మంగళవారం ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణి సంగమం వద్ద కుటుంబసభ్యులతో పుణ్యస్నామాచిరించిస్తున్న మంత్రి సవిత

## త్రివేణి సంగమంలో పుణ్యస్నామాచరించిన మంత్రి సవిత

**విజయవాడ,ఫిబ్రవరి 18,ప్రభాతవార్తప్రతినిధి:** ఆధ్యాత్మికతకు, సంప్రదాయాలకు కుంభమేళాలు పునాదులని రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి ఎస్ సవిత అభిప్రాయపడ్డారు. మహా కుంభమేళా ఆధ్యాత్మిక కార్యక్రమం మాత్రమే కాదని, కోట్లాదిమంది భారతీయుల సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక అని తెలిపారు. మంగళవారం ప్రయాగ్ రాజ్‌లోని త్రివేణి సంగమం వద్ద భర్త సి.వెంకటేశ్వరరావు, కుమారుడు జగదీష్‌తో కలిసి మంత్రి సవిత పుణ్య స్నానాలు ఆచరించారు. ఈ సందర్భంగా గంగానదికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పసుపు కుంకుమ, పువ్వులు సమర్పించి హారతి ఇచ్చారు. పితృదేవతలకు తర్పణాలు వదిలి, బ్రాహ్మణులకు వస్త్ర దానం చేశారు. అమృత ఘడియల్లో పవిత్ర నదుల్లో పుణ్య స్నానాలు ఆచరించడం వల్ల మోక్షం లభిస్తుందని పురాణాలు, వేదాలు చెబుతున్నాయి. కుంభమేళాలు భారతీయ ఆధ్యాత్మికతకు, సంస్కృతీ సంప్రదాయాలకు పునాదులు వంటివి. ముఖ్యంగా ధర్మంపై విశ్వాసం పెంపుదలకు, ఆధ్యాత్మిక జ్ఞాన సముపార్జనకు మార్గం చూపుతాయని కోట్లాదిమంది నమ్మకంఖి అని ఒక ప్రకటనలో మంత్రి సవిత తెలిపారు.

## జ్ఞానేశ్ నియామకంపై రగడ

# అర్ధరాత్రి సిఇసియా?

### సుప్రీం ఉత్తర్వులు బేఖాతరు చేయడమే..

### హడావుడి ప్రకటన ప్రధానికి తగునా?

### ప్యానెల్ మీటింగ్‌లో డిస్సెంట్‌నోట్ ఇచ్చానన్న రాహుల్

### పిటిషన్లపై 'సుప్రీం'లో నేడు విచారణ



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18:** కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ పదవికి పేరునుఖరారుచేసి అర్థరాత్రిపూట ప్రకటించడంపై రాహుల్ గాంధీ తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేసారు. సిఇసి ఇతర కమిషనర్ల నియామకానికి ఏర్పాటుచేసిన ముగ్గురుసభ్యుల ప్యానెల్ ప్రధానిమోడీ అధ్యక్షతన పనిచేస్తుంది. కమిటీలో హోంమంత్రి అమిత్‌షా, విపక్షనేత రాహుల్‌గాంధీ, న్యాయశాఖమంత్రి అర్జున్‌రామ్ మేఘవాల్‌లు ఉన్నారు. కమిటీ ఎంపిక సమయంలోనే సుప్రీంలో కేసు నడుస్తున్నందున ఉత్తర్వులు వచ్చేంతవరకూ వేచి ఉండాల్సిందిపోయి హడావిడిగా అర్థరాత్రిపూట ప్రకటించడం ప్రధానిమోడీ, హోంమంత్రి అమిత్‌షాలకు ఎంతమాత్రం తగదని గౌరవప్రదం కానేకాదని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం సోమవారం రాత్రిపొద్దుపోయాక సిఇసిగా జ్ఞానేష్ కుమార్‌ను నియమిస్తున్నట్లుప్రకటించారు. ఇప్పటివరకూ ఆయన పనిచేసిన కమిషనర్ పోస్టుకు వివేక్‌జోషి అనే అధికారిని నియమిస్తున్నట్లు ప్రకటించారు. సమావేశంలోనే రాహుల్‌గాంధీ నిర్ణయాన్ని సుప్రీంకోర్టు ఉత్తర్వులు వచ్చేంతవరకూ వాయిదా వేయాలని కోరారు. సుప్రీంకోర్టులో ఈ పిటిషన్లు బుధవారం విచారణకురానున్నాయి. అయినాకూడా ప్యానెల్ నిర్ణయాన్ని మార్చుకోకపోవడంతో రాహుల్ తన అసమ్మతి నోట్‌ను ప్రకటించారు. ప్యానెల్ సమావేశంలో తాను డిస్సెంట్‌నోట్ ఇచ్చానని స్వతంత్ర ప్రతిపత్తి ఉన్న ఎన్నికల సంఘం కార్యనిర్వాహక ప్రమేయం లేకుండా స్వేచ్ఛగా ఉండాలని, ఎన్నికల కమిషనర్, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ నియామకాలను రాజకీయ జోక్యంనుంచి మినహాయించాలని డిమాండ్‌చేసారు. సుప్రీంకోర్టు ఉత్తర్వులను సైతం ధిక్కరించారని, కమిటీనుంచి భారత ప్రధాన న్యాయమూర్తిని తొలగించారని మోడీ ప్రభుత్వం కోట్లాది మంది ఓటర్ల సమైక్యత, ఎన్నికల ప్రక్రియ స్వచ్ఛతను లాగేసుకుంటున్నదని ఆయనపేర్కొన్నారు.

2023 సంవత్సరం మార్చిరెండోతేదీ సుప్రీంకోర్టు ధర్మాసనం తీర్పునుప్రకటిస్తు సిఇసి, ఎన్నికల కమిషనర్ల నియామకాలను ప్రధానమంత్రి, విపక్ష నేత, సుప్రీంచీఫ్‌జస్టిస్‌ల ఆధ్వర్యంలోని కమిటీ సిఫారసులతో జరగాలని ఆదేశించిన అంశాన్ని గుర్తుచేసారు. సుప్రీంకోర్టు తీర్పు మిలియన్లకొద్దీ ఓటర్ల సమైక్యత ఎన్నికల ప్రక్రియను దెబ్బతీస్తోందన్నారు. సుప్రీంకోర్టు ఉత్తర్వులకు ఎవనువెంటనే ప్రభుత్వం 2023 ఆగస్టులో ఒకచట్టాన్ని తెచ్చి సుప్రీంకోర్టు ఉత్తర్వుల స్ఫూర్తిని దెబ్బతీసిందని అన్నారు. సుప్రీం ప్రధాన న్యాయమూర్తిని తప్పించడం న్యాయవ్యవస్థనుంచి తమ అధీనంలోకి రాజ్యాంగాన్ని తీసుకోవడమేనని అన్నారు. ప్రభుత్వ ఉత్తర్వులను ఒక ప్రజాప్రయోజన వ్యాజ్యంద్వారా సవాల్‌చేసారు. ఈనెల 19వ తేదీ సుప్రీంలో ఈ పిటిషన్ విచారణకు వస్తోంది. కాంగ్రెస్ పార్టీపరంగా సుప్రీంకోర్టు ఆదేశాలు వచ్చేంతవరకూ సిఇసి, కమిషనర్ల నియామకాలను పక్కనపెట్టాలని డిమాండ్‌చేస్తున్నట్లు రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

## ప్రొ. జిపి రాజశేఖర్

>>జీలో సీనియర్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. రాయలసీమ వర్సిటీ వెంకట బసవరావు, అనంతపురం జేఎన్టీయూ హెచ్.సుదర్శనరావు, తిరుమల పద్మావతి మహిళా వర్సిటి ఉమ, మచిలీపట్నం కృష్ణా వర్సిటీ కె.రాంజీ, ఆదికవి నన్నయ వర్సిటీ ప్రసన్న , విక్రమ సింహపురి వర్సిటీ అల్లం శ్రీనివాసరావు వీరంతా మూడేళ్ల పాటు ఆయా వర్సిటీలకు వీసీగా కొనసాగనున్నారు.

## 'రూల్స్' వర్తించవా?

>> చిందులు తొక్కాడు. అంతటితో ఆగకుండా మాటదురుసుగా వ్యవహరించాడు. ఈ విషయం తెలుసుకున్న కొందరు ఉద్యోగులు అక్కడకు చేరుకున్నారు. వివిఎస్ఓ అల్లంసురేంద్ర, ఆలయ సెక్యూరిటీ మహద్వారం గేట్‌వద్దకు చేరుకుని బోర్డు సభ్యుడిని సర్దిచెప్పారు. చివరకు వారే దగ్గరుండి ఆయన్ను వమద్వారంగేట్ ద్వారానే బయటకు సాగనంపారు. కాగా టిటిడి ఉద్యోగి తీరుపై బోర్డుసభ్యుడు ఆగ్రహం వ్యక్తం చేయడం మరీ కొసమెరుపు.మహద్వారం గేట్‌ద్వారా ఆలయం లోపల అర్చకులు, పండితులు, స్వాములు, అత్యవసర ఉద్యోగులు, పరకామణి కార్మికులు మాత్రమే అనుమతి ఉంటుంది. అలాంటిది బోర్డు సభ్యుడు ఇలా వ్యవహరించడం భక్తులను ఆశ్చర్యానికి గురిచేసింది.

## పోలీసు నియామక నిబంధనల సవరణ

**విజయవాడ,ఫిబ్రవరి 18,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో పోలీస్ నియామక నిబంధనలను సవరిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. ఎస్ఐ (సివిల్) పోస్టులను 65 శాతం (గతంలో 55 శాతం) డైరెక్టర్ రిక్రూట్మెంట్ ద్వారా భర్తీ చేయాలని సూచించింది. ప్రమోషన్ ద్వారా 30 శాతం, బదిలీల ద్వారా 5 శాతం భర్తీ చేయాలని పేర్కొంది. గత ఏడాది జులై 1 నుంచి ఏర్పడిన ఖాళీలను ఈవిధానంలో భర్తీ చేయాలని ఆదేశించింది.

రాష్ట్ర, కేంద్ర అవార్డులు పొందినవారికి కేటగిరీలను బట్టి 525 మార్కులు ఇచ్చి నియామకాల్లో ప్రాధాన్యత ఇవ్వాలని ఉత్తర్వులు జారీ చేసింది.

## ఇక ఆక్వాలో అద్భుత ఫలితాలు

>> ఎకరాలకు పెరగాలని సీఎం ఆకాంక్షించారు. అయితే కాలుష్య రహితంగా ఆక్వా ప్రయాణం సాగాలన్నారు. ఆక్వాలో ప్రధాన సమస్యగా ఉన్న కాలుష్యానికి పరిష్కార మార్గాలు ఉన్నాయని..వాటిని రైతులు, ఉత్పత్తి దారులు పాటించాలని కోరారు. ప్రతి ఒక్కరూ తమ సాగు వివరాలను రిజిస్టర్ చేసుకోవాలన్నారు..అలా కాకుండా ఇష్టానుసారంగా చేస్తానంటే మాత్రం నిబంధనల ప్రకారం వ్యవహరిస్తామని చెప్పారు. ఆక్వాకు ప్రాధాన్యం అనేది తమ అభిమతమన్న సిఎం...నిబంధనల అమలకు కూడా అంతే ప్రాధాన్యం ఇస్తామని...పొల్యూషన్ విషయంలో కఠినంగా ఉంటామని స్పష్టం చేశారు. రాష్ట్రానికి ఆక్వాను ప్రధాన ఆదాయ వనరుగా మార్చేందుకు ఉన్న అవకాశాలు, అధిగమించాల్సిన అవరోధాలపై ఈ సదస్సుల్లో చర్చించారు. రైతులను చైతన్య పరిచేలా...టెక్నాలజీ వాడకం పెంచేలా మూడు రోజుల పాటు పలు అంశాలపై ఇక్కడ అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు.

**ఆక్వాసాగుకు రాష్ట్రం అనుకూలం..**

ఆక్వా రంగంపై నాకు ప్రత్యేక మైన శ్రద్ధ ఉంది....మన రాష్ట్రం ఆక్వా సాగుకు అత్యంత అనుకూలం. 2014 - 19 మధ్య కాలంలో నాడు ఆక్వా రాష్ట్రానికి ప్రధాన ఆదాయ వనరుగా నిలిచింది. రాష్ట్ర జివిఎ(స్థూల విలువ జోడింపు)లో 8.8 శాతం ఆక్వా వాటాగా ఉంది. వియత్నాం వంటి దేశాల్లో మన కంటే తక్కువ ప్రొడక్షన్ ఉన్నా...వాల్యుయేషన్‌లో వాళ్లు ముందు ఉన్నారు. వియత్నాం ఆక్వా ఉత్పత్తుల్లో 3.9 మిలియన్ టన్నుల ఎగుమతులతో 13 బిలియన్ డాటర్లు ఆర్జిస్తుండగా, మనం 5 మిలియన్ మెట్రిక్ టన్నులు ఎగుమతి చేస్తూ 3 బిలియన్ డాలర్లు మాత్రమే ఆర్జిస్తున్నాం. మనం కూడా ఆ దిశగా ప్రయాణం చేయడానికి ఇలాంటి సదస్సులు ఉపయోగపడతాయి. మన ఉత్పత్తులను ప్రాసెస్ చేయడం ద్వారా మంచి ధరలు పొందవచ్చు. దీనికి పరిష్కారం వేస్ట్ టు వెల్త్. దీని ద్వారా సమస్యలు పరిష్కారం చూపవచ్చు అని సీఎం అన్నారు

**పభుత్వం నుంచి అన్నిరకాల ప్రోత్సాహం.**

వ్యవసాయ,అనుబంధాల రంగల్లో ఉత్పత్తి సామర్థ్యం పెంచడంతో పాటు సాంకేతికతను అందుకు వినియోగించుకోవాలన్నారు.టెక్నాలాజీ ద్వారా మార్కెటింగ్,ఆదాయం వృద్ధి చేసుకోవాలన్నారు.1995లో ఐటీ అన్నాను..నేడు ఎఐ అంటున్నాను. మనం టెక్నాలజీని స్వాగతించాలన్నారు. ఖర్చులు తగ్గించుకునేందుకు, నాణ్యత పెంచేందుకు ఎఐను ఆక్వారంగంలోనూ విరివిగా వాడాలి. రొయ్యల రైతులు రకరకాల వైరస్‌ల కారణంగా నష్టపోతుంటాయి. వీటి సమాచారాన్ని ఎఐ ద్వారా విశ్లేషించి ఏ జబ్బులు వచ్చే అవకాశం ఉందనేది కూడా తెలుసుకోవచ్చు.

తద్వారా సరైన మందులతో ముందుగానే తగు చర్యలు తీసుకోవచ్చు. ఎఐ అనేది నేను చెపుతుంటే కొందరు అర్థం చేసుకోవడం లేదు. కానీ తప్పదు ఏఐ టూల్‌ను సమర్థవంతంగా ఉపయోగించుకోవాలి. టెక్నాలజీ, అవకాశాలను అందిపుచ్చుకుంటేనే సత్వర ఫలితాలు వస్తాయి. డాటా ఆధారంగా రాబోయే రోగాన్ని ముందే కనిపెట్టి చెప్పవచ్చు. మరోవైపు పంటల ఉత్పత్తితో పాటు...ప్రాసెసింగ్ ఉంటేనే అగ్రో బేస్డ్ ఇండస్ట్రీకి భవిష్యత్ ఉంటుంది. ఆ దిశగా జరిగే ప్రయత్నాలకు ప్రభుత్వం అన్ని రకాలుగా పోత్సాహం అందిస్తుంది" అని సిఎం అన్నారు.

# రెడ్‌క్రాస్ సేవలు ప్రశంసనీయం

### కరోనా సంక్షోభంలో ప్రజలకు మరింత చేరువైన సంస్థ: గవర్నర్ నజీర్



మంగళవారం రెడ్ క్రాస్ సోసైటీ నూతన కార్యవర్గం మర్యాదపూర్వకంగా రాజ్‌భవన్‌లో గవర్నర్ జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నజీర్ కలుసుకున్న దృశ్యం

**విజయవాడ,ఫిబ్రవరి 18,ప్రభాతవార్తప్రతినిధి:** సంతృప్త సేవా కార్యక్రమాలు అందించడంలో రెడ్‌క్రాస్ ప్రశంసనీయంగా వ్యవహరిస్తోందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ జస్టిస్ సయ్యద్ అబ్దుల్‌నజీర్ వ్యాఖ్యానించారు.కరోనా సంక్షోభకాలంలో రెడ్ క్రాస్ అపూర్వ సేవా కార్యక్రమాలను నిర్వహించిందన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర శాఖ తన సమాజ హిత కార్యక్రమా లను విస్తృత పరచి ప్రజలకు సేవలు మరింత చేరువ చేయాలని పిలుపునిచ్చారు. ఏపీ రెడ్ క్రాస్ రాష్ట్ర శాఖ కు నూతన చైర్మన్‌గా ఎన్నికైన వై. డి. రామారావు, కోశాధికారిగా ఎన్నికైన పి. రామచంద్ర రాజు లు ప్రధాన కార్యదర్శి ఏకేఫరిడా తో కలిసి మర్యాదపూర్వకంగా రాజ్ భవన్ లో గవర్నర్ ని కలుసుకున్నారు.ఈ సందర్భంగా గవర్నర్ వారిని అభినందిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని 20 రెడ్ క్రాస్ రక్తనిధి కేంద్రాలలో ప్రజలకు నాణ్యమైన రక్త సేవలు అందుతున్నాయన్నారు.

# ఖతార్, భారత్ మధ్య కొత్త వాణిజ్య ఒప్పందం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18:** భారత్ ఖతార్‌లమధ్య వచ్చే ఐదేళ్లలో 28 బిలియన్ డాలర్లమేర ద్వైపాక్షిక వాణిజ్యం జరగాలని రెండుదేశాలు అవగాహనకు వచ్చాయి. భారత్‌లో రెండురోజులపాటు పర్యటించిన ఖతార్ ఎమిర్ షేక్ తమిమ్ బిన్ హమద్ అల్‌థాణి ప్రధానిమోడీతో ద్వైపాక్షిక భేటీ జరిపారు. వాణిజ్యం,పెట్టుబడులు, ఇంధన రంగాల్లో పరస్పర సహకారంతో ముందుకు వెళ్లాలనినిర్ణయించారు. రెండుదేశాల ప్రజలమధ్య సత్సంబంధాలు మరింత పెరగాలని అభిలషించారు. ఖతారి ఎమిర్ తనతోపాటే భారీ ప్రతినిధుల బృందాన్ని తీసుకురావడంతో భారత్‌లో ఉన్న పెట్టుబడుల అవకాశాలు వారికి తెలుస్తాయని చెప్పారు. వ్యూహాత్మక భాగస్వామ్యంపై రెండుదేశాలమధ్య ఒప్పందంజరిగింది. ఇరువురునేతల భేటీ తర్వాత విదేశాంగశాఖ కార్యదర్శి అరుణ్‌కుమార్ ఛటర్జీ మాట్లాడుతూ వచ్చే ఐదేళ్లలో రెండువైపులా రెట్టింపు ద్వైపాక్షిక వాణిజ్యం జరగాలని లక్ష్యం విధించినట్లు తెలిపారు. ఖతార్‌నుంచి ఎమీర్‌తోపాటు మంత్రులు, సీనియర్ అధికారులు, పారిశ్రామికవేత్తలు అనేక మంది వచ్చారు. గతంలో మార్చిలో ఖతార్ ఎమీర్‌ను భారత్‌లోపర్యటించాలని ఆదేశంలోపర్యటించిన ప్రధానిమోడీ ఆహ్వానించారు. మంగళవారం ఉదయం ఎమీర్‌ను రాష్ట్రపతి ద్రౌపదిముర్ము, ప్రధానిమోడీలు సాదరంగా ఆహ్వానించారు. సాయంత్రం ఎమీర్ గౌరవార్థం రాష్ట్రపతిముర్ము తేనీటి విందు ఇచ్చారు. అనంతరం ఎమీర్, ప్రధానిమోడీలతో కలిసి హైదరాబాద్ హౌస్‌లో చర్చలు జరిపారు. వాణిజ్యం, పెట్టుబడులు, ఇంధనం వంటిప కీలకంగా చర్చల్లో ప్రస్తావ నకు వచ్చాయన్నారు. ప్రస్తుత వాణిజ్యం రెండుదేశాలమధ్య 14 బిలియన్ డాలర్లవరకూ సాగుతోందని, వచ్చే ఐదేళ్లలో రెట్టింపుచేయాలని నిర్ణయించారు. ఖతార్ ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ భారత్‌లో 1.5 బిలియన్ డాలర్లు పెట్టుబడుల్పు పెట్టింది. జాయింట్ బిజినెస్ ఫోరమ్ ఆధ్వర్యంలో భేటీలుకూడా జరిగాయి.

## ప్రజాస్వామ్యం కూలిపోతోంది..

>>వారి పరిస్థితి అతి దారుణంగా తయారవుతుందన్నారు. రాష్ట్రంలో దిగజారిపోయిన లా అండ్ ఆర్డర్‌కు వల్లభనేని వంశీ అరెస్ట్ అద్దం పడుతోందన్నారు. మంగళవారం మధ్యాహ్నం విజయవాడ సబ్ జైల్లో ఉన్న వల్లభనేని వంశీతో జగన్ ములాఖత్ అయ్యారు గన్నవరం టిడిపి ఆఫీసుపై దాడి కేసులో సాక్షులను బెదిరించారన్న కేసులో వంశీ అరెస్ట్ అయి జైలులో ఉన్నారు. జైలులో వంశీని జగన్ పరామర్శించారు. జగన్‌తో పాటు వంశీని కలిసిన వారిలో తలశిల రఘురాం, వంశీ సతీమణి పంకజశ్రీ ఉన్నారు.మాజీ మంత్రులు కొడాలి నాని, పేర్నినానికి విజయవాడ జిల్లా జైల్లోకి వెళ్లేందుకు పోలీసులు అనుమతి నిరాకరించారు. జగన్‌తో పాటు వంశీని కలిసేందుకు మాజీఎంఎల్ఏల్లో సింహాద్రి రమేష్‌ను మాత్రమే జైల్లోకి వెళ్లేందుకు అనుమతించారు పోలీసులు. దాదాపు అర్ధగంట ములాఖత్‌లో జగన్ వంశీతో మాట్లాడారు.అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతుంటే అరెస్ట్ పరిణామాలు చూస్తుంటే రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయని, వంశీని అరెస్ట్ చేసిన తీరు దారుణం అని వైఎస్ జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గన్నవరం టిడిపి కార్యాలయంపై దాడి జరిగిందని ఫిర్యాదు చేసిన సత్యవర్ధన్ కేసును ఉపసంహరించుకున్నాడు. వంశీ తప్పు చేయలేదని సత్యవర్ధన్ చెప్పినప్పటికీ తప్పుడు కేసు పెట్టారని అన్నారు. టిడిపి నేత పట్టాభి రెచ్చగొట్టడంవల్లే గన్నవరం టిడిపి కార్యాలయంపై దాడి జరిగింది. మొదట్లో వంశీ పేరు ఎక్కడా లేదు. దాడి ఘటనలో వంశీ లేరు. వంశీని 71వ నిందితుడిగా ఎఫ్ఐఆర్‌లో చేర్చారు. ఘటన జరిగినప్పుడు అక్కడి నుంచి వెళ్లిపోయానని సత్యవర్ధన్ చెప్పాడు. సత్యవర్ధన్‌ను తీసుకెళ్లి తెల్లకాగితంపై సంతకం చేయించుకున్నారని జగన్ ఆరోపించారు.పట్టాభి రెచ్చగొట్టడం వల్లే గన్నవరం టిడిపి ఆఫీస్‌పై దాడి జరిగిందన్నారు. టిడిపి పాలనలో ప్రజాస్వామ్యం ఖూనీ అయ్యిందన్నారు జగన్. వంశీకి నెలల తరబడి బెయిల్ రాకుండా అడ్డుకుంటున్నారంటూ కొత్త విషయాన్ని బయట పెట్టారు. వంశీకి బెయిల్ రాదని టిడిపి నేతలు ముందుగా వ్యాఖ్యానిస్తున్నా రంటే కేసులు ఎంత కఠిన చట్టాలతో పెట్టాలని చూస్తున్నారన్నారు. సత్యవర్ధన్ కోర్టును తప్పుదోవ పట్టించారంటూ, ఆ మర్నాడే 11న విజయవాడ, పటమట పీఎస్‌లో సత్యవర్ధన్ మీద ఒక ఎఫ్ఐఆర్ పెట్టి, దాన్ని వారి కుటుంబ సభ్యులకు చూపించి, బెదిరించారు.ఆ మర్నాడు ఫిబ్రవరి 12న సత్యవర్ధన్ అన్నతో సత్యవర్ధన్ వద్ద ఉన్న రూ.20 వేలు లాక్కుని, అతడిని కిడ్నాప్ చేశారని, దీనిని ఎవరో చూసి తమకు చెప్పారంటూ పోలీసులకు ఒక ఫిర్యాదు చేయించి వెంటనే కేసు రిజిస్టర్ చేశారు.ఆ మరుసటి రోజు ఫిబ్రవరి 13వ తేదీ తెల్లవారుజామున వల్లభనేని వంశీని అరెస్ట్ చేశారు. ఇక్కడ ఆశ్చర్యకర విషయం ఏమిటంటే,అదే రోజు 13వ రోజు సాయంత్రం సత్యవర్ధన్ స్టేట్‌మెంట్ నమోదు చేసి, అందులో వంశీపై చెప్పించారు.అంటే కనీసం ఎవరైతే కిడ్నాప్ అయ్యారని చెబుతున్నారో.. అతడి స్టేట్‌మెంట్ నమోదు చేయక ముందే, వంశీని తెల్లవారుజామునే అరెస్ట్ చేశారంటే ఎంత కుట్రపూరితంగా ఈ అరెస్ట్ జరిగిందో అర్థమవుతోందన్నారు.



మంగళవారం మహాకుంభ్‌మేళాలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు కుటుంబ సమేతంగా పుణ్యస్నానాలు ఆచరిస్తున్న దృశ్యం

# కల్తీనెయ్యి సూత్రధారులే ఇక కీలకం!

### ఆ నలుగురికీ రిమాండ్

**తిరుమల, ఫిబ్రవరి 18ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల లడ్డూప్రసాదం తయారీలో కల్తీనెయ్యి సరఫరా చేశారనే ఆరోపణల కేసులో పాత్రధారులు నలుగురికీ సిబిఐ సిట్ కస్టడీ ముగిసింది. మంగళవారం సాయంత్రం ఆ నలుగురు ఏఆర్ డైరీ యాజమాన్యం ఎండి రాజశేఖరన్‌తోబాటు సరఫరా దారులు ఉత్తరప్రదేశ్‌కు, ఉత్తరాఖండ్ రూర్కె బోలేబాబాడైరీకి చెందిన అప్పటి డైరెక్టర్లు విపిన్‌జైన్, షోమిల్‌జైన్, వైష్ణవీడైరీ (పెనుబాక) సిఇఓ అపూర్వ వినయ్‌కాంత్ చావ్దాలను తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించి వైద్యపరీక్షలు చేయించారు. వారి ఆరోగ్యం బాగానే ఉందని వైద్యులు నిర్ధారించడంతో వారిని కోర్టులో హాజరుపరచారు. న్యాయమూర్తి మళ్లీ వారికి రిమాండ్ ఆదేశించడంతో తిరుపతి సబ్‌జైల్‌కు తరలించారు. కాగా ఈ నలుగురినీ బెయిల్‌పై విడుదల చేయించేందుకు అవసరమైన చర్యలు తీసుకుని న్యాయవాదులు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. సోమవారం సాయంత్రం బెయిల్ పిటిషన్ పరిశీలించిన న్యాయమూర్తి బుధవారం (నేడు)కు వాయిదా వేశారు. కల్తీనెయ్యి కేసులో సిబిఐ సిట్ బృందం లోని సిబిఐ జాయింట్ డైరెక్టర్ వీరేశ్‌ప్రభు, డిఐజి మురలీరాంభా నేతృత్వంలోని తిరుపతి అడిషనల్ ఎస్పీ వెంకట్రావు, డిఎస్పీలు, సిఐలు నలుగురు నిందితులను కస్టడీకి తీసుకుని ఐదురోజులు విచారణ చేశారు. టెండర్లు దక్కించుకోవడం, ఆ తరువాత నెయ్యిని నిబంధనల మేరకు సరషరా చేయకపోవడం వంటి ఘటనల్లో అసలు కీలక సూత్రధారుల్ని పట్టుకునేందుకు సిట్ సిద్ధమవుతోంది. ఇప్పటికే ఉన్న ఆధారాలతో మరిన్ని సమాధానం రాబట్టిన సిట్ అధికారులు ఇద్దరిని కీలకసూత్రధారులుగా ప్రస్తుతానికి నిర్ధారించింది. ఆ ఇద్దరికీ నోటీసులు జారీచేసి శుక్రవారం లేదా శనివారం విచారణకు పిలుస్తోందనేది సమాచారం తెలుస్తోంది. కల్తీనెయ్యి వినియోగించారనే సంచలన భాగోతంలో పలు రకాలుగా పలు కీలక విషయాలు తెలిసినా ప్రత్యేకంగా నలుగురిని అరెస్టుచేసి రిమాండ్ నుండి కస్టడీకి తీసుకుని లోతుగా విచారణచేశారు.

చాలావరకు పొంతనలేని సమాధా నాలుఇవ్వడం, తమకు గుర్తులేదు, అప్పట్లో ఎవరో చెప్పారు,మేం నెయ్యిపంపాము అనే వివరాలు ఇవ్వడంతో సిబిఐ సిట్ అధికారులు ఖంగుతినే పరిస్థితి నెలకొంది. వేర్వేరుగా విచారణ చేస్తున్నా సమాధానాలు రాబట్టడంలో కొంత సహనంతో వ్యవహరిస్తున్నారని తెలుస్తోంది. గత ఐదేళ్ల వైసిపి ప్రభుత్వంలోని పూర్వ టిటిడి ధర్మకర్తలమండలి పెద్దలు, టిటిడి ఉన్నతాధికారి, కొనుగోలుకమిటీ ఏమేరకు నిబంధనలు పాటించి నెయ్యిసరఫరాకు టెండర్లు పిలిచారు, టెండర్లలో పాల్గొన్న ఐదు సంస్థలు, కాంట్రాక్టర్ల నుండి కమీషన్లు ఇచ్చుకు న్నారా? ఇందుకు ఎవరు కీలకంగా వ్యవహరించా రని సమాధానాలు సేకరించడంతో తదుపరి ముందుకు వెళ్ళనున్నారనేది ట్విస్ట్.

# విజయ్ కుమార్ ముందస్తు బెయిలుపై వాదనలు

**విజయవాడ,ఫిబ్రవరి 18,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ సమాచార,పౌరసంబంధాల శాఖ మాజీ కమిషనర్ తుమ్మా విజయ్‌కుమార్‌రెడ్డి ముందస్తు బెయిల్‌పిటిషన్‌పై రాష్ట్ర హైకోర్టులో వాదనలు ముగిసాయి. ఒక వర్గం మీడియాకు అనుచిత లబ్ధి చేకూర్చారన్న ఆరోపణలతో ఏసీబీ కేసు నమోదు.అదే విధంగా ఒక దినపత్రిక సిబ్బందిని, కొన్ని మీడియా పక్షాల పనిచేసిన వారికి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా జీతాలు ఇచ్చారనే అభియోగాలున్నారు.కొందరు మీడియా న్యూస్ యాంకర్లు పేరు పెట్టి విజయభాస్కర రెడ్డిని ఏకవచనంతో పిలిచేవారనని,వారిని ఉద్దేశపూర్వకంగా విజయకుమార్‌రెడ్డి ప్రోత్సాయించారనే ఆరోణలు ఉన్నాయి.వారికి ప్రత్యేక ఫ్యాకేజీలు ఐఅండ్‌పీఆర్ నిధులతోనే కొనుగోలు చేసి ఇచ్చారనే ఆరోపణలు ఉన్నాయిదీంతో ఆయనపై కూటమి ప్రభుత్వం విజిలెన్స్ ద్వారా తుమ్మా విజయకుమార్‌రెడ్డిపై విచారణకు ఆదేశాలు జారీ చేసింది.ఈ నేపథ్యంలో ఏసీబీ నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ మంజూరుకు విజయ్‌కుమార్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్. దాఖలు చేపారు.ఈ క్రమంలో విజయ్‌కుమార్‌రెడ్డి ముందస్తు బెయిల్‌పై తీర్పు రిజర్వ్ చేసినట్టు హైకోర్టు ప్రకటించింది.

## వారం - వర్జ్యం

తేది : 19-02-2025, బుధవారం

శ్రీ క్రోధి నామ సంవత్సరం,
మాఘమాసం, ఉత్తరాయణం,
శిశిర ఋతువు, కృష్ణపక్షం,
షష్ఠి ఉ.7.33
స్వాతి ఉ.10.39
వర్జ్యం : సా.4.54-6.42
దు.ఉ.12.06-12.52
శుభసమయం : ఉ.9.40-10.30
సా.5.00-6.00
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం :** ఆరోగ్య సమస్యలు ఎదురై చికాకులు పెడతాయి. సోదరుల నుండి శుభవార్తలు.

**వృషభం:** వృత్తి, వ్యాపారాలలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి. వాహనసౌఖ్యం.

**మిథునం:**రుణవత్తిడులు ఎక్కువై ఎదురై చికాకులు పెడతాయి. వాహనసౌఖ్యం.

**కర్కాటకం :** ఇంటాబయటా సమస్యలు వేధిస్తాయి. ప్రముఖులతో పరిచయాలు.

**సింహం:** మిత్రులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకొంటారు. ధనలాభం.

**కన్య :** మాటల చాతుర్యంతో ఎదుటి వారిని ఆకట్టుకుంటారు. ప్రయాణాలు.

**తుల :** నూతన వస్తు, వస్త్రా, విలువైన ఆభరణాలు కొనుగోలు చేస్తారు.

**వృశ్చికం:**వృత్తి, వ్యాపారాలలో లాభాలు సాధిస్తారు. విందు, వినోదాలు.

**ధనుస్సు:** చేపట్టిన పనులలో ఇబ్బందులు ఎదురైన పట్టుదలతో ముందుకు సాగుతారు.

**మకరం:** ప్రయాణాలలో తొందరపాటు వద్దు. ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు అవసరం.

**కుంభం:** ఎంత కష్టపడ్డా ఫలితం ఉండదు. ధనవ్యయం పెరుగుతుంది.

**మీనం :** భాగస్వామ్య వ్యాపారాలలో లాభాలు పొందుతారు. వాహనయోగం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# సీమలో రూ.750కోట్లతో అత్యాధునిక ఆటోమేటిక్ సిగ్నలింగ్ వ్యవస్థ

## 2026నాటికి రేణిగుంట-వాడి సెక్షన్ పూర్తి



**గుంతకల్లు రైల్వే,ఫిబ్రవరి 18,ప్రభాతవార్త:** రైల్వే మంత్రిత్వ శాఖ రాయలసీమలోని దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజన్ పరిధిలో సుమారు రూ.750కోట్ల అంచనా వ్యయంతో 536.57కి.మీ రైలు మార్గాన్ని అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఆటోమేటిక్ సిగ్నలింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయనుంది. భారతీయ రైల్వేలోనే అత్యధిక కిలోమీటర్లను ఆటోమేటిక్ సిగ్నల్ వ్యవస్థను ఏర్పాటు చేస్తోంది. ప్రస్తుతం రేణిగుంట-గుంతకల్లు-వాడి సెక్షన్లో ప్రస్తుతం రైళ్ల 130కి.మీల వేగంతో రాకపోకలు సాగిస్తున్నాయి. ఈ రైళ్ల నిర్వహణలో ఎలాంటి అవరోధం,ఆలస్యం కలుగకుండ ఆటోమేటిక్ బ్లాక్ సిగ్నల్ వ్యవస్థను డబ్లింగ్ రైల్వే(అప్ అండ్ డౌన్) రైలు మార్గాలను ఏకకాలంలో పూర్తి చేసేందుకు అధికార యంత్రాంగం ప్రణాళిక సిద్ధం చేసింది. గుంతకల్లు రైల్వే డివిజన్లో రేణిగుంట-గుంతకల్లు-వాడి మార్గంలో ఏడు రీచ్లుగా విభజించి పనులను ప్రారంభించింది. నాల్వార్-యర్మరాస్ మధ్య 85కి.మీ, యర్మరాస్- ఆదోని 78.362కి.మీలు, ఆదోని-గుంతకల్లు 50.577కి.మీలు ఇందులో భాగంగా మొట్టమొదటగా గుంతకల్లు-మొలగవల్లి స్టేషన్ల మధ్య 23కి.మీలలో నాలుగు బ్లాక్లను ఏర్పాటు చేశారు. తద్వారా రైళ్ల నిర్వహణకు ఎలాంటి ఆటంకం లేకుండ రైళ్లు సజావుగా రాకపోకలు సాగించేందుకు అవకాశం కలిగింది. గుంతకల్లు-వేములపాడు మధ్య 64.1కి.మీలు, వేములపాడు- ముద్దనూరు మధ్య 63.89కి.మీలు, ముద్దనూరు-నందలూరు మధ్య 94.54కి.మీలు, నందలూరు-రేణిగుంట మధ్య 85.72కి.మీలు చొప్పున గుంతకల్లు రైల్వే డివిజన్ పరిధిలో మొత్తం 536.57కి.మీ మేర ఆటోమేటిక్ సిగ్నలింగ్ వ్యవస్థను 2026నాటికి పూర్తి చేసేందుకు రైల్వే శాఖ రేయింబవళ్లు అవిశ్రాంతంగా కృషి చేస్తోంది. ఈ నూతన వ్యవస్థ అమలుతో రైళ్లను ఎలాంటి ఆలస్యం లేకుండా సకాలంలో రైళ్లను సమర్థవంతంగా నిర్వహణ,భద్రత,ఆపరేషనల్ ఎఫిషియెన్సీ మరింతగా పెరుగుతుంది.

# మార్చి 14న పిఠాపురంలో జనసేన ఆవిర్భావ దినోత్సవ సభ

**విజయవాడ ఫిబ్రవరి 18 ప్రభాతవార్త ప్రతినిధి:** జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మార్చి 14న పిఠాపురంలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ఆపార్టీ మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించింది. దీనికి జనసేన అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్కళ్యాణ్ , ఇతర నాయకులు హాజరుకానున్నట్లు తెలిపింది. సార్వత్రిక ఎన్నికల్లో 100శాతం స్ట్రైక్ రేటుతో జనసేన విజయం సాధించిన తర్వాత నిర్వహిస్తున్న తొలి ఆవిర్భావ దినోత్సవ సభ ఇదేనని పేర్కొంది. ఈసభకు ఎన్డీఏకూటమి పక్షాలనే తలు హాజరై సందేశాలు ఇచ్చే అవకాశం ఉంది.

# తిరుమల సమాచారం



## నవీముంబైలో అమ్మవారి ఆలయానికి స్థలం కేటాయించండి

### సిఎం చంద్రబాబుద్వారా మహారాష్ట్ర సిఎంకు వినతి

**తిరుమల,ఫిబ్రవరి 18ప్రభాతవార్తప్రతినిధి:** వాణిజ్యరాజధాని ముంబైలోని నవీముంబైలో పద్మావతి అమ్మవారి ఆలయానికి, టిటిడి సమాచార కేంద్రం నిర్మించేందుకు స్థలం కేటాయించాలని కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ద్వారా మహారాష్ట్ర సిఎం దేవేంద్రపడ్నవీస్కు విజ్ఞప్తి చేశారు. టిటిడి ఛైర్మన్ బిఆర్నాయుడు, ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. నవీముంబైలో ఇప్పటికే శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మాణం కోసం 3.61 ఎకరాల స్థలాన్ని లీజు ప్రాతిపదికన కేటాయించారని, అయితే మరో 1.50 ఎకరాల స్థలంలో అమ్మవారి ఆలయాన్ని కూడా నిర్మించాలని టిటిడి నిర్ణయించిందన్నారు. ఈ మేరకు స్థలాన్ని కేటాయించాలని,బాంద్రాలో టిటిడి సమాచార కేంద్రానికి కూడా కొంత స్థలాన్ని కేటాయించాలని మహారాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

# ఇఎస్ఐ ఆస్పత్రిలో అధికారుల నిర్లక్ష్యంపై కఠినచర్యలు

## రాజమండ్రి హాస్పిటల్లో 9మంది సస్పెన్షన్



హాస్పటల్లో ఆకస్మిక తనిఖీ చేస్తున్న కార్మికశాఖ మంత్రి సుభాష్

**సచివాలయం, ఫిబ్రవరి 18,ప్రభాతవార్త :** ఈఎస్ఐ ఆస్పత్రిలో విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కార్మిక శాఖమంత్రి వాసంశెట్టి సుభాష్ ఆదేశించారు. ఈ విషయంపై ఆంధ్రప్రదేశ్ ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ డైరెక్టర్ తక్షణమేచర్యలు తీసుకున్నారు. విధులను సక్రమంగా నిర్వహించని కారణంగ 5గురు వైద్యులు,4గురు కార్యాలయ సిబ్బందిని సస్పెండ్ చేశారు. సోమవారం నిర్వహించిన ఆకస్మిక తనిఖీలో,కొందరు వైద్యులు,సిబ్బంది హాజరు నమోదుచేసుకొని తమ కర్తవ్యాలను నిర్వర్తించకుండా ఆస్పత్రి నుంచి వెళ్ళి పోతున్నట్లు గుర్తించారు. మంత్రి హాజరు నమోదు పుస్తకాలను పరిశీలించగా కొందరు హాజరు నమోదు చేయకపోవడం,కొందరు హాజరు నమోదుచేసి వెంటనే వెళ్ళిపోవడం,మరికొందరు సమస్యలకు సరైన సమాధానం ఇవ్వకపోవడం వెల్లడైంది. ఈ వ్యవహారాన్ని చాలా సీరియస్గా తీసుకున్న మంత్రి, ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ డైరెక ్టర్ను తక్షణమే చర్యలుతీసుకోవాలని ఆదేశించారు. ఫలితంగా బాధ్యతారహితంగా వ్యవహరించిన సిబ్బందిపై సస్పెన్షన్ ఆదేశాలు జారీ చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అన్ని ఈఎస్ఐ బీమా చందాదారులు మరియు వారి కుటుంబ సభ్యులకు నాణ్యమైన వైద్యసేవలు అందించేందుకు కట్టుబడి ఉన్నామని మంత్రి అన్నారు. రోగుల సంరక్షణలో ఏదైనా నిర్లక్ష్యం లేదా క్రమశిక్షణా రాహిత్యాన్ని సహించ బోమని,ప్రస్తుతం విచారణ కొనసాగుతోందని, నివేదిక ఆధారంగా మరిన్ని చర్యలు తీసుకో బడతాయని మంత్రి తెలిపారు.

ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ డైరెక్టర్,అన్ని వైద్య సిబ్బంది, ఆస్పత్రి సిబ్బందిని తమ విధులను నిబద్ధత, సత్ప్రవర్తనతో నిర్వహించాలని, ఈఎస్ఐ పథకం కింద లబ్దిదారుల సంక్షేమానికి కృషిచే యాలని కోరారు.

# శివరాత్రి సందర్భంగా ప్రత్యేక బస్సులు

**విజయవాడ, ఫిబ్రవరి18, ప్రభాతవార్తప్రతినిధి:** మహాశివరాత్రి సందర్భంగా భక్తులకు ఏపీ పర్యాటక(టూరిజం)శాఖమంచికబురుచెప్పింది. రాష్ట్రంలోని ప్రధాన నగరాలను ఆయా శైవక్షేత్రాలకు ప్రత్యేక బస్సులను నడపనుంది. విజయవాడ నుండి శ్రీశైలానికి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపింది. రాజమండ్రి నుండి ప్రత్యేక టూరిజం బస్సులుబయలు దేరనున్నాయి. మూడురోజులపాటు ఏపీ టూరిజం ఆధ్వర్యంలో శ్రీశైలంయాత్ర కొనసా గుతుంది. టూరిస్టులను తీసుకువెళ్లే ప్రదేశాలు శక్తిపీఠం శ్రీశైలంభ్రమరాంబటెంపుల్, శ్రీశైలం మల్లికార్జునస్వామి ఆలయం, త్రిపురాంతకేశ్వరి స్వామి టెంపుల్, బాలా త్రిపురసుందరి దేవి టెంపుల్. మహాశివరాత్రిసందర్భంగా అక్కడికివెళ్లాలను కునే భక్తులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చు.

# ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా సూక్ష్మ సేద్య పరికరాలు

**విజయవాడ ఫిబ్రవరి 18 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎస్సీ,ఎస్టీ వర్గాలకు చెందిన రైతులకు 100 శాతంరాయితీపై సూక్ష్మ సేద్య పరికరాలు అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. గరిష్ఠంగా అయిదెకరాల వరకు రూ.2.18 లక్షలు మించకుండా ఈ పథకాన్ని అమలు చేస్తారు. రాష్ట్రీయ కృషి వికాస యోజన లో భాగంగా సూక్ష్మ సేద్య ప్రాజెక్టు కింద బిందు, తుంపర సేద్య రాయితీ వివరాలపై వ్యవసాయ, సహకార శాఖ ఎక్స్ అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వైకాపా ప్రభుత్వ హయాంలో సూక్ష్మ సేద్య పథకాన్ని మూడేళ్లపాటు అటకెక్కించారు. దీంతో అన్నదాతలు రూ.లక్షలు ఖర్చుపెట్టి సొంతంగా పరికరాలు అమర్చుకోవాల్సి వచ్చింది. 2022లో పథకాన్ని ప్రకటించి 2022-23,2023-24 సంవత్సరాల్లో నామమాత్రంగా అమలుచేశారు. దానికీరూ.1150కోట్ల మేర బకాయిలు పెట్టారు.



## వారణాశిలో వేడుకగా శ్రీనివాసకల్యాణం

### గోవిందనామస్మరణలతో ప్రతిధ్వనించిన ప్రాంతం

**తిరుమల,ఫిబ్రవరి 18ప్రభాతవార్తప్రతినిధి:** నిత్య కల్యాణంపచ్చతోరణంగా విరాజిల్లే తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి ఆలయంలో నిర్వహించే రీతిలోనే ఉత్తరప్రదేశ్ ప్రయాగ్రాజ్ మహాకుంభమేళాలో భాగంగా వారణాశిలో మంగళవారం శ్రీనివాసకల్యాణాన్ని నిర్వహించారు. బిర్లమందిర్ బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం ప్రాం గణంలో ఆలయ అర్చకులు శ్రీదేవిభూదేవి సమేత మలయప్పస్వామి ఉత్సవర్లను కల్యాణ వేదిక వద్దకు వేంచేపుచేశారు. అక్కడఉదయం 11 నుండి 12గంటల వరకు వేదపండితులు వేద మంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాల నడుమ విశ్వక్సేనారాధన, పుణ్యాహ వచనం, కంకణ ధారణ, అగ్నిప్రతిష్టాపన, యజమాని సంకల్పం, భక్త సంకల్పం, మాంగళ్య పూజ, మంగళసూత్ర ధారణ మొదలైన ఘట్టా లతో శాస్త్రోక్తంగా స్వామివారి కల్యాణాన్ని నిర్వహించారు. చివరగా స్వామిఅమ్మవార్లకు నక్షత్రహారతి,మంగళహారతి సమర్పించడంతో కల్యాణం విజయవంతంగా ముగిసింది. అక్కడ తిలకించిన భక్తులు పులకించారు. ఈ కార్యక్రమంలో టిటిడి ఇఒ శ్యామలరావు దం పతులు, హెచ్డిపిపి ప్రోగ్రామ్ అధికారి రాజగోపాల్, పారుపత్తేదార్ బాల సుబ్రమణ్యం, తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థికి బ్రాహ్మణ సంఘటన మద్దతు



ఎన్నికల ప్రచార పత్రాన్ని ఆవిష్కరిస్తున్న బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వేమూరి అనంద సూర్య

**విజయవాడ,ఫిబ్రవరి18,ప్రభాతవార్తప్రతినిధి:** ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్ఎల్సీ కూటమి అభ్యర్థికి తమ సామాజిక వర్గం మద్దతు ఉంటుందని బ్రాహ్మణ కార్పరేషన్ మాజీ చైర్మన్ వేమూరి అనంద సూర్య ప్రకటించారు. రాష్ట్రీయ బ్రాహ్మణ సంఘటన రాష్ట్ర కార్యలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనంద సూర్య మాట్లాడుతూ విద్యాధికుడు మాజి మంత్రి కూటమి బలపరిచిన అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ను ఎమ్ఎల్సీ ఎన్నికలలో మొదటి ప్రాధాన్య ఓటువేసి ప్రతి ఒక్కరూ ఆయన గెలుపునకు దోహదపడాలని ఈ సందర్భంగా మాజీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ వేమూరి ఆనంద సూర్య పిలుపునిచ్చారు. సకల జనుల శ్రేయస్సే ఎన్డిఏ కూటమి ప్రధాన ఎజెండాగా పరిపాలన కొనసాగిస్తున్న ఈ ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపు ప్రాధాన్యత సం తరించుకొని ఉందని యువతి యువకులు విద్యార్థికులు ఉద్యోగులు ప్రతి ఒక్కరు విజ్ఞతతో ఆలోచించి ఆలపాటి రాజేంద్రప్రసాద్ గెలుపుకు దోహదపడాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. ఆలపాటి ఎన్నికల ప్రచార పోస్టరును వేమూరి అనంద సూర్య ఆవిష్కరించారు. ఈ సమావేశంలో రాష్ట్రీయ బ్రాహ్మణ సంఘటన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గార్లపాటి విజయకుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వారణాసి దుర్గా సారథి, అందుకూరి శ్రీమన్నారాయణ, రాచూరి విజయలక్ష్మి, నందిరాజు ప్రకాష్ , కల్పన, రాజ హనుమంతరావు, పెండ్యాల సుబ్బారావు,వల్లి, భమిడిపాటి కుమార్ శర్మ పలువురు పాల్గొన్నారు.

# రేషనలైజేషన్పై పునరాలోచించాలి

**విజయవాడ, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త :** గ్రామ వార్డు సచివాలయాల రేషనలైజేషన్లో విఆర్వోలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, వెంటనే గ్రామ వార్డు సచివాలయం రేషనలైజేషన్పై పునరాలోచించాలని రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు, ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలనాయుడులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రెవెన్యూ వ్యవస్థలో కీలకంగా గ్రామస్థాయిలో రైతులకు ప్రజలకు అనుసంధానంగా వుండి రైతుల భూ సమస్యలు, ప్రజలకు సంబంధించిన అన్ని సర్టిఫికెట్లు ఇవ్వడంలో కీలకపాత్ర పోషిస్తున్న విఆర్ఓలకు గత ప్రభుత్వంలో రీసర్వే పేరిట పనిఒత్తిడికి లోనై సూసైడ్ చేసుకున్నారని, కూటమి ప్రభుత్వం వస్తే విఆర్వోలపై పనివత్తిడి తగ్గి ప్రమోషన్లు, డిఎ బకాయిలు, పాత బకాయిలు, ఐఆర్ ప్రకటిస్తారని ఆశతో ఉద్యోగులంతా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి కృషి చేశారన్నారు. కానీ కొంతమంది అధికారులు ఇస్తున్న తప్పుడు నివేదికల వల్ల కూటమి ప్రభుత్వానికి చెడ్డపేరు వచ్చేలా వుందన్నారు. 90శాతం రెవెన్యూ సేవలందిస్తున్న విఆర్వోలకు స్టేషనరి, సిస్టంస్ వంటివి ఇవ్వకపోయినా రాత్రి పగలు తేడా లేకుండా విశ్రాంతి దినాల్లో కూడా సేవలందిస్తున్నారని, వారికి రెండు సచివాలయాలు ఒక విఆర్ఓకు కేటాయించడం ద్వారా పనిఒత్తిడి పెరిగిపోతుందని, సకాలంలో పని పూర్తవకపోతే దీనిపై అధికారులు తప్పుడు నివేదికలు ఇస్తారని, దానివల్ల కూటమి ప్రభుత్వానికి చెడ్డపేరు వచ్చే అవకాశముందని, కాబట్టి ఈ సచివాలయాల పునర్వ్యవస్థీకరణపై ప్రభుత్వం పునరాలోచించాలని కోరారు.

# విజయవాడలో కేంద్ర పరిపాలన ట్రిబ్యునల్ బెంచ్




**విజయవాడ,ఫిబ్రవరి18,ప్రభాతవార్తప్రతినిధి:** కేంద్ర పరిపాలన ట్రిబ్యునల్ బెంచ్ ఇప్పుడు ఆంధ్రప్రదేశ్కు అందుబాటులోకి వచ్చింది. క్యాట్ బెంచ్ను విజయవాడ ఆటోనగర్లోని స్టాలిన్ కార్పొరేట్ భవన్లో ప్రారంభించారు. ఇంతవరకు ఆంధ్రప్రదేశ్లో సర్క్యూట్ బెంచ్ లేకపోవడంతో రాష్ట్రంలోని ఉద్యోగులు, అఖిల భారత సర్వీసు అధికారులు తమ సర్వీసు పరమైన అంశాల్లో న్యాయం కోసం ఢిల్లీలోని ప్రిన్సిపల్ బెంచ్ను,లేని పక్షంలో హైదరాబాద్లోని క్యాట్ను ఆశ్రయించాల్సి వచ్చేది. ఇప్పుడు రాష్ట్రంలోనే సర్క్యూట్ బెంచ్ అందులోకి వస్తుండడంతో ఇకపై వారంతా ఆ బెంచ్ను ఆశ్రయించేందుకు అవకాశం ఏర్పడింది. ఈ బెంచి ప్రారంభం పూర్తయి కార్యకలపాలు అందుబాటులోకి వచ్చాయి. క్యాట్ ఛైర్మన్ జస్టిస్ రంజిత్ వంసతరావు మోరే, క్యాట్ సభ్యులు షాలినీ మిశ్రా వర్చువల్గా ఈ బెంచి ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్నారు. హైదరాబాద్ క్యాట్ హెచ్ఓడీ, జ్యుడీషియల్ మెంబర్ డాక్టర్ లతా బి పాట్నే, అడ్మినిస్ట్రేటివ్ సభ్యులు వీఎస్కే కౌముది, రిజిస్ట్రార్ నవీన్కుమార్ తదితరులు ప్రారంభ కార్యక్రమానికి హాజరయినట్లు ఈ బెంచ్ ఇన్ఛార్జి డాక్టర్ లతా బి. పాట్నే తెలిపారు. ప్రతి నెల 3వ వారం 5 రోజులపాటు విజయవాడలోని క్యాట్ సర్క్యూట్ బెంచ్ అందుబాటులో ఉంటుందని విజయవాడ బెంచ్ అన్ని రకాల సదుపాయాలతో ఏర్పాటైందని అన్నారు. అమరావతి రాజధాని ప్రాంతంలో క్యాట్ బెంచ్ ఏర్పాటు కోసం సీఆర్డీఏ స్థలం కేటాయించిందని అక్కడ నిర్మాణాలు పూర్తయ్యే వరకు ఆటోనగర్ స్టాలిన్ కార్పొరేట్ ఐదో అంతస్తులో ఈ బెంచ్ కార్యకలాపాలు కొనసాగుతాయని రిజిస్ట్రార్ నవీన్కుమార్ పేర్కొన్నారు.

# దేవాలయాలకు టిటిడి పాలన ఆదర్శం

## దర్శన నిర్వహణ వ్యవస్థ పటిష్టం

### ఆలయ కన్వెన్షన్ ఎక్స్పోలో టిటిడి అదనపు ఇఒ వెంకయ్యచౌదరి




**తిరుమల,ఫిబ్రవరి 18ప్రభాతవార్తప్రతినిధి:** హిందు సనా తనధర్మాన్ని మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్ళేందుకు అనేక కార్యక్రమాలు తిరుమల తిరుపతి దేవస్థానం చేపడుతోందని, దేశంలోని అన్ని దేవాలయాలకు తిరుమల ఆలయం నిర్వహణ ఆదర్శమని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి తెలిపారు. మినీ సచివాలయంగా కొనసాగుతున్న టిటిడిలో 66 శాఖలు ద్వారా భక్తులకు విశేష సేవలందిస్తున్నట్లు చెప్పారు. సరాసరి రోజుకు 70వేల మంది భక్తులు శ్రీవారిని దర్శించుకుంటున్నట్లు ఆయన వెల్లడించారు. తిరుపతిలో జరుగుతున్న ఆలయ కన్వెన్షన్ ఎక్స్ఫో (ఐటిసిఎక్స్)సదస్సులో రెండవరోజు మంగళవారం సాయంత్రం టిటిడి అదనపు ఇఒ వెంకయ్యచౌదరి పాల్గొన్నారు. ఆలయాల నిర్వహణ, భక్తులకు దర్శనం చేయిస్తున్న తీరు, వసతి కల్పన భక్తులకు అందిస్తున్న సౌకర్యాలు, టిటిడి ఉద్యోగులు సిబ్బంది సేవలు ,వివిధ సంస్థలు,ట్రస్టులు నిర్వహణగురించి స్పష్టంగా వివరించారు. తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని ఏడాదికి సగటున 2.50కోట్లమంది భక్తులు దర్శించుకోవడం జరుగుతుందన్నారు. వస్తున్న భక్తులకు నిరంతరం అన్నప్రసాదాలు, పారిశుధ్యసౌకర్యాలు అందిస్తున్న తీరును వివరించారు. తిరుమలలో భక్తులు వేచివుండేందుకు వైకుంఠమ్ క్యూ కాంప్లెక్స్లలో 63కంపార్టుమెంట్లు ఉన్నాయన్నారు. భక్తులకు దర్శనసమయం సుమారుగా 12గంటలు పడుతుందన్నారు. భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం, రోజువారీ వచ్చే భక్తుల సంఖ్య ఆధారంగా దర్శన ప్రణాళికలు మారుతాయన్నారు. 60వేలమంది యాత్రికులకు వసతికల్పించేందుకు 7,600 గదులు, 5 పిఎసిలు ఉన్నాయన్నారు. ప్రతి రోజూ 3.50లక్షలు లడ్డూలు అందుబాటులో ఉంచుతున్నామని అదనపు ఇఒ తెలిపారు. తిరుమలకు వస్తున్న భక్తులకు శ్రీవారి దర్శనం, వసతి,అన్నప్రసాదాలు, పారిశుద్యసేవలు అందించడమేగాక వివిధ ధార్మిక సామాజిక సంక్షేమ కార్యకలాపాలు కూడా టిటిడి నిర్వహిస్తోందని ఆయన తెలిపారు. దేశవ్యాప్తంగా సనాతన ధర్మాన్ని విస్తృతంగా తీసుకెళ్ళేందుకు అన్నమాచార్య, దాస్యసాహిత్యం, ఆళ్వార్దివ్యప్రబంధం, హిందే ధర్మప్రచార ,ఇతర ప్రాజెక్టులు ద్వారా ముందుకు తీసుకెళుతున్నామని చౌదరి చెప్పారు. ముఖ్యంగా స్వామివారి నిత్యకైంకర్యాలు, ఆర్జితసేవలు, పూజాకార్యక్రమలు ప్రపంచంలోని భక్తులకు తెలిసేందుకు వీలుగా తెలుగు,తమిళం, కన్నడం, హిందీ,భాషలలో ఎస్వీబిసి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వైద్య,విద్యరంగాల్లో విశేష సేవలందించడం జరుగుతోందన్నారు. గోసంరక్షణ, రాబోయే మూడు సంవత్సరాల్లో మరింతగా డిజిటలైజేషన్ను వినియోగించి పారదర్శక సేవలందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిటిడి జెఇఒ వీరబ్రహ్మం, వేదిక్వర్సిటీ ఉపకులపతి శ్రీరామసదాశివమూర్తి, హెచ్డిపిపి కార్యదర్శి శ్రీరామరఘునాథ్, సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి, ఐటిసిఎక్స్ టెంపుల్కన్వెన్షన్ వ్యవస్థాపకుడు గిరీష్ వాసుదేవ్ కులకర్ణి, ఛైర్మన్ప్రసాద్లాడ్, తదితరులు పాల్గొన్నారు.

# కల్తీ నెయ్యి పై కొరడా.. ఆత్రేయపురంలో ఫుడ్ కంట్రోల్ అధికారులు దాడులు



**ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా బ్యూరో ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:** ఆత్రేయపురం కేంద్రంగా అడ్డు అదుపు లేకుండా సాగుతున్న కల్తీ నెయ్యి వినియోగంపై ఫుడ్ కంట్రోల్ అధికారులు సోమవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఆసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ బి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఇన్స్పెక్టర్లు రొక్కయ్య సుబ్బారావు ప్రసాద్ శ్రీకాంత్ చౌదరి లు ఏకకాలంలో నిర్వహించిన ఈ దాడుల్లో ఎటువంటి బ్రాండ్లు లేని 150 కేజీలు కల్తీ నెయ్యి, ముడి సరుకులు సీజ్ చేశారు. కల్తీ నెయ్యి వినియోగించి అమ్మకాలు సాగిస్తున్న పూతరేకుల దుకాణాలపై దాడులు నిర్వహించి ఇరువురిపై కేసులు నమోదు చేశారు. అయితే ఫుడ్ కంట్రోల్ అధికారులు నిరక్ష ్య వైఖరితోనే ఆత్రేయపురం కేం ద్రంగా కల్తీ నెయ్యితో తయారుచేసిన పూతరేకుల అమ్మకాలు అడ్డు అదుపు లేకుండా సాగు తున్నాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి ప్రజల ఆరోగ్యాన్ని గాలికి వదిలి పశువుల వ్యర్థా లతో తయారు చేసిన నెయ్యిని వినియోగించి పూతరేకులు తయారీ జరుగుతుందని ఫిర్యా దులు అందిన ఫుడ్ కంట్రోల్ అధికారులు నిమ్మ కునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. నిడదవోలు కేంద్రంగా వాహనాల్లో కల్తీ నెయ్యి డబ్బాలను తరలిస్తున్న ఫుడ్ కంట్రోల్ అధికారులు పట్టించుకోకపోవడం ఈ అనుమానాలు తావిస్తుంది. కొందరు బడా వ్యాపారులు ఫుడ్కంట్రోల్ అధికారులను మచ్చిక చేసుకొని ఈ కల్తీనెయ్యి దందా సాగిస్తున్నారని దీంతో ప్రజల ఆరోగ్యానికి భద్రత లేకుండా పోయిందని పలువురు వాపోతున్నారు. పూతరేకులు అమ్మకాల్లో ఆత్రేయపురం బ్రాండ్ ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందింది. ఆత్రేయపురం పూతరేకుల బ్రాండ్ కు మచ్చ తెచ్చేలా పూతరేకులు తయారీలో కల్తీ నెయ్యి వినియోగిస్తున్న అక్రమార్కులపై తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇప్ప టికైనా ఫుడ్ కంట్రోల్ అధికారులు అడపాదడపా దాడులతో సరిపెట్టకుండా నిరంతరం ఆత్రేయ పురం సరఫరా అవుతున్న కల్తీ నెయ్యి సరఫరా దారులపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

# నడకమార్గంలో తెలంగాణ భక్తుడు మృతి

**తిరుమల,ఫిబ్రవరి 18ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనానికి కాలినడకన శ్రీవారి మెట్లమార్గంలో వస్తున్న తెలంగాణ భక్తుడు గుండెపోటుకు గురై మృతి చెందాడు. ఈ సంఘటన మంగళవారం మధ్యాహ్నం జరిగింది. తెలంగాణ హైదరాబాద్ షాద్నగర్కు చెందిన వెంకటేశ్(50)మంగళవారం మధ్యాహ్నం కొండకు నడకన వస్తున్నాడు. శ్రీవారిమెట్లమార్గంలో వస్తున్న అతను 200 మెట్లు ఎక్కినతరువాత తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. గుండెపోటు రావడంతో కిందవాలిపోయాడు. తోటిభక్తులు గమనించి వెంటనే వైద్య అధికారులకు, విజిలెన్స్కు తెలిపారు. వెంటనే చంద్రగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతను మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు.

# రాష్ట్రోపాధ్యాయ సంఘం పూర్వాధ్యక్షుడు నీరుకొండ నరసింహారావు మృతి

**విజయవాడ ఫిబ్రవరి 18 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీ రాష్ట్రోపధ్యాయ సంఘం(ఎస్టీయు) పూర్వాధ్యక్షుడు,పెన్షనర్ల సంఘ నాయకులు నీరుకొండ నరసింహారావు మృతి చెందారు. ఎన్టీఆర్ జిల్లా నందిగామలోని తన స్వగృహంలో మంగళవారం ఉదయం మృతిచెందారు. ఎస్టియు నేతగా ఉపాధ్యాయులను ఏకత్రాటిపై నడిపి సమస్యల పరిష్కారానికి నిరంతర కృషిచేసారు. అనేకంశాలపై ఆయన ప్రభుత్వంపై న్యాయపోరాటాలు చేసి విజయం సాధించారు. కీలకంగా ప్రతి కేసును ఆయన న్యాయస్థానాల్లో స్వయంగా వాదించే వారు. ఎస్టియు రాష్ట్ర అధ్యక్షులుగా పనిచేసిన కాలంలో ఆయన ప్రభుత్వంతో పలు అంశాలపై సంప్రదింపులు జరిపారు.

నందిగామలో ఎస్టియు భవనం రావడానికి ఆయన కృషి ఎంతో ఉంది. రిటైర్ అయిన అనంతరం ఆంధ్రప్రదేశ్ విడిపోయిన సమయంలో కూడా పలు ఉద్యమాల్లో పాల్గొన్నారు. ఉద్యమం కోసం పలు సూచనలు చేశారు. ఉపాధ్యాయ హక్కుల కోసం పోరాడారు.

ప్రస్తుతం రిటైర్డ్ ఉద్యోగుల సంఘానికి అధ్యక్షులుగా పనిచేస్తున్నారు. వీరు లేని లోటు ఉపాధ్యాయ ఉద్యమానికి రిటైర్డ్ ఉద్యోగులకు తీరని లోటని పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.

సీపీఐ నేతలు దోనేపూడి శంకర్, అక్కినేని వనజ, ప్రభుత్వవిప్ తంగిరాల సౌమ్య ఆయనకు నివాళులర్పించారు.

వార్త

అజ్ఞానం అహంకారానికి దారితీస్తుంది. అహంకారం తీవ్ర అజ్ఞానానికి దారితీస్తుంది. అజ్ఞానంఎప్పుడూ మార్పుకు భయపడుతూ ఉంటుంది.

-వి.జాన్సన్

# సంక్షేమమా! సంక్షోభమా?

లక్ష్మీకటాక్షం లేకపోతే జీవనం సాగించడంఎంత దుర్భరంగా ఉంటుందో వేరే చెప్పాల్సిన పని లేదు. వ్యక్తికానీ, కుటుంబం కానీ,ప్రభుత్వంకానీ ఆదాయం లేకుండా నడవడం, నడపడం సాధ్యం కాదనేది జగమెరిగిన సత్యం. అందులోనూ ప్రజాసంక్షేమమే ధ్యేయమని చెప్పుకుంటూ నిరుపేద,బలహీన,బడుగువర్గాల అభివృద్ధికి దేశవ్యాప్తంగా లక్షలాది కోట్ల రూపాయలు వివిధ పథకాలపై వెచ్చిస్తున్న ఈ రోజుల్లో నిధులు ఎంత అవసరమో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరంలేదు. అందుకోసం ప్రజల మీద భారం వేయకతప్పదు.అందులో మరో అభిప్రాయానికి తావులేదు. నిధుల సమీకరణకు అప్పులు, లేక పన్నులు తప్ప మరో మార్గం లేదనేది అందరికీ తెలిసిందే. అటు కేంద్రంలో కానీ, ఇటు రాష్ట్రంలో కానీ అధికారంలో ఎవరున్నా ఏదోఒక రూపంలో ప్రజల వద్ద నుండి డబ్బు వసూలు చేయాల్సిందే. అది సరిపోనప్పుడు అప్పుల బాట ఉండనే ఉన్నది. పన్నులు వేసేందుకు ఒక పద్ధతి ఉండాలి. ఒక విధానం ఉండాలి. ఎన్ని పన్నులువేసినా, మరే రూపంలో నిధులు సేకరించే ప్రయత్నం చేసినా ప్రజలకు అందువల్ల కష్టంఅంత ఉండకూడదు. అందుకే చెప్తారు పిల్లి తన పిల్లలను తీసుకువెళ్లినట్లుగా ప్రజల పట్ల పాలకుల తీరు ఉండాలంటారు.కానీ ప్రస్తుత పరిస్థితులు అలా లేవు. ఇష్టానుసారంగా పన్నులు వేస్తున్నారు. పన్నులు వేసే కొద్దీ ధరలు అందుకోలేనంతగా పెరుగుతున్నాయి. జిఎస్టీ అన్నా మరే రూపంలో వస్తువులపై పన్నులు వేసినా చివరకు కావడి ఎన్ని వంకలు తిరిగినా ఇంటికి చేరాలన్నట్లు పన్నుల భారమంతా ప్రజలు మోయాల్సిందే. దేశంలో పన్నులు ఏ మేరకు వేశారో, ఫలితంగా ధరలు ఏ స్థాయికి పెరుగుతున్నాయో ప్రత్యేకంగా చర్చించాల్సిన పనిలేదు. అదుపు లేకుండా పెరిగిన ఈ ధరలతో ముఖ్యంగా నిరుపేదలు, మధ్యతరగతి ప్రజలు విలవిల్లాడిపోతున్నారు. అపరిమితఆదాయం ఉన్న నల్లధనస్వాములకు ఏ వస్తువు ధర ఎంత పెరిగినా చీకూచింత లేకపోవచ్చుకానీ సామాన్యులు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. మరొకపక్క ఆదాయాన్ని దృష్టిలో పెట్టుకోకుండా ఇష్టానుసారంగా వ్యయం చేస్తుండడంతో అప్పులబాట పట్టడం తప్పడంలేదు. ఓట్లకోసం, అధికారం కోసం జనాకర్షణ పథకాలు కోకొల్లలుగా ప్రకటిస్తున్నారు. ప్రజలు కోరినవేకాదు అభ్యర్థించనివి కూడా ఎన్నో పథకాలు ప్రవేశపెడుతున్నారు. అవన్నీ పూర్తి చేయాలంటే ఎన్ని లక్షల కోట్లు అవసరం అవుతాయో ఆలోచించడం లేదు. గతవారంలో దేశ అత్యున్నత న్యాయస్థానం కూడా ఉచితాలపై విచారణ సందర్భంగా పలు వ్యాఖ్యలు చేసింది. అందురూ ఆలోచించాల్సిన సమయమిది. ఇక ఆదాయాన్ని పెంచుకునేందుకు అన్ని రకాల కసరత్తులు చేస్తున్నారు. నిత్యం ఆదాయం పెంచుకునే అన్వేషణ జరుగుతున్నది. యేడాదియేడాదికి మద్యం ఆదాయాన్ని పెంచుకుంటున్నారు. తెలుగు రాష్ట్రాల వరకు పరిశీలించినా ఎక్సైజ్ ఆదాయం ఖజానాకు ప్రధాన ఆర్థిక వనరుగా మారిపోయింది. ఒక్కవిషయాన్ని విస్మరిస్తున్నారు. ప్రభుత్వం రూపొందించే మద్యం విధానాలు, అందువల్ల పెరుగుతున్న ఆదాయం అంతిమంగా సమాజంపై చూపుతున్న దుష్ప్రభావం పరిశీలిస్తే ఆందోళన కలుగుతుంది. మద్యంమత్తులో సొంత తల్లిని చంపేవారు కొందరు అయితే భార్యను హతమార్చేవారు ఇంకొందరు. రకరకాల నేరాలకు మద్యం కారణమవుతున్నది. తాగుడు మూలంగా రహదారి ప్రమాదాలు మహిళలపై అఘాయిత్యాలు, గృహహింస, లైంగిక వేధింపులు లాంటి నేరాలు అంతులేకుండా పెరిగిపోతున్నాయి. తెలుగురాష్ట్రాల్లో రోడ్డు ప్రమాదాలను తీసుకుంటే యేడాదికి దాదాపు ఇరవై వేల మందికిపైగా అసువులు బాస్తున్నారు. యాభై వేల మందికిపైగా క్షతగాత్రులవుతున్నారు. అందులో కొందరు శాశ్వత వికలాంగులు అవుతున్నారు.వారుకుటుంబానికి భారమై జీవచ్ఛవంలా కాలం గడుపుతున్నారు. చట్టాలు ఎన్ని తెచ్చినా మరెంత మందిని అధికారులను నియమించినా ఇది ఆగడంలేదు. ఇవేకాదు హత్యలు,కిడ్నాపులు లాంటివి జరుగుతున్నాయి. పట్టపగలు నడిరోడ్డులో హత్యలకు వెనుకాడడం లేదు. ఇటు ప్రమాదాల్లో కానీ అటు నేరాల్లో కానీ నిందితులైనవారిలో అధిక శాతం మద్యం మత్తులో ఉండి చేసినవారే ఉన్నారనేది అధికార రికార్డులే వెల్లడిస్తున్నాయి. మరొకపక్క ఎన్నోలక్షల కుటుంబాలు మద్యానికి బానిసై రోగపీడితులై మంచానికే పరిమితమై కృంగికృశించి అసువులు బాస్తుంటే ఎన్నో లక్షల కుటుంబాలు చితికిపోతున్నాయి. ఇన్ని అనర్థాలకు మూలమైన మద్యాన్ని పాలకులు పెంచిపోషించడం, ఆదాయం కోసం ప్రజలతో తాగించడం, ప్రోత్సహించడం ఎంత వరకు సమంజసమో మనసుపెట్టి ఆలోచించాలి. మద్య నిషేధం ఎన్నికల నినాదంగా మిగిలిపోతున్నది. మద్యం ఆదాయం పైనే ఆశలు పెట్టుకుంటున్నారు. మరొకపక్క నాటుసారా కూడా తెలుగు రాష్ట్రాల్లో విజృంభిస్తున్నది. సారా పొయ్యి లు కుగ్రామాల్లోనే కాదు మండల కేంద్రాలకు కూడా విస్తరిస్తున్నాయి. మద్యానికి బానిసలై అనారోగ్యం పాలైన కుటుంబాలకు కుటుంబాలే రోడ్లమీద పడుతుండడంతో ఆనాడే ఆవేదన చెందిన మహాత్ముడు స్వతంత్ర భారతావని నుంచి మద్యం రక్కసిని తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. ఆయననే ఆదర్శంగా తీసుకొని ఆయన అడుగు జాడల్లో నడుస్తున్నామని చెప్పుకుంటూ వర్ధంతులు, జయంతులు క్రమం తప్పకుండా నిర్వహించుకుంటున్న పాలక పెద్దలు ఆయన అభిష్టానికి వ్యతిరేకంగా మద్యాన్ని ప్రోత్సహిస్తున్నారు. అంతేకాదు ఒకపక్క ప్రజా సంక్షేమం అంటూ అందుకోసం మరొకపక్క ప్రజలను ఆర్థికంగా, ఆరోగ్యపరంగా సంక్షోభంవైపు నెట్టడం ఏమాత్రం న్యాయం కాదు.

మానవ నాగరికతను చాలా వరకు ప్రభావితం చేసేది ఉత్తమ మహిళలే.



ఎమర్సన్

ఒక మనిషి అభివృద్ధికి, దిగజారడానికి స్వయంకృతమే కారణం అవుతుంది.



అబ్రహాంలింకన్

## ప్రజావాక్కు



### మహాకుంభమేళాలో మరిన్ని మృతులు

ఫిబ్రవరి 15 శనివారం ఢిల్లీ రైల్వేస్టేషన్‌లో మహా కుంభమేళాకుఏర్పాటుకు చేయబడిన ప్రత్యేకరైళ్ళలో వేలమంది భక్తులు పుణ్యస్నానాల కోసం పడిగాపులు పడుతూండగా ముందుగా నిర్ణయించిన ప్లాట్ ఫాం కాకుండా మరొక దానికి వస్తుందనే ప్రకటన వినగానే ఆతృత, కంగారు, భయంఒక్కసారిగా ఆవహించి ఓవర్ బ్రిడ్జ్ మీదకు రాగానే ఒక్కసారిగా తోపులాటకు గురిఅవగా అందులో చివరిసారి సమాచారం అందేసరికి 18 మంది చనిపోగా మరెంతో మందికి తీవ్రగాయాలయ్యాయని వార్తలొచ్చాయి. తొక్కిసలాటకు మరొక కారణం ఏంచెబుతున్నారంటే రెండు రైళ్ళ పేర్లు ఒకేలా అనిపించడంతో దీనిలో తామెక్కవలసిన రైలేదో తెలియరాలేదు.ఒకదాని పేరు ప్రయాగ్‌రాజ్ ఎక్స్‌ప్రెస్ మరొక దాని పేరు ప్రయాగ్ రాజ్ స్పెషల్. మహా కుంభమేళాఏమోగాని తొక్కిసలాటలలో, రోడ్డు ప్రయాణాలలో చాలామంది మృతి చెందారు.

-ఎన్. రామలక్ష్మి,సికింద్రాబాద్

### వేతనాలు వెంటనే చెల్లించాలి

ఉపాధిహామీ కూలీలవేతనాలు చెల్లింపులో జాప్యం చోటు చేసుకుంటుంది. ఇది ఒకరకంగా కూలీలసంఖ్య తగ్గడానికి కారణం అవుతోంది. చట్టంప్రకారం పని చేసిన 15 రోజులలో వేతనాలు అందాలని నిర్దిష్టంగా పేర్కొన్న అందుకు తగిన అడుగులు పడ్డ దాఖలాలు లేవు. ప్రభుత్వం ఇప్పటికే ఆరు వారాల కూలీలు బాకీపడి ఉన్నది. కాబట్టి తొందరగా స్పందించి వేతనాలు విడుదలచేయాలి. వేతనాలు అందితేనే కూలీల సంఖ్య పెరిగి పని దినాలు పెరిగే అవకాశం ఉందని గమనించాలి.

- భారత అవినాష్, జనగామ

### మార్పులు జరగడం సహజం

పది సంవత్సరాలు అంతకుపై బడి అధికారంలో ఉన్న ప్రభుత్వాలపై సహజంగా ఏర్పడే వ్యతిరేకత ఈ సమయంలో ప్రభుత్వంలో ఉన్నవారు చేసే అవినీతి పనులు, తప్పులు, అపరిష్కృత సమస్యలు వంటివి ప్రతిపక్షాలు అధికారంలోకి రావడానికి కారణం అవుతాయి. ఇటీవల ఢిల్లీ,అంతకుముందు కర్ణాటక,తెలంగాణ రాష్ట్రాలలో జరిగింది అదే. అయితేఇలా జరగడం కొత్తకాదు. ఎనిమిదో అద్భుతమూ కాదు.భవిష్యత్తులోనుఇలానే జరుగుతుంది.

-ఎం.శ్రీనివాస్, హైదరాబాద్

### మంత్రుల విశ్వసనీయత ప్రశ్నార్థకం?

రాష్ట్ర ప్రభుత్వ పలుశాఖల్లో టెండర్లు, అనుమతులు, బిల్లుల చెల్లింపు, అధికారుల బదలీలు వంటివి మంత్రులకు తెలియకుండానే జరిగిపోతున్నట్లు పత్రికల్లో వార్తలు వస్తున్నాయి. ఆపైన దిద్దుబాట్లు, రద్దులు, విచారణకు ఆదేశిస్తున్నారు. ముఖ్యమంత్రి మంత్రులను శాఖలపై పట్టుపెంచుకోమని ప్రతి సందర్భంలోనూ చెప్పటం మీడియా ద్వారా చూస్తున్నాం! తాజాగా మంత్రుల అనుచరులు నియోజకవర్గాల్లో దందాలు చేస్తున్న వార్తలు వస్తున్నాయి! ఇప్పటికే చాలామంది కూటమి ఎమ్మెల్యేలు అవినీతి కార్యకలాపాలతో కార్యకర్తలకు అందుబాటులో లేకుండాపోయారు.పరిస్థితి చక్కదిద్దకుంటే ముఖ్యమంత్రి ఎంత కష్టపడినా బూడిదలో పోసిన పన్నీరు అవుతుంది.

-గరిమెళ్ల రామకృష్ణ, ఏలూరు, ఏలూరు జిల్లా

### పరీక్షాపే చర్చ

నిరుపేద విద్యార్థులకి బలవర్ధక ఆహారం, ఆర్థిక సాయం, పుస్తకాలు, పెన్నులు,యూనిఫారం ఇలావారికి అవసరమైన వాటినన్నిటిని అందించటం ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లి అక్కడి పరిస్థితులను గమనించడం, క్రమశిక్షణ అలవర్చటం వంటి పనులని ప్రభుత్వం జిల్లా కలెక్టర్లకి విద్యాధికారులకి అప్పగించాలి. ఈ మధ్య కొందరు సినీప్రముఖులు, రాజకీయ నాయకులు మారుమూల గ్రామాలను దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తున్నారు. అలానే నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థులను ధనవంతులు కలెక్టర్లు, మంత్రులు దత్తత తీసుకొని వారికి విద్యాదానం చేయాలని ప్రభుత్వం సంకల్పించాలి. ఇవన్నీ చేస్తేనే విద్యారంగానికి విద్యార్థులకు న్యాయం జరుగుతుంది.

-ఎమ్.ఎస్.శర్మ, హైదరాబాద్

### పెరుగుతున్న శబ్దకాలుష్యం

గ్రామాల్లో పట్టపగలే వీధి దీపాలు వెలుగుతున్నాయి. కరెంట్ కోతలు విధిస్తున్నారు.లోవోల్టేజి సమస్య. అపరిశుభ్రమైన మురికి కాలువలు. మైకులు, డిజెల ద్వారా శబ్ద కాలుష్యం అధికం. దోమల బెడద. రెసిడెన్షియల్ ఏరియాలో అక్రమంగా వెల్డింగ్ షాపులు, కారంమిల్లులు నిర్వహిస్తున్నారు.ఆటో, ట్రాక్టరు డ్రైవర్లు టేప్‌రికార్డర్‌లో అధిక శబ్దంతో పాటలు పెడుతున్నారు. పొద్దున్నే వీధి వ్యాపారస్తులు గట్టిగా కేకలు వేస్తూ నిద్రాభంగం కలిగిస్తున్నారు. శబ్దకాలుష్యాన్ని అరికట్టడానికి అవసరమైన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది. ఇది ఒక్కరితో ముగిసిపోయేది కాదు.

-పుట్లూరి రాంనర్సింహా రెడ్డి, నల్లగొండ జిల్లా

మన వి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# విద్య, ఉద్యోగాల్లో అసమానతలు తొలగించలేరా?

**రాష్ట్ర పరిధిలోని చట్టాలకు లోబడి అన్ని రంగాల్లో సమన్యాయం చేసుకోవాలని, ప్రభుత్వ పాలనలో ప్రతినిధు లుగా జనాభా దామాషా ప్రకారం బీసీ ఎస్సీఎస్టీ నాయ కులు ఉన్నప్పుడే ఆయా కులాలకు సామాజిక రాజకీయ ఆర్థిక రంగాల్లో సామాన్యయం జరుగుతుందనే వాస్తవాన్ని నేటి బీసీ ఎస్సీ ఎస్టీ నాయకులు గ్రహించి ఇకనైనా పరి వర్తన చెంది సామాజిక పోరాటాలని రాజ్యాధికార పోరాటం దిశగామళ్లించి యుద్ధ ప్రాతిపదికన ఆధిపత్య కులాలకబంధ హస్తాల్లో బందీఅయిపోయిన రాజ్యన్ని ఉలిక్కిపడేలా సామా జిక రాజకీయ పోరాటాలు చేయాల్సిన తక్షణ అవసరత ఉన్నదనే అంశాన్ని అణగారిన వర్గాల నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న మేధావులు విద్యావంతులైన నాయకులు, ప్రజలు గ్రహించాల్సిన సత్యం.**

పుల్లెంల గణేష్

భారతదేశ సామాజిక వ్యవస్థలో కులానికి ఉన్న ప్రాధాన్యత ఏంటో జగమెరిగిన సత్యం. నేడు ఆధునిక భారతంలో కూడా ప్రభుత్వ విధి విధానాలను ప్రభుత్వ పథకాలను అమలు చేయాలంటే ప్రతి అంశంపై ప్రత్యక్షంగా, పరోక్షంగా కులం ప్రభావం ఉంటుంది. ఐతే కులంతో ఆనాటి నుండి నేటివరకు అత్యధికంగా లబ్ధి పొందుతున్నది 10శాతం ఉన్న అగ్రకులాలే. ఎందుకనగా స్వాతంత్రానంతరం రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వంలో మెజార్టీ నాయకులు అగ్రకులాల నాయకులే. ఐతే కులం మూలంగా అత్యధికంగా వెనుకబాటుకి గురవుతున్నది మాత్రం మెజారిటీగా ఉన్న అణగారిన వర్గాలేనని సామాజిక రాజకీయ ఆర్థిక సాంస్కృతిక అంశాలని క్షుణ్ణంగా పరిశీలిస్తే నిరూపణ అవుతుంది. అయితే అగ్రవర్ణాలమని చెప్పుకుంటూ స్వాతంత్రం ముందు స్వాతంత్రం తర్వాత కూడా భారతదేశ పాలన వ్యవస్థలో చక్రం తిప్పుతున్నది మాత్రం 10శాతం ఉన్న అగ్రవర్ణాలైతే 90శాతం పైగా ఉన్న బిసి, ఎస్సీఎస్టీలు ఆనాటి నుండి నేటి వరకు పాలితులుగానే ఉంటున్నారు అనేది చరిత్ర నిరూపిస్తున్నది. కులంలోని తారతమ్యాల కారణంగా ఎస్సీ రిజర్వేషన్ల ఫలాలు రాజ్యాంగ బద్ధంగా, చట్టబద్ధంగా అన్ని కులాలకి సమ పంపిణీ కావడం లేదని ఎస్సీకులాల్లో కూడా చైతన్యవంతులైన కొన్ని సమూహాలు మాత్రమే విద్య, ఉద్యోగ పరంగా లబ్ధిపొందడం, అదే ఎస్సీకులాల్లో అనేక చిన్న చిన్న కులాలు విద్యా, ఉద్యోగాల్లో అత్యంత వెనుకబాటుకు గురవడం అనేది ఒక విధంగా అసమానతలకి దారితీస్తున్నది. ఎస్సీ కులాల రిజర్వేషన్ ఫలాలు సమ పంపిణీ కావాలనే అంశంతో ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో మూడు దశాబ్దాలుగా అనేక మంది నాయకులు ఎస్సీ వర్గీకరణ కావాలని సామాజిక న్యాయం కోసం పోరాటాలు చేస్తున్నారు. ఇక ఆనాటి సామాజిక పోరాటాల మూలంగా సామాజికన్యాయం అమలుకై చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చేయడం జరిగింది. అప్పుడు ఎస్సీల్లో 59 కులాలు ఉన్నట్టుగా గుర్తించి నాలుగు భాగాలుగా విభజించి ఏ గ్రూపు కులాలకి 1శాతం, బి గ్రూప్ కులాలకి 7 శాతం, సి గ్రూప్ కులాలకి 6శాతం, డిగ్రూప్ కులాలకు 1 శాతం రిజర్వేషన్లు కేటాయించడం జరిగింది. అయితే కొద్ది కాలానికి ఆ వర్గీకరణ అంశాన్ని శాస్త్రీయ దృక్పథంతో సమ పంపిణీ కావడం లేదని సుప్రీంకోర్టు కొట్టి వేసింది. ఇక ఆనాటి నుండి నేటి వరకు కూడా ఎస్సీ వర్గీకరణకై అనేక సామాజిక పోరాటాలు జరుగుతూనే ఉన్నాయి.అందులో భాగంగా గత సంవత్సరం ఆగస్టు1న సుప్రీంకోర్టు ధర్మసనం ఏడుగురు న్యాయమూర్తులతో కూడిన బెంచ్ కేంద్ర పార్లమెంట్ చట్టంతో సంబంధం లేకుండా ఆయా రాష్ట్రాలే వర్గీకరణ చేసుకోవచ్చని వెసులుబాటు ఇస్తూ తీర్పు ఇవ్వడం జరిగింది. వర్గీకరణ అమలుకై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలో భాగంగా తాజాగా ఫిబ్రవరి 4న అసెంబ్లీ వేదికగా ఎస్సీ వర్గీకరణ అమలుకై చట్టబద్ధత చేస్తామని హామీ ఇస్తూ,రాష్ట్ర ప్రభుత్వం వేసిన ఏకసభ్య కమిషన్ చైర్మన్ ఐన షామీమ్ అక్తర్ ఇచ్చిన రిపోర్ట్‌లోని క్రిమిలేయర్ అంశాన్ని మినహాయిస్తూ, మిగతా అంశాలు అమలు చేస్తామని అసెంబ్లీ సాక్షిగా చెప్పడం జరిగింది. అయితే తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తామంటున్న ఎస్సీ వర్గీకరణలో భాగంగా 59 కులాలను గుర్తించి మూడు విభాగాలుగా విభజించారు. వాటిలో



గ్రూప్1 కేటగిరిలో సామాజికంగా ఆర్థికంగా విద్యాపరంగా అత్యంత వెనుకబడిన 15కులాలని చేర్చి 3.288శాతం జనాభాకి 1 శాతం రిజర్వేషన్ కేటాయిస్తామని, గ్రూప్.2 కేటగిరిలో మధ్యస్థంగా లబ్ధిపొందిన కులాలుగా 18 సమూహాలని ప్రధానంగా ఎస్సీఇతర ఉపకులాలని చేర్చి 62.48 శాతం జనాభాకి 9శాతం రిజర్వేషన్లని కేటాయిస్తామని, గ్రూప్3 కేటగిరిలో మెరుగైన ప్రయోజనాలు పొందిన కులాలుగా 26 సమూహాలని ప్రధానంగా ఇతర ఉపకులాలని చేర్చి33.963శాతం జనాభాకి 5శాతం రిజర్వేషన్లని 2011 జనాభా లెక్కల ప్రకారం రిజర్వేషన్స్ కేటాయిస్తామని తీర్మానం చేయడం జరిగింది. భారత రాజ్యాంగ నిర్మాత డా. బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాధికారం అనే మాస్టర్ 'కీ'తో సామాజిక రాజకీయ ఆర్థిక సాంస్కృతిక రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకురావచ్చని సందేశాన్ని ఇచ్చాడు. కాబట్టి ఇకనైనా ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో దశాబ్దాల కాలంగా ఎస్సీ వర్గీకరణ అమలుకై ఎందరో నాయకులు పోరాటం చేసినప్పటికీ ఆ ఒక్క సమస్యని జీవితకాల సమస్య కాదు. కాబట్టి తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలు కాబోతున్న తరుణంలో ఇక ఇన్నాళ్లుగా వర్గీకరణ కోసం పోరాడిన నాయకులందరూ కూడా రాజ్యాధికార పోరాటంపైదృష్టి పెట్టి తెలంగాణ రాష్ట్రంలో మెజారిటీగా ఉన్న బీసీ ఎస్సీ ఎస్టీ నాయకులు ఏకమై బహుజన రాజ్యాధికారాన్ని సాధించుకోవడమే ముందున్న అంతిమ లక్ష్యం అని భావించాలి. ఎందుకంటే అణగారిన వర్గాలకి తెలంగాణ రాష్ట్రంలో నేటి వరకు రాజ్యాధికారం లేకపోవడం మూలంగా రాజకీయ, సంపద, భూభాగ, వ్యాపారం ఇలా అనేకరంగాల్లో సమాన వాటా దక్కక తీవ్రంగా నష్టపోయినట్టుగా అనేక గణాంకాలు నిరూపిస్తున్నాయి. ఒకప్పుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అగ్ర కులాలు ఎస్సీ,ఎస్టీలపై చేసిన అనేక దాడుల సంఘటనల్లో ఒకరికొకరు అన్నదమ్ముల వలె కలిసి పోరాడి హక్కులకై, న్యాయం కోసం ఉద్యమించారు. ఎస్సీ వర్గీకరణ సాధించుకోవడమే జీవితకాల లక్ష్యంగా ఆయా నాయకులు భావించకుండా, ఒకనాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో బహుజన రాజ్యస్థాపనకై రాజకీయ రణరంగాన్ని సృష్టించిన దళిత, బహుజన నాయకులు నేడు అంతేస్థాయిలో బహుజన రాజ్యాధికార భూకంపనలు సృష్టించాల్సిన అత్యవసరత ఉన్నదనే సత్యాన్ని అణగారిన వర్గాల నాయకులు గ్రహించాలి. ఎస్సీ వర్గీకరణతో రాష్ట్రస్థాయిలోని ప్రభుత్వ ఆధ్వర్యంలోని విద్యా ఉద్యోగాల్లో అవకాశాన్ని దక్కించుకోగలం కానీ కేంద్ర స్థాయి ఉద్యోగాల్లో సమాన వాటాకి రాష్ట్రస్థాయి చట్టాలు సరిపోవు కాబట్టి అంతిమంగా పార్లమెంటులో జనాభా దామాషాప్రకారం ఆయా కులాల ప్రతినిధులు ఉంటేనే అన్ని సామాజిక వర్గాల వారికి అన్ని రంగాల్లో పంపిణీ జరుగుతుంది. కనీసం రాష్ట్ర పరిధిలోని చట్టాలకు లోబడి అన్ని రంగాల్లో సమన్యాయం చేసుకోవాలని, ప్రభుత్వ పాలనలో ప్రతినిధులుగా జనాభా దామాషా ప్రకారం బీసీ ఎస్సీఎస్టీ నాయకులు ఉన్నప్పుడే ఆయా కులాలకు సామాజిక రాజకీయ ఆర్థిక రంగాల్లో సామాన్యయం జరుగుతుందనే వాస్తవాన్ని నేటి బీసీ ఎస్సీ ఎస్టీ నాయకులు గ్రహించి ఇకనైనా పరివర్తన చెంది సామాజిక పోరాటాలని రాజ్యాధికార పోరాటం దిశగామళ్లించి యుద్ధ ప్రాతిపదికన ఆధిపత్య కులాలకబంధ హస్తాల్లో బందీఅయిపోయిన రాజ్యన్ని ఉలిక్కిపడేలా సామాజిక రాజకీయ పోరాటాలు చేయాల్సిన తక్షణ అవసరత ఉన్నదనే అంశాన్ని అణగారిన వర్గాల నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న మేధావులు విద్యావంతులైన నాయకులు, ప్రజలు గ్రహించాల్సిన సత్యం. •

# ఉచిత పథకాలతో సామాన్యుడిపై భారం


తిరుమలశెట్టి సాంబశివరావు

ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ మధ్య మాటల సందర్భంలో క్షీణించిన రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితుల్లో, తాము ఇచ్చిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి హామీలను తక్షణమే అమలు చేయటం కష్టమని వెల్లడించారు. మంచిదే, అయితే ఈ మహిళా ఉచిత బస్సు ప్రయాణం బదులు వైసీపీ ప్రభుత్వం పెంచిన చార్జీలని గత తెలుగుదేశ ప్రభుత్వ స్థాయికో, నష్టం వచ్చినా ప్రభుత్వమే భరిస్తూఇంకా సాధ్యమైన మేర తగ్గిస్తే ప్రయాణీకులందరికీ లాభమేగాక ప్రజారవాణా పెరిగి ట్రాఫిక్‌ఇక్కట్లు, వాహన ప్రమాద మరణాలు, జల,వాయు కాలుష్యాలు తగ్గి, పర్యావరణానికిమేలు చేస్తుంది. విదేశీ, చమురు దిగుమతుల భారమూతగ్గుతుంది. కనుక ఈ దిశగా ప్రభుత్వం పునరాలోచన చేయాలి. మహిళలకి ఉచిత బస్సు ప్రయాణం అని వూరించిన కర్ణాటక ప్రభుత్వం కూడా పెరిగిన ఉచిత భారాన్ని చార్జీలను పెంచి ప్రజలపై మోపబోతుందనే వార్తలు వచ్చాయి. అసలు రాజకీయపార్టీలు ప్రకటించే జనాకర్షక పథకాల భారాన్నిమోసేది అధికార పార్టీలనేతలో, తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేసే విపక్షపార్టీ నేతలోకాదు, తామేనని తెలుసు గనుక మెజార్టీ ప్రజలు తరచూ సుపరిపాలన వైపే మొగ్గుతుంటారు. సూపర్ సిక్స్ విజన్ 2047వంటి పథకాల కంటే స్వచ్ఛమైన పరిపాలన కోసం మన రాష్ట్రంలో తెలుగు దేశం పార్టీని గెలిపించారు. ఒకప్పుడు పశ్చిమ బెంగాల్‌లో జ్యోతి బసు, త్రిపురలో మాణిక్ సర్కార్, ఒరిస్సాలో నవీన్ పట్నాయక్ లాంటి వారు దక్షత, నిజాయితీ గల నేతలనే నమ్మికతో ప్రజలు 20సంవత్సరాలు పైగా ఏకధాటిగావారిని గెలిపించారు. రాష్ట్రంలో కూడా రౌడీయిజాన్ని, అవినీతిని నియంత్రించిన క్రమశిక్షణ గల నేతలుగా భావించి యన్టీఆర్, చంద్రబాబును ఎన్నోసార్లు గెలిపించారు. అయితే విద్యుత్ చార్జీల పెంపు, బషీర్ బాగ్ కాల్పుల ఘటనతో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రతిపక్షాలు ఏకమైన ఫలితంగా 2004 ఎన్నికల్లో కొద్ది తేడాతో టీడీపీ ప్రభుత్వం ఓడిపోయింది. ఇక ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేశామని గొప్పగాచెప్పుకున్నా, ప్రతిపక్షాల అనైక్యత, ముఖ్యంగా ప్రజారాజ్యం, టీఆర్‌ఎస్ భారీగా చీల్చటంతో రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం రెండోసారి అతికష్టమ్మీద గట్టెక్కింది. ఇక అనుచిత ఉచిత పథకాలకు సానుకూలంగా లేని బిజెపి కూడా గత మూడు సార్వత్రిక ఎన్నికల్లో దేశభక్తి, పౌరులంతా ఒక్కటే,నిజాయితీ వంటి నినాదాలతోనే విజయం సాధించింది కదా. ఐనా నేటి మన నాయకులు ప్రజల ధనమే అనే ధీమాతో, మంచి అనిపించుకోవడానికి పోటీపడి ఎన్నికల వేళ హామీలు ఇస్తున్నారు. ఇకనైనా అప్పుల ఊబిలో వున్న రాష్ట్రప్రభుత్వం కూడా ఉచితాల మాయ నుండి బైటపడి తక్షణ ప్రజా సమస్యలపై దృష్టి సారించాలి. నేడు ప్రజలు చౌక రుణాల సౌకర్యం వంటి వాటితో భారీగా పెరిగిన వాహన వినియోగం, ట్రాఫిక్ వంటి సమస్యలతో అవస్థలు పడుతున్నారు. రాష్ట్ర విభజన వేళ రెండు ప్రభుత్వాలు పోటీపడి పెంచిన జీతభత్యాల ఫలితంగా ఖజానాపై వ్యయం భారీగా పెరిగి లక్షలాది ఖాళీలను భర్తీ చేయకపోవటంతో తగినంత మంది సిబ్బందిలేరని అధికారులూ, ఉద్యోగులూ గతంలో వలె తరచూ క్షేత్రస్థాయిలో పర్యటించకపోవటంతో పురపాలన గాడితప్పింది. కార్లు, కాన్వాయిల్లో తిరిగే ప్రజాప్రతినిధులకు ఈ సమస్యలపై సరైన అవగాహన లేకపోవచ్చు. కనుక ఇకనైనా వాటిపై తక్షణ చర్యలు చేపట్టాలి.మన ప్రతిపక్షాలు కూడా ప్రతి ప్రభుత్వనిర్ణయాన్ని రాద్ధాంతం చేసే అలవాటు మానుకోవాలి. పెన్షన్, రేషన్ కార్డులు వంటి వాటిలో అక్రమాలపై విచారణ జరిపించాలని ప్రభుత్వం భావిస్తుంటే పేదలపై పిడుగు అంటూ కొందరు అర్థం లేని వ్యాఖ్యలు చేస్తున్నారు. అసలు ప్రతి ప్రభుత్వ సంక్షేమ పథకానికి రేషన్ కార్డు కావాలని డిమాండ్ చేస్తున్నందునే తెల్లరేషన్ కార్డులు తీసుకోటం, ఫలితంగా రేషన్ బియ్యం పక్కదారి పట్టటం చూస్తున్నాం. అయితే పాశ్చాత్య జల్సా సంస్కృతి పెరగటం, అధిక పన్నుల భారం మోస్తున్నాం గనుక కొంత వరకైనా గిట్టుబాటు చేయాలని మరి కొందరు సంపాదనా పరులు కూడా సంక్షేమ పథకాలు పొందుతున్నారు. మన వంతుగా సొంత లాభం కొంత మానుకుంటేనే సమాజం చైనా, జపాన్ వంటి దేశాలవలే త్వరితగతిన అభివృద్ధి చెందుతుంది. మన పిల్లల్ని కష్టపడి, కష్టపెట్టి చదివిస్తే అప్పుడు తెలుసుకోకపోయినా పెరిగి ప్రయోజకులై తమ పెద్దల గురించి గొప్పగా చెప్పుకుంటారు మరి అక్రమాలతో వందల కోట్లు సంతానానికి పంచినా వారి గురించి గొప్పగా చెప్పుకోరు, చెప్పుకోలేరు. అలాగే మంత్రులు, ప్రజా ప్రతినిధులు కూడా తామ ఆదర్శంగా ఉంటూ ఉచిత పథకాల దుష్ఫలితాలను వివరిస్తే ప్రజలు తప్పక అర్థంచేసుకుంటారు. ఐతే అవసర మైన సంక్షేమ పథకాలనుమాత్రం నిజమైన పేదలకే వర్తింప జేస్తూ, ఇలా ఆదాచేసిన ప్రజా ధనంతో గతప్రభుత్వం భారీగా పెంచిన విద్యుత్ బిల్లులు, బస్సుచార్జీల భారం తగ్గిస్తే ఎటువంటి రాయితీ పథకాలు ఆశించనీ, స్థిరమైన ఆదాయం లేని సామాన్య, అన్నివర్గాల ప్రజలు హర్షిస్తారు. •

# స్థానిక సమస్యల పరిష్కారమే పంచాయతీరాజ్ లక్ష్యం!

రామ కిష్టయ్య సంగన భట్ల

భారత దేశంలోని అతి ప్రాచీన వ్యవస్థ పంచాయతీ రాజ్ వ్యవస్థ. గ్రామస్థాయిలో అమల్లో ఉండే అతి ప్రాచీన పాలనా వ్యవస్థే పంచాయతీ. ఇదే స్థానిక స్వపరిపాలనా సంస్థల వ్యవస్థ. ప్రాచీన కాలంలో పనిచేస్తున్న గ్రామ పాలనా వ్యవస్థ నాటి సాంఘిక పరిస్థితుల కనుగుణంగా గ్రామ వృత్తి పనివారల ప్రతినిధులతో పనిచేయగా, బ్రిటిష్ పాలనకాలంలో గవర్నర్ జనరల్ రిప్పన్ ప్రోత్సాహంతో స్థానిక స్వపరిపాలనా సంస్థలు రూపు దిద్దుకున్నాయి. 1919, 1935 భారత ప్రభుత్వ చట్టాలు కొంత వీటికి బలం చేకూర్చాయి. భారత దేశంలో మూడంచెల పంచాయతీ రాజ్ వ్యవస్థను ప్రారంభించిన తొలి రాష్ట్రంరాజస్థాన్ కాగా, 1959 నవంబరు 1న, ఆంధ్రప్రదేశ్‌లో దేశంలోనే రెండవదిగా, మహబూబ్ నగర్ జిల్లా, షాద్‌నగర్లో ప్రారంభమైంది. గ్రామ స్థాయిలో గ్రామ పంచాయతీ, బ్లాకు స్థాయిలో పంచాయతీ సమితి, జిల్లాస్థాయిలో జిల్లా పరిషత్ ఏర్పడింది. 1986లో బ్లాకు స్థాయి వ్యవస్థని మండల పరిషత్‌గా మార్చారు. కేంద్ర ప్రభుత్వ చొరవతో ప్రయోగాత్మక ప్రాతిపదికగా, సమాజ వికాసాభివృద్ధి కార్యక్రమం (కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్) 1952లో ప్రారంభమైంది. ఈ కార్యక్రమం ద్వారా దేశంలో బాగా వెనుకబడిన గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, రవాణా సౌకర్యాలు, కుటీర పరిశ్రమలు అనే ఐదురంగాలకు ప్రాధాన్యం ఇచ్చారు. 1953లో ఈ పథకాన్నే జాతీయ విస్తరణ సేవా పథకం (నేషనల్ ఎక్స్‌టెన్షన్ సర్వీస్ స్కీమ్)గా దేశ మంతటా అమలు చేశారు. ఈ కార్యక్రమాల ప్రభావాన్ని అంచనా వేయడానికి బల్వంతరాయ్ మెహతా అధ్యక్షతన నిపుణుల కమిటీని 1956లో నియమించారు. ఈ కమిటీ తన నివేదికను 1957లో సమర్పించింది. ఈకమిటీ సిఫారసులే పంచాయతీరాజ్ వ్యవస్థ (ప్రజాస్వామ్య వికేంద్రీకరణ) ఏర్పాటుకు మూలాధారం అయినాయి. బల్వంతరాయ్ మెహతా (1900 ఫిబ్రవరి 19, 1965 సెప్టెంబరు 19) స్వాతంత్ర్య సమర యోధుడు, సామాజిక కార్యకర్త, పంచాయితీ రాజ్ నూతన వ్యవస్థ మార్గదర్శకుడు. ఆయన బర్డోలి సత్యాగ్రహ భాగస్వామి. గుజరాత్ రాష్ట్రానికి రెండవ ముఖ్యమంత్రిగా పనిచేశాడు. స్వయం పాలన కోసం ప్రజల పోరాటం ఆయన జీవితాశయం. ప్రజాస్వామ్య వికేంద్రీకరణ సంబంధంగా 'బల్వంతరాయ్ మెహతా కమిటీ' సిఫార్సులు దేశంలో అమలు పరచబడి,ప్రాచుర్యం పొందిన పంచాయితీ రాజ్ అనే విప్లవాత్మక కార్యక్రమంతో మెహతా గుర్తింపు పొందాడు.స్వాతంత్ర్యం తరువాత మెహతా భారత దేశ లోక్‌సభకు పార్లమెంటు సభ్యునిగా రెండుసార్లు ఎన్నికయ్యాడు. పార్లమెంట్ అంచనా కమిటీ అధ్యక్షుడుగా ఉన్నాడు. ప్రణాళిక ప్రాజెక్ట్స్ కమిటీ అధ్యక్షుడుగా రాష్ట్రాలలో మూడు అంచెల వ్యవస్థ స్థాపన కోసం మెరుగైన విధానానికి అద్భుతమైన నివేదికను సిద్ధం చేశాడు. తద్వారా



భారతదేశపు పంచాయితీ రాజ్ ఫాదర్‌గా ప్రశంసించ బడ్డాడు.1952, అక్టోబరు 2న ప్రవేశపెట్టిన సమాజ అభివృద్ధి కారక్రమం ప్రాతిపదికగా, జాతీయాభివృద్ధి మండలి 1957, జనవరి, 16న బల్వంత్‌రాయ్ గోపాల్ మెహతా అధ్యక్షతన ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ 1953, అక్టోబరు 2న ప్రవేశపెట్టిన జాతీయ విస్తరణ సేవా కార్యక్రమం పథకాలు ఎంతవరకు విజయవంతం అయినాయో సమీక్షించి, గ్రామ పరిపాలనలో ప్రజలకు భాగస్వామ్యం కల్పించడానికి అవసరమయ్యే సంస్థాగత ఏర్పాటును సిఫార్సు చేసింది. బల్వంతరాయ్ మెహతా కమిటీ ప్రజాస్వామ్య వికేంద్రీకరణ ప్రజల భాగస్వామ్యం అనే అంశాలతో 3 అంచెల పంచాయతీరాజ్ వ్యవస్థను సిఫారసు చేస్తూ, తన నివేదికను 1957, నవంబరు 24న జాతీ యాభివృద్ధి మండలికి సమర్పించింది. కమిటీ నివేదికను జాతీయాభివృద్ధి మండలి 1958, జనవరిలో ఆమోదించింది. ఈ నివేదికలోని అంశాల అమలు వివిధ రాష్ట్రాలు పంచాయతీ రాజ్ సంస్థ ఏర్పాటుకు ప్రయత్నించాయి. భారత దేశంలో 1959 అక్టోబరు 2న రాజస్థాన్‌లోని నాగూర్ జిల్లాలో పంచాయతీరాజ్ వ్యవస్థను లాంచనంగా ప్రారంభించారు. రాజస్థాన్ రాష్ట్రంలో, నాగోర్ జిల్లాలోని, సికార్ అనే ప్రాంతంలో ఈ విధానాన్ని ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ ప్రారంభిస్తూ చేసిన వ్యాఖ్యానం"నేడు ప్రారంభమవుతున్న స్థానిక స్వపరిపాలనా సంస్థలు భారత ప్రజాస్వామ్యానికి ప్రాతిపదికగా పనిచేస్తూ జాతి నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తూ, భవిష్యత్ నాయకత్వానికి పాఠశాలలుగా తోడ్పడతాయి. మూడు అంచెల విధానాన్ని ప్రారంభించిన రెండో రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. 1959, నవంబరు 1న ఆంధ్రప్రదేశ్లోని రంగారెడ్డి జిల్లాలోని శంషాబాద్ వద్ద నీలం సంజీవరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నెహ్రూప్రారంభించారు. బల్వంతరాయ్ మెహతా కమిటీ చేసిన ముఖ్యమైన సిఫార్సులు దేశంలో 3 అంచెల పంచాయతీ రాజ్ విధానం ఏర్పాటు చేయాలి, జిల్లా స్థాయిలో జిల్లా పరిషత్, బ్లాకు స్థాయిలో పంచాయతీ సమితి, గ్రామ స్థాయిలో గ్రామ పంచాయతీ ప్రజల భాగస్వామ్యం కల్పించడానికి పంచాయతీరాజ్ వ్యవస్థను నెలకొల్పాలి. గ్రామ పంచాయతీ వ్యవస్థకు ప్రత్యక్ష ఎన్నికలను నిర్వహించాలి. ఈ ఎన్నికలు పార్టీ ప్రాతిపదికన కాకుండా, స్వతంత్ర ప్రాతిపదికపై జరపాలి. స్థానిక సంస్థలకు ప్రతి 5 సంవత్సరాలకు ఒకసారి నియమబద్ధంగా ఎన్నికలు జరపాలి. స్థానిక సంస్థలకు తగిన అధికారాలను, ఆర్థిక వనరులను సమకూర్చాలి. భవిష్యత్తులో చేపట్టబోయే అభివృద్ధి పథకాలన్నీ స్థానికసంస్థల ద్వారానే నిర్వహించాలి. స్థానిక స్వపరిపాలనలో జిల్లా కలెక్టరు కీలకపాత్ర పోషించాలి. కింది స్థాయిలో మినహాయించి, మాధ్యమిక, ఉన్నత స్థాయిల్లో పరోక్ష ఎన్నికలు నిర్వహించాలి. అధికారాల, పరిపాలనా, వనరుల, ప్రణాళికా, ప్రజాస్వామ్య వికేంద్రీకరణలు జరగాలి.పంచాయతీలకు రాష్ట్రప్రభుత్వం గ్రాంట్లు మంజూరు చేయాలని బల్వంత్‌రాయ్ మెహతా కమిటీసూచించింది. స్థానిక సమస్యలను స్థానికంగా పరిష్కరించడం, ప్రజలను రాజకీయంగా చైతన్యం చేయడం పంచాయతీ రాజ్ వ్యవస్థ ప్రధాన లక్ష్యం. ఆ లక్ష్యసాధన కోసం స్వాతంత్ర్యానంతరం కేంద్రరాష్ట్రప్రభుత్వాలు తనవంతు కృషిచేస్తూనే ఉన్నాయి. •

## బాలల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు అధికారులు కృషి చేయాలి : బాపట్ల జిల్లా కలెక్టరు

**బాపట్ల, ఫిబ్రవరి18,ప్రభాతవార్త:** బాలల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి అన్నారు. బాలల సంక్షేమం, హక్కుల పరిరక్షణపై అనుబంధ శాఖల అధికారులతో మంగళవారం స్థానిక కలెక్టరేట్ నుంచి వీక్షణ సమావేశం ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణకు జిల్లాస్థాయిలో కమిటీ నియమించనున్నట్లు కలెక్టర్ ప్రకటించారు. బాలలు, మహిళల సంక్షేమం, ఆరోగ్యం, సంరక్షణ అంశాలపై జిల్లా సంయుక్త కలెక్టర్ నాయకత్వంలో కమిటీ పని చేస్తుందన్నారు. మహిళలు పని చేసే ప్రదేశాలలో స్నేహపూర్వక వాతావరణం కల్పించడం, సామాజిక భద్రత అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రధానంగా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, గ్రానైట్ పరిశ్రమలు, టెక్స్ టైల్స్, ఆక్వా పరిశ్రమలలో 18 సంవత్సరాలలోపు బాలలు పనిచేయరాదన్నారు. నియమించనున్న కమిటీ జిల్లాలోని అన్ని పరిశ్రమలలో తనిఖీలు చేయాలన్నారు. 14 సంవత్సరాలలోపు బాలలు బడిలోనే ఉండాలని ఆదేశించారు. ఎట్టి పరిస్థితులలో బాలలు పనిలో ఉండరాదన్నారు. పరిశ్రమలు అభివృద్ధికి ఎంతో అవసరమని, తద్వారా నిరుద్యోగ సమస్య తీరుతుందన్నారు. పరిశ్రమలతో ఉత్పాదకత మెరుగు పడుతుందన్నారు. తనిఖీల సమయంలో ఈ విషయాన్ని గుర్తించి నిబంధనలు, మార్గదర్శకాలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. బాలల సంరక్షణ కొరకు పనిచేస్తున్న సార్డ్స్, బచ్చన్ బచావో వంటి స్వచ్ఛంద సంస్థల సహకారాన్ని తీసుకోవాలని ఆయన సూచించారు. పరిశ్రమలలో కార్మికుల ప్రాణాలు సంరక్షణ చాలా ముఖ్యమన్నారు.బాలల ఆరోగ్యం, హక్కుల పరిరక్షణ కొరకు అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. కొన్ని పరిశ్రమలలో అధికంగా శీతలీకరణ కేంద్రాలు ఉన్నాయని, ఆ ప్రాంతంలో పనిచేసే వారికి ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున వైద్య శిబిరాలు నిర్వహించాలని సూచించారు. బాపట్ల జిల్లాలో ఆక్వా అనుబంధ పరిశ్రమలు, జీడి మామిడి ప్రాసెసింగ్ యూనిట్లు, గ్రానైట్ పాలిషింగ్ యూనిట్లలో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన యువత అధికంగా ఉన్నట్లు ప్రాథమిక సమాచారం ఉందన్నారు. ఈ నేపథ్యంలో స్వచ్ఛంద సంస్థల సహకారంతో పరిశ్రమలలో పరిశీలన, అక్కడ పని చేసే వారికి



అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రమాదాల సమయంలో ప్రాణాలు కాపాడుకోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మహిళలకు అవగాహన కల్పించాల న్నారు. అలాంటి వారి వివరాలను ఆభా లో నమోదు చేయాలన్నారు. వారి ఆరోగ్య బీమా, జీవిత బీమా, నిబంధనలు వర్తిస్తున్నాయా లేదా పరిశీలించాలన్నారు. వారి వృత్తిలో నైపుణ్యం అభివృద్ధికి శిక్షణలు ఇవ్వడం ఎంతో అవసరమన్నారు. అధికారులు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేస్తేనే మంచి ఫలితం లభిస్తుందని వివరించారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ జీఎం శ్రీనివాసరావు, కార్మిక శాఖ అధికారి వెంకట శివ ప్రసాద్, మహిళ, శిశు సంక్షేమ శాఖ అధికారి ఉమా, కాలుష్య నియంత్రణ మండలి అధికారి, సార్డ్స్ సంస్థ ప్రాజెక్టు మేనేజర్ సుజని, బచ్చన్ బచావో మేనేజర్ తిరుపతిరావు, అనుబంధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అమరావతి వార్త

## విలీన గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యత

### -కమిషనరు పులి శ్రీనివాసులు

**గుంటూరు కార్పొరేషన్ ఫిబ్రవరి, 18 ప్రభాతవార్త :** గుంటూరు నగర పరిధిలోని విలీన గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని నగర కమీషనర్ పులి శ్రీనివాసులు ఇంజనీరింగ్ అధికారులకు స్పష్టం చేశారు. మంగళవారం కమీషనర్ రోజువారీ పర్యటనలో భాగంగా బుడంపాడు, బొంతపాడు గ్రామాల్లోని పలు ప్రాంతాల్లో పర్యటించి పారిశుద్ధ్యం, అభివృద్ధి పనులను పరిశిలించారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూవిలీన గ్రామాల్లో రోడ్లు, మెరుగైన పారిశుధ్య పనులు చేపట్టడానికి అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వార్డు సచివాలయ కార్యదర్శులు తమ సచివాలయం పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక వసతుల సమస్యలపై సమగ్ర అవగాహన కల్గిఉండి అందుకు అనుగుణంగా ఉన్నతాధికారులకు నివేదిక అందించాలని ఆదేశించారు. అలాగే ప్రజారోగ్య కార్మికుల రేషనలైజేషన్ పూర్తవుతున్నందున పారిశుద్ధపనుల్లో భాగంగా ఇంటింటి చెత్త సేకరణ నూరు శాతం జరిగేలా పర్యవేక్షణ చేయాలని శానిటరి ఇన్స్పెక్టర్లను ఆదేశించారు. ఈ పర్యటనలో ఈఈ కోటేశ్వరరావు, డిఈఈ సతీష్‌కుమార్, ఏఈలు, శానిటరి ఇన్స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.



## పెండ్లి కుమారునిగా మల్లేశ్వరుడు



**మంగళగిరి,ఫిబ్రవరి 18,ప్రభాతవార్త :** స్థానిక శ్రీగంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఈనెల 18నుంచి 27వ తేది వరకు జరిగే శ్రీమహా శివరాత్రి బ్రహోత్స వాల్లో భాగంగా తొలిరోజైన మంగళవారం స్వామివారి పెండ్లి కుమారుని ఉత్స వం జరిగింది. ఈ సందర్భంగా గణపతి పూజ,స్వామివారికి పంచామృతా భిషేకం, ఉత్స వమూర్తులకు పెండ్లికుమారుని చేయుట పూజలు నిర్వహించారు.అర్చక స్వామి మహేష్‌కుమార్‌శర్మ,పురోహితులు టి.శ్యాంసుందర్ శాస్త్రి పూజలు నిర్వహించారు.పట్టణానికి చెందిన చంద్రిక జ్యూయలర్స్ అధినేత జంజనం నాగేంద్రరావు, విజయలక్ష్మి దంపతులు కైంకర్యపరులుగా వ్యవహరించారు.కార్యక్రమంలో మాజీ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ భోగి కోటేశ్వరరావు,సీతారామ కోవెల మాజీ ట్రస్ట్ బోర్డుచైర్మన్ వాకా మంగారావు,మాజీ ట్రస్ట్ బోర్డు సభ్యుడు కొల్లి వేంకట బాబురావు పాల్గొన్నారు.దేవస్థానం కార్యనిర్వాహణాధికారి జేవి నారాయణ పర్యవేక్షించారు.

## మహాశివరాత్రి మహోత్సవాన్ని విజయవంతం చేస్తాం

### - మల్లేశ్వరస్వామి ఆలయ డిప్యూటి కమిషనరు లీలాకుమార్

**పెదకాకాని,ఫిబ్రవరి18,ప్రభాతవార్త:** పెదకాకాని శ్రీగంగా భ్రమరాంబ సమేత శ్రీమల్లేశ్వరస్వామి వారి ఆలయం మహాశివరాత్రి పర్వదిన ఉత్స వాలను అన్నిప్రభుత్వశాఖల సమన్వయంతో పనిచేసే ఉత్స వాలుసజావుగా సాగేలా ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయడిప్యూటి కమిషనర్ గోగినేని లీలాకుమార్ తెలిపారు. మంగళవారం ఆలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేవంలో ఏర్పాట్లు గురించి వివరించారు. మహ శివరాత్రి బ్రహ్మోత్స వములు శైవాగమప్రకారముగా పాన్సా హినికదీక్షతో శాస్త్రవుత ్తముగా జరుగునని తెలిపారు. ఈసందర్భంగా ప్రతిరోజు విజే ుశ్వరపూజ పుణ్యా హవాచనము పంచగవ్యప్రాసన దీక్షధారణ అంకురారోహణ అగ్నిప్రతిష్టాపన అఖండ దీపారాధన ధ్వజారోహణ నిత్యబలిహరణ, ప్రతినిత్యం స్వామివారికి మహన్యాసక పూర్వక ఏకాదశ రుద్రాభిషేకములు శ్రీభ్రమరాంబ అమ్మవారికి సహస్రనామ కుంకుమార్చనలునిత్యం విశేషంగా చతుర్వేద పారాయణం జరుగునని తెలిపారు. ఆలయానికి రంగులు దిద్దుతూ రథోత్స వానికి భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈనెల23నుంచి మార్చి1 వరకు ఆలయంలో మహాశివరాత్రి మహోత్స వాలు జరగ ునున్నాయని అన్నారు. శివరాత్రిరోజు వామన పూజలు అనుమతులు ఉండవని తెలిపారు. భక్తులకు ఉచితదర్శనం శీఘ్ర దర్శనం ఎర్పాట్లు జరుగుతున్నాయని, 26వతేది రాత్రిలింగోద్భవ కాలమున స్వామివారికి వివేషంగాఅభిషేకములు నిర్వహించినట్లు తెలిపారు. అదేరోజు రాత్రి రెండు గంటలకు శ్రీభ్రమరాంబ సమేత మల్లేవ్వరస్వామి వార్ల కళ్యాణోత్స వం అత్యంత వైభవముగా నిర్వహించుటకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.



## రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి : విద్యుత్తు శాఖ మంత్రి

**కారంపూడి, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:** రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని విద్యుత్తు శాఖ మంత్రి, పల్నాడు జిల్లా ఇన్‌ఛార్జి గొట్టిపాటి రవికుమార్, మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. ఒప్పిచర్ల గ్రామంలోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి తిరునాల సందర్భంగా



మంగళవారం దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రమంతా అభివృద్ధి పథంలో పరుగెడుతుందన్నారు. రాష్ట్రంలో వ్యవస్థలన్నీ గాడిలో పెట్టామన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగుదేశం నాయకులు కుర్రి శివారెడ్డి, మద్దిరాల జానఒని, అక్కయ్య చౌదరి, పుల్లయ్య, అంజయ్య, సరస్వతి బాలునాయక్, బాలకృష్ణ, మస్తాన్ జాని, రాఘవ, సైదారావు, చప్పిడి రాము, బూసా రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## చారిత్రక ప్రాంతాలలో సినిమాలు తీయటం అభినందనీయం : మంత్రి గొట్టిపాటి

యడ్లపాడు, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త : చారిత్రక కొండవీడు ప్రాంతములో గ్రామీణ వాతావరణంలో సినిమాలు తీయటం చాలా అభినందనీయమని, ఇందులో గ్రామీణ సచివాలయంలో ఉండే పంచాయితీ కార్యదర్శి పాత్రలో శివాజి స్వంతంగా సినిమానిర్మించటం చాలా అభినందనీయమని, ఇటు వంటి చారిత్రక ప్రాంతములో పర్యాటక రంగంగా అభివృద్ధి చెందాలన్నదే ముఖ్య ఉద్దేశమని, ఇందుకు గాను స్థానిక శాసన సభ్యులు ప్రత్తిపాటి పుల్లారావుతో కలిసి ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడును కలసి అభివృద్ధికి తీసుకోవల్సిన చర్యలను తీసుకుంటామని నియోజక వర్గ ఇన్‌చార్జి మరియు విద్యుత్ శాఖా మాత్యులు గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. అనంతరం స్థానిక శాసన సభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ గత ప్రభుత్వంలోనే కొండవీడు అభివృద్ధికి బాటలు పడ్డాయని, అప్పుడు మెట్ల మార్గం, ఘాట్ రోడ్డు నిర్మాణం చేపట్టటంతో పర్యాటకులకు చాలా ఉపయోగ కరంగా ఉందని, నేడు ఈ ప్రాంతములో ఈ ప్రాంత వాసి సినిమాను



తీయటం చాలా అభినందనీయమని, చారిత్రక ప్రదేశాలలో ఇటువంటి కార్యాక్రమాల వల్ల మరింత పర్యాటకంగా అభివృద్ధి చెందటానికి ఉపయోగ పడుతుందన్నారు. అనంతరం నటుడు శివాజి మాట్లాడుతూ కొండవీడు ప్రాంతము మా స్వగ్రామం దగ్గరలోనే ఉందని, అయితే పుల్లారావు ఎప్పుడూ చెబుతున్నారని, ఈ ప్రాంతం అభివృద్ధి చెందాలని తెలుపుతున్నారని, ఇందులో బాగంగానే నా స్వంత ప్రోడక్షన్‌లో రెండవ సినిమాఅని, అయితే ఏపీలోను సినీ పరిశ్రమ ఉంటే ఇక్కడ యువతకు నూతన ఉరవడి వస్తుందని, దీనిపై సిఎమ్ నారాచంద్రబాబు నాయుడుతో తెలపటంతో వారు సానుకూలంగా స్పందించారని, త్వరలో ఏపిలోనూ సిని పరిశ్రమ వస్తుందని అకాక్షించుతున్నానన్నారు. ఇది టూరిజం కోసమే ఈ సినిమా చేయటం జరుగుతుందని, ఇప్పటికే సగభాగం పూర్తి అయిందని, ఇంకా ఇక్కడ రెండు రోజుల పాటు షూటింగ్ నిర వ్రహించుతున్నామన్నారు. కొండవీడు పర్యాటక రంగా అభివృద్ధి చెందాలన్నదే నాఉద్దేశమన్నారు. కార్యక్రమంలో నియోజక వర్గ నాయకులు, మండల, గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇంటింటి వ్యర్థాల సేకరణ ఖచ్చితంగా జరగాలి : కమిషనరు ధ్యానచంద్ర

### -శానిటరీ ఇనస్పెక్టర్ బైక్‌పై తిరుగుతూ పారిశుధ్య పరిశీలన గావించిన వైనం

**విజయవాడ కార్పొరేషన్,ఫిబ్రవరి 18,ప్రభాతవార్త:** రోడ్డుపై ఎటువంటి వ్యర్థాలు ఉండకూడదని, ఇంటింటి వ్యర్థాల సేకరణ ఖచ్చితంగా జరగాలని, పుష్‌కార్ట్‌లలో ఖచ్చితంగా నాలుగు చెత్తబుట్టలను



ఉంచాలని,తడి చెత్తను,పొడి చెత్తను విడివిడిగా సేకరించాలని,నిర్మాణ వ్యర్థాలను ఎప్పటికప్పుడు తీసివేయాలని మున్సి పల్ కమీషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన తన పర య్యటనలో భాగంగా ఆంధ్రప్రభ కాలనీ, ప్రకాష్‌నగర్,ఎల్బీఎస్ నగర్,ఉడా కాలని,కరకట్ట రోడ్,కంఢ్రిక,నూజివీడు రోడ్డు, వాంబే కాలని తదితర ప్రాంతాలను పర్యటించి క్షేత్రస్థాయిలో పారిశుధ్య నిర్వహణ పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెయిన్‌రోడ్ల లోనే కాకుండా చిన్న చిన్న వీధుల్లో కూడ పారిశుద్ధ నిర్వహణ ఖచ్చితంగా జరగాలని,ఎక్కడా వ్యర్థాలు ఉండరాదని ఆదేశించారు. ప్రకాష్‌నగర్, ఎల్బీఎస్‌నగర్,ఉడా కాలనీ,పరిసర ప్రాంతాలన్నీ శానిటరీ ఇనస్పెక్టర్ గోపీరాజు ద్విచక్ర వాహనంపై ఎక్కి పారిశుధ్య నిర్వహణను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వ్యర్థాలను రోడ్డుపైన నిలువ ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని, కాలువల్లో పూడికలను ఎప్పటికప్పుడు తీస్తూ నీటి ప్రవాహంలో ఎటువంటి ఆటంకం లేకుండా చూసుకోవాలని,నీటి ప్రవాహం ఆగినప్పుడు దోమలు ఉత్పత్తి అవుతాయని, దోమలు నియంత్రించడానికి కాలువల్లో పూడికలను తీయడమే కాకుండా మలేరియా సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ప్రతి రోజు ఫాగింగ్,యంఎల్ ఆయిల్ స్ప్రే చేస్తూ ప్రజలు దోమకాటు వల్ల అనారోగ్యం పాలవకుండా చూసుకునేటట్లు చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో ఇంఛార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్‌బాబు,బయాలజిస్ట్ సూర్యకుమారి, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బాబూ శ్రీనివాస్,శానిటరీ ఇనస్పెక్టర్లు,సిబ్బంది పాల్గొన్నారు.

## పర్యావరణ హితమైన వస్తువులనే వాడాలి

### -ఇన్‌ఛార్జి ఛీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్

**విజయవాడ కార్పొరేషన్,ఫిబ్రవరి 18,ప్రభాతవార్త:** పర్యావరణ హితమైన వస్తువులనే వాడాలని, మార్కెట్ ప్రదేశాల్లో,రైతుబజార్లో,హాస్పటల్స్‌లో ఎక్కడా కూడ సింగిల్ యూజ్ ప్లాస్టిక్స్‌ను నిషేధించాలని దానికి బదులుగా పర్యావరణ హితమైన వస్తువులను వాడేందుకు ప్రజలను చైతన్యపర్చాలని,ఈ నెలాఖరు లోగా ప్రజలందరికీ వాటి గురించి అవగాహన



కల్పించాలని ఇన్‌ఛార్జి మెడికల్ హెల్త్ ఆఫీసర్ సురేష్‌బాబు పేర్కొన్నారు. మంగళవారం కమీషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కార్యక్రమంలో భాగంగా వ్యర్థాలు ఎక్కువగా వచ్చే ప్రదేశాలైన రైతుబజార్,మార్కెట్,హాస్పటల్స్,హోటల్స్ మేనేజర్లతో కార్పొరేషన్ ప్రధాన కార్యాలయం లోని నూతన భవనం,మీటింగ్ హాల్లో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకసారి వాడి పడేసిన ప్లాస్టిక్ వ్యర్థాలతో పర్యావరణానికి హాని కల్గుతుందని అవి భూమిలో కలిసిపోవడానికి 200 సంవత్సరాలకు పైగా సమయం పడుతుందన్నారు. మార్చి 1 నుండి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై ప్రత్యేక రైడ్లు నిర్వహిస్తారని, ఎవరైనా సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ని వాడినా, విక్రయించినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని భారీ జరిమానా విధిస్తామని,అమ్మే వారి ట్రేడ్ లైసెన్సు కూడ కాన్సిల్ చేస్తామన్నారు సమావేశంలో రైతు బజార్ ఎస్టేట్ ఆఫీసర్లు,మార్కెట్ మేనేజర్లు,హాస్పటల్ మేనేజర్లు,అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్లు,సానిటరీ సూపర్‌వైజర్లు,ఇనస్పెక్టర్లు పాల్గొన్నారు.

## పోలింగ్ బూతులను పరిశీలించిన పల్నాడుజిల్లా కలెక్టరు

**దుర్గి, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త :** ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ బూతులను మంగళవారం జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు పరిశీలించారు. దుర్గి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించి అక్కడున్న ఎన్నికల పోలింగ్ బూతులను పరిశీలించి సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు.



అనంతరం పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు జరుగుతున్న స్టడీ అవర్స్‌ను పరిశీలించి ఇటీవల జరిగిన పరీక్షలలో విద్యార్థుల ప్రగతిని ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. సరైన ప్రగతి లేని విద్యార్థులకు ఎలాంటి తర్ఫీదు అందిస్తారని, విద్యార్థులకు మెటిరియల్ గురించి అడిగి తెలుసుకున్నారు. 10వ తగరతి పరీక్షల్లో విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తమ ఫలితాలు సాధించే విధంగా కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆయన వెంట యంఈఒ బెంజిమెన్, ఆర్డీవో మురళీకృష్ణ, తహశీల్దారు ఫణీంద్రకుమార్, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

## జీబీఎస్ పై ఆందోళన వద్దు

### -జీజీ హెచ్ సూపరింటెండెంట్ రమణ యశస్వి



**గుంటూరు కార్పొరేషన్ ఫిబ్రవరి, 18 ప్రభాతవార్త :** గుల్లియన్ బారీ సిండ్రోమ్ (జి.బి.ఎస్.) విషయంలో ఎవరూ ఆందోళన చెందాల్సి న పనిలేదని, జీజీహెచ్‌లో తగిన వైద్య సేవలు, ఔషదాలు అందుబాటులో ఉన్నాయని జీజీ హెచ్ సూపరింటెండెంట్ రమణ యశస్వి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ గతంలో వైరస్ జబ్బుల బారిన పడిన వారికి ఈ సిండ్రోమ్ వచ్చే అవకాశాలు ఎక్కువ అని . కరోనా భారిన పడిన వారిలో ఇప్పుడు ఈ వైరస్ కనిపిస్తోందన్నారు. జీజీహెచ్ న్యూరాలజీ విభాగంలో బాధితులకు చికిత్స అందిస్తున్నామని చెప్పారు. ఇలాంటి కేసులు తరచుగా వస్తుంటాయన్నారు. ఇప్పుడు వేరే జిల్లాల నుంచి కేసులు రావడంతో సంఖ్య పెరిగినట్లు కనిపిస్తోందన్నారు. జీజీహెచ్‌లో చేరిన ఎనిమిదేండ్ల పాప ఈ సింద్రోం నుంచి కోలుకొని డిశ్చార్జ్ అయినట్లు వెల్లడించారు. జీజీహెచ్ లో చేరిన వారిలో కోనసీమ, పల్నాడు జిల్లా వాసులు కూడా ఉన్నారని పేర్కొన్నారు. ఈ వైరస్ సోకిన వారికి సాధారణంగా పాదాలు, కాళ్లలో జలదరింపు, బలహీనతతో మొదలై చేతులు చాతి, మెడ, ముఖం వంటి భాగాలకు విస్తరిస్తుందని తెలిపారు. అందుకే దీన్ని అపెండింగ్ పెరాలసిస్ అని కూడా అంటారని వివరించారు. సమస్య ముదురుతున్న కొద్ది కండరాల బలహీనత, పక్షవాతం గాను మారుతుందని చెప్పారు. చాలా వరకు కదలికలకు తోడ్పడే చలన నాడుల మీద ప్రభావం చూపినా, కొందరిలో గుండె శ్వాస వేగం వంటి పనులను నియంత్రించే స్వయంచాలిత నాడీ వ్యవస్థను దెబ్బతీయొచ్చని యశస్వి వివరించారు. ప్రభావితమైన అవయవాలను బట్టి వేరువేరు లక్షణాలు కనిపిస్తుంటాయని ఆయన వెల్లడించారు. ఈ వ్యాధి లక్ష మందిలో ఒకరిద్దరికి మాత్రమే వచ్చే అవకాశం ఉందన్నారు. శరీరంలోని రోగనిరోధక వ్యవస్థ పొరపాటున ఫెరిపెరల్ నరాలపై దాడి చేయడంతో కండరాల బలహీనత, తిమ్మిర్లు రావడం, కాళ్లు చచ్చుబడి పోవటం వంటి సమస్యలు తలెత్తుతాయన్నారు. జీబీఎస్ రోగులకు సరిపడా ఇమ్యూనో గ్లోబిన్ ఇంజెక్షన్లు అందుబాటులో ఉన్నాయన్నారు. వ్యాధి లక్షణాలు ఏమాత్రం బయపడినా సరే వెంటనే వైద్యులను సంప్రదించి తగు వైద్య సేవలు పొందాల్సి న అవసరం ఉందన్నారు.

## తిరునాళ్ల ఏర్పాట్లను పరిశీలించిన కమిషనరు

**నరసరావుపేట, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త :** నరసరావుపేట పురపాలక సంఘ పరిధిలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని జరుగుతున్న ఏర్పాట్లను కమిషనర్ జశ్వంత్‌రావు మంగళవారం పరిశీలించారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. కోటప్పకొండరోడ్డు, వినుకొండరోడ్డు, బస్టాండ్ ప్రాంతాలలో డివైడర్లకు వేస్తున్న పెయింటింగ్స్‌ను, సెంట్రల్ లైటింగ్



పనులను తనిఖీ చేశారు. పారిశుద్ధ్య పనులకు సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పారిశుద్ధ్య నిర్వహణలో ఎక్కడా లోపాలు కనిపించకూడదన్నారు. పెయింటింగ్ పనులతో పాటు సెంట్రల్ లైటింగ్ పనులలోనూ వేగంతో పాటు నాణ్యత ఉండాలన్నారు. పట్టణంలోని ప్రధాన రోడ్లన్నీ పరిశుభ్రంగా ఉండాలన్నారు. రోడ్ల వెంబడి ఉన్న ఆక్రమణలను తొలగించాలన్నారు. కమిషనర్ జశ్వంత్‌రావు వెంట మున్సి పల్, ఇంజనీరింగ్ అధికారులు, శానిటరీ అధికారులు ఉన్నారు.

## రీసర్వే ఆకస్మిక తనిఖీ చేసిన జేసి భార్గవ తేజ



**గుంటూరు,ఫిబ్రవరి 18,ప్రభాతవార్త :** రీసర్వే పైలెట్ ప్రాజెక్టు క్రింద జిల్లాలోని తుళూ ్లరు మండలం,వడ్డమాను గ్రామంలో రీసర్వే ఏవిధంగా జరుగుతుందో అని జిల్లా సంయుక్త కలెక్టర్ ఏ.భార్గవ్ తేజ ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు.ఈ సందర్భంగా రీసర్వే బ్లాక్ బైండరీ సరిహద్దును పరిశీలించి గ్రౌండ్ ట్రుతింగ్ కార్యక్రమానికి హాజరైన రైతులతో మాటా ్లడి వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు .గ్రామపటం ,ఓఆర్ఐ షీట్లను పరిశీలించి గ్రామ సర్వేయర్లకు,గ్రామ రెవెన్యూ అధికారులకు రీసర్వే మీద తగు సూచనలు చేశారు.కార్యక్రమానికి జేసి తోపాటు తుళ్ళూరు మండల తహసీల్దార్ సుజాత,సర్వే సహాయ సంచాలకులు,డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్,మండల సర్వేయరు,గ్రామ సర్వేయర్లు,గ్రామ రెవెన్యూ అధికారులు హాజరయ్యారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుని మృతి



**వత్స వాయి ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:** వత్స వాయి గ్రామానికి చెందిన తన్నీరు నాగబాబు అనే యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు ఎస్సై ఉమామహేశ్వరరావు తెలిపారు. వత్స వాయి నుండి తన ద్విచక్ర వాహనంపై తన తల్లి లక్ష్మీతో కలిసి పెనుగంచిప్రోలు గ్రామానికి తన సోదరుడైన వెంకటేశ్వరరావు ఇంటికి వెళుతుండగా వత్స వాయి కొత్త వేమవరం గ్రామాల మధ్య జరిగిన రోడ్డు ప్రమాదంలో నాగబాబు అక్కడకక్కడే సంఘటనా స్థలంలో మృతిచెందగా తల్లి లక్ష్మి తీవ్ర గాయాల పాలయ్యారు. నాగబాబు మృతదేహాన్ని జగ్గయ్యపేట ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## ఆలయప్రాంగణంలో స్టీల్ క్యూలైన్ ఏర్పాటుకు విరాళం అందజేత

**పెదకాకాని,ఫిబ్రవరి18,ప్రభాతవార్త:** పెదకాకాని గ్రామ వాస్తవ్యులు బండారు రామారావు(రాము) ధర్మపత్ని ధనలక్ష్మి దంపతులు ప్రాంగణంలో ఉచిత ప్రసాద వితరణచేయుటకు ఏర్పాటు చేయుచున్న స్టీల్‌క్యూలైన్లకు రూ.50,000-లు నగదును ఆలయ ఉపకమీషనర్ ద్వారా కాంట్రాక్టర్ కి అందించినట్లు దేవస్థాన ఉపకమీషనర్ గోగినేని లీలాకుమార్ తెలిపారు.ఆలయ అభివృద్ధికి, నిత్యఅన్నదాన పథకమునక ుభక్తులు విరివిగా విరాళము సమర్పించి ఆలయ అభివృద్ధికి సహకరించవలసిందిగా భక్తులకు విజ్ఞప్తి చేసినారు.అనంతరం దాతలకు ప్రత్యేక దర్శనం,వేదాఆశీర్వచనం చేయించి శ్రీస్వామి వారి శేషవస్త్రంతో సత్కరించి చిత్రపటం అందజేశారు.



## వర్సిటీని సందర్శించిన జువాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా - బొటానికల్ సర్వే ఆఫ్ ఇండియా ప్రతినిధులు

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,ఫిబ్రవరి 18,ప్రభాతవార్త :** వర్సిటీని బొటానికల్ సర్వే ఆఫ్ ఇండియాకు చెందిన శాస్త్రవేత్త డాక్టర్ శంకరరావు,జువాలజికల్ సర్వే ఆఫ్ ఇండియాకు చెందిన శాస్త్రవేత్తలు డాక్టర్ దీప జైస్వాల్,డాక్టర్ రాజమోహన్ లు మంగళవారం సందర్శించారు.వర్సిటీలోని వృక్ష,సూక్ష్మజీవ శాస్త్రం,ఫారెస్ట్రీ జంతుశాస్త్ర విభాగాలను సందర్శించి విద్యార్థులతో సమావేశం అయ్యారు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫారెస్ట్రీ,వృక్ష,జంతు శాస్త్ర విభాగాల్లో పోస్టు గ్రాడ్యుయేషన్ తర్వాత బొటానికల్ సర్వే ఆఫ్ ఇండియా,జువాలజికల్ సర్వేఆఫ్ ఇండియా సంస్థల్లో పరిశోధనతో పాటు ఉపాధి అవకాశాలను విద్యార్థులకు వివరించారు.అనంతరం విభాగాధిపతి ఆచార్య కె.మల్లికార్జునతో సమావేశమై పశ్చిమ కనుమలు,మడ అడవుల్లో ఏపి బయోడైవర్సిటీ బోర్డు కార్యక్రమాలను తెలియజేశారు.అనంతరం ఇన్‌చార్జీ విసి ఆచార్య కె.గంగాధరరావు,ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం లను మర్యాదపూర్వకంగా కలిశారు.బయోడైవర్సిటీ నిర్వహిస్తున్న కెపాసిటి బిల్డింగ్ కార్యక్రమాన్ని గురించి తెలియజేశారు. .కార్యక్రమంలో ఆచార్య వెంకటేశ్వర్లు,ఆచార్య రామచంద్రన్,ఆచార్య వెంకటరత్నమ్మ,ఆచార్య ఉమామహేశ్వరరావు,ఆచార్య ఎస్ఎం ఖాశీం,డాక్టర్ తిరుపతిరావు,డాక్టర్ కె.బాబు,డాక్టర్ నాగరాజు,డాక్టర్ మిధున్,డాక్టర్ బాలరాజు,డాక్టర్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# హ్యాండ్‌బాల్ పోటీల విజేతలుగా తెనాలి ఎన్ఆర్‌కె కళాశాల విద్యార్థులు

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,ఫిబ్రవరి 18,ప్రభాతవార్త :** వర్సిటీలో జరుగుతున్న అంతర్ కళాశాలల పురుషుల హ్యాండ్ బాల్ పోటీల్లో తెనాలిలోని ఎన్ఆర్‌కె అండ్ కెఎస్ఆర్ గుప్తా కళాశాల మొదటి స్థానంలో నిలిచి ట్రోఫీని కైవశం చేసుకుంది.



రెండోస్థానంలో వర్సిటీ వ్యాయామ విద్య కళాశాల నిలువగా,మూడవ స్థానంలో రేపల్లెలోని ఏబిఆర్ ప్రభుత్వ కళాశాల నిలిచినట్లు పోటీల నిర్వాహక కార్యదర్శి బి.అప్పలరాజు తెలిపారు.ఈ సందర్భంగా విజేతలకు బహుమతి ప్రధానోత్సవం జరిగింది.కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం మాట్లాడుతూ విశ్వవిద్యాలయ క్రీడాకారులు జాతీయ,అంతర్జాతీయ స్థాయిలో పథకాలు సాధించి వర్సిటీ ప్రతిష్టను పెంచాలని కోరారు.రానున్న రోజుల్లో అంతర్జాతీయ స్థాయి క్రీడాపోటీలకు అతిధ్యం ఇచ్చే యూనివర్సిటీగా ఎదగాలని ఆకాంక్షించారు.విశిష్ట అతిధిగా పాల్గొన్న వ్యాయామ విద్యా డైరెక్టర్ ఆచార్య పిపిఎస్ పాల్‌కుమార్ మాట్లాడుతూ క్రీడాకారులకు విశ్వవిద్యాలయం అందించే ప్రయోజనాలను వివరించారు.ఈ పోటీలను వర్సిటీ ఫార్మసీ కళాశాల నిర్వహించినట్లు వివరించారు.ఈ సందర్భంగా ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఏ.ప్రమీలరాణి క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు.అనంతరం హ్యాండ్‌బాల్ పోటీలకు 16మంది సభ్యులతో కూడిన జాబితాను సెలక్షన్ కమిటీ సభ్యులు డాక్టర్ ఎం.బి.బుజ్జిబాబు,డాక్టర్ వెలంగిణి రెడ్డి ఎంపిక చేశారు.ఈ జట్టు ఈనెల 28వ తేది నుంచి మార్చి 4వ తేది వరకు పెరియార్ విశ్వవిద్యాలయంలో జరిగే సౌత్ జోన్ విశ్వవిద్యాలయాల పురుషుల హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొంటుందని అప్పలరాజు తెలిపారు.

# ఆలపాటి గెలుపులో ప్రైవేటు ఉపాధ్యాయుల పాత్ర కీలకమైనది : ఎమ్మెల్యే ప్రత్తిపాటి

**చిలకలూరిపేట,ఫిబ్రవరి18,ప్రభాతవార్త:** పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీచేస్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్ గెలుపులో ప్రైవేట్ ఉపాధ్యాయులు కీలకపాత్ర పోషించినున్నారని మాజీమంత్రి,నియోజకవర్గ శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. మంగళవారం ఆలపాటి రాజేంద్రప్రసాద్ గెలుపును కోరుతూ పట్టణంలోని పలు ప్రైవేటు విద్యాసంస్థల లో ప్రత్తిపాటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ చాలిచాలని జీతాలతో జీవితాలు నెట్టుకొస్తున్న ప్రైవేటు ఉపాధ్యాయులకు మద్దతుగా ప్రభుత్వం తరుపున తగిన సహాయసహకారాలు అందించటానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రాబోయే డిఎస్సీని అర్హులైన ప్రైవేటు ఉపాధ్యాయులు ఉపయోగించుకోవాలని అన్నారు. ఆలపాటికి మొదటి ప్రాధాన్యత ఓటువేసి ప్రభుత్వ 8నెలల పాలనకు సంఘీభావంగా మద్దతు తెలపాలన్నారు.నియోజకవర్గ ఎమ్మెల్సీ పరిశీలకులు పోలం దినేష్‌రెడ్డి మాట్లాడుతూ ప్రైవేటు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కొరకు ఆలపాటి రాజేంద్రప్రసాద్ కృషి చేస్తారని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలపాటికి మద్దతుగా చైతన్య లిటిల్స్, చైతన్య టెక్నో, శ్రీ చైతన్య, నారాయణ జూనియార్ కళాశాల మోడరన్ గ్రీన్‌వ్యాలీల ఉపాధ్యాయులను కలసి ప్రత్తిపాటి ఆలపాటి విజయానికి కృషిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త తోట రాజారమేష్, బిజెపి నియోజకవర్గ ఇన్‌చార్జి టి జయరామిరెడ్డి, నియోజకవర్గ టిడిపి సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ కరిముల్లా, పట్టణ అధ్యక్షుడు పఠాన్ సమద్‌ఖాన్, కార్యదర్శి మద్దుమాల రవి, అధికార ప్రతినిధి మురకొండ మల్లిబాబు, చిలకలూరిపేట రూరల్ మండలాల అధ్యక్షుడు జవ్వాజి మదన్‌మోహన్, టిడిపి నాయకులు అబ్దుల్ మజీద్, తూబాటి శ్రీహరి. షేక్ జానీభాష, అజారుద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు దృష్టి లోపాలు రాకుండా పౌష్టిక హారం తీసుకోవాలి

**బాపట్ల,ఫిబ్రవరి18,ప్రభాతవార్త:** పాఠశాల విద్యార్థులు దృష్టి లోపాలు రాకుండా చిన్నప్పటి నుండి పౌష్టిక హారం తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి అన్నారు.స్థానిక పురపాలక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం కంటి అద్దాలను జిల్లా కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులు తప్పనిసరిగా ప్రతిరోజు గుడ్లు, ఆకుకూరలు తీసుకోవాలన్నారు. రక్తహీనతను తగ్గించడానికి ఐరన్ మాత్రలను



విద్యార్థులు తీసుకోవాలన్నారు.పాఠశాల విద్యార్థులు చదువు కునేటప్పుడు సరైన వెలుతురు ఉన్నచోట కూర్చుని చదువుకోవాలని అన్నారు. ప్రతిరోజు నిద్రలేచిన వెంటనే విద్యార్థులు కళ్ళు శుభ్రం చేసుకోవాలని ఆయన అన్నారు. దానితో పాటు కంటికి సంబంధించిన ఎక్సైజ్ లను కూడా విద్యార్థులు తప్పకుండా చేయాలని, విద్యార్థులు మొబైల్స్ చూడడం టీవీలు చూడడం తగ్గించుకొని ఆటలాడుకోవాలని ఆయన సూచించారు. పిల్లలు చదువు కునేటప్పుడు తలనొప్పికి గురివ్వడం సక్రంగా చూడలేక పోవడం వంటి లక్షణాలను తల్లిదండ్రు లు వెంటనే గుర్తించి వారికి అవసరమైన కంటి వైద్య పరీక్షలు చేయించాలన్నారు.జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో ఈ విద్యా సంవత్సరం 3వేల మంది విద్యార్థుకు కంటి అద్దాలు పంపిణీ చేయడానికి ప్రభుత్వం 7 లక్షల50 వేల రూపాయలు మంజూరు చేయడం జరిగిందన్నారు. పాఠశాల విద్యార్థులు ఈ కంటి అద్దాలను తీసుకొని చక్కగా చదువుకొని మంచి మార్కులను సాధించాలని ఆయన అన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పాఠశాల విద్యార్థులకు కంటి అద్దాలు అమర్చి పుస్తకాన్ని చదివించి చూశారు. కంటి అద్దాలు తీసుకున్న తర్వాత విద్యార్థులకు చదువుకోవటం ఎట్లా ఉందని కలెక్టర్ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. దానికి విద్యార్థులు స్పందిస్తూ అద్దాలు పెట్టుకున్న తర్వాత చక్కగా చదువు కుంటామన్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి పురుషోత్తం, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి విజయమ్మ, బాపట్ల రెవిన్యూ డివిజనల్ అధికారి పి.గ్లోరియా, తహసిల్దార్ సలోమి, పాఠశాల ప్రధానో పాధ్యాయులు రాజశ్రీ, విద్యార్థులు తదితరులు, పాల్గొన్నారు.

# 22న మండలపరిషత్ సర్వసభ్య సమావేశం

**నిజాంపట్నం, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:** మండల పరిషత్ సర్వసభ్య సాధారణ సమావేశం ఈనెల 22 ఉదయం 10.30 గంటలకు జరుగుతుందని ఎంపిడిఓ నాగలక్ష్మీ మ తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ మండలాధ్యక్షురాలు మోపిదేవి విజయనిర్మల అధ్యక్షతన సమా వేశం జరుగుతుందని ఎంఎల్‌సి ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అందుకు అను గుణంగా సమావేశం జరుగుతుం దన్నారు. మండలం లోని



ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, కో ఆప్షన్ మెంబర్లు, వివిధ శాఖల అధికారులు తప్పక సమావేశానికి హాజరుకావాలని ఆమె కోరారు.

**-గులియన్ బ్యారి సిండ్రోమ్ బాక్టీరియా వ్యాపించకుండా చర్యలు తీసుకోవాలి :** గులియన్ బ్యారి సిండ్రోమ్ బాక్టీరియా వ్యాపించకుండా చర్యలు తీసుకోవాలని ఎంపిడిఓ నాగలక్ష్మీ పంచాయితీ కార్యదర్శులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒహెచ్ఎస్ఆర్‌ను ప్రతి రోజూ శుభ్రపరచాలని, ప్రతి రోజూ క్లోరినేషన్ చేయాలని తెలిపారు. తాగునీటిని పరీక్షలు చేయించాలని, జంతువుల, పక్షుల, అవశేషాలు వాటర్ టాంకులలో చెరువులలో, బావులలో, నీటికుంటల దగ్గర పడవేయకుండా చూడాలని తెలియజేశారు. టాంక్‌ల దగ్గర పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలనా న్నరు. మంచినీరు కాచి చల్లార్చి తాగాలని, చికెన్ బాగా ఉడికించి తినాలని, తాజా ఆహారం తీసుకోవాలని ఆమె ప్రజలకు సూచించారు.

**18 నుంచి 28 వరకు మండలంలో ఆధార్ మొబైల్ క్యాంప్‌లు:** ఈనెల 18వ తేదీ నుంచి మండలంలోని వివిధ గ్రామాలలో ఆధార్ నమోదుకు మొబైల్ క్యాంప్‌లు నిర్వహిస్తున్నామని ఎంపిడిఓ తెలిపారు. పల్లపట్ల, అడవులదీవి, గరువుపాలెంలలో ఆధార్‌క్యాంప్‌లు నిర్వహిస్తున్నామన్నారు.

# జ్ఞానజ్యోతి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

**నిజాంపట్నం, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:** పూర్వ ప్రాథమిక విద్య గురించి అంగన్‌వాడీ కార్యకర్తలు తెలుసుకోవాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందని ఎ ంఇఒ 1 శోభాచంద్ అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన నిజాంపట్నం జడ్‌పి ఉన్నతపాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహించిన జ్ఞాన జ్యోతి శిక్షణా కార్యక్రమానికి ఆయన కోర్సు డైరెక్టరుగా వ్యవహరిస్తూ మాట్లాడుతూ పూర్వ ప్రాథమిక విద్య విషయాలపై ప్రభుత్వం జ్ఞాన జ్యోతి శిక్షణను ఏర్పాటు చేసిందన్నారు. అంగన్‌వాడీ



కార్యకర్తలు శ్రద్ధగా విని విషయాలను తెలుసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు 120 రోజుల సర్టిఫికెట్ కోర్సు జరుగుతుందని అందులోభాగంగా 6 రోజుల వృత్యంతర శిక్షణ నిర్వహిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ 2 శేషుగోపాలం, సిడిపిఒ అనసూయ, డిఆర్‌పిలు సిహెచ్ గణేష్‌రావు, ఎం తులసీదాసు, ప్రసూన, గౌరి, జ్యోతిలక్ష్మిలు పాల్గొన్నారు.

# డంపింగ్ యార్డు పొగతో విద్యార్థులకు అవస్థలు

**పెదకూరపాడు, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త :** మండల పరిధిలోని 75 తాళ్ళూరు జెడ్పీ హైస్కూల్ తరగతి గదులు గ్రామ పంచాయితీ డంపింగ్‌యార్డు నుండి వచ్చే పొగతో



నిండిపోయి విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. పాఠశాలకు దక్షిణ దిక్కులో డంపింగ్‌యార్డు ఉండటం, గాలివాటం పాఠశాల వైపు వెళ్ళడం కారణంగా తరగతి గదుల్లో పొగ నిండిపోతుంది. ఫ్యాన్లు తిరుగుతుంటే మరికొంత పొగను తరగతి గదుల్లోకి లాగేస్తుంది. వేసవికాలం ప్రారంభం కావడంతో ఫ్యాన్లు వేయకపోతే ఉక్కపోతగా ఉంటుంది. గతంలోనూ అనేకసార్లు గ్రామ పంచాయితీ వారి దృష్టికి, సర్పంచ్ వారికి స్వయంగా విన్నవించినా సమస్య పునరావృతం అవుతూనే ఉంది. త్వరలో పదవ తరగతి కామన్ పరీక్షలు కూడా ఈ పాఠశాలలో జరగనున్నాయి. చెత్త నుండి సంపద సృష్టిస్తాం అని చెప్తున్న ప్రభుత్వ లక్ష్యం ఒక వైపు కాగా, స్థానికంగా చెత్త నుండి పొగసృష్టించడం పాఠశాల విద్యార్థులకు అనారోగ్యం కలిగిస్తుంది. సమస్య పరిష్కరించకుంటే డంపింగ్‌యార్డు తరలించాలని ఉద్యమం చేపట్టాల్సి వస్తుందని పూర్వ విద్యార్థి సంఘం సభ్యులు తెలిపారు.

# ఆధార్ క్యాంపు ప్రారంభం

**యడ్లపాడు, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త :** యడ్లపాడు గ్రామంలోని బొడ్రాయి సెంటరు వద్ద ఉన్న అంగన్వాడీ కేంద్రంలో అధార్ క్యాంప్ ఏర్పాటు చేయటం జరిగిందని ఎంపీడివో హేమలతాదేవి తెలిపారు. ఈ సందర్భంగా అమె వివరిస్తూ ఈ సెంటరు ఈ నెల 21వ తేది వరకు నిర్వహించడం జరుగుతుందని, ఇందులో 0-5సంవత్సరముల పిల్లలకు అధార్ నమోదు



చేయుట అధార్ అప్డేట్ చేయుట జరుగుతుందని, 0-5సంవత్సరంలోపు అధార్ లేని పిల్లలు అధార్ నమోదు చేయవలసినదిగా తెలియజేయడమైందన్నారు. కార్యక్రమంలో పంచాయితీ సెక్రటరీ ఎ శశికళ, డిజిటల్ అసిస్టెంట్లు ప్రసన్న, స్వాతి పాల్గొన్నారు.

# జ్ఞానజ్యోతి శిక్షణా కార్యక్రమం

**యడ్లపాడు, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త :** జ్ఞాన జ్యోతి 120రోజుల శిక్షణా కార్యక్రమము మండల పరిధిలోని లింగారావుపాలెం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నుండి ప్రారంభమైనాయి. ఈ శిక్షణా కార్యక్రమాలు అరు రోజుల పాటు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించట ంజరుగుతుంద



న్నారు. ఈ శిక్షణకు జిల్లా ఎడబ్లూ రిసోర్స్ పర్సన్ మరియు కెఆర్‌పి ఇ నిర్మలరాణి, డిఆర్‌పిలు వి ఉమామహేశ్వరరావు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఎమ్ జోజమ్మ విచ్చేసి 3-6పంవత్సరాల పిల్లలు లబ్దిపొందనున్నారని, పిల్లలలో సమగ్రాభివృద్ధి శారీరకాభివృద్ధి, మానసికాభివృద్ధి, సామాజిక మరియు బావోద్యేగాభివృద్ధి, భాషాభివృద్ధి, సృజనాత్మకతాభివృద్ధులు ఎలా జరుగుతాయి, అనుకూలంగా జరిగితే దేశానికి మంచి పౌరులౌవుతారని, ఈ విధంగా జరగటానికి టిఎల్ఎమ్ తయారుచేసుకోవాలని, అభ్యాసనా సామర్ధ్యం ఎలాపెంచాలి అనే అంశాలపై శిక్షణ ఇవ్వటం జరుగుతుందన్నారు.

# శ్రీలక్ష్మీ నృసింహ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు

**యడ్లపాడు, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త :** మండల పరిధిలోని కొండవీడు కొండలపై నెలకొని ఉన్న 14వ శతాబ్దం నాటి రెడ్డి రాజులు నిర్మించిన అతి పురాతన దేవాలయం శ్రీ లక్ష్మీ మ నృసింహ స్వామి వారి వార్షికోత్సవం సందర్భంగా స్వామివారికి కళ్యాణం మరియు స్వాతీ నక్షత్రం సందర్భంగా గ్రామంలో గ్రామోత్సవం కార యక్రమాలు ఏర్పాటుచేయటం



జరిగింది. ఈ సందర్భంగా ఈ వార్షికోత్సవ కార్యక్రమాలలో రాష్ట్ర విద్యుత్ శాఖా మాత్యులు గొట్టిపాటి రవికుమార్, స్థానిక శాసన సభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పాల్గొని స్వామివారికి పూజలు నిర్వహించారు. అలయ మర్యాదలతో అలయ అర్చకులు, ఎండోమెంట్ అధికారులు వీరికి ఘన స్వాగతం పలికారు.

# శ్రీశైలంలో జరిగే బ్రహ్మోత్సవాలకు ఎమ్మెల్యే ప్రత్తిపాటికి ఆహ్వానం

చిలకలూరిపేట,ఫిబ్రవరి18,ప్రభాతవార్త: రాష్ట్రంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీశైలంలో వేంచేసియున్న భ్రమరాంబసమేత మల్లిఖార్జునస్వామి బ్రహ్మోత్సవాలకు మాజీ మంత్రి, శాసన సభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావును మంగళవారం ఆయన నివాసంలో దేవస్థాన అర్చకులు కలసి ఆహ్వానించారు. ఈ మేరకు ఆహ్వానపత్రిక, స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను ప్రత్తిపాటికి అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 19వతేదినుంచి మార్చి1వతేది వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు



అంగరంగవైభవంగా జరగనున్నాయని, భక్తుల సౌకర్యార్ధం నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

# వ్యాపారస్తులు ఫిబ్రవరిలోనే ట్రేడ్ లైసెన్స్ ఫీజులు చెల్లించాలి : మునిసిపల్ కమిషనరు

చిలకలూరిపేట,ఫిబ్రవరి18,ప్రభాతవార్త: పట్టణంలోని వర్తకులందరూ ఫిబ్రవరి 25వ తేదిలోగా ట్రేడ్ లైసెన్స్‌లు చెల్లించాలని మున్సిపల్ కమీషనర్ పి శ్రీహరిబాబు కోరారు.మంగళవారం కమీషనర్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఫిబ్రవరి నెలలో ట్రేడ్ లైసెన్స్ చెల్లించకపోతే మార్చి నెలలో 25శాతం, మార్చి నెలలో చెల్లించకపోతే ఎప్రిల్ నెలలో 50శాతం అపరాధరుసుం విధించబడుతుందని తెలిపారు. అప్పటికి చెల్లించకపోతే లైసెన్స్



రద్దుచేయడంతోపాటు తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈవిషయాన్ని గమనించి ఫిబ్రవరిలోనే ట్రేడ్ లైసెన్స్ చెల్లించాలని కోరారు.

# దూరవిద్య కేంద్రం ఎంఏ తెలుగు పరీక్షా ఫలితాలు విడుదల

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,ఫిబ్రవరి 18,ప్రభాతవార్త :** వర్సిటీలోని దూరవిద్య కేంద్రం అక్టోబర్,నవంబర్‌లలో నిర్వహించిన ఎంఏ తెలుగు కోరు స1,2,3,4 సెమినార్ పరీక్షల రెగ్యులర్/సప్లిమెంటరీ ఫలితాలను విడుదల చేసినట్లు దూరవిద్య కేంద్రం అసిస్టెంట్ రిజిస్ట్రార్ డి.కోదండపాణి తెలిపారు.విద్యారు ధలు రీవాల్యూయేషన్ కు ధరఖాస్తు చేసుకోవాలనుకునే వారు ఈనెల 28వ తేది లోగా ఒక్కో పేపర్‌కు రూ.960లు చెల్లించి మార్చి 3వ తేదిలోగా పరీక్షల కోఆర్డినేటర్ కార్యాలయానికి దరఖాస్తు అందేలా పంపాలన్నారు.ఫలితాలను దూరవిద్య కేంద్రం వెబ్‌సైట్ లో ఉంచినట్లు వివరించారు.ఈ సందర్భంలో డైరెక్టర్ ఆచార్య వి.వెంకటేశ్వర్లు,పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య డి.రామచంద్రన్,అసిస్టెంట్ రిజిస్ట్రార్ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయుల పాత్ర కీలకం : ఎమ్మెల్యే గళ్ళా మాధవి

**గుంటూరు క్రైమ్,ఫిబ్రవరి 18,ప్రభాతవార్త :** ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల్లో జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని,సమాజ హితం కోసం పాటుపడే ఎన్డీయే కూటమి ప్రభుత్వం బలపరిచిన అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ గెలుపుకోసం ప్రైవేట్





ఉపాధ్యాయులు తమ మద్దతు ఇవ్వాలని గుంటూరు పశ్చిమ నియోజక వర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి కోరారు.మంగళవారం స్థానిక చంద్రమౌళినగర్ 3వ లైన్‌లోని భాష్యం స్కూల్లో ఎమ్మెల్యే మాధవి,ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, మౌలానా ముస్తాక్ అహ్మద్, మన్నవ మోహనకృష్ణ,భాష్యం రామ కృష్ణ, కోవెలమూడి రవీంద్ర,సింహాద్రి కనకా చారిలు ఉపాధ్యాయులతో సమావేశమై ఓట్లు అభ్యర్థించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో ఎమె మ్మల్సీ ఎన్నికల ప్రచారాన్ని విస్తృతంగా నిర్వహిస్తు న్నాము.గడిచిన 5 ఏళ్ళకాలంలో ఉపాధ్యాయులు ,నిరుద్యోగుల మొదలు అన్ని వర్గాల ప్రజలు నరకయాతన అనుభ వించారు.గత ప్రభుత్వానికి చరమగీతం పాడటంలో ఉపాధ్యా యులు కీలకపాత్ర పోషించారు.ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన నాటి నుండి అభివృద్ధిలో ఎలా ముందుకు వెళ్తుందో మనమందరం చూస్తున్నాం.ప్రజల్ని చైతన్యవంతుల్ని చేసే సత్తా ఉపాధ్యా యులకే ఉందని కనుక గత సార్వత్రిక ఎన్నికల్లో నాకు 50వేలకు పైగా మెజార్టీ ఇచ్చారో, అదేవిధంగా అంతటి ఘన విజయాన్ని ఆలపాటికి ఇవ్వాలని కోరారు.రాష్ట్ర రాజకీయాల్లో తన అనుభవంతో సక్సస్ మార్కు చూపిన ఆలపాటి రాజేంద్రప్రసాద్ లాంటి వ్యక్తికి మనం వేసే ఓటు,రాష్ట్రాభివృద్ధిలో ఒక కీలక అడుగు అవుతుంది.కనుక ఉపాధ్యాయులు అందరూ ముక్తకంఠం తో మద్దతు తెలిపి,మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరుతున్నామన్నారు.

**-పోలేరమ్మ తల్లి దేవస్థానంలో జరిగిన చండిహోమం కార్యక్రమానికి హజరైన ఎమ్మెల్యే గళ్ళా మాధవి.**

25వ డివిజన్ స్థానిక సుబ్బారెడ్డినగర్‌లో పోలేరమ్మ తల్లి దేవస్థానంలో జరిగిన చండీహోమం కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిధిగా హాజరై అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు.ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యే గళ్ళా మాధవికి ఘనస్వాగతం పలికి తీర్థప్రసాదాలు అందజేశారు.

# వేములకొండ సుబ్బారావు భౌతికకాయానికి నివాళులు అర్పించిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి

**చిలకలూరిపేట,ఫిబ్రవరి18,ప్రభాతవార్త:** పట్టణంలోని 23వ వార్డుకు చెందిన వేములకొండ సుబ్బారావు మరణించడంతో విషయం తెలుసుకున్న మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు మంగళవారం సుబ్బయ్యతోటలో గల సుబ్బారావు నివాసానికి వెళ్లి ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబసభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతికి



తెలియచేశారు. ఈ కార్యక్రమంలో గౌడ కార్పోరేషన్ డైరక్టర్ కందుల రమణ తదితర టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# జగన్ పరామర్శయాత్రలు సిగ్గుచేటు

## జనసేన రాష్ట్ర నాయకుడు పెంటేల బాలాజీ



**చిలకలూరిపేట,ఫిబ్రవరి18,ప్రభాతవార్త:** తన ప్రభుత్వ హయంలో జరిగిన అక్రమాలకు, అవినీతికి, దౌర్జన్యాలకు ఊతమిచ్చిన నాయకులను పరామర్శిండచానికి వైసిపి అధినేత జగన్ జైలు యాత్రలు చేయడం శోచనీయమని జనసేన పార్టీ సెంట్రల్ ఆంధ్రా కో కన్వీనర్ పెంటేల బాలాజీ అన్నారు. మంగళవారం తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అనేక కేసులలో ముద్దాయిగా ఉండి మహిళలను వ్యక్తిత్వాన్ని కించపరిచేవిధంగా ప్రవర్తించిన వంశీని జైలులో పరామర్శించడానికి వెళ్లడం అంటే ఇటువంటి తప్పులను జగన్ సమర్దించడమేనని బాలాజీ దుయ్యబట్టారు. గతంలో ఈవియం ప్యాడ్ల ధ్వంసం కేసులో ఆరెస్టయిన పిన్నెల్లి రామకృష్ణరెడ్డిని, ఇంకొక కేసులో అరెస్టయి జైలుకు వెళ్లిన నందిగం సురేష్‌ను పరామర్శించడానికి జైలుకువెళ్లిన జగన్ ఇప్పుడు వ్యక్తిని కిడ్నాప్‌చేసి బెదిరించిన కేసులో అరెస్టయిన వంశీని పరామర్శిస్తున్న జగన్ ప్రజలకు ఏ రకమైన సందేశం ఇస్తున్నారని బాలాజీ ప్రశ్నించారు. ఏ నాయకుడైనా ప్రజలకు ఆదర్శంగా ఉండాలనుకుంటారని, ప్రజలలో నమ్మకాన్ని నిలుపుకునే విధంగా ఉంటారని, కానీ జగన్ నేరస్థులను వెనకేసుకురావడం బాధాకరమని బాలాజీ అన్నారు.

# అమేజాన్‌లో అందుబాటు ధరల్లో ప్యార్‌బజార్

**విజయవాడ, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త :** వాలంటైన్స్‌డేను మరింత ప్రత్యేకంగా జరుపుకోడానికి అందుబాటు ధరల్లో కొత్తస్టోర్ ఫంట్‌ను ప్రారంభించామని అమేజాన్ ఇండియా ప్రతినిధులు తెలిపారు. ప్యార్‌బజార్ పేరిట బజార్ ఫ్యాషన్, గృహాలంకరణ, వంటగది ఉత్పత్తులు, ఫోన్ యాసెసరిస్, జ్యువలరీ లపై భారీ తగ్గింపు ఇస్తామన్నారు.

# అంగన్‌వాడీ టీచర్లకు జ్ఞాన జ్యోతి శిక్షణ

**నూజెండ్ల,ఫిబ్రవరి18,ప్రభాతవార్త:** మండలకేంద్రమైన నూజెండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఉప్పలపాడు పాఠశాలల నందు అంగన్‌వాడీ టీచర్లకు జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమం మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాశాఖాధికారి నలబోలు రవింద్ర హాజరై ప్రసంగించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు 6 రోజులు పాటు అంగన్‌వాడీలకు ఈ శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయడం



జరిగిందని తెలిపారు. అంగన్‌వాడీలకు వచ్చే చిన్నారుల పట్ల జాగ్రత్తగా వ్యవహరించి అంకితభావంతో పని చేయాలన్నారు. పిల్లలకు అనువైన బోధనా పద్ధతులు గురించి వివరించారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ చిన్నస్వామి, విన్యాసమ్మ, నాగరాజ కుమారి తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటికి మద్దతుగా జీవీ, మక్కెన విస్తృత ప్రచారం

**వినుకొండ,ఫిబ్రవరి18,ప్రభాతవార్త:** కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు మద్దతుగా ఏపీ ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మకె క్కన మల్లికార్జునరావు విస్తృత ప్రచారం నిర్వహించారు. మంగళవారం పట్టణంలోని జూనియర్ కాలేజి మైదానం, ఎన్నెస్పీ కాలనీ సాయిబాబా గుడి వద్ద ఉదయపు నడక చేస్తున్న ఉపాధ్యాయులు, పట్టభద్రులు, ఉద్యోగులను కలసి ఆలపాటిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. తమకు ప్రత్యర్ధిగా ఉన్న లక్ష్మణరావు ఎమ్మెల్సీగా ఉన్న సమయంలో వైకాపా ప్రభుత్వం ఎన్ని తపు ్పలు చేసినా ఎందుకు ప్రశ్నించలేదో సమాధానం చెప్పాలన్నారు. ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు మద్దతుగా అన్ని ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలు నిలిచాయని మొదటి ప్రాధాన్యత ఓటు కూటమి అభ్యర్థి ఆలపాటికి వేయాలని ఓటర్లను కోరారు. కూటమి ప్రభుత్వం యువతకు అధిక ప్రాధాన్యత ఇస్తూ పెద్ద ఎత్తున ఉపాధి,ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తుందని ఆలపాటిని గెలిపిస్తే ఆ వర్గాలకు మరింత సంక్షేమాభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు నాగశ్రీనురాయల్, లెనిన్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**నూజెండ్ల.......** ఈ నెల 27న జరగనున ్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని తెదేపా నాయకులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన ఓటర్లను కోరారు. మంగళవారం ఈ మేరకు మండలకేంద్రమైన నూజెండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండలంలోని ఉప్పలపాడు గురుకుల పాఠశాల, మోడల్ స్కూల్ నందు కూటమి నాయకులతో కలిసి ఆయన ప్రచార కార్యక్రమం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ద్వారానే యువతకు, ఉపాధ్యాయులకు ప్రయోజనం చేకూతుందని కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో తెదేపా మండల సీనియర్ నాయకులు లగడపాటి వెంకట్రావు, డిసి ఛైర్మన్ గంగినేని రాఘవ, నాయకులు రెడ్డి వెంకటరత్నం,మీసాల మురళీ,వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఫిర్యాదు అందిన 3గంటలలోనే నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు


**యడ్లపాడు, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త :** మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామ సమీపంలోని కృష్ణగంగా నూలు మిల్లు వద్ద జరిగిన గోలుసు చోరీ సంఘటనపై విచారణలోకి దిగిన మూడు గంటలలోపే చేదించటం జరిగిందని, గోలుసు దొంగలను గుంటూరు రైల్వే ష్టేషన్‌లో అదుపులోకి తీసుకోవటం జరిగిందన్నారు. నిందితులు దుకాణంలో కొనుగోలు చేసిన వస్తువులకు నగదు యూపిఐ ద్వారా చేయటంతో వెంటనే సంబంధింత చిలకలూరిపేట బ్యాంకు వద్ద నిందుతుల



సమాచారం సేరించి వారి ఫోన్ నెంబర్ల అధారంగా విచారణ చేపట్టటంతో వారిలో ఒకరు నాదెండ్ల గ్రామానికి చెందిన దినేష్ ప్రస్తుతం హైదరాబాదులో ఉంటున్నాడని, అయితే ఇక్కడికి వచ్చి దొంగతనం చేసి తిరుగు ప్రయాణం హైదరాబాదుకు వెళుతున్న సమయంలో స్టేషన్ సమీపంలో అదుపులోకి తీసుకోవటం జరిగిందన్నారు. వీరు దొంగిలించిన బంగారు గోలుసు 32గ్రాములు ఉందని, దీని విలువ ప్రస్తుతం 3.5లక్షల వరకు ఉందన్నారు. వీరి వద్ద నుండి బంగారం, వారు ఉపయోగించిన బైక్ స్వాదీనం పర్చుకొని కేసు నమోదుచేసి రిమాండ్‌కు పంపటం జరిగిందన్నారు.

# తూనుగుంట్ల చంద్రశేఖర్ మృతిపట్ల పలువురు సంతాపం

**చిలకలూరిపేటటౌన్,ఫిబ్రవరి18,ప్రభాతవార్త:** పట్టణానికి చెందిన ప్రముఖ వస్త్రవ్యాపారి, అయ్యప్పస్వామి దేవస్ధాన కమిటి ఉపాధ్యాక్షులు తూనుగుంట్ల చంద్రశేఖర్ మంగళవారంమృతి చెందారు. తూనుగుంట్ల చంద్రశేఖర్ మృతిపట్ల ఆయ్యప్పస్వామి దేవస్ధాన కమిటి అధ్యక్షులు వెల్లంపల్లి రవిశంకర్, నాగబైరు జగన్మోహన్‌రావు, ఆర్యవైశ్య కళ్యాణమండపం అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ అర్వపల్లి సురేష్‌కుమార్, చేవూరి కృష్ణమూర్తి, పట్టణ ఆర్యవైశ్య సంఘ నాయకులు తమ సంతాపాన్ని తెలియచేశారు.



# సహజసాగు పట్ల ప్రజలు ఆసక్తి పెంచుకోవాలి : ఎంపిడిఓ స్వరూపరాణి

**నాదెండ్ల,ఫిబ్రవరి18,ప్రభాతవార్త:** సహజసాగు పట్ల ప్రజలు ఆసక్తి పెంచుకోవాలని యంపిడిఓ స్వరూపారాణి అన్నారు. సోమవారం సాయంత్రం మండల పరిషత్ కార్యాలయంలో వివిధ గ్రామాలలో సహజసాగుద్వారా పండించిన ఆకుకూరలు, కూరగాయల ప్రదర్శనను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సహజసాగు వలన ఆరోగ్యకరమైన ఆకుకూరలు, పండ్లు పండించవచ్చునని, అవి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని వివరించారు. ఈ కార్యక్రమంలో రైతుసాధికార సంస్థ మండల కన్వీనర్ సాగి శ్రీనివాసరావు, సుధారాణి, సైదా, భార్గవి, వెంకటరామిరెడ్డి, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.



# పేద విద్యార్థికి బాపట్ల జిల్లా కలెక్టరు చేయూత

**బాపట్ల,ఫిబ్రవరి18,ప్రభాతవార్త:** అగ్ని ప్రమాదంలో పూర్తిగా ఇల్లు కాలిపోయిన విద్యార్థిని వేమినేనివెంకట వసంతకు జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి తక్షణమే 10వేల రూపాయలు ఆర్థిక ఆర్థిక



సహాయం అందజేశారు. జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి మంగళవారం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కంటి అద్దాల పంపిణీ కార్యక్రమానికి హాజరయ్యారు. కంటి అద్దాల పంపిణీ కార్యక్రమంలో అద్దాలు తీసుకోవడానికి వచ్చిన వెంకట వసంతను జిల్లా కలెక్టర్ అమ్మ ఈరోజు స్కూలుకు యూనిఫామ్ వేసుకుని రాలేదు ఎందుకని అడిగారు వెంటనే విద్యార్థి బాపట్లలో అగ్నిప్రమాదంలో తమ ఇల్లు కాలిపోయిందని వేసుకోవడానికి యూనిఫామ్ లేదని జిల్లా కలెక్టర్‌కు తెలపడంతో జిల్లా కలెక్టర్ మనసు చలించిపోయి విద్యార్థిని వెంకట వసంతకు వారి కుటుంబానికి 10వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి పురుషోత్తం, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి విజయమ్మ , బాపట్ల రెవెన్యూ డివిజనల్ అధికారి పి.గ్లోరియా, బాపట్ల మున్సిపల్ కమిషనర్ రఘునాథ్, రెడ్డి, తహసిల్దార్ సలీమా తదితరులు పాల్గొన్నారు.

# రీ సర్వేను పరిశీలించిన పల్నాడు కలెక్టరు

**దుర్గి, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త :** దుర్గిలో జరుగుతున్న భూముల రీసర్వేను మంగళవారం జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు పరిశీలించారు. సర్వే జరుగుతున్న విధానాన్ని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సర్వే మ్యాప్‌లను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎటువంటి వివాదాలు లేకుండా రైతులకు ఆమోదయోగ్యంగా సర్వే పనులు నిర్వహించాలన్నారు.



కలెక్టర్ రాకను తెలుసుకున్న పలువురు రైతులు తమ పంటలకు గిట్టుబాటు ధర లేకుండా తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని గిట్టుబాటు ధర అందించాలని రైతులు కలెక్టర్‌ను కోరారు. ఆయన వెంట గురజాల ఆర్డీవో మురళీకృష్ణ, తహశీల్దారు ఫణీంద్రకుమార్, డివిజనల్ సర్వేయర్ భానుకీర్తన, మండల సర్వేయర్ రఘుపతిరావు, రెవెన్యూ సిబ ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులలో పునాది అభ్యాసనాన్ని మెరుగుపరచాలి

**దుర్గి, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త :** విద్యార్థులలో పునాది అభ్యాసనాన్ని మెరుగుపరిచి విద్యా నైపుణ్యాలను పెంపొందించాలని మండల విద్యాశాఖాధికారి బెంజిమెన్ కోరారు. జ్ఞానజ్యోతి 6రోజుల శిక్షణా కార్యక్రమం దుర్గి జిల్లాఉన్నత పాఠశాలలో మంగళవారం ప్రారంభించారు. శిక్షణా కాలంలో నేర్చుకున్న అంశాలను పాఠశాలల్లో అమలు పరిచి విద్యార్థుల నైపుణ్యాన్ని పెంపొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో రీసోర్స్ పర్సన్స్ వెంకటేశ్వరరావు, రవి ప్రసాద్, అంగన్‌వాడి సూపర్‌వైజర్ నాగమణి, ఇన్‌చార్జి హెచ్.యం హనుమంతరావు, అంగన్‌వాడి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గులియన్ బ్యార్రి సిండ్రోమ్ వ్యాధి నివారణ చర్యలపై అవగాహన

**బాపట్ల,ఫిబ్రవరి18,ప్రభాతవార్త:** గులియన్ బ్యార్రి సిండ్రోమ్ వ్యాధి నివారణ చర్యలపై ప్రజలలో అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి అధికారులకు తెలిపారు. గులియన్ బ్యార్రి సిండ్రోమ్ వ్యాధి వ్యాప్తిపై మంగళవారం అధికారులతో స్థానిక కలెక్టర్ ఛాంబర్ లో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రాణాంతకమైన గులియన్ బ్యార్రి సిండ్రోమ్ వ్యాధికి జిల్లా వాసులు గురికాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. కలుషితమైన తాగునీరు, కలుషితమైన ఆహార పదార్థాలు తీసుకోవడంతోనే వ్యాధి వస్తుందని తెలిపారు. వ్యాధి లక్షణాలు గుర్తించడంపై అవగాహన కల్పించాలన్నారు. వ్యాధి సోకినట్లైతే మూడు రోజులపాటు తగ్గకుండా జ్వరం వస్తుందని, తీవ్రమైన నీరసం, డయేరియా, పక్షవాతం, నరాలు సచ్చుపడటం,ఒ ాళ్ళ వేళ్ల దగ్గర నుంచి స్పర్శ క్రమేపి కోల్పోవడం వంటివి సంభవిస్తాయన్నారు. లక్షణాలు కనపడిన వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. బ్యాక్టీరియా సోకిన వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం ప్రత్యేక వైద్యం అందిస్తుందని ఆయన తెలిపారు. గుంటూరు జి జి హెచ్ లో ప్రత్యేక కేంద్రం, ప్రకాశం జిల్లా ఒంగోలు రిమ్స్ లో ప్రత్యేక కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ఎన్టీఆర్ వైద్య ఆరోగ్య కార్డు పై మంగళగిరిలోని నిమ్స్, ఎయిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుటకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని అన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో సరఫరా చేసే తాగునీటిని మరింతగా శుభ్రపరచాలని



అధికారులను ఆయన ఆదేశించారు. కలుషితమైన తాగునీరు, ఆహార పదార్థాలు తీసుకోరాదని సూచించారు. బాగా కాచి, వడకట్టి, చల్లార్చిన నీటినే తాగాలని గ్రామాల్లో బీటా టామ్ టామ్, మైక్ లు, మీడియా ద్వారా ప్రచారం చేసి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. చెరువులలో తాగునీరు కలుషితం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. చెరువుల దగ్గర నుండి త్రాగు నీటిని ప్యూరిఫైయర్ చేసే ప్రదేశం వరకు నీటిని తరలించే కాలువలలో మృత కలేబరాలు, మురుగునీరు కలవకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వాటర్ ట్యాంకులను పూర్తిగా ఎండబెట్టి వాటిని క్లోరినేషన్ చేసిన తర్వాత నీటిని నింపాలని అధికారులకు ఆయన సూచించారు. చెరువుల దగ్గర పరిసరాలు పరిశుభ్రంగా ఉండేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్ విజయమ్మ, ఎస్ ఈ రూరల్ వాటర్ సప్లై అనంతరాజు, బాపట్ల, చీరాల,అద్దంకి, రేపల్లె మున్సిపల్ కమీషనర్లు పాల్గొన్నారు.

# కోలాహలంగా మిట్టగుడిపాడు తిరునాళ్ల

**రెంటచింతల, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:** మండల పరిధిలోని మిట్టగుడిపాడు గ్రామ తిరునాళ్ల వేడుకను పురస్కరించుకుని సోమవారం వివిధ ఆలయాల్లో వేకువ జామునే పూజలు నిర్వహించారు. కల్యాణ వేడుకలకు భక్తులు పెద్దఎత్తున తరలిరావడంతో గ్రామంలో ఆధ్యాత్మిక కోలాహలం నెలకొంది. గ్రామంలోని వేణుగోపాలస్వామి ఆలయం, శివాలయం, భ్రమరాంబ సమేత నాగేశ్వరస్వామి ఆలయాల్లో జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమాలు, స్వామివారి కల్యాణోత్సవాలు తిలకించిన భక్తజనం ఆధ్యాత్మిక పరవశం చెందారు. వేణుగోపాలస్వామి 17వ వార్షిక కల్యాణోత్సవంలో పలువురు దంపతులు పీటలపై



కూర్చొనగా కృష్ణకాంత్ ఆచార్యుల ఆధ్వర్యంలో అర్చకులు వడ్డమాను రమణాచార్యులు, గొట్టిపాళ్ల కృష్ణమాచార్యులు కల్యాణ క్రతువు నిర్వహించారు. ప్రాచీన భ్రమరాంబ సమేత నాగేశ్వర ఆలయంలో అర్చకులు వెల్లటూరి నాగేశ్వరశర్మ ఆధ్వర్యంలో శివపార్వతుల శాంతి కల్యాణం కన్నుల పండువగా జరిగింది. శివాలయంలో భక్తుల నడుమ స్వామివారి కల్యాణం వైభవంగా జరిగింది. కల్యాణోత్సవాల్లో పాల్గొన్న భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం ఉత్సవమూర్తులను గ్రామవీధుల్లో ఊరేగించారు. తిరునాళ్ల సందర్భంగా పలు సాంస్కృతిక ప్రదర్శనలతోపాటు నాలుగు విద్యుత్తు ప్రభలను ఏర్పాటు చేశారు.

# బ్రహ్మకుమారి సమాజం ఉత్సవాలలో పాల్గొన్న ఎమ్మెల్యే చదలవాడ

**నరసరావుపేట, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త :** పట్టణంలో ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో మహాశివరాత్రి ఉత్సవాలకు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విశ్వవిద్యాలయం పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రహ్మకుమారి సమాజం చేస్తున్న సేవలను కొనియాడారు. శాంతి, ప్రేమ సమాజంలో



పంచిపెట్టాల్సిన అవసరం ఉందన్నారు. బ్రహ్మకుమారి సమాజం సభ్యులు చేసేటువంటి కార్యక్రమాలు అందరికీ ఆదర్శమన్నారు. ప్రతి ఒక్కరూ మంచి హృదయంతో నడుచుకోవాలని వివరించారు. సభ్యులకు మహాశివరాత్రి పర్వదిన శుభాకాంక్షలను తెలియజేశారు. సమాజం యొక్క 89వ వార్షిక వేడుకలను కేక్ కట్ చేసి ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, సమాజ సభ్యులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

# నిరుపేదల జీవనోపాధి కొరకు పీఎం ఈజిపి రుణాలు

**బాపట్ల,ఫిబ్రవరి18,ప్రభాతవార్త:** నిరుపేదల జీవనోపాధి కొరకు పీఎంఈజిపి రుణాలు విస్తృతంగా మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి



తెలిపారు. పి ఎం ఈ జి పి, పాడి గేదెలు, జీవనోపాధి రుణాల మంజూరుపై సంబంధిత శాఖల అధికారులతో మంగళవారం స్థానిక కలెక్టర్ చాంబర్లో ఆయన సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలను పేదరికం నుంచి బయటకు తెచ్చేందుకు జీవనోపాధి చూపాలన్నారు. పరిశ్రమల ఏర్పాటుతో అభివృద్ధి, జీవనోపాధులు పెరుగుతాయన్నారు. ఇందుకొరకు పరిశ్రమలను ప్రోత్సహించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసే రాయితీ నగదు లబ్ధిదారులకు చేరేలా చూడాలన్నారు. పాడి గేదెల పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పాల ఉత్పత్తి, పశు సంపద వృద్ధికి మీ తోడ్పాటునందించాలన్నారు. గతేడాది రుణ లక్ష్యాలను చేరుకోలేకపోవడం ఏమిటని అధికారులను నిలదీశారు. ప్రభుత్వ మార్గదర్శకాలు, నిబంధనలు ఉల్లంఘించరాదని ఆదేశించారు. రుణ సదుపాయం కల్పించడంలో బ్యాంకర్లు సహకరించాలన్నారు. పీఎంఈజిపి కింద ఖాదీ గ్రామీణ పరిశ్రమల కమిషన్ కింద 36 యూనిట్లు స్థాపించాలని లక్ష్యం కాగా, కేవలం 16 మాత్రమే మంజూరు చేయడంపై అసహనం వ్యక్తం చేశారు. ఖాదీ గ్రామీణ పరిశ్రమల బోర్డ్ కింద 199 యూనిట్లు స్థాపించాల్సి ఉండగా, కేవలం 72 యూనిట్లు మంజూరుపై ఆరా తీశారు. పురోగతి తక్కువగా ఉండడం ఏమిటని ప్రశ్నించారు. పరిశ్రమల శాఖ ద్వారా రూ.6.64 కోట్ల నిధులతో 207 యూనిట్లు స్థాపించాలని లక్ష్యం కాగా, కేవలం 91 యూనిట్లు మంజూరు చేయడం ఏమిటన్నారు. లక్ష్యాలను చేరుకోలేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. 442 యూనిట్లు రూ.14.97 కోట్లతో ఏర్పాటు చేయాలని లక్ష్యాలలో కనీసం 50 పురోగతి సాధించలేదని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. రూ.6.31 కోట్లతో 179 యూనిట్లను స్థాపించడం ఏమిటని ప్రశ్నించారు.పొదుపు సంఘాలలోని మహిళల జీవనోపాధి పెంచడానికి వెలుగు సిబ్బంది నిరంతరం కృషి చేయాలన్నారు. వెలుగు సిబ్బంది సక్రమంగా పనిచేయకపోవడంతోనే లక్ష్యాలు చేరుకోవడం లేదని ఆయన అసహనం వ్యక్తం చేశారు. ఎంపిక ప్రక్రియ, యూనిట్ల స్థాపనలో సిబ్బంది ప్రోత్సాహకం లేకపోవడంతోనే ఔత్సాహికులు ముందుకు రావడం లేదన్నారు. పొదుపు మహిళలకు సాధారణంగా పంపిణీ చేసే బ్యాంకు రుణాల సైతం లక్ష్యాలు చేరుకోవడం లేదని అసహనం వ్యక్తం చేశారు. సిబ్బంది పనితీరు సరిగా లేకపోవడంతోనే యూనిట్ల స్థాపనలో జాప్యం జరుగుతుందన్నారు. బ్యాంకులపై సాకులు చెప్పి పనిచేయడం లేదా అంటూ నిలదీశారు. పాల ఉత్పత్తి, పశు సంపద వృద్ధికి పాడి గేదెలు ఎంతగానో ఉపయుక్తమన్నారు. అలాంటి వాటికి రుణాల మంజూరులో జాప్యం జరగడానికి వీలులేదన్నారు. 23 వేల సంఘాలకు రూ.152 కోట్ల శ్రీ నిధి రుణాలను మంజూరు చేయాలని లక్ష్యం పూర్తి కాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటివరకు కేవలం 19,649 సంఘాలకు రూ.136 కోట్లు మాత్రమే రుణంగా ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. పర్యవేక్షణ కొరవడంతోనే బాపట్ల జిల్లాలో మొండి బకాయిలు రూ.4.21 కోట్లు నిలిచాయన్నారు. ఒక వెయ్యి యూనిట్ల పాడి గేదెలు పంపిణీ చేయాలని లక్ష్యం కాగా, కేవలం 252 యూనిట్లు మాత్రమే మహిళలకు మంజూరు చేయడంపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. వెలుగు అధికారులు నిర్లిప్తంగా ఉండడం మంచి పద్ధతి కాదని హెచ్చరించారు. పది రోజులలో పురోగతి కనిపించకపోతే సంబంధిత అధికారులను బాధ్యులను చేస్తూ చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ జిఎం శ్రీనివాసరావు, డి ఆర్ డి ఏ పిడి పద్మ, చేనేత జౌళి శాఖ ఏడి నాగమల్లేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# డిజిఎఫ్‌టితో అమేజాన్ భాగస్వామ్యం విస్తరణ

**విజయవాడ, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త :** తమ ఈ కామర్స్ ఎగుమతులను వేగంగా చేయడానికి డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ తో భాగస్వామ్య ఒప్పందాన్ని పొడిగించుకున్నట్లు అమేజాన్ ఇండియా గ్లోబల్ ట్రేడ్ డైరెక్టర్ భూపేన్ వాకంకర్, వైస్ ప్రెసిడెంట్ చేతన్ కృష్ణస్వామి, డిజిఎఫ్‌టి అదనపు కార్యదర్శి, డైరెక్టర్ జనరల్ సంతోష్ సారంగి సంయుక్తంగ ప్రకటించారు. గత నవంబర్ 2023లో చేసుకున్న ఎంఓయును పునరుద్దరించామన్నారు.

# విజయవాడలో కార్ల డైమండ్ షోరూం ప్రారంభం

**విజయవాడ, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త :** విజయవాడలో కార్ల డైమండ్ షోరూంను తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ మంగళవారం ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ రాజధాని విజయవాడ అభివృద్ధిదిశగా పయనిస్తోందని, పలువురు వ్యాపారులు విజయవాడ రావడానికి మక్కువ చూపుతున్నారన్నారు. మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ గోల్డ్ బిజినెస్‌లో అనుభవం వున్న నిర్వహకులు ఈ గోల్డ్ వ్యాపారంలో కూడా రాణిస్తారన్నారు. నిర్వహకులు విద్యాధర్, హర్షవర్ధన్, మణికంఠ, సంజయ్, నరసింహారావులు మాట్లాడుతూ విజయవాడలో మొదటిసారిగా ఈ డైమండ్ ఎక్స్‌క్లూజివ్ షోరూంను ప్రారంభించిన సందర్భంగా పలు బహుమతులను అందిస్తామన్నారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షుడు కొనగళ్ళ విద్యాధరరావు తదితరులు పాల్గొన్నారు.

# పట్టణ పరిశుభ్రతకు పెద్దపీఠ వేస్తున్నాం

## -ఎమ్మెల్యే చదలవాడ

నరసరావుపేట, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త : జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో పరిశుభ్రతకు పెద్దపీట వేస్తున్నామని ఎమ్మెల్యే డాక్టర్



చదలవాడ అరవింద్‌బాబు అన్నారు. మహాశివరాత్రి సందర్భంగా కోటప్పకొండలోనూ, పట్టణంలోనూ నిర్వహించే తిరునాళ్ళకు జరుగుతున్న ఏర్పాట్లను ఈ సందర్భంగా వారు వివరించారు. స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ కార్యక్రమం కూటమి ప్రభుత్వం పాలన ప్రారంభమైన నాటి నుండి నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. ముఖ్యంగా ఆర్టీసీ బస్టాండ్ వంటి ప్రాంతాలలో ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్‌ను పార్టీ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించడం జరిగిందన్నారు. ప్రతి రోజు వేల మంది ప్రయాణికులు బస్టాండ్ నుండి వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తున్నారని తెలిపారు. అటువంటి ప్రాంతంలో సరైన వసతులు, బస్టాండ్ ఆవరణ మొత్తం క్లీన్ అండ్ గ్రీన్‌గా ఉండాలన్నారు. ఆహ్లాదకరమైన వాతావరణం ఉన్నప్పుడే ప్రజలు ఆరోగ్యంతో ఉంటారని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు తెలియజేశారు. కోటప్పకొండలోనూ స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు హాజరు కావడంతో పాటు ప్రజలు తమవంతు సహకారం అందించారని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు కపలవాయి విజయ్‌కుమార్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# పోలీసుల అదుపులో చైన్ స్నాచర్స్

**నరసరావుపేట క్రైం, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త :** మండలంలోని కాకాని గ్రామానికి చెందిన దేవిశెట్టి శ్రీలక్ష్మమ్మ గ్రామీణ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు



మేరకు చైన్ స్నాచర్‌ను గ్రామీణ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాలను రూరల్ సి.ఐ. రామకృష్ణ, ఎస్.ఐ. చల్లా కిషోర్‌లు తెలియజేశారు. చెంఘీజ్‌ఖాన్‌పేటకు చెందిన పోతురాజు బాలకృష్ణ, యద్దల నరేంద్రసాయిలను అదుపులోకి తీసుకున్నా మన్నారు. వారు ఇచ్చిన సమాచారంలో చైన్ స్నాచర్స్‌గా గుర్తించామన్నారు. పగటి సమయంలో మోటార్ సైకిళ్ళపై గ్రామాలలో తిరుగుతూ ఊరి బయట, ఇళ్ళల్లో ఒంటరిగా ఉన్న మహిళలను లక్ష్యంగా చేసుకుంటారని తెలిపారు. గత ఏడాది 9వ నెల 15వతేదీన కాకాని గ్రామంలో సాయంత్రం గంగమ్మతల్లి గుడి వద్ద కూర్చొని ఉన్న లక్ష్మమ్మను గమనించి మోటార్ సైకిల్‌పై వచ్చి ఆమె మెడలోని బంగారు గొలుసును అపహరించారన్నారు. అదే విధంగా ఫిబ్రవరి 18వతేదీన కేసానుపల్లి పంచాయితీ పరిధిలో నిందితులు ఉన్నట్లు పోలీసులకు అందిన సమాచారం మేరకు ఎస్.ఐ.లు కిషోర్, వంశీకృష్ణ, తమ సిబ్బందితో ముద్దాయిలను అరెస్ట్ చేయడం జరిగిందన్నారు. వారి వద్ద నుండి బంగారు గొలుసును రికవరీ చేశామని, వాటి విలువ రూ.5 లక్షలు ఉంటుందని సి.ఐ. రామకృష్ణ, ఎస్.ఐ. చల్లా కిషోర్‌లు వివరించారు.

# తిరుమల కళాశాలలో ముగిసిన ఎఫ్‌డిపి

**నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త :** తిరుమల ఇంజనీరింగ్ కళాశాలలో ఈసిఈ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఆరు రోజుల ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం విజయవంతంగా మంగళవారం ముగిసింది. రీసోర్స్ పర్సన్స్ ఈ సందర్భంగా నెక్స్ట్ జనరేషన్ కమ్యూనికేషన్స్ అనే అంశానికి సంబంధించి వివరాలను తెలియజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.వి.నారాయణ మాట్లాడుతూ రీసెర్చ్ స్కాలర్స్‌కి ఈ ప్రోగ్రాం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. వివిధ కళాశాలలకు చెందిన అధ్యాపకులకు శిక్షణ ఇవ్వడం ద్వారా ఇంజనీరింగ్ విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఈసిఈ విభాగాధిపతి జగదీష్ మాట్లాడుతూ 200 మందికి పైగా అధ్యాపకులు శిక్షణకు హాజరైనట్లు తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ రావెల సత్యనారాయణ పాల్గొని సందేశం ఇచ్చారు. కోఆర్డినేటర్ కాంతికుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

# ప్రమాదాల నివారణకు ఫేస్‌వాష్ అండ్ గో

**నరసరావుపేట క్రైం, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త :** ప్రమాదాల నివారణకు ఫేస్‌వాష్ అండ్ గో కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా ఎస్పీ కె.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. పోలీస్ అధికారులు తమ సిబ్బందితో అర్ధరాత్రి దాటిన తర్వాత లారీలు, బస్సులు, వ్యాన్‌లు, కార్ల వాహనాలకు సంబంధించిన డ్రైవర్లకు నీళ్ళతో ముఖం కడిగించి పంపిస్తున్నారు. వాహనాలు నడిపే సమయంలో డ్రైవర్లు అప్రమత్తంగా ఉండటంతో పాటు తమ కుటుంబసభ్యుల గురించి ఆలోచించాలన్నారు. రాత్రివేళల్లో జిల్లా వా ్యప్తంగా బస్టాండ్, రైల్వేస్టేషన్‌లలో కొత్త వ్యక్తులపై ప్రత్యేక దృష్టి పెడుతున్నామన్నారు. అదే విధంగా ఏటిఎంలు, బ్యాంక్‌ల వద్ద గస్తీ నిర్వహించి శివారు కాలనీలలోనూ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా పోలీస్ కార్యాలయం నుండి అధికారులు తెలియజేశారు.

# కాలిఫోర్నియా బాదంతో ఆరోగ్యం

**విజయవాడ, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త :** కాలిఫోర్నియా బాదం పప్పులు రుచికరమైనవి కాకుండా మొత్తం ఆరోగ్యానికి మద్దతు ఇచ్చే ముఖ్యమైన పోషకాలతో నిండి వుంటాయి. అవి మీ ప్రియమైన పోషకాలతో నిండి వుంటాయి. అవి మీ ప్రియమైన ఆరోగ్యం పట్ల మీ శ్రద్ధను కూడా ప్రదర్శిస్తాయి విటమిన్ ఈ మెగ్నీషియం డైటరీ ఫైబర్ ఆరోగ్య కొవ్వులు ప్రోటీన్ యొక్క సహజ మూలం రోగ నిరోధక శక్తికి మద్దతు ఇస్తుందని ప్రముఖ నటి శ్రియశరణ్, కాస్మోటాలజిస్ట్ డాక్టర్ గీతిక మిట్టల్ ప్రముఖ భారత నటి వాణి భోజన్ ఆయుర్వేద నిపుణురాలు మధుమిత కృష్ణన్ లు వెల్లడించారు.

# ప్రతిష్టాత్మక గెలాక్సీ రికార్డు స్పందన

**విజయవాడ, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త :** భారతదేశంలో శామ్‌సంగ్ గెలాక్సీ ఎస్ 25 సిరీస్‌కు రికార్డు స్పందన పొందిందని ప్రీ ఆర్డర్‌లు 20శాతం ఎక్కువగా వచ్చాయని శామ్‌సంగ్ ప్రతినిథులు ప్రకటించారు. నేవి సిల్వర్ షాడో ఐసీబ్లూ మింట్ రంగుల్లో లభిస్తాయన్నారు.


# శామ్‌సంగ్ టీవి ప్లస్ ఇండియా

**విజయవాడ, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త :** శామ్‌సంగ్ టివి ప్లస్ ఇండియాలో ప్రత్యేకంగా ఐదు కొత్త ఫాస్ట్ చానళ్లను ప్రారంభించడానికి వార్నర్ బ్రదర్స్‌తో కలిసి ఈడబ్ల్యుబిటివి చానళ్ల అధిక నాణ్యత ఉచిత వినోదం కోసం డిమాండ్‌ను తీర్చడం ద్వారా స్ట్రీమింగ్ ప్రేక్షకులకు ప్రీమియం కథను అందిస్తాయని శాంసంగ్ బిజినెస్ డెవలప్‌మెంట్ హెడ్ కునాల్ మెహతా తెలిపారు. హిందీ కార్యక్రమాలపై బలమైన దృష్టి సారించి ప్రాంతీయ పట్టణ ప్రేక్షకులను లీనమయ్యేలా చేయడానికి రూపొందించబడ్డాయని శామ్‌సంగ్ స్మార్ట్ టీవీలు మొబైల్ పరికరాల్లో వీక్షకులను ఆకర్షించడానికి రూపొందించామన్నారు.

# వరుస దొంగతనాలతో రెంటచింతల ప్రజలు బెంబేలు

**రెంటచింతల, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:** వరుస దొంగతనాలతో మండల ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. వివరాల్లోకి వెళితే ఇంటికి తాళం వేస్తే రాత్రికి ఆ ఇల్లు దొంగల కంటబడి చోరీకి గురవుతున్నాయి. తాళం వేసిన ఇళ్లను దొంగలు టార్గెట్ చేస్తూ దొంగలు వరుస చోరీలకు పాల్పడటంతో ప్రజలకు భయాందోళనలకు





గురవుతున్నారు. రెంటచింతలలో మంగళవారం వెలుగులో ఇళ్లను టార్గెట్‌గా చేసుకుని రూ.లక్షల్లో నగదు, బంగారం అపహరిస్తున్నారు. స్థానిక కన్యకాపరమేశ్వరాలయం బజారు బొడ్రాయి సెంటర్లో నివాసం ఉంటున్న ఫైనాన్షియర్ తాళ్లూరు సాంబశివరావు ఇంట్లో చోరీ జరిగిందది. గత మూడు రోజులక్రితం ఇంటికి తాళం వేసి భార్య లక్ష్మితో హైదరాబాదు వెళ్లిన సాంబశివరావు తాను ఒక్కడే 18వ తేదీ ఉదయం ఇంటికి రావడంతో ఇంటి తాళాలు పగులగొట్టి, తలుపులు తెరచి ఉండటం చూసి దిగ్భ్రాంతికి గురయ్యాడు. తెరచి ఉన్న బీరువాలోని రూ.90 వేల నగదు చోరీ అయినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించాడు. బంగారు ఆభరణాలు అపహకరణ వివరాలు భార్య వచ్చిన తర్వాత తెలుస్తాయని బాధితుడు తెలిపాడు. అలాగే గ్రామంలోని ఆరోగ్యమాత గుడి సమీపంలో నివాసముంటున్న మరో ఫర్టిలైజర్ వ్యాపారి ఆదూరి ఇన్నారెడ్డి ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలోని సుమారు రూ.5 లక్షలు విలువ చేసే 75 గ్రాముల బంగారు ఆభరణలు అపహరణకు గురయ్యాయి. గత నాలుగు రోజులక్రితం వ్యాపారి వేళాంగిని యాత్రకు వెళ్లిన క్రమంలో ఈ చోరీ జరిగింది. అదే ప్రాంతంలో తాళం వేసిన గాదె బాల్‌రెడ్డి ఇంటిలో కూడా దొంగలు చోరీకి పాల్పడ్డట్టు తెలుస్తోంది. అయితే చోరీ వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. ఎక్కడా ఆధారాలు చిక్కకుండా తప్పించుకు తిరుగుతున్న దొంగల భరతం పట్టాలని మండల ప్రజలు పోలీసులను కోరుతున్నారు.

# పిల్లల మనోవికాసానికి అంగన్‌వాడీ ఇల్లు దోహదం

**కొల్లూరు, ఫిబ్రవరి 18 (ప్రభాతవార్త) :** అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు మనో వికాసంపై అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రత్యేక దృష్టి సారించాలని మండల విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు సూచించారు. మంగళవారం బాలుర జిల్లా పరిషత్ హైస్కూల్లో ఆవరణలో ఫౌండేషన్ లెట్రాసీ, ఎఫ్‌ఎల్‌ఎన్, ఇసిసిఇ కార్యక్రమాలపై అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణా తరగతులను నిర్వహించారు. సూపర్‌వైజర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఎంఈవో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు 120రోజుల జాన జ్యోతి కార్యక్రమంలో భాగంగా పిల్లలకు విద్యను ఎలా బోధించాలి, వారి మానసిక వికాసం అభివృద్ధి



చెందే విధంగా ఆటల పాటలతో కూడిన విద్యను తరగతి గదులలో ప్రదర్శించాలన్నారు. పిల్లల చేత సంఖ్యా జ్ఞానం, సృజనాత్మకత అంశాలపై కార్యక్రమాన్ని ప్రదర్శింప చేయాలన్నారు. అంకెలను గుర్తించడం అంకెలతో కూడిన అభినయ గేయాలను చెప్పించాలన్నారు. పూర్వ ప్రాథమిక విద్య బలోపేతంగా ఉండే విధంగా అంగన్‌వాడీ కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ విజయలక్ష్మి, ఉపాధ్యాయులు సిహెచ్ సుధార్, శ్రీనివాసరావు, కొల్లూరు అనంతవరం సెక్టార్ల అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# అమృతలూరు, పాంచాళవరం గ్రామాల్లో "పొలం పిలుస్తోంది" నిర్వహణ

**అమృతలూరు, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:** వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది మంగళవారం అమృతలూరు, పాంచాళవరం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పెసర,మినుము పంటలను పరిశీలించి అనంతరం గ్రామాల్లో రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో ఎఓ వి.లోకేశ్వరి మాట్లాడుతూ మినుము, పెసర పంటలు పూత, పిందె దశలో ఉన్నాయని ఈ దశలో పంటలకు సస్యరక్షణ చర్యలు చేపట్టడం వలన అధిక దిగుబడి సాధించవచ్చని తెలిపారు. ఈ దశలో



మారుకా మచ్చల పురుగు, కాయతొలుచు పురుగు ఉధృతిని గుర్తించి నివారణకు ఎకరాకు రిమాన్ 150ఎంఎల్, లేదా ప్రోక్లెయిమ్ 100గ్రాములు, తెల్ల దోమ నివారనకు ప్రైడ్ 100గ్రాములు, లేదా ఆర్తిన్ 320గ్రాములు నీటిలో కలిపి పిచికారి చేయాలని తెలిపారు. రైతులందరూ ఈ నెల 25వ తేది లోపు రైతు విశిష్ట గుర్తింపు న్యూ నమోదు కార్యక్రమంలో పేర్లు నమోదు చేసుకోవాలని దీని వలన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే ప్రధకాల నుండి లబ్ధిపొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎఇఓ ఐ.శ్రీకాంత్, విఏఏలు, రైతులు పాల్గొన్నారు.

# జిల్లా తెదేపా కార్యాలయంలో రాష్ట్ర డాక్టర్ సెల్ ఉపాధ్యక్షులు కడియాల జన్మదిన వేడుకలు

నరసరావుపేట, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త : పల్నాడు జిల్లా టిడిపి కార్యాలయలో మంగళవారం ఆ పార్టీ డాక్టర్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంచి పెట్టారు. పార్టీ యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్, గొట్టిపాటి జనార్ధన్‌బాబు, తెలుగు యువత ప్రధాన కార్యదర్శి గంగిరెడ్డి శ్రీనివాసరెడ్డి, షేక్ రఫీ, నరసింహారావు తదితరులు జన్మదిన వేడుకలలో పాల్గొని పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ కడియాలకు జన్మదిన శుభకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఎన్నికలలో పార్టీ విజయానికి కృషి చేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు అభినందనలు తెలిపారు. తమ వెంట నడిచే ప్రతి ఒక్కరికి అండగా ఉంటామని డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు పేర్కొన్నారు.

# రాష్ట్రస్థాయి టెన్నీస్ బాల్ క్రికెట్‌కు ఎంపికైన కెరిడ్జ్ స్కూల్ విద్యార్థులు

**నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త :** రాష్ట్రస్థాయి టెన్నీస్ బాల్ క్రికెట్‌కు కెరిడ్జ్ స్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. వివరాలను పాఠశాలలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఛైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు తెలియజేశారు. ఫిబ్రవరి 17న రాజుపాలెం పాఠశాలలో సీనియర్ టెన్నీస్ బాల్ క్రికెట్ పల్నాడు జిల్లా జట్టుకు ఎంపికలు జరిగాయన్నారు. ఆ పోటీలలో కెరిడ్జ్ స్కూల్‌కు చెందిన గౌతమ్‌రెడ్డి, గౌతమ్ ప్రదీప్‌రెడ్డి, సి.హెచ్.విన్స్ మంచి ప్రతిభను చూపారన్నారు. పల్నాడు జిల్లా జట్టులో వారు స్థానం సాధించారన్నారు. చిత్తూరు జిల్లాలో ఈ నెల 21,22,23 తేదీలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో తమ విద్యార్థులు పాల్గొంటారని ఛైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు తెలిపారు. అదే విధంగా అద్దంకిలో జరిగిన కరాటే పోటీలలోనూ ఆరు రాష్ట్రాలకు చెందిన 650 మంది విద్యార్థులతో తమ విద్యార్థులు పోటీ పడి విజయం సాధించారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బర్నబాస్, క్యాంపస్ ఇన్‌చార్జి కోట బాపూజీ, పిఈటి మహిత, కోచ్ శివకృష్ణ పాల్గొన్నారు.

# పోలింగ్‌కు పోలింగ్ స్టేషన్లు సిద్ధం

## -తహశీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్

**పొన్నూరు, ఫిబ్రవరి 18,ప్రభాతవార్త:** కృష్ణా-గుంటూరు పట్టభద్రుల నియోజక వర్గానికి ఈ నెల 27వ తేదీన ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్



జరుగుతుందని తహశీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్ తెలిపారు. అందుకు సంబంధించి నిడుబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐదు పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశామన్నారు. ఓటు ఉన్న ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవచ్చన్నారు. పోలింగ్ కేంద్రాల్లో త్రాగునీరు. లైటింగ్, ర్యాంప్ తదితర ఏర్పాట్లను చేసినట్లు చెప్పారు. పట్టణ పరిధిలో మూడు పోలింగ్ బూత్‌లను, రూరల్ పరిధిలో రెండు పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఓటర్లు గుర్తింపు కార్డును చూపించి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాలలో ప్రశాంతమైన వాతావరణం ఉండేవిధంగా ఏర్పాట్లు చేశామన్నారు. తహశీల్దార్ వెంట ప్రధానోపాధ్యాయులు శివలక్ష్మి, మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు, రూరల్, అర్బన్ సిఐలు యాదల కోటేశ్వరరావు, కేసన రవికిరణ్,పట్టణ ప్రణాళికాధికారి రఘురాం, పట్టణ సర్వేయర్ శ్రీనివాసరాజు, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం జిల్లా సరిహద్దు చెక్‌పోస్టు అయిన ములుకుదురు, చుండూరుపల్లి సమీపంలోని పరిశీలించారు. ఎన్నికల సందర్భంగా నగదు, బంగారు ఆభరణాలు, మద్యం తదితరాలు రవాణా కాకుండా పటిష్ట చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ఎవరైనా రూ.50వేలకు మంచి నగదు తీసుకెళ్తున్నట్లయితే అందుకు సంబంధించిన వివరాలను చూపించాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల్లో పాల్గొనే అభ్యర్థులు కూడా ఎన్నికల సిబ్బందికి సహకరించి ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు జరిగేవిధంగా చూడాలని తహశీల్దార్ కోరారు.

# పట్టభద్రులు ఓటును అవగాహనతో వినియోగించుకోవాలి

## -ఉప ఎన్నిక అధికారులు బి.శేషన్న, కె.వి.గోపాలకృష్ణ

**తెనాలి, ఫిబ్రవరి 18 (ప్రభాతవార్త):** నియోజకవర్గంలో 26 పోలింగ్ కేంద్రాల ద్వారా పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక అసిస్టెంట్ ఎన్నికల అధికారులు మండల తహశీల్దార్ కె.వి.గోపాలకృష్ణ, మున్సిపల్ కమిషనర్ బి.శేషన్నలు వివరించారు. పట్టభద్రుల ఎన్నికల నిర్వహణ కార్యాచరణ ఓటు వినియోగం అంశాలపై మంగళవారం స్థానిక కొత్తపేటలోని పెన్షనర్స్ అసోసియేషన్ హాల్లో విశ్రాంత ఉద్యోగులతో సమావేశం ఏర్పాటు చేశారు. పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మాదిరాజు గోపాలకృష్ణమూర్తి అధ్యక్షతన జరిగిన అవగాహన సమావేశంలో మున్సి పల్ కమీషనర్ బి.శేషన్న మాట్లాడుతూ సాధారణ ఎన్నికలకు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఉన్న వ్యత్యాసాన్ని వివరించారు. సాధారణ ఎన్నికలకు ఒకసారి ఓటరుగా నమోదైతే సరి



పోతుందని, పట్టభద్రుల ఎన్నికలు, ఎన్నిక ముందు విధిగా ఓటరుగా నమోదు కావాల్సి ఉంటుందన్నారు. ఈనెల 27వ తేదీన నిర్వహించే పోలింగ్ ప్రక్రియ అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. పట్టణంలోని మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఏడు చోట్ల పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సీనియర్ సిటిజన్స్ విశ్రాంత ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకునే క్రమంలో క్యూలైన్సులో నిలబడవలసిన అవసరం లేదని, వృద్ధులు, నేరుగా వెళ్ళి ఓటు వేసే అవకాశం ఉంటుందన్నారు. మండల తహశీల్దార్ కె.వి.గోపాలకృష్ణ మాట్లాడుతూ తెనాలి నియోజకవర్గంలో 26పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఓటు విలువైనదని, ఓటు వేయడం పట్టభద్రుల బాధ్యతని, ఆ బాధ్యతను అందరూ సక్రమంగా వినియోగించు కోవాలన్నారు. బ్యాలట్ పేపర్ ద్వారా జరిగే పోలింగ్‌కు పట్టభద్రులు తాము ఎంచుకున్న అభ్యర్థి ఫోటో ఉన్న లైన్‌లో ఎన్నికల కమీషన్ కేటాయించిన కలం వినియోగించి ప్రాధాన్యత క్రమం ఓటును ఒకటి అంకె మాత్రమే వేయాలన్నారు. రిటైర్డ్ ప్రిన్సిపల్ సోమయ్యశాస్త్రి సందేహా లను అధికారులు నివృత్తి చేశారు. నిబంధ నలకు అనుగుణంగా ఉన్న ఓటు మాత్రమే చెల్లుతుందన్నారు. సీనియర్ సిటిజన్స్ అధ్యక్షులు మొవ్వ సత్యనారాయణ, పెన్షనర్స్ అసోసియేషన్ కార్యదర్శి బెల్లంకొండ హృదయరాజ్, గంటయ్య తదితర విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

# హోమ్ గార్డు ఆకస్మిక మృతి

**తెనాలి, ఫిబ్రవరి 18 (ప్రభాతవార్త) :** విధి నిర్వహణలో నిబద్ధత పది మందితో కలుపుగోలుగా ఉండే వ్యక్తిత్వంతో అలుపెరుగని సేవలందించే హోమ్ గార్డు ఎద్దు శ్రీను ఆకస్మిక మృతి సహచర ఉద్యోగులను అధికారులను కలిచి వేసింది. స్థానిక రూరల్ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహించే హెచ్‌డి, నెంబర్ 582, హోమ్ గార్డు ఎద్దు శ్రీను తీవ్రమైన గుండెపోటుతో మంగళవారం తుదిశ్వాస విడిచారు. పట్టణంలోని అని ్న పోలీస్ స్టేషన్‌లలో విధులు నిర్వహించి, విధి నిర్వహణో తనదైన విధానంతో ఉన్నతాధికారుల మన్ననలతో పాటు, సహచర ఉద్యోగులలో



వివాద రహితుడిగా తన ఉనికిని చాటుకుంటున్న ఎద్దు శ్రీను రూరల్ పోలీస్ స్టేషన్‌లో ప్రస్తుతం విధు లు నిర్వహిస్తూ పాండు రంగపేటలో నివాస ముంటున్నాడు. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం మూడు గంటల సమయంలో తన నివాసంలో తీవ్ర గుండెపోటుకు గురైన శ్రీను పరిస్థితి గమనించి కుటుంబ సభ్యులు హుటా హుటిన స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. హోమ్ గార్డు ఎద్దు శ్రీను భౌతిక కాయాన్ని సందర్శించిన పుష్పాంజలి ఘటించిన హోమ్ గార్డులు, పోలీస్ అధికారులు, సిబ్బంది తమ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఏదేమైనా విధి నిర్వహణ లో అలుపెరుగని హోమ్ గార్డు శ్రీను మరణంతో సహచర ఉద్యోగులు కన్నీటి పర్యంత మయ్యారు. శ్రీనుతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.

# పదోతరగతిలో నూరుశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

## -విద్యార్థులకు పూర్తిస్థాయిలో తర్ఫీదు -వంద రోజుల కార్యక్రమం పక్కాగా అమలు -మార్చి 17నుంచి పదోతరగతి పబ్లిక్ పరీక్షలు

పొన్నూరు, ఫిబ్రవరి 18,ప్రభాతవార్త: ఈ ఏడాది పదోతరగతిలో నూరుశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ప్రభుత్వం ప్రణాళికాబద్దంగా ముందుకు సాగుతోంది. అందుకు సంబంధించి విద్యార్థులకు అన్ని సబ్జెక్టుల్లో పూరి ్తస్థాయిలో తర్ఫీదు ఇస్తుంది. గతంలో వచ్చిన ఫలితాల కన్నా మెరుగైన ఫలితాలు సాధించాలన్న ధ్యేయంగా వంద రోజుల కార్యక్రమాన్ని రూపొందించి విద్యార్థులను పరీక్షలకు ఏ విధంగా సమాయాత్త పరచాలో ఉపాధ్యాయులకు షెడ్యూల్‌ను



అందజేసింది. సెలవు రోజుల్లో కూడా తరగతులు నిర్వహించే విధంగా ఉపాధ్యాయులకు ఆదేశాలు జారీచేసింది. డల్లర్స్ పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఉపాధ్యాయులకు ఎప్పటికప్పుడు దిశానిర్దేశం చేస్తూ ప్రణాళికలను పరుగులు పెట్టిస్తుంది. నూరుశాతం ఉత్తీర్ణ సాధించాల్సిందేనని ఉపాధ్యాయులకు హుకుం జారీ చేసింది. ఏ సబ్జెక్టులోనైనా మెరుగైన ఫలితాలు రాబట్టలేకపోతే ఆ ఉపాధ్యాయులే బాధ్యులవుతారని హెచ్చరించింది. విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతోపాటు ఉదయం సాయంత్రం, పౌష్టికాహారాన్ని కూడా అందిస్తుంది. గత ప్రభుత్వం విద్యను నిర్లక్ష్యం చేసిందని, ఈ ప్రభుత్వంలో నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలన్న ధ్యేయంగా విద్యాశాఖామంత్రి నారా లోకేష్ ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. ఈ నెల 17వ తేదీ నుంచి పదోతరగతి పరీక్షలు నిర్వహించేందుకు పరీక్షా కేంద్రాలను ఎంపికచేయడంతోపాటు ఏ కేంద్రంలో ఎంత మంది విద్యార్థులు పరీక్షలు వ్రాసేందుకు అనువుగా ఉంటుందో కూడా నిర్ణయించి విద్యార్థుల కేటాయింపు కూడా చేపట్టారు. విద్యార్థుల ప్రోగ్రెస్ మీద తల్లిదండ్రులు కూడా శ్రద్ధ పెట్టాలని తల్లిదండ్రులకు కూడా సూచిస్తున్నారు. పొన్నూరు పట్టణ, మండల పరిధిలోని ఏడు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. చింతలపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో-160మంది విద్యార్థులు, పచ్చలతాడిపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో-160మంది, నిడుబ్రోలు ఐదవవార్డు మునిసిపల్ హైస్కూల్‌లో-200మంది, నేతాజీనగర్ మునిసిపల్ ఉన్నత పాఠశాలలో-180మంది, నిడుబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(బాలురు)-320మంది, ఎంవిఆర్‌ఎస్ వివేకా హైస్కూల్‌లో-180మంది, నిడుబ్రోలు అనీల్-ప్రసాద్ హైస్కూల్‌లో-300మంది విద్యార్థులు పరీక్షలు వ్రాసేందుకు సిద్దంగా ఉన్నారు. మండల, పట్టణ పరిధిలో 15వందల మంది విద్యార్థులు ఈ ఏడాది పదోతరగతి పరీక్షలు వ్రాసేందకు సిద్దంగా ఉన్నారు. పరీక్షా కేంద్రాలలో కూడా విద్యార్థులు సజావుగా, అనువుగా పరీక్షలు వ్రాసేందుకు అవసమైన సౌకర్యాలను కల్పించాలని ఇప్పటికే ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు విద్యాశాఖాధికారులు ఆదేశాలు జారీ చేయడం జరిగింది. మార్చి-17న తెలుగు పరీక్ష, 19న హిందీ, 21న ఇంగ్లీషు, 22 కాంపోజిట్ తెలుగు(సంస్కృతం), 24 గణితం, 26 ఫిజిక్స్, 28 బయాలజి, 31కానీ ఏప్రిల్ 1న కానీ సోషల్ పరీక్ష నిర్వహించేందుకు ఇప్పటికే టైంటేబుల్‌ను విడుదల చేయడం జరిగింది. ఈ పరీక్షలన్నీ రోజు మార్చి రోజు నిర్వహించే విధంగా షెడ్యూల్‌ను రూపొందించారు. ఇప్పటికే మండలశాఖాధికారులు పదో తరగతి విద్యార్థులకు విద్యాశాఖ అమలు చేస్తున్న వంద రోజుల కార్యక్రమం సజావుగా సాగుతుందా...లేదా..?అనే విషయాలపై పరిశీలన చేస్తున్నారు. మండల విద్యాశాఖాధికారి కె.శ్రీనివాసరెడ్డి మండల, పట్టణంలోని అన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల విద్యాభ్యాసాన్ని పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేస్తున్నారు.

# అంగన్‌వాడీలకు ప్రారంభమైన జ్ఞానజ్యోతి శిక్షణా తరగతులు

**తెనాలి, ఫిబ్రవరి 18 (ప్రభాతవార్త) :** ఐసిడిఎస్ ప్రాజెక్టు ద్వారా అంగన్‌వాడీ కేంద్రాలలో నర్సరీ స్థాయిలో శిక్షణ పొందిన చిన్నారులు అనంతరం ఒకటవ తరగతి ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విధంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ముందుకు తీసుకు వెళుతూ అంగన వాడీ కార్యకర్తలకు 120రోజుల జ్ఞాన జ్యోతి శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభిం చారు. స్థానిక మారీసుపేటలోని నల్లమోతు చెంచు రామానాయుడు మున్సి పల్ ఉన్నత పాఠశాలలో



మంగళవారం ఐసిడిఎస్, విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి శిక్షణా తరగతులను ప్రారంభించారు. కార్యక్రమ విశిష్టతను మండల ద్వితీయ ఎమ్ఈవో జయంత్‌బాబు మీడియాకు వివరించారు. ఎలిమెంటరీ పాఠశాలల్లో విద్యా విధానం మెరుగుపరుస్తూ అంగన్‌వాడీ కేంద్రాల్లో నర్సరీ శిక్షణ పొందిన చిన్నారులను ఒకటవ తరగతి నుండి ప్రభుత్వ పాఠశాలలో జాయిన్ చేసే విధంగా రూపొందనున్న కార్యచరణకు అనుగుణంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి శిక్షణా తరగతులు 120రోజుల పాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారిని సునీత మాట్లాడుతూ నర్సరీలో శిక్షణను ఇచ్చే అంగన్‌వాడీ కార్యకర్తలు ఒకటి రెండు తరగతులకు కూడా శిక్షణ ఇచ్చే విధంగా వారిని తీర్చిదిద్దడం జ్ఞాన జ్యోతి శిక్షణా తరగతుల ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. శిక్షణానంతరం వారికి సర్టిఫికెట్లు మంజూరు చేయడం జరుగు తుందన్నారు. 120రోజులు శిక్షణ పొందిన అంగన్‌వాడీ కార్యకర్తలు, ప్రైమరీ పాఠశాలలో మొదటి రెండు తరగతుల వారికి విద్యాబుద్ధులు నేర్పించే విధంగా కార్యాచరణ ఉంటుందన్నారు. కాగా ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారిణి సునీత కార్యకర్తలకు శిక్షణ తరగతులు నిర్వహించారు.

# వర్సిటీలో ఎమ్మెల్సీ అభ్యర్థుల ప్రచారం

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,ఫిబ్రవరి 18,ప్రభాతవార్త :** ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థులు కెఎస్ లక్ష్మణరావు,ఆలపాటి రాజేంద్రప్రసాద్‌లు మంగళవారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాల యాన్ని సందర్శించారు.వర్సిటీలో ఉన్న పరీక్షా భవన్,అంబేడ్కర్ లైబ్రరీ,పరిపాలన భవన్ దూరవిద్య కేంద్రంతో పాటు పలు కళాశాలలు విభాగాలను సందర్శించి ఉద్యోగులు ఓటు చేయాలని అభ్యర్థించారు.తమకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించి మండలిలో గ్రాడ్యుయేట్ల సమస్యలు పరిష్కారం కోసం కృషిచేసేందుకు తగిన అవకాశం కల్పించాలని కోరారు.ఈ సందర్భంగా పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కె.ఎస్.లక్ష్మణరావు మట్లాడుతూ తాను ఎమ్మెల్సీ గా ఉద్యోగుల నిరుద్యోగుల సమస్యల పై పోరాడినట్లు వివరించారు. శాసనమండలిలో గళం విప్పి నిరుద్యోగులకు ఉద్యోగ నోటిఫికేషన్లు ఇప్పిచ్చినట్లు పేర్కొన్నారు .కూటమి అభ్యర్థిగా బరిలో ఉన్న ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ తనకు విద్యాశాఖ మంత్రిగా చేసిన అనుభవం ఉందని పలు విద్యాసంస్థలు నడుపుతున్నట్లు ఆయన గుర్తుచేశారు.

# ఆలపాటికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలి

**అమృతలూరు, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:** రానున్న కృష్ణా-గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ పోటీ చేస్తున్నారని రాజేంద్రప్రసాద్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని మాజీ మంత్రి, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబు కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆనందబాబు మంగళవారం మండలంలోని అమృతలూరు, కూచిపూడి, పెదపూడి, ఇంటూరు, గోవాడ, మూల్పూరు జడ్‌పి హైస్కూళ్ళలో ఉపాధ్యాయులను, కూచిపూడి సెక్రడ్ హైస్కూల్ ఉపాధ్యాయులను కలసి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ప్రచార కార్యక్రమంలో ఎపి మైనార్టీ కార్పోరేషన్ చైర్మన్ మౌలానా మస్తర్ అహ్మద్, శరణు శేషగిరి రాజేంద్రప్రసాద్, కొత్తపల్లి రవీంద్రబాబు, బొల్లు రమేశం, యలవర్తి బ్రహ్మానందం, మట్టపూడి జైపాల్, ఐమళ్ల ప్రమోద్‌కుమార్, కె.శామ్యూల్, పాములపాటి వెంటక సుబ్బారావు, క్రొత్తపల్లి మాథ్యూస్, మండవ రమేష్ తదితరులు పాల్గొన్నారు

# ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికలను పకడ్బంధీగా నిర్వహించాలి: జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు

కారంపూడి, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త: ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికల నిర్వహణ పకడ్బంధీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు అన్నారు. మంగళవారం కారంపూడిలోని బ్రహ్మానాయుడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. ఈ నెల 27న జరగనున్న ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికలకు మండలంలో 10,500 మంది తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. రెండు పోలింగ్ బూత్‌లను పరిశీలించి సలహాలు సూచనలు ఇచ్చారు. జిల్లా కలెక్టరు వెంట గురజాల ఆర్డీవో మురళీకృష్ణ, తహశీల్దారు వెంకటేశ్వర్లు నాయక్, ఎంపీడీఓ గంటా శ్రీనివాసరెడ్డి, ఎంఈఓ రవికుమార్, మండల ప్రత్యేకాధికారి డ్వామా పీడీ మూర్తి, ఏపీఓ కోటిరెడ్డి, ఆర్ఐ శ్రీనివాసరావు, వీఆర్వోలు యేసుదాసు, తదితరులు పాల్గొన్నారు.

# ఈతగాళ్ళ సంఘం ఆధ్వర్యంలో నరసింహారావుకు సత్కారం

**సత్తెనపల్లి, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త :** 68 సంవత్సరాల వయస్సులో కృష్ణానదిని ఈదిన పోతుగంటి నరసింహారావును ఈతగాళ్ళ సంఘం



ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సత్కరించారు. 6వ సారి కిలోమీటరున్నర మేరకు ఈత పోటీలలో ఆయన పాల్గొని విజయం సాధించడం గొప్ప విషయమని సంఘం సభ్యులు తెలియజేశారు. నిత్యం ఈత కొడుతూ పలువురికి ఆయన ఆదర్శంగా నిలిచారన్నారు. పోతుగంటి నరసింహారావుతో పాటు కార్యక్రమంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోండి

## -మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు

**పొన్నూరు, ఫిబ్రవరి 18,ప్రభాతవార్త:** ఈ 18వ తేదీ నుండి 21వ తేదీ వరకు ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు, అదేవిధంగా 24వ తేదీ నుంచి 28వ తేదీ వరకు రెండు విడతలుగా ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నామని అవసరమైనవారు సేవలను సద్వినియోగం చేసుకోవాలని మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళరమేష్‌బాబు కోరారు. 8,27 వార్డుల అంగన్‌వాడీ కేంద్రాలలో ఈ నెల 18వ తేదీ నుంచి 19వ తేదీ వరకు, 25వ వార్డు శ్రీరామా మునిసిపల్ హైస్కూల్, 9వ వార్డు అంగ్‌నవాడీ కేంద్రంలో 20వ తేదీ నుంచి 21వ తేదీ వరకు, 11, 23వ వార్డుల్లోని అంగన్‌వాడీ కేంద్రాలలో 24వ తేదీ నుంచి 25వ



తేదీ వరకు,7, 22వ వార్డుల్లోని అంగన్‌వాడీ కేంద్రాలలో ఈ నెల 27నుండి 28వ తేదీ వరకు ఆధార్ క్యాంపులను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 22,23,25,27వార్డుల్లో జరిగే క్యాంపులకు షేక్ ఆసిప్ బాషా ఎడ్యుకేషన్ సెక్రటరీ, 7,8,9,11వార్డుల్లో జరిగే క్యాంపులకు ఎ.ధీరజ్ వార్డు ఎడ్యుకేషన్ సెక్రటరీ ఆపరేటర్లుగా వ్యవహరిస్తారని కమిషనర్ తెలిపారు. ఆధార్‌లో చాలా వరకు తప్పులున్నట్లు గుర్తించడం వల్ల ప్రభుత్వం ఈ ప్రత్యేకమైన క్యాంపులను నిర్వహిస్తుందన్నారు. ఆయా వార్డుల్లో పొందుపరచిన తేదీలలో ఆధార్‌లోని తప్పొప్పులను సరిచేసుకొనే వెలసులుబాటు ఉన్నట్లు తెలిపారు.

# ప్యానెల్ కమిటి నియామకానికి దరఖాస్తులు ఆహ్వానం

## -ప్రిన్సిపల్ సివిల్ జడ్జి పవన్‌కుమార్ ఏకా

**పొన్నూరు, ఫిబ్రవరి 18,ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ న్యాయసేవాధికార సంస్థ, జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మండల న్యాయసేవాధికార సంస్థలో ప్యానెల్ కమిటి నియామకానికి అర్హులైన వారి వద్ద నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి పవన్‌కుమార్ ఏకా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బలహీన వర్గాలు, ఎస్సీ, ఎస్టీ, మహిళలు, చిన్నపిల్లలు, గ్రామీణ ప్రాంత శ్రామికుల కొరకు పాటుపడే సామాజిక కార్యకర్తలు, న్యాయవాద వృత్తిలో ప్రావీణ్యం కలవారు, న్యాయసేవల రంగంలో ప్రత్యేక ఆసక్తి గలవారు అర్హులుగా తెలిపారు. దరఖాస్తులను పోస్టు ద్వారా గానీ, వ్యక్తిగతంగా గానీ ఈ నెల 20వ తేదీ లోపు మండల న్యాయసేవాధికార సంస్థ, పొన్నూరు వారికి అందేవిధంగా పంపాలన్నారు. అదేవిధంగా మార్చి 8వ తేదీన పొన్నూరు ప్రిన్సిపల్ సివిల్ కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జడ్జి పవన్‌కుమార్ తెలిపారు. పొన్నూరు కోర్టు పరిధిలోని కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, అమూల్యమైన సమయాన్ని, డబ్బుని ఆదా చేసుకోవాలని జడ్జి పవన్‌కుమార్ ఏకా సూచించారు.

# నర్రవారిపాలెం తుమ్మలపల్లి రహదారికి మరమ్మత్తులు

**కర్లపాలెం,ఫిబ్రవరి18,ప్రభాతవార్త:** కర్లపాలెం మండల పరిధిలోని నర్రవారిపాలెం తుమ్మలపల్లి రహదారికి ఆర్ అండ్ బి అధికారులు మరమ్మత్తు పనులను మంగళవారం చేపట్టారు. 600 మీటర్ల వరకు తారు రోడ్డును ఉన్న రహదారి మీద కొత్తగా వేయనున్నారు. కట్టవాద గ్రామంలోని వాటర్ ప్లాంట్ దగ్గర నుంచి ఈ రహదారిని ఏర్పాటు చేయనున్నారు.ఈ సందర్భంగా మంగళవారం ప్రొక్లైనర్ తో పాత రహదారిని కదిలించి దానిమీద కొత్త తారు పోసి రోలింగ్ చేయనున్నారు. సముద్ర తీర గ్రామం కావడంతో నిత్యం ఆక్వా రైతుల వాహనాలతో రద్దీగా ఉంటుంది.ఈ రహదారి ఏర్పాటు వలన వాహనదారులకు ప్రయాణం సులభతరం కానుంది.



# అనంత నగేష్‌కు ఆక్వాకల్చర్ ఇనోవేషన్2.0 అవార్డు

**బాపట్ల,ఫిబ్రవరి18,ప్రభాతవార్త:** ఆక్వారంగంలో 30 సంవత్సరాలు విశిష్ట సేవలు అందించినందకు ఆక్వాకల్చర్ ఇనోవేషన్2.0అవార్డు దక్కడం ఎంతో సంతోషంగా ఉందని అనంత నగేష్ అన్నారు.మంగళవారం విజయవాడలో ఫార్చ్యూన్ మురళీకృష్ణ లో జరిగిన రెండు రోజుల డీప్ టెక్నాలజీ అండ్ గవర్నమెంట్ టెక్ ఇన్నోవేషన్ కాంక్లేవ్ లో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరియు అగ్రికల్చర్ ఫిషరీస్ అనిమల్ హస్బండ్రీ మంత్రి కే అచ్చం నాయుడు అలాగే అప్కెట్ కో వైస్ చైర్మన్,మైన్స్ అండ్ ఎక్సైజ్ మినిస్టర్ కొల్లు రవీంద్ర చేతులమీదుగా అనంత నగేష్‌కు అవార్డు ప్రధానం చేశారు. ఫిషర్మెన్గా ఎక్స్పర్ట్‌గా ఎంటర్ప్రెన్యూర్ గా ఆక్వా కల్చర్ కి 30




సంవత్సరాలు చేసిన సేవకు ముఖ్యమంత్రి చేతుల మీదుగా అవార్డు ఇవ్వడం జరిగిందన్నారు.ఇనోవేషన్ అవార్డు అందకున్న అనంత నగేష్‌ను బాపట్ల శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ ప్రత్యేకంగా అభినందించారు.

# ఆలపాటి రాజుకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలి

## - మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే జూలకంటి

కారంపూడి, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తొలి ప్రాధాన్యత ఓటు ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు వేసి వేయాలని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. మంగళవారం కారంపూడిలో ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజయాన్ని కాంక్షిస్తూ సెయింట్ జాన్స్, రెయిన్‌బో, బాలయోగి పాఠశాలల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గడచిన ఏడు నెలల కాలంలో రాష్ట్రం అభివృద్ధి చెందిందన్నారు. వేయి కోట్లతో రోడ్ల మరమ్మతులు, అన్నక్యాంటీన్, ఉచిత గ్యాస్ వంటి పథకాలు అందించామన్నారు. రాష్ట్రం మరింత అభివృద్ధికి సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. అమరావతి రాజధానిని పూర్తి చేసే బాధ్యత కూటమి ప్రభుత్వానిదేనన్నారు.



పోలవరం పూర్తి చేసి సాగునీరు అందిస్తామన్నారు. వైకాపా పాలనలో రాష్ట్రం 20 ఏళ్ల వెనకబడిందన్నారు. మంత్రిగా పనిచేసిన ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెదేపా నేతలు పంగులూరు అంజయ్య, పంగులూరు పుల్లయ్య, మునుగోటి సత్యం, బి.శ్రీనివాసరావు, బాలకృష్ణ, తండా మస్తాన్‌జానీ, పూర్ణచంద్రరరావు, బూసా రామాంజనేయులు, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

# రక్తదానం చేసి మానవత్వం చాటుకున్న నరసింహారావు

**తిరువూరు, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త :** ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు బోసు బొమ్మ సెంటర్లోని శ్రీ వైష్ణవి హాస్పటల్లో తుంటి ఎముక విరిగి చికిత్స పొందుతున్న భాగ్యమ్మకు ఆరు ప్యాకెట్లు రక్తం అవసరపడగా తిరువూరు హెల్పింగ్ హ్యాండ్స్ గ్రూప్ నరేష్ ని ఫోన్లో సంప్రదించారు. గ్రూపులో సభ్యులైన నరసింహారావు



విషయం తెలుసుకుని హాస్పటల్‌కు వచ్చి బ్లడ్‌ను డొనేట్ చేశారు. కార్యక్రమంలో వైష్ణవి హాస్పటల్ డా అక్రమ్, హెల్పింగ్‌హ్యాండ్స్ గ్రూప్ గౌరవాధ్యక్షులు పెద్దవరపు సత్యనారాయణ, గ్రూపుసభ్యులు మర్సకట్ల కుమార్ (సీనియర్ న్యాయవాది), ఎక్కిరాల సోమరాజు, టెక్నిషియన్ చక్రి, చెన్నారావు, మర్సకట్ల దిలీప్, జి బాబూరావు, పల్ల నరేంద్ర కిషోర్, కె ప్రసాద్ లక్ష్మి, సిరికొండ అభి (పరిపూర్ణ చారిటబుల్‌ట్రస్టు) , మడిపల్లి రాంబాబు, ముద్దిబోయిన నరేష్‌లు పాల్గొన్నారు. అత్యవసర సమయంలో బ్లడ్ డొనేట్ చేసిన నరసింహారావును డా అక్రమ్, పెద్దవరపు సత్యనారాయణలు అభినందించారు.

# రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలుతో ప్రజాస్వామ్యం అపహాస్యం : మాజీ ఎమ్మెల్యే నల్లగట్ల స్వామిదాస్

ఎ కొండూరు, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త : ప్రజాస్వామ్యంలో నిర్బంధాలు, అరెస్టుల వల్ల బంతిని ఎంత గట్టిగా కొడితే అంతేపైకి వస్తుందని, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం తీరువల్ల ప్రజా ఉద్యమాలు వస్తాయని, కక్ష సాధింపు చర్యల వల్ల, రాజ్యాంగానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న తీరు కక్ష సాధింపు, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం పాలవుతుందని తిరువూరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే వైసిపి ఇన్‌చార్జ్ నల్లగట్ల స్వామిదాస్ రాష్ట్రంలో తె.దె.పా కూటమి తీరును తీవ్రంగా మీడియా సమావేశంలో



ఆక్షేపించారు. సార్వత్రిక ఎన్నికల ముందు సూపర్ 6 పథకాలంటూ ప్రచారం చేసి , అధికారంలోకి వచ్చాక తీరా ప్రజలను మోసం చేయడం చంద్రబాబు నైజం అని స్వామిదాస్ విమర్శించారు. రాష్ట్రంలో తిరిగి ఎన్నికలు వస్తాయని, అప్పుడు ప్రజలు వైసిపిని అధికారంలోకి తీసుకొని వచ్చి జగన్ మోహన్ రెడ్డిని సిఎంగా గద్దె ఎక్కించడం ఖాయమని స్వామిదాస్ జోస్యం చెప్పారు. గన్నవరం మాజీ ఎమ్మెల్యే వంశీ అరెస్ట అప్రజాస్వామికమని ఈ విషయంలో విష్ణువర్ధన్ అనే వ్యక్తి కోర్టులో వాఙ్మూలం ఇచ్చాడని, అయినా కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం పాలు చేస్తూ లోకేష్ రచించిన రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని నడపడం హాస్యాస్పదంగా వుందని, రాబోయే రోజుల్లో ఈ ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్పడం ఖాయమని, తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని స్వామిదాస్ ఈ సందర్భంగా రాష్ట్రంలో ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వంను హెచ్చరించారు.

# ఆలపాటికి మేడ్ మద్దతు

## -మేడ్ రాష్ట్ర అధ్యక్షులు మురికిపూడి దేవపాల్

**గుంటూరు కల్చరల్,ఫిబ్రవరి 18,ప్రభాతవార్త :** ఫిబ్రవరి 27న జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కృష్ణా-గుంటూరు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ నియోజక వర్గం నుండి కూటమి అభ్యర్థిగా పోటీచేస్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్ కి మోడల్ అసోసియేషన్ ఆఫ్ దళిత్ ఎంప్లాయిస్ ఏపి మేడ్ మద్దతు ప్రకటించింది.కావున ఉమ్మడి గుంటూరు- గుంటూరు జిల్లాల్లోని 33 నియోజకవర్గాల అధ్యక్ష,ప్రధాన కార్యదర్సులు ,రాష్ట్ర,జిల్లా, మండల కార్యవర్గ సభ్యులు నాయకులు, కార్యకర్తలు ఎన్నికల వరకు మద్దతుగా విస్తృతంగా ప్రచారం చేసి వారి గెలుపులో భాగ స్వాములు కావాలసిందిగా కోరారు. కార్యక్రమంలో గుంటూరు నగర అధ్యక్షులు రావెల నల్లయ్య, ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధాయులు కొల్లిపర ఆనందరావు,డాక్టర్ చిలకా వేంకటేశ్వరరావు, బందెల నవీన్,కందుకూరి మరియదాసు పాల్గొన్నారు.

# ఆకట్టుకుంటున్న నాణేల శివలింగం

**సత్తెనపల్లి, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త :** అయిదు వేల అయిదు రూపాయల నాణేలతో శివలింగాన్ని సత్తెనపల్లికి చెందిన ఏలూరి శివాచారి వినూత్నంగా తయారు చేశారు. శివ లింగం రాతితో సాధారణం గా ఎక్కడైనా కనిపిస్తుంద న్నారు. అయితే అందుకు భిన్నంగా శివాచారి



వినూత్నంగా నాణేలతో శివలింగాన్ని తయారు చేశారన్నారు. రూ.5ల నాణేలను రూ.5 వేల వరకు సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, విజయవాడ తదితర ప్రాంతాలలో బంధువులు, స్నేహితుల ద్వారా రూ.5 వేల అయిదు రూపాయల నాణేలను వారు సేకరించారు. చక్కతో శివలింగాన్ని తయారు చేసి ఒక క్రమపద్ధతిలో రూ.5ల నాణేలను ఊడిపోకుండా అంటించారు. లంకెలకూరపాడు శివాలయంలో మహాశివరాత్రికి ఈ శివలింగాన్ని పంచామృతాలతో అభిషేకం చేస్తామని ఆయన తెలియజేశారు.

# స్వచ్ఛ సర్వేక్షణ్‌లో విజయవాడను ఉన్నత స్థానంలో నిలపండి

## -కమిషనరు ధ్యానచంద్ర

**విజయవాడ కార్పొరేషన్,ఫిబ్రవరి 18,ప్రభాతవార్త :** స్వచ్ఛ సర్వేక్షణ్‌లో పాల్గొని విజయవాడను ఉత్తమమైన స్థానంలో నిలపాలని మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా విజయవాడ నగరపాలక సంస్థకు స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఉత్తమమైన స్థానాలు వచ్చాయని దీనికి కారణమైన ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సారి జరిగే స్వచ్ఛ సర్వేక్షణ్‌లో కూడ పాల్గొని విజయవాడను ఉత్తమమైన స్థానంలో నిల్పాలని ప్రజలను ఆయన కోరారు. ఈ సారి నిర్వహించే స్వచ్ఛ సర్వేక్షణ్ ఫీడ్‌టాక్‌ను క్యూఆర్ కోడ్ ద్వారా స్కాన్ చేసి,ఫోన్ నెంబరు,ఓటిపి నమోదు చేసి,సర్వేలో ఉన్న పది ప్రశ్నలకు తమ అభిప్రాయాన్ని తెలియప్పి సర్వేని పూర్తి చేయాల్సిందిగటా ఆయన ప్రజలను కోరారు.

# విజయవాడ కార్పోరేషన్ జోనల్ కమిషనర్‌గా షమ్మీ

**సత్తెనపల్లి, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త :** విజయవాడ కార్పోరేషన్ జోనల్ కమిషనర్‌గా సత్తెనపల్లి పట్టణానికి చెందిన కమిషనర్ కె. షమ్మీ నియమితుల య్యారు. గ్రేడ్-2 కమిషనర్‌గా ఆయన పదోన్నతి పొందా రు. పదోన్నతిపై విజయ వాడకు బదిలీ అయ్యారు. మున్సిపల్ రీజన్ శాఖ నుండి ఈ మేరకు ఆయన కు ఉత్తర్వులు అందాయి. ఈ సందర్భంగా కమిషనర్ షమ్మీకి పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు.



# పట్టభద్రుల ఎన్నికలలో ఆలపాటిని భారీ మెజారిటితో గెలిపించాలి

**పిట్టలవానిపాలెం,ఫిబ్రవరి18,ప్రభాతవార్త:** పట్టభద్రుల ఎన్నికలలో ఆలపాటి రాజాను భారీ మెజారిటితో గెలిపించాలని బాపట్ల శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ అన్నారు.ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు మంగళవారం పిట్టలవానిపాలెం మండలం చందోలు ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఎమ్మెల్సీ ఒటర్లతో కలిసి ఆలపాటి రాజాకు పట్టభద్రుల ఎన్నికలలో తమ మద్దతు తెలిపి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త నామన వెంకట శివన్నారాయణ,ఆప్కో చైర్మన్ సజ్జా హేమలత, బిజెపి నాయకులు కరిముల్లా, పిట్టలవానిపాలెం మండల పార్టీ అధ్యక్షులు అప్జల్,చందోలు గ్రామ పార్టీ అధ్యక్షులు రజాక్ , తెలుగుదేశం పార్టీ నాయకులు నియాజీ,పిట్టలవానిపాలెం మహిళా అధ్యక్షురాలు గ్లోరి యానెట్ మరియు తెలుగుదేశం జనసేన బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

19-2Pg5.qxd:19-2Pg5.qxd 01/01/01 8:18 AM Page 1



## ఉక్రెయిన్ యుద్ధం ముగింపు దిశగా..

# అమెరికా-రష్యా తొలివిడత చర్చలు షురూ!

### సౌదీ అరేబియా రాజధాని రియాద్‌లోని ప్యాలెస్‌లో సమావేశాలు



**రియాద్, ఫిబ్రవరి 18:** అమెరికా-రష్యా దేశాలు యేళ్లతర్వాత తొలిసారి ఉక్రెయిన్ యుద్ధ ముగింపుకోసం అధికారికంగా చర్చలు మొదలు పెట్టాయి. సౌదీ అరేబియా రాజధాని రియాద్ లోని దిర్ఘియా ప్యాలెస్ వీటికి వేదికైంది. అమెరికా-రష్యా విదేశాంగ మంత్రులు మార్కో రూబియో, సెర్గీ లవ్రోవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా యుద్ధానికి ఎలా ముగింపు పలకాలన్న అంశం వీరి మధ్య ప్రధానంగా చర్చకు వచ్చింది. అమెరికా పశ్చిమాసియా దూత స్టీవ్ విట్‌కాఫ్, జాతీయ భద్రతా సలహాదారు మైక్ వాల్జ్ ఈ చర్చల్లో పాల్గొన్నారు. మరోపక్క రష్యా తరఫున క్రెమ్లిన్ ప్రతినిధి యూరీ ఉస్కోవ్ కూడా హాజరయ్యారు. సౌదీ అరేబియా మంత్రి ఫైజల్ బిన్ ఫర్హాన్ అల్ సౌద్, జాతీయ భద్రతా సలహాదారు ముసాద్ బిన్ మహమ్మద్ అల్ అబియన్ ఈ చర్చల్లో భాగం కావడం విశేషం. 2022 జెనీవాలో మీటింగ్ తర్వాత ఉభయ దేశాల దౌత్యవేత్తలు భేటీ కావడం ఇదే తొలిసారి. ఈ సమావేశంపై అమెరికా స్పందిస్తూ.. ఇది చర్చల ప్రారంభం కాదని.. యుద్ధం ముగింపునకు రష్యా సిద్ధంగా ఉందో లేదో తెలుసుకోవడానికని పేర్కొన్నారు. ఇక మాస్కో ప్రతినిధి మాట్లాడుతూ తాము అమెరికాతో సంబంధాలను సాధారణంగా చేసుకోవడానికి ఇవి ఉపయోగపడతాయని పేర్కొన్నారు.

**అమెరికన్ జాతీయుడికి స్వేచ్ఛ..**

మాదక ద్రవ్యాలు కలిగి ఉన్నాడనే ఆరోపణలపై ఈనెల 7న రష్యాలోని వ్నుకోవ్ విమానాశ్రయంలో అరెస్టయిన కలోబ్ బేయర్స్ అనే 28 యేళ్ల యువకుడినివదిలిపెట్టారు. ఈవిషయాన్ని రష్యా మీడియా సంస్థలు వెల్లడించాయి. కలోబ్ ఇస్తాంబుల్ నుంచి తన ప్రేయసితో ప్రయాణిస్తుండగా కస్టడీలోకితీసుకొన్నారు. అతడిపై నేరం రుజువైతే 10 యేళ్ల జైలు శిక్ష పడేది. మాస్కో-వాషింగ్టన్ల మధ్య ఉద్రిక్తతలు తగ్గించే చర్యల్లో భాగంగా అతడిని విడుదలచేసినట్లు తెలుస్తోంది.

**జెలెన్‌స్కీతో చర్చలకు పుతిన్ ఓకే: క్రెమ్లిన్**

ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో చర్చలు జరిపేందుకు పుతిన్ ఓకేచెప్పారు. అవసరం అనుకుంటే వీరి మధ్య చర్చలు ఉంటాయని క్రెమ్లిన్ వెల్లడించింది. అదే సమయంలో అధ్యక్షుడిగా జెలెన్‌స్కీ చట్టబద్ధతను ప్రశ్నించింది. ఉక్రెయిన్‌లో శాంతి నెలకొల్పేందుకు మంగవారం సౌదీ అరేబియా వేదికగా కీలక సంప్రదింపులు మొదలైన సంగతి తెలిసిందే. అమెరికా, రష్యా ప్రతినిధుల మధ్య చర్చలు జరుగుతున్నాయి. ఈ తరుణంలో తాజా స్పందన వచ్చింది.

2022 నుంచి రష్యా-ఉక్రెయిన్ యుద్ధం జరుగుతోంది. తాను అధికారంలోకి వస్తే ఆ యుద్ధాన్ని ఆపేస్తానని పలుమార్లు చెప్పిన డొనాల్డ్ ట్రంప్.. అధికారాన్ని చేపట్టిన వెంటనే ఆ దిశగా చర్యలు చేపట్టారు. దానిలో భాగంగానే అమెరికా-రష్యాలు యేళ్ల తర్వాత తొలిసారి ఉక్రెయిన్ యుద్ధం ముగింపు కోసం అధికారికంగా చర్చలు మొదలుపెట్టాయి.



# మహాకుంభ్‌మేళాలో 55 కోట్లమంది పుణ్యస్నానం

**మహాకుంభ్‌నగర్, ఫిబ్రవరి 18:** ప్రయాగరాజ్‌లో భారీ ఎత్తున కొనసాగుతున్న కుంభమేళాకు ఊహించని రీతిలోభక్తులు వస్తున్నారు. మంగళవారం సాయంత్రానికి 55 కోట్లమందికిపైగా భక్తులుత్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించినట్లు యూపి ప్రభుత్వం ఒకప్రకటన చేసింది. మానవ చరిత్రలో ఏమతపరమైన సాంస్కృతిక సామాజిక కార్యక్రమంలో ఇంత భారీగా జనం పాల్గొనలేదని వెల్లడించింది. దేశ విదేశాలనుంచి భారీగా సామాన్యులు ప్రముఖులు తరలివచ్చి త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్నారు. గతనెల 13న ప్రారంభం అయిన ఈ ఆధ్యాత్మిక వేడుక ఈనెల 26వ తేదీవరకూ కొనసాగుతున్నది. భారత్‌లోని 110 కోట్లమంది సనాతనుల్లో సుమారు సగంమంది పవిత్ర గంగానదిలో స్నానం ఆచరించారని తెలిపింది. 26 నాటికి ఈ సంఖ్య 60 కోట్లు దాటుతుందని అంచనావేసింది. తొలుతకుంభమేళాకు 45కోట్లమందిమాత్రమే వస్తారనిఅంచనా వేస్తే ఊహించనిరీతిలోభక్తులు పోటెత్తారు. 14వ తేదీకే 50 కోట్లమార్కును అధిగమించి తాజాగా 55 కోట్లమార్కును చేరుకుంది. 29న మౌని అమావాస్యరోజే సుమారు 8కోట్లమంది ప్రయాగ్ రాజ్‌కు రాగా మకర సంక్రాంతి రోజున 3.5 కోట్లమంది జనవరి 30న రెండుకోట్లమందికిపైగా భక్తులు పుణ్యస్నానాలు ఆచరించినట్లు యూపి సర్కారు తెలిపింది.

మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాడు కుటుంబ సమేతంగా కుంభమేళాలో పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ డిప్యూటి సిఎం పవన్‌కళ్యాణ్ కూడా కుటుంబసమేతంగా త్రివేణి సంగమంలో స్నానం చేసారు. మహాకుంభమేళా అనేది ప్రపంచంలోనే అతిపెద్ద మత ఆధ్యాత్మిక వేడుక అని వెంకయ్య పేర్కొన్నారు.సనాతన సంప్రదాయం వారసత్వానికి ఇదో గొప్ప ప్రతీకగా పేర్కొన్నారు. దేశం ఆరోగ్యంగా సౌభాగ్యంగా ఉండాలని గంగా మాతను ప్రార్థించానని వెంకయ్యనాయుడు తెలిపారు.



## గ్వాటెమాలాలో లోయలో పడిన బస్సు

### 51 మంది మృతి, పలువురికి తీవ్రగాయాలు

**గ్వాటెమాలా సిటీ, ఫిబ్రవరి 18:** లాటిన్ అమెరికా దేశం గ్వాటెమాలాలో రాజధాని నగరంలో జరిగిన బస్సుప్రమాదంలో 51 మంది చనిపోయారు. ఇటీవలికాలంలో గ్వాటెమాలా సిటీలో అత్యంత భారీ స్థాయిలోజరిగిన ప్రమాదంగా అధికారులు చెపుతున్నారు. బస్సు ఘాట్‌లోని రైయిలింగ్‌ను ఢీకొని అక్కడినుంచి అత్యంత లోతుగా ఉన్న లోయలో పడిపోయింది. 70 మందికిపైగా ప్రయాణిస్తున్న ఈబస్సులో కిందికి ఒక్కసారిగా పడిపోవడంతో 51 మంది చనిపోయారు. వలంటీర్ ఫైర్‌ఫైటర్స్ గ్రూప్‌నకు చెందిన విక్టర్ గోమెజ్‌మాట్లాడుతూ ఇప్పటి వరకూ శవాగారానికి 51 మృతదేహాలు తెచ్చినట్లుచెప్పారు. మరో పదిమంది తీవ్రంగా గాయపడిన వారిని బస్సునుంచి వెలికి తీస్తున్నట్లు తెలిపారు. గ్వాటెమాలా అధ్యక్షుడు బెర్నార్డో అరెవాలో ఈప్రమాదంపై తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తంచేసారు. బస్సు ఘాట్‌రోడ్డులో వెళుతుండగానే మెటల్ రెయిలింగ్‌ను ఢీకొని సుమారు 20 మీటర్ల లోతున్న లోయలోకి పడిపోయిందని మురుగునీరు కలుషిత నీటినదిలోపడిపోయిందని అగ్నిమాపకశాఖ అధికారి కార్లోస్ హెర్నాండెజ్ అన్నారు. బురదనీటినుంచి మృతదేహాలను వెలికితీస్తున్న దృశ్యాలు వైరల్ అయ్యాయి. స్థానిక మీడియా వివరాలప్రకారం బస్సు గ్వాటెమాలా నగరానికి వెళుతోంది. సాన్ ఆగస్టిన్ అకాసాగ్వాస్టాన్‌నుంచి బయలుదేరి 90 కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్వాటెమాలా నగరానికి వస్తున్నట్లు సమాచార మంత్రి మిగ్వేల్ ఎంజెల్ దియాజ్ అన్నారు. 30 ఏళ్ల సర్వీసు ఉన్న ఈ బస్సుకు లైసెన్స్ ఉందని అధికారులు తెలిపారు.దక్షిణ,మధ్య అమెరికా దేశాల్లో రోడ్డు ప్రమాదాలు ఇటీవలికాలంలో పెరిగిపోయాయి. 2018 జనవరిలో పెరూ దేశంలో రాజధాని లిమా వద్ద ఒక బస్సు పడిపోయిన ప్రమాదంలో 52 మంది చనిపోయారు.

# గుజరాత్‌లో పట్టునిరూపించుకున్న బిజెపి



### స్థానిక ఎన్నికల్లోను కాషాయం హవా

**అహ్మదాబాద్, ఫిబ్రవరి 18:** గుజరాత్ రాజకీయ ముఖచిత్రంపై భారతీయ జనతాపార్టీ తన పట్టు పెంచుకుంది. మొత్తం 66 మున్సిపాలిటీలు, మరో రెండు ఉప ఎన్నికల్లో తన సత్తాను చాటింది. బిజెపి మున్సిపాలిటీ ఎన్నికల్లో తన ఆధిపత్యం చాటింది. మొత్తం 1315 స్థానాల్లో బిజెపి గెలిస్తే కాంగ్రెస్ 252 స్థానాలు మాత్రమే దక్కించుకోగలిగింది. స్వతంత్ర అభ్యర్థులు 126 స్థానాల్లో గెలిస్తే ఆప్ అభ్యర్థులు, ఇతరులు 13స్థానాలు నాలుగు స్థానాల్లో గెలిచారు. తాలూకా పంచాయతీ పోల్స్‌లో కూడా బిజెపి ఆధిక్యం ప్రదర్శించింది. 55స్థానాలు గెలిస్తే కాంగ్రెస్ 17 సీట్లకే పరిమితం అయింది. స్వతంత్రులు మరో ఆరుస్థానాలు గెలిచారు. ఇదే తీరు జునాగఢ్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కూడా కొనసాగింది. బిజెపి 44 స్థానాల్లోను, కాంగ్రెస్ 11 స్థానాల్లోను గెలిచింది. ఈనెల 16వ తేదీనుంచి ప్రారంభం అయిన ఈ ఎన్నికల్లో వోటర్లు 57శాతం పాల్గొన్నారు. చోర్వాద్ మున్సిపాలిటీలో 76శాతం రికార్డు అయింది. మొత్తం 1844 మున్సిపల్ స్థానాల్లో 167 పోటీలేకుండానే గెలిచాయి. 4374 మంది అభ్యర్థులు మిగిలిన 1677 స్థానాల్లో పోటీచేసారు.

పోటీలేని స్థానాల్లోకూడా బిజెపి డామినేట్ చేసింది. 162 సీట్లలో పోటీలేకుండా ఎన్నికయ్యారు. కాంగ్రెస్ ఒకటి, ఇతర పార్టీలకు నాలుగు స్థానాలు వెళ్లాయి. బిజెపి వల్సాద్, పార్ది, ధరమ్‌పూర్ మున్సిపాలిటీలను గెలుచుకుంది. అయితే రెబెల్స్‌నుంచి ఎక్కువ చిక్కులు ఎదుర్కొంది. నలుగురు స్వతంత్రులు ధరమ్‌పూర్‌లో గెలవడమే ఇందుకు కారణం. వల్సాద్‌లో బిజెపి 37 స్థానాల్లో 34 గెలిచింది. కాంగ్రెస్ పార్టీ కేవలం ఒక్కస్థానమే గెలిచింది. జునాగఢ్ మున్సిపల్ కార్పొరేషన్‌లో బిజెపి 60 స్థానాల్లో 40 గెలుచుకుంది. కాంగ్రెస్ 11 స్థానాలు, ఒకస్థానం స్వతంత్ర అభ్యర్థి గెలిచారు. 2004నుంచి జునాగఢ్‌లో బిజెపి పట్టుతో ఉంది. 2009లో ఒక్కసారి మాత్రమే కాంగ్రెస్ గెలిచింది.

దేవ్‌గఢ్ బారియా నగర్ పాలికా ఎన్నికల్లో హింస ప్రజ్వరిల్లింది. కాపాడి ప్రాంతంలో హాహాకారాలే వినిపించాయి. గుర్తుతెలీని వ్యక్తులు రాళ్లురువ్వారు. రెండుగ్రూపుల మధ్య తీవ్రస్థాయిలో వాగ్యుద్ధం జరిగింది. అధికారులు ఎక్కడికక్కడ భారీ సంఖ్యలో సిబ్బందిని మోహరించడంతో ఎలాంటి ప్రాణహాని జరగలేదు.



# వికీపీడియా పేరు మార్చుకుంటే రూ. 8,600 కోట్లిస్తా!

### ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ విరాళం ఆఫర్

**వాషింగ్టన్, ఫిబ్రవరి 18:** వికీపీడియా ఆన్‌లైన్ వేదికగా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రజలకు విస్తృత సమాచారాన్ని ఉచితంగా అందిస్తోంది. అయితే ఈ ఎన్‌సైక్లోపీడియాను ఓపెన్ చేయగానే విరాళాలకు సంబంధించిన సందేశం దర్శనమిస్తుంది. దీనిపై ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ ఇప్పటికే పలుమార్లు వ్యంగ్యంగా కామెంట్లు చేశారు. తాను ఆ సంస్థకు బిలియన్ డాలర్లు ఇవ్వడానికి సిద్ధమేనని అన్నారు. కానీ దానికి ఓ షరతు పెట్టారు. తాజాగా మరోసారి మస్క్ ఆ ఆఫర్‌పై ప్రకటన చేశారు. సోషల్ మీడియా యాజమాన్యం దాని పేరును (రాయటానికి వీలులేని ఓ అసభ్యకర పేరుగా) మారిస్తే.. వారికి బిలియన్ డాలర్లు (భారత కరెన్సీలో దాదాపు రూ. 8,600 కోట్లు) ఇస్తానని అన్నారు.

'వినియోగదారుల నుంచి నిధుల సేకరించాల్సిన అవసరం వికీమీడియా ఫౌండేషన్‌కు ఏముందని మీరు ఎప్పుడైనా ఆలోచించారా..? వికీ నిర్వహణకు అంత డబ్బు అవసరం లేదు. మరి దేనికోసం ఆ సొమ్ము అడుగుతున్నారు..?' అని మస్క్‌ప్రశ్నించారు. ప్రపంచ కుబేరుడు ఈ ఆఫర్ ప్రకటించిన విషయమై ఓ యూజర్ స్పందిస్తూ ఆ ఆఫర్ ఇంకా ఉనికిలో ఉందా? అని మస్క్‌ను ప్రశ్నించారు. దీనికి మస్క్ బదులిస్తూ 'అవును ఆ ఆఫర్ ఇంకా ఉంది. కావాలంటే ముందు పేరు మార్చాలి' అంటూ మస్క్ జవాబిచ్చారు.

# స్వేచ్ఛ ఉందని ఏదయినా మాట్లాడేస్తారా?

## యూట్యూబర్ రణ్‌వీర్‌పై సుప్రీం ఆగ్రహం



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18:** వాక్ స్వాతంత్ర్యం ఉంది కదాని ఏదైనా మాట్లాడేస్తారా అని యూట్యూబర్ రణ్‌వీర్ అల్హాబాదియాపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. సామాజిక కట్టుబాట్లను గాలికొదిలేసి నోటికొచ్చింది మాట్లాడతారా అని మండిపడింది. ఇండియాస్ గాట్ లాటెంట్ ఈవెంట్‌లో పాల్గొన్న ఒక వ్యక్తిని తల్లితండ్రుల గురించి శృంగారంపై ప్రశ్నించిన తరువాత్ల దేశవ్యాప్తంగా తీవ్ర నిరసనలు వ్యక్తం అవుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే అల్హాబాదియాపై పలు రాష్ట్రాల్లోకేసులు నమోదయ్యాయి. బెదిరింపులు కూడా ఎదుర్కొంటున్నట్లు చెపుతూ ఆతడు సుప్రీంలో పిటిషన్ వేసాడు. దీనితో మంగళవారం విచారణ జరిపిన సుప్రీంకోర్టు అరెస్టునుంచి ఆతడికి రక్షణ కల్పిస్తూ పలు ప్రశ్నలు వేసింది.

యూట్యూబ్‌షోలో అల్హాబాదియా చేసిన వ్యాఖ్యలు ఆతడి మెదడులో పేరుకుపోయిన మలినాన్ని బయటపెట్టాయి. ఇవి ఆతడి వక్రబుద్ధిని సూచిస్తున్నాయి. మేం ఎందుకు రక్షించాలి. వాక్స్వాతంత్ర్యం పేరుతో సామాజిక నిబంధనలకు విరుద్ధంగా నోటికొచినచంది మాట్లాడటానికి ఎవరికీ అనుమతిలేదన్నారు. సామాజిక విలువలంటే ఏమిటో ఉన్న పరిమితులేంటో సమాజానికి ఉన్న విలువలు మీకేమైనా తెలుసా వాటిని గౌరవించడం నేర్చుకోండి అని మండిపడింది. మీరు వాడిన పదాలు ఎంతోమంది మహిళలు, బాలికలు, తల్లితండ్రులనే కాదు సమాజం సైతం సిగ్గుపడేలాచేస్తాయి. నువ్వు నీ అనుచరులు ఆ స్థాయి దుర్మార్గానికి దిగజారారు. ఇది అసభ్యత కాకపోతే మరేంటీ మీపై నమోదయిన ఎఫ్ఐఆర్‌లను మేం ఎందుకు కొట్టేయాలి ఎందుకు ఎఫ్ఐఆర్‌లను క్లబ్‌చేయాలి అని ప్రశ్నించారు.

పాపులారిటీకోసం ఇలాంటి పదాలు వాడి బెదిరింపులవరకూ తెచ్చుకున్నారు. రణ్‌వీర్‌పై ఎఫ్ఐఆర్ నమోదయినా ఆతడిని అరెస్టు చేయకూడదని అన్నారు. పిటిషనర్ తన పాస్‌పోర్టును ఠాణె పోలీస్‌స్టేషన్‌లో డిపాజిట్ చేయాలి. కోర్టు ఆమోదంలేకుండా ఆతడు దేశం విడిచి వెళ్లకూడదన్నారు. అల్హాబాదియా కానీ ఆతడి స్నేహితులు కానీ తదుపరి ఆదేశాలు వచ్చేవరకూ ఏ ప్రదర్శన చేయకూడదన్నారు. ఎఫ్ఐఆర్‌లు నమోదయిన మహారాష్ట్ర, అస్సాం పోలీసులకు అల్హాబాదియా సహకరించాలని ఆదేశించింది.

# షిండే వర్గం ఎమ్మెల్యేల భద్రత కుదింపుపై రేగుతున్న అసమ్మతి

### మహాయుతిలో కమ్ముకుంటున్న నిరసన



**ముంబయి, ఫిబ్రవరి 18:** మహారాష్ట్రలో మహాయుతి రాజకీయాలు గందరగోళంగా మారాయి. సిఎం దేవేంద్ర ఫడ్నవిస్ నేతృత్వంలోని హోం శాఖ 20 మంది అధికార ఎమ్మెల్యేల వైకేటగిరీ భద్రతను కుదించేందుకు సిద్ధం కావడంతో షిండేవర్గం కారాలు మిరియాలు నూరుతోంది. డిప్యూటి సిఎం ఏక్‌నాథ్‌షిండేకు చెందిన శివసేన 20 మంది ఎమ్మెల్యేల వైకేటగిరీ సెక్యూరిటీని ఉపసంహరించింది. బిజెపి అజిత్‌పవార్ వర్గం ఎమ్మెల్యేలకు కూడా భద్రతను తగ్గించనున్నారు. అయితే శిండేవర్గంతోపోలిస్తే ఆసంఖ్య చాలా తక్కువ అని పార్టీ వర్గాలు తెలిపాయి. రాష్ట్ర వనరుల దుర్వినియోగాన్ని అరికట్టడంలో భాగంగా ప్రభుత్వం ఈచర్య తీసుకుంటున్నట్లు సమాచారం. గతంలో మహావికాస్ అఘాడి కూటమినుంచి అధికారపార్టీలోచేరిన ఎమ్మెల్యేలకు ఈ వైకేటగిరీ భద్రతను కల్పించారు. తాజాగా ఈభద్రతను తొలగించేందుకు సిద్ధం అయ్యారని ఆరోపిస్తున్నారు. 3నెలల కిందటే మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో మహాయుతి కూటమి ఘనవిజయం సాధించిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత సిఎం అభ్యర్థి ఎంపికలో విభేదాలు నెలకొన్నప్పటికీ వాటన్నింటికీ చెక్ పెడుతూ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసారు. ఇటీవల ఇన్‌ఛార్జి మంత్రుల నియామకంలోనూ అధికార కూటమిలో విభేదాలు తలెత్తాయి. రాయ్‌గఢ్, నాసిక్‌లకు ఇన్‌ఛార్జిల నియామకంపై శిండేసేన అభ్యంతరం తెలపడంతో వాటికిబ్రేక్‌పడింది. ఈ పరిణామాలవేళ శిండే నేతృత్వంలోని ఎమ్మెల్యేలకు భద్రతను కుదించాలని నిర్ణయించడం ఇపుడు విమర్శలకు తావిస్తోంది.



## రన్‌వేపై తిరగబడిన విమానం

### 18 మందికి తీవ్ర గాయాలు, ముగ్గురు పరిస్థితి విషమం

**టొరంటో, ఫిబ్రవరి 18:** కెనడాలో అనూహ్యరీతిన చోటుచేసుకున్న విమాన ప్రమాదం ప్రయాణీకులను భయానికి గురిచేసింది. టొరంటో పియర్సన్ అంతర్జాతీయ విమానాశ్రయంలో పెను ప్రమాదం తప్పిందనే చెప్పాలి. విమానం ల్యాండ్ అయినతర్వాత రన్‌వేపై అదుపు తప్పి బోల్తాపడింది. దీనితో 18 మందికి తీవ్ర గాయాలయ్యాయి. ముగ్గురిపరిస్థితి విషమంగా ఉందని అధికారులు తెలిపారు. ప్రమాద సమయంలో విమానంలో 80 మంది ప్రయాణీకులున్నారు. వెంటనే అప్రమత్తం అయిన భద్రతా సిబ్బంది రక్షణ చర్యలుచేపట్టారు. క్షతగాత్రులను దగ్గరలోని దవాఖానకు తరలించారు. డెల్టా ఎయిర్ లైన్స్‌కు చెందిన విమానం అమెరికాలోని మిన్నెపోలీస్‌నుంచి టొరంటోకు వచ్చింది. పియర్సన్ ఎయిర్‌పోర్టులో రన్‌వేపై దిగిన విమానం అదుపు తప్పి బోల్తాపడిందని అధికారులు చెప్పారు.

# కార్యకర్తల మృతికి ప్రతీకారం తీర్చుకుంటా!

### బంగ్లా మాజీ ప్రధాని షేక్ హసీనా



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18:** బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ అధినేత మహ్మద్‌యూనస్ ఓఉగ్రవాది అంటూ ఆదేశ మాజీ ప్రధాని షేక్ హసీనా ఘాటు విమర్శలుచేసారు. అవామీ లీగ్ పార్టీ కార్యకర్తలు ఏర్పాటుచేసిన ఒక బహిరంగ కార్యక్రమంలో హసీనా జూమ్‌కాల్‌ద్వారా కనిపించారు. ఆమె మాట్లాడుతూ కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని, తాను బంగ్లాకు తిరిగివస్తానని, పార్టీ కార్యకర్తల మరణాలకు ప్రతీకారం తీర్చుకుంటానని ప్రతిజ్ఞచేసారు. అవామి లీగ్ పార్టీ నాయకులు ఓపిగ్గా ఐక్యంగా ఉండాలి. నా దేశానికి తిరిగి వస్తా, పార్టీ కార్యకర్తల మృతికి ప్రతీకారం తీర్చుకుంటా. గతంలో మాదిరిగానే అందరికీ న్యాయంచేస్తా. జులై ఆగస్టుల్లో జరిగిన నిరసనల్లో మరణించినవారు పోలీసుల కాల్పులకారణంగా చనిపోలేదు. ఇపుడు పోస్టుమార్టం నిర్వహిస్తే నిజాలు వెలుగులోకి వస్తాయి. విద్యార్థులు చేసిన ఆందోళనలకు అనేకమంది పోలీసులు అవామి లీగ్ కార్యకర్తలు, విద్యావంతులు, కళాకారులు హత్యకు గురయ్యారు. అయినా యూనస్ వారిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ఆమెప్రశ్నించారు. దేశాన్ని నడపడంలో తనకు ఎలాంటి అనుభవం లేదని గతంలోనే ఆయన అంగీకరించారు. అన్ని విచారణ కమిటీలను రద్దుచేసి దేశాన్ని నాశనంచేస్తున్నారని ప్రభుత్వ కార్యాలయాలపై అధికారులపై దాడులుచేయడం యూనస్ అసమర్థతకు నిదర్శనమన్నారు. ప్రణాళికతోనే నాతండ్రి నివాసాన్ని నాశనం చేసారని, మధ్యంతర ప్రభుత్వం ఏర్పడి ఇన్ని నెలలు గడుస్తున్నా అల్లర్లు ఆగలేదని అన్నారు. దేశ ఆర్థికవ్యవస్థ సంక్షోభంలో ఉంది. శాంతి భద్రతలు క్షీణిస్తున్నాయని ప్రజల భద్రత ప్రమాదంలో ఉందని,ఈ ఉగ్రవాద ప్రభుత్వాన్ని తరిమికొట్టాలని ఆమె అన్నారు.

ఈసందర్భంగా ఆందోళనల్లో మృతిచెందిన పలువురు పోలీసుల కుటుంబాలతో హసీనా మాట్లాడారు. బంగ్లాదేశ్‌లో రిజర్వేషన్లకు వ్యతిరేకంగా చోటుచేసుకున్న ఆందోళనకర పరిస్థితుల నేపథ్యంలో గత ఏడాది ఆగస్టు 5న దేశం వీడిన షేక్ హసీనా భారత్‌లోఆశ్రయం పొందుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో హసీనాతోపాటు ఆమె మంత్రివర్గంలో ఉన్న నేతలు సలహాదారులు సైనికాధికారులపై నేరారోపణలు నమోదయ్యాయి. ఈ క్రమంలో ఢాకా కేంద్రంగా ఉన్న ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రిబ్యునల్ ఇప్పటికే ఆమెకు అరెస్టువారంట్ జారీచేసింది. మరోవైపు యూనస్ సర్కారు ఆపరేషన్ డెవిల్‌హంట్‌ను ప్రారంభించింది. దేశాన్ని అస్థిరపరిచే కుట్రదారులను చట్ట ఉల్లంఘనలకు పాల్పడేవారే లక్ష్యంగా ఈ ఆపరేషన్‌చేస్తున్నట్లు బంగ్లాదేశ్ హోంమంత్రి తెలిపారు. హసీనా ప్రభుత్వంలో పనిచేసిన 41 మంది పోలీస్ అధికారులను ముందురోజే బంగ్లాప్రభుత్వం అరెస్టుచేసింది. విద్యార్థుల ఆందోళన సమయంలో వారిని అణిచివేశారంటూ 1059 మంది పోలీస్ అధికారులను సిబ్బందిని ఉద్యోగాలనుంచి తొలగించింది.

# కేన్సర్ చికిత్సకు ఐదారునెలల్లో టీకా

### కేంద్రమంత్రి ప్రతాప్‌రావ్ జాదవ్



**ఛత్రపతి శంభాజీనగర్, ఫిబ్రవరి 18:** మహిళల్ని తీవ్రంగా ప్రభావితంచేస్తున్న క్యాన్సర్లను ఎదుర్కొనేందుకు ఐదారునెలల్లో టీకా అందుబాటులోకి వస్తుందని కేంద్ర వైద్యఆరోగ్యశాఖ సహాయ మంత్రి ప్రతాప్‌రావ్‌జాదవ్ వెల్లడించారు. ఈ టీకా వేసుకునేందుకు తొమ్మిదినుంచి 16 ఏళ్లలోపు వయసు ఉన్న బాలికలు మాత్రమే అర్హులని స్పష్టంచేసారు. ఈ టీకాపై పరిశోధనలు దాదాపు పూర్తికావచ్చాయని ట్రయల్స్ కొనసాగుతున్నాయన్నారు. మంగళవారం ఆయన ఛత్రపతి శంభాజీనగర్‌లో మీడియాతో మాట్లాడారు. దేశంలో కేన్సర్ రోగుల సంఖ్య పెరుగుతోంది, ఈ సమస్య పరిష్కరించేందుకు కేంద్రం చర్యలుచేపట్టిందన్నారు. 30 ఏళ్లు పైబడిన మహిళలకు ఆసుపత్రుల్లో స్క్రీనింగ్ నిర్వహిస్తారని, ఈవ్యాధిని ముందుగా గుర్తించేందుకు డేకేర్ కేన్సర్ కేంద్రాలు కూడా ఏర్పాటుచేస్తున్నామని అన్నారు. ఈ టీకా రొమ్ము నోటి గర్భాశయ కేన్సర్లను నియంత్రిస్తుందని మంత్రి జాదవ్ తెలిపారు. ఆసుపత్రుల్లో ఆయుష్ విభాగాలున్నాయని ప్రజలు ఈసౌకర్యాలను పొందవచ్చన్నారు.

19-2Pg6exHMNWJQE.qxd:19-2Pg6exHMNWJQE.qxd 01/01/01 9:38 AM Page 1





ప్రయాగరాజ్ మహాకుంభమేళాలో గంగానదిలో స్నానాలు చేస్తున్న రఘురామ,బిటెక్ రవి తదితరులు

# పులివెందులకు బై ఎలక్షన్లు వస్తే ఇన్‌చార్జీగా వెళ్తా: రఘురామ

**విజయవాడ.ఫిబ్రవరి18,ప్రభాతవార్తప్రతినిధి:** పులివెందులకు ఉప ఎన్నిక వస్తే బాగుంటుందని అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆ మేరకు ఒక వీడియో ట్రెండవుతుందది.ఆ ఎన్నికలకు తానే ఇన్‌చార్జీగా వెళ్తానని రఘురామ వ్యాఖ్యానించారు. ఉత్తరప్రదేశ్ లోని ప్రయాగరాజ్ మహాకుంభమేళాలో శాసనమండలి మాజీ సభ్యుడు, పులివెందుల నియోజకవర్గం టీడీపీ ఇన్‌ఛార్జ్‌గా ఉన్న మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి (బీటెక్ రవి) పుణ్యస్నానాలు చేశారు. త్రివేణి సంగమం షాహి స్నానఘట్టంలో సంప్రదాయ బద్ధంగా స్నానాన్ని ఆచరించారు. అనంతరం, గంగాదేవికి పూజలు చేసి, హారతి ఇచ్చారు.ఈ సందర్భంగా అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పులివెందులకు బై ఎలక్షన్ రావాలని బీటెక్ రవితో అన్నారు.

అందుకు స్పందించిన బీటెక్ రవి బై ఎలక్షన్ వస్తే ఇన్‌ఛార్జ్‌గా మీరే ఉంటారని రఘురామ కృష్ణరాజుతో అన్నారు. నేనే వస్తా అని రఘురామకృష్ణరాజు బీటెక్ రవితో చెప్పాడు. ఇప్పుడు ఈ చర్చ రాజకీయాలలో ఆసక్తికరంగా మారింది. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.



శ్రీకాళహస్తిలో పనులను పరిశీలిస్తున్న రాష్ట్ర దేవాదాయశాఖ ప్రధాన కార్యదర్శి వినయ్‌చంద్, కమిషనర్ రామచంద్రమోహన్ తదితరులు

# శివరాత్రి ఏర్పాట్లు భేష్: వినయ్‌చంద్

**శ్రీకాళహస్తి,ఫిబ్రవరి18 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వ రాలయంలో నిర్వహించే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఈ నెల 21నుంచి మార్చి 6వ రకు నిర్వహించనున్నారు.ఈ ఏడాది శివరాత్రి బ్రహ్మోత్సవాలను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించుటకు శాసనసభ్యుడు బొజ్జల వెం కట సుధీర్‌రెడ్డి పరుగులు తీస్తున్నారు. గత 20 రోజులుగా మంత్రులు ఉన్నతాధికారులు సమీక్షిస్తున్నారు.ఈ నేపథ్యంలో మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వినయ్‌చంద్ దేవాదాయశాఖ కమిషనర్ రామచంద్రమోహన్, దేవాదాయశాఖ ఆర్‌జెసి ఆజాద్ ఆలయ ఇఓ డి. బాపిరెడ్డి,ఇఇ మురళీధర్‌రెడ్డి, డెప్యూటీ ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి,ఎఇఓ లోకేష్‌రెడ్డి, విద్యా సాగర్‌రెడ్డి,ఎఇఇ కిషోర్‌లు వెంటరాగా అడు గడుగునా క్షుణ్ణంగా పరిశీలించారు. ముఖ్యంగా ఆలయం లోని క్యూలైన్లను పరిశీలించారు.దక్షిణ గోపురం నుంచి ప్రవేశించే వివిఐపిల క్యూలైన్లను పరిశీలించారు.అలాగే నాల్గవ గేటు,మూడవ గేటు అటు ఇటు ఏర్పాటు చేస్తున్న పార్కింగ్‌కు బిటి రోడ్లును అలాగే రామమందిరం నుంచి నాల్గవ గేటు వరకు వెడల్పు చేసిన సిమెంటు రోడ్లును ఉన్నతాధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు.

**షెడ్డులు అద్భుతం:** శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు చేపట్టిన ఏర్పాట్లును పరిశీలించిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వినయ్‌చంద్,దేవాదాయశాఖ కమిషనర్ రామచంద్రమోహన్ సాంస్కృతిక కార్యక్రమాల షెడ్డును అలాగే భవిష్యత్తులు ఏర్పాటు చేయనున్న వివిధ కౌంటర్లకు సంబంధించిన షెడ్డులను చూసి ఇఓ బాపిరెడ్డి చొరవను, అలాగే ఇంజనీరింగ్‌శాఖ ప్లానింగ్‌ను అభినందించారు.అలాగే రాజగోపురంలో చేపట్టిన సుందరీకరణను పరిశీలించారు.2017లో రాజ గోపురం నిర్మాణం పూర్తి అయితే సుందరీకరణ ప్రశ్నార్థకంగా మారింది. గతంలో ఎన్నడూ లేని విధంగా రాజగోపురం చుట్టు అందాల హరివిల్లుగా పచ్చిక బయళ్ళు, రక రకాల పూల చెట్లు భక్తులను ఆకర్షించే విదంగా తీర్చిదిద్దిన వైనాన్ని చూసిన అధికారులు ఇంజనీరింగ్ సేవలను అభినందించారు. తరువాత వాహనాల మండపం ఎదురుగా నిలబెట్టిన స్వామి వారి రథాన్ని తేరు వీధిని పరిశీలించారు అక్కడ నుంచి బిక్షాల గాలి గోపురం నుంచి ప్రవేశించి రంగుల గోపురం వద్ద నుంచి ఉన్న క్యూలైన్లను తనిఖీ చేసారు. ఈ సందర్భంగా రాజగోపురం పక్కనే ఓ ప్రైవేటు వ్యక్తి బోర్డును చూసి మధ్యలో ఆయనకు ఎలా స్థలం వచ్చిందని ప్రశ్నించారు. అలాగే సన్నిధి వీదిలోని ఓ లాడ్జికి సంబంధించి ఇఓ బాపిరెడ్డిని వివరాలు అడిగారు. శివరాత్రి సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తగా వ్యవహారించాలని ఇఓకు సూచించారు.నాలుగు గోపురాలను పరిశీలించిన ఉన్నతాధికారులకు గతంలో ప్రవేశం బిక్షాల గాలిగోపురం నుంచే ఉండేవని వివరించారు. కాలక్రమేణ మారిందని వివరించారు.

శ్రీకాళహస్తి అప్రదక్షిణ దివ్యక్షేత్రం కాబట్టి బిక్షాల గాలిగోపురం నుంచి ప్రవేశించాలని స్థానిక ఆచారం చెబుతుందని ఉన్నతాధికారులకు వివరించారు.

# అక్రమ మైనింగ్‌తో కోట్లాది రూపాయలు లూటీ

## ఇప్పటికీ తేల్చని మైనింగ్, రెవెన్యూ అధికారులు

## తెరపైకి వచ్చిన వాస్తవ పట్టాదారులు

## దోపిడి చేసిన కోట్లాది రూపాయలు రివకరీ చేయడం ఎలా!

**చిత్తూరు, శ్రీరంగరాజపురం, ఫిబ్రవరి 18 ప్రభాత వార్త:** శ్రీరంగరాజపురం పద్మాపురం గ్రామ లెక్క దాఖలులో జరుగుతున్న మైనింగ్ పనులు అక్రమం అని మంగళవారం మైనింగ్, రెవెన్యూ, పోలీసు అధికారులు నిర్ధారించారు. అయితే ఇప్పటికే ఈ మైనింగ్ నుండి సుమారు 8 కోట్ల రూపాయల వరకు క్వారీ రాళ్ళను అక్రమార్కులు దర్జాగా మైనింగ్, రెవెన్యూ, పోలీసు అధికారులకు తెలిసి దోపిడి చేసుకెళ్ళిపోయారు. పద్మాపురం గ్రామ లెక్కదాఖలులో మైనింగ్ అక్రమంగా జరుగుతుందని 'ప్రభాతవార్త' గత ఆరు నెలలుగా ప్రచురిస్తూ వస్తోంది. అయితే ఈ వ్యవహారంపై ఇటు మైనింగ్ అధికారులు, అటు రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదు. ఈ క్రమంలో వాస్తవ భూమి హక్కుదారులైన వ్యక్తులు కోర్టును ఆశ్రయించగా కోర్టు ఆదేశాల మేరకు సర్వే నిర్వహించడానికి మైనింగ్, రెవెన్యూ, పోలీసు అధికారులు మంగళవారం రంగంలోకి దిగారు. ఈ మేరకు కార్వేటినగరం సర్కిల్ ఇన్స్‌పెక్టర్ హనుమంతప్ప, తహసిల్దారు లోకనాధపిళ్ళై, ఎస్ఐ సుమన్‌లతో పాటు మైనింగ్ సర్వేయర్లు మంగళవారం క్షేత్ర స్థాయికి చేరుకుని సర్వే నిర్వహించారు. ఈ సర్వేలో పిల్లిగుండ్లపల్లి గ్రామంకు చెందిన గుణశేఖర్‌నాయుడు భార్య మోహనమ్మకి పట్టా వుండటంతో కొలిచి ఆమె భూమిని చూపారు. మోహనమ్మ పట్టా భూమిలో కొద్ది భాగం మైనింగ్ ఇప్పటికే చేసి పూర్తి చేసినట్లు తెలింది. మరోవైపు భానుప్రతాప్ ఈ క్వారీకి సంబంధించి గత ఏడాది నవంబర్ 26వ తేదీ లీజు తెచ్చుకున్నాడు. అయితే ఇప్పటికీ వర్క్ ఆర్డర్ తీసుకోలేదు. భానుప్రతాప్‌కు ఇచ్చిన లీజులో ఈ భూమి వుండటంతో ఇకపై ఇతను క్వారీ చేసే అవకాశం కన్పిస్తోంది. ఇప్పటి వరకు అనధికారికంగా ఎలాంటి అనుమతులు లేకుండా గత ఏడాది జూన్ నెల నుండి ఈ క్వారీలో మైనింగ్ చేసి కోట్లాది రూపాయల విలువైన గ్రానైట్ రాళ్ళను అనధికారికంగా తీసుకెళ్ళిపోయారు.

ఈ క్రమంలో అనధికారికంగా గ్రానైట్ రాళ్ళను తీసుకెళ్ళి కోట్లాది రూపాయలు ఆర్జించిన వారిపై రెవెన్యూ, మైనింగ్, పోలీసు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారనే విషయంపై ప్రస్తుతం శ్రీరంగరాజపురం మండలంలో చర్చ జరుగుతుంది.



అక్రమ మైనింగ్‌ను పరిశీలించి సర్వే నిర్వహిస్తున్న రెవెన్యూ, పోలీసు, మైనింగ్ అధికారులు

# భక్తులకు సుదర్శనమే లక్ష్యంగా ఏర్పాట్లు

**ప్రభాతవార్త -శ్రీకాళహస్తి**

'శివభక్తులకు శివరాత్రి పర్వదినాన సుదర్శనం-సత్వర దర్శనం లక్ష్యంగా ఏర్పాట్లు' చేపట్టామని ఆలయ ఇఓ డి.బాపిరెడ్డి వివరించారు. ఈ నెల 21 నుంచి ప్రారంభమయ్యే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు సంబంధించి ప్రభాతవార్తకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఇలా తెలిపారు.



ఇఓ డి.బాపిరాజు

**ప్ర.వా: ఈ యేడాది శివరాత్రి బ్రహ్మోత్సవాల బడ్జెట్ ఎంత?**

ఇఓ: బడ్జెట్ ఎంత అయినా భక్తులు మెచ్చేరీతిలో ఉత్సవాలు నిర్వహణకే ప్రాధాన్యత ఇచ్చాము

**ప్ర.వా: కొత్తగా బాధ్యతలు స్వీకరించిన మీరు తొలిసారి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. మీ స్పందన ఏమిటి?**

ఇఓ: ఇది తనకు శ్రీజ్ఞాన ప్రసూనాంబ అమ్మవారు వాయులింగేశ్వరుడు ఇచ్చిన మహాదవకాశం. దక్షిణకైలాసంలో తొలిసారి ఉత్సవాల్ని నిర్వహించటం తనకు భోళాశంకరుడు అదించారు.ఇంత కన్నా నాకు సంతృప్తి ఏముంటుంది? ఇది నా పూర్వ జన్మసుకృతంగా భావిస్తున్నాను.నేను బాధ్యతలు చేపట్టి 2 నెలలు మాత్రమే.నేను ఏదో చేస్తాను అనే కన్నా నేను ఏమి చేసానో మీరు గుర్తించి ప్రజలకు తెలియజేయాలి.

**ప్ర.వా: ఈ యేడాది ఉత్సవాల్లో ప్రత్యేకతలేమిటి?**

ఇఓ: ఒకటేమిటి? ఈ ఏడాది శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భక్తులకు అన్ని కొత్త దనాలే, స్థానిక శాసనసభ్యులు సుధీర్‌రెడ్డి చొరవతో ఆలయంలో అద్భుతమైన అలంకరణలు, బంగారు సొబగులు ఇక ఉత్సవాలకు పది రోజుల పాటు స్వామి అమ్మవార్ల వాహనాలు బంగారుమయం. స్వామిఅమ్మవార్లకు ఏడువారాల నగల అలంకారాలతో కనువిందు.

**ప్ర.వా: దర్శనాలకు తీసుకున్న నిర్ణయాలేమిటి?**

ఇఓ: ఏ నిర్ణయం తాను స్వతహాగా తీసుకోలేదు. అన్ని రాష్ట్ర మంత్రులు స్థానిక నాయకులు, ఉన్నతాధికారుల దృష్టికి తెచ్చి నిర్ణయాలు తీసుకున్నాము.

**ప్ర.వా: దర్శనాలకు సంబంధించి నిర్ణయాలేమిటి?**

ఇఓ: దర్శనాలకు సంబంధించి సిబ్బంది గతానుభవాల్ని దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర మంత్రులు సూచనల మేరకు వచ్చిన ప్రతిభక్తునికి సుదర్శనం, సత్వర దర్శనం కోసం మహాశివరాత్రి పర్వదినాన 'మహాలఘుదర్శనం' ఏర్పాటు చేశాము. దీనిపై కొన్ని సూచనలు వచ్చాయి. అయితే తప్పక స్వామి విగ్రహం కనబడుతుంది. గతంలో ఎన్నడూలేని విధంగా ఈ ఏడాది సామా న్య భక్తులకు,ఉచిత దర్శనం కోరుకునే వారికి ప్రాధాన్యత ఇచ్చాం. రెండు క్యూలైన్లను ఏర్పాటు చేసాం.

**ప్ర.వా: లింగోద్భవ దర్శనానికి ప్రతి ఏడాది గందరగోళం కదా?**

ఇఓ: అందుకే ఈ ఏడాది ఎలాంటి గందరగోళం లేకుండా స్పష్టమైన చర్యలు తీసుకుంటున్నాం. మూడు క్యూలైన్లలో కూడా భక్తుల్ని అనుమతిస్తాం. కాబట్టి ఎలాంటి ఇబ్బంది ఉండదు.

**ప్ర.వా: భద్రత విషయంలో తీసుకున్న చర్యలేమిటి?**

ఇఓ: ఈ ఏడాది ప్రతి భక్తుడు ఓ నిఘా నేత్రంగా ఉంటారు. ప్రత్యేక భద్రత ఎందుకు? అయితే భద్రతకు సంబంధించి సాక్షాత్తు రాష్ట్ర హోం శాఖ మంత్రే పోలీసు ఉన్నతాధికారులు స్థానిక అధికారులకు ప్రత్యేక సూచనలిచ్చారు.

**ప్ర.వా: ఎంత మంది భక్తులు వస్తారనుకుంటున్నారు? సదుపాయాలేమిటి?**

ఇఓ: గత ఏడాది సుమారు రెండు లక్షల మంది భక్తులు దర్శనం చేసుకొని ఉంటారని అంచనా. ఈ ఏడాది జిల్లా కలెక్టర్ ఆదేశాలతో రెండున్నర లక్షల మంది భక్తులు వచ్చినా ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నావం.

**ప్ర.వా: భక్తులకు బస,వసతుల మాటేమిటి?**

ఇఓ: భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా బస సదుపాయాలు కల్పిస్తున్నాము. లోబావిలో టిటిడి నిర్మించిన డార్మెంటరీల్లో రాజగోపురం పక్కన రెండు పెద్ద షెడ్లులలో బస కల్పిస్తున్నాము. అక్కడ బస చేసే వారికి ఉచిత బస్సులు, అల్పాహారం అందిస్తాం.

**ప్ర:వా: అలంకారాల మాటేమిటి?**

ఇఓ: ఈ ఏడాది అలంకారాలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చాం. గతంలో కన్నా భిన్నంగా విద్యుత్ దీపాలంకారాలు ఏర్పాటు చేశాం.ఈ ఏడాది శాశ్వత విద్యుత్ దీకరణను చేపట్టాం. ఈ ఏడాది భరద్వాజ తీర్థం, సన్నిధివీధి, నాలుగుమాడావీధుల్లో కూడా విద్యుత్ దీపాలంకరణ చేపట్టాం.

**ప్ర.వా: ఉత్సవాల్లో ప్రత్యేకత ఏమిటి?**

ఇఓ: సమయపాలన. ప్రతి ఒక్కరురాత్రి ఉత్సవం తిలకించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నాం

**ప్ర.వా: క్యూలైన్లలో ఏర్పాట్లు ఏమిటి?**

ఇఓ: ఒక నెల రోజుల నుంచి తమ ఇంజనీరింగ్ సిబ్బంది స్థానికనాయకులు కమిషనర్ సూచనల మేరకు ఏర్పాట్లు చేపట్టామన్నారు.శివరాత్రి బ్రహ్మోత్సవాలకు ప్రతి ఒక్కరు కృషి చేస్తేనే విజయం సాధిస్తాం.

**ప్ర.వా: తీసుకున్న నిర్ణయాల్లో సహచరుల స్పందన ఏమిటి?**

ఇ.ఓ: తన సిబ్బందితోనూ స్థానిక ప్రజాప్రతినిధితో తరచూ చర్చలు జరుపుతూ ఏర్పాట్లు చేపట్టాము.ఎప్పటి కప్పుడు ఆలయంలోని సమాచారాన్ని తెలుసుకొనుటకు వాకి టాకిలను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. అలాగే భక్తులకు ఎలాంటి ఇబ్బంది కల్గకుండా ఆలయంలో అడుగడుగునా సిసి కెమెరాల్ని ఏర్పాటు చేశాం. వచ్చిన భక్తులు మళ్లీ మళ్లీ వచ్చే విధంగా ఏర్పాట్లు చేశాం.

**ప్ర.వా: క్యూలైన్ల ఏర్పాటు ఎలా ఉంటుంది?**

ఇ.ఓ: ఆలయానికి వచ్చే స్థానిక,స్థానికేతర భక్తులకు సుదర్శనం కల్గించేందుకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశాం. రాబోవు రోజుల్లో భక్తుల సంఖ్య గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో కొత్తగా ఏర్పాటు చేసే క్యూలైన్లు ఎంతగానో ఉపయోగపడతాయి. వృద్ధులు వికలాంగులు, బిడ్డల తల్లులకు మాత్రం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం.

**ప్ర.వా: ప్రసాదాల మాటేమిటి?:-**

ఇఓ: దేవాలయానికి వచ్చే భక్తులకు ఉచిత ప్రసాదాలతో పాటు దేవస్థానం విక్రయించే ప్రసాదాలు విరివిగా లభించుటకు ఏర్పాట్లు చేసామన్నారు. రెండున్నరలక్షల మంది భక్తులకు సరిపడా లడ్డూ,వడ,పులిహోర ప్రసాదాల తయారికి నిర్ణయించామన్నారు. క్యూలైన్లలో పసిబిడ్డలకు పాలను సరఫరా చేస్తామన్నారు. అలాగే ఎక్కడా భక్తులు మంచినీటికి ఇబ్బంది పడకుండా మంచినీళ్ళ బాటిల్స్‌ను ఏర్పాట్లు చేస్తున్నాము. ప్రసాదాల విక్రయాలకు అదనంగా నాలుగు గోపురాల వద్ద నాలుగు కౌంటర్లు ఏర్పాటు చేసాము. మొక్కులు మొక్కుకున్న వారికి దక్షిణ గోపురం వద్ద గల స్తుపథ మండపం ఎంతో ఉపయోగపడుతోంది.

**ప్ర.వా: పార్కింగ్ మాటేమిటి?**

ఇఓ: పార్కింగ్‌కు ఇబ్బంది లేదు. సన్నిధివీధిలో రోడ్లన్ని వెడల్పు చేసాము. సన్నిధివీధిలోనే మూడు చోటన్ల పార్కింగ్ ఏర్పాటు చేసాము. ఉన్నతంలో వచ్చే వాహనాలను పార్కింగ్‌కు జలవినాయకుని సమీపంలోని పార్కింగ్ కేంద్రాల వద్ద, జ్ఞాన ప్రసూనాంబ అతిధి గృహం పక్కన,టూరిస్టుబస్టాండు వద్ద లోబావిలో అవకాశం కల్పించాం.

**ప్ర.వా: భక్తులకు భోజన సదుపాయాలు కల్పించారా?**

ఇఓ: వచ్చే నిరుపేద భక్తులకు అన్నదానంలో అవకాశం కల్పించుటకు 13రోజుల పాటు రెండువేల మందికిపైగా భోజన సదుపాయం కల్పిస్తున్నాం. ఇక శివరాత్రి జనజాగరణ రోజు పది వేల మందికి భోజన వసతి కల్పించనున్నాము.

**ప్ర.వా: పారిశుద్ధ్యంకు ఏం చర్యలు తీసుకున్నారు?**

ఇఓ: జిల్లా కలెక్టర్ ఆదేశాలతో చర్యలు తీసుకున్నాము. ఇప్పటికే పట్టణంలో నాలుగుమాడా వీధుల పరిశుభ్రతకు స్వీపర్లును నియమించుకున్నామని అంతేకాక శివరాత్రికి మరి కొందరిని ప్రత్యేకంగా నియమించాం. అలాగే మున్సిపల్ అధికారులతో సమన్వయంతో పనులు చేపడుతున్నాము. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ప్రత్యేక స్నానఘట్టాలు,మరుగుదొడ్లు ఏర్పాటు చేసాము. ఇక భక్తులు వచ్చి స్వామి అమ్మవార్ల కృపకు పాత్రులు కావాలి.

# నదుల అనుసంధానంతో సంపదసృష్టి

## సమర్ధ నీటి వినియోగంతో రాష్ట్రం సస్యశ్యామలం: అఖిల భారత ఇరిగేషన్ మంత్రుల సమావేశంలో మంత్రి నిమ్మల

**విజయవాడ,ఫిబ్రవరి18,ప్రభాతవార్తప్రతినిధి:** నదుల అనుసంధానం, నీటి వనరుల సమర్ధ సద్వినియోగంతో రాష్ట్రంలో సిరిసంపదలు సృష్టించవచ్చునే ప్రగాఢ విశ్వాసంతో ముందుకు వెళుతున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు చెప్పారు. రాజస్థాన్లోని ఉదయపూర్‌లో అఖిల భారత స్థాయిలో జరుగుతున్న 2వ రాష్ట్రాల ఇరిగేషన్ మంత్రుల మొదటి రోజు సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రఖ్యాత ఇంజనీర్ కేఎల్ రావు ఏనాడో చెప్పిన నదుల అనుసంధాన ప్రక్రియకు ప్రధాని మోదీ, ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడుల సమర్ధ నాయకత్వంలో మా రాష్ట్రంలో శ్రీకారం చుట్టామన్నారు. విభజిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నాలుగు కోట్ల ఎకరాలు భూవిస్తీర్ణం ఉండగా అందులో రెండు కోట్ల ఎకరాలు వ్యవసాయ యోగ్యంగా ఉందని చెప్పారు. రెండు కోట్ల ఎకరాల విస్తీర్ణంలో కోటి ఎకరాలకు ఇంకా నీటి వసతి కల్పించాల్సి ఉందన్నారు. ప్రతి ఎకరాకు నీరు అందించి రాష్ట్రాన్ని కరవురహిత ప్రాంతంగా చేయాలనే గమ్యంగా పెట్టుకున్నట్లు. రామానాయుడు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ జల చిత్రాన్ని ఆయన వీడియో రూపంలో అద్భుతంగా ఆవిష్కరించారు.అందులో ఆంధ్రప్రదేశ్‌లోని నీటి వనరులు, చేపడుతున్న సాగునీటి ప్రాజెక్టులు, జరుగుతున్న పనులు స్పష్టంగా వివరించారు. వికసిత్ భారత్ 2047లో భాగంగా జల సంరక్షణ అంశాలపై రాష్ట్రంలో చేపట్టబోయే పనులను కూడా ఈసందర్భంగా ప్రస్తావించారు. దేశంలోనే మొదటి సారిగా 2017లో ఎపి వారీమ్స్ టెక్నాలజీని ప్రవేశపెట్టి, రియల్ టైం గవర్నెన్స్ ద్వారా వాటర్ మేనేజ్మెంట్ చేసి సమర్ధ నీటి వినియోగాన్ని చంద్రబాబు తీసుకొచ్చారని తెలిపారు. ఈ టెక్నాలజీ ఉపయోగించడం ద్వారా గతంలో కంటే ఈ ఏడాది రిజర్వాయర్లలో అదనంగా 53శాతం, నీటి నిల్వ చేయగలిగామని వివరించారు. స్వర్ణాంధ్ర 2047లో భాగంగా అమలులోకి తీసుకొచ్చిన వాటర్ పాలసీ ద్వారా భూగర్భ జలాలు పెంపొందించడం, డ్రిప్, పైప్డ్ ఇరిగేషన్‌ను ప్రోత్సహిస్తున్నామన్నారు.గోదావరి నదిపై నిర్మితమవుతున్న పోలవరం ప్రాజెక్టు అత్యంత విశిష్టమైనదిగా మంత్రి పేర్కొన్నారు. ప్రపంచంలోనే ఎక్కువ సామర్ధంతో అనగా 50 లక్షల క్యూసెక్కుల వరద డిశ్చార్జి సామర్ధంతో 1128 మీటర్ల పొడవైన స్పిల్ వే నిర్మించినట్టు మంత్రి స్పష్టం చేశారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తైతే కృష్ణ, గోదావరి డెల్టాల స్థిరీకరణ జరుగుతుందని, సుస్థిర వ్యవసాయం సాధ్య పడుతుందని ఆయన పేర్కొన్నారు. తద్వారా రాష్ట్ర దశ,దిశ మారగలదన్నారు. రాష్ట్రంలోని సాగు, తాగు, పారిశ్రామిక అవసారాల కోసం మరో 85 ప్రాజెక్టులు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. ఆధునిక టెక్నాలజీ ఉపయోగించడంలో రాష్ట్రం అగ్రస్థానంలో ఉండడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు దిశా నిర్దేశమే కారణమని చెప్పారు. భూగర్భ జలాల్ని కొలిచేందుకు 1810 జియో మీటర్లు ఏర్పాటు చేశామని, దేశంలోనే తొలిసారిగా బోర్ వెల్స్‌కు కూడా జియో ట్యాగ్ చేసి వినియోగిస్తున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో జల సంరక్షణకు సంబందించి, నీటి పొదుపు, వృధాను అరికట్టడం వంటి చర్యలకు సంబందించి తీసుకుంటున్న చర్యలను గణాంకాలతో సహా వివరించారు. ఏపీలో ఉన్న ఐదు ప్రధాన నదులు, 35 మైనర్ నదులు నుంచి జలాలని గరిష్టంగా వినియోగించి రాయలసీమ లాంటి కరవ ప్రాంతాలకు నీటిని తరలించేలా కార్యాచరణ చేపడుతున్నట్టు వెల్లడించారు. రాష్ట్రంలోని జలవనరులు అభివృద్ధికి నీటి సంరక్షణకు, పొదుపు చర్యలకు ప్రాజెక్టుల నిర్మాణం త్వరితగతిన సాగేందుకు ప్రధాని మోధీ, కేంద్ర జలశక్తి మంత్రి సిఆర్ పాటిల్ అందిస్తున్న సహాకారం, ముఖ్యమంత్రి చంద్రబాబు చూపిస్తున్న చొరవకు, ఇస్తున్న ప్రోత్సాహకానికి రామానాయుడు కృతజ్ఞతలు తెలిపారు. పోలవరం బనకచర్ల లింక్ ప్రాజెక్టు, రాష్ట్రానికి సంబంధించన మరి కొన్ని ప్రతిపాదిత నీటిపారుదల ప్రాజెక్టులకు పూర్తి స్థాయిలో ఆర్దిక సహాకారంతో పాటు, అన్ని రకాల అనుమతులు ఇవ్వాలని వేదికపైనున్న కేంద్ర జలశక్తి మంత్రి సిఆర్ పాటిల్‌ను, ఉన్నతాధికారులను కోరారు.




రాష్ట్రాల జలవనరులశాఖా మంత్రుల సమావేశంలో మంత్రి డాక్టర్ నిమ్మలకు జ్ఞాపికను అందిస్తున్న దృశ్యం

# కిడ్నాప్‌కేసులో వంశీ బెయిల్ పిటిషన్ నేటికివాయిదా

**విజయవాడ,ఫిబ్రవరి18,ప్రభాతవార్తప్రతినిధి:** వంశీని కస్టడీకి ఇవ్వాలని కోరుతూ పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌పై న్యాయస్థానం విచారణ జరిపింది. ఈ పిటిషన్‌పై వంశీ తరఫు న్యాయవాదులు కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు వంశీకి ఎస్సీ, ఎస్టీ కోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ కేసుకు సంబంధించిన వివరాలు ఇంకా రాబట్టాల్సి ఉందని, 10 రోజుల కస్టడీకి కావాలని కోర్టులో పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. ఈ మూడు పిటిషన్లపై తదుపరి విచారణను బుధవారానికి వాయిదా వేసింది. ఇక కిడ్నాప్ కేసులో తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ వైఎస్సార్సీపీ నేత, గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ విజయవాడ ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిగింది. తనకు ఆరోగ్య కారణాలరీత్యా బ్యారక్‌లో బెడ్ ఏర్పాటు చేయాలని, ఇంటినుంచి ఆహారం తెచ్చుకునేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌పై విజయవాడ కోర్టు విచారణ జరిపింది. ఈ రెండు పిటిషన్లపై కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులను ఆదేశించింది.

# అదృశ్యమైన యూట్యూబ్ ఛానల్ రిపోర్టర్ శవమై తేలాడు

## హంద్రీనీవా కాలువలో కనిపించిన మృతదేహం, ఒంటిపై గాయాలను బట్టి హత్యగా నిర్ధారించిన పోలీసులు, ఇద్దరు వ్యక్తుల్ని అదుపులోకి తీసుకుని విచారణ, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలింపు

**గుంతకల్లు, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:** అనుమానాస్పదంగా అదృశ్యమైన యూట్యూబ్ ఛానల్ రిపోర్టర్ భోగాల తిరుమలరెడ్డి (45) మంగళవారం మధ్యాహ్నం హంద్రీనీవా కాలువలో శవమై తేలాడు. సోమవారం జరిగిన ఘటనా స్థలానికి కిలోమీటర్ దూరంలో మృతదేహం కనిపించింది. గుర్తించిన పోలీసులు మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుని ఒంటిపై వున్న గాయాలను బట్టి హత్యగా నిర్ధారించినట్లు పోలీసులు తెలిపారు. మృతుని భార్య కామేశ్వరి ఫిర్యాదు మేరకు ఇద్దరు వ్యక్తుల్ని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికలకు చెమటోడ్చుతున్న నాయకులు

## పోటీ ఇద్దరి మధ్యే.. కూటమి నేతలను భయపెడుతున్న గత అనుభవాలు

**ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా బ్యూరో ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:**ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎం.ఎల్.సి. ఎన్నికల్లో పట్టు సాధించి అఖండ విజయం సాధించి ప్రజలలో ప్రభుత్వం పై సానుకూల దృక్పథం ఉందని చాటాలని ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు ఆదేశాల మేరకు కూటమి నాయకులు ముఖ్యంగా టీడీపీ నాయకుల కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం విజయానికి తీవ్రంగా కష్టపడుతున్నారు. అధికార పార్టీ కదా హడావుడి ఉంటుంది అని కొందరు సామాన్య వ్యక్తులు అనుకుంటున్నా హడావిడి వెనుక భయం తొంగి చూస్తున్న సంగతి ఎలక్షన్ గురించి తెలిసిన వారికి తేటతెల్లం అవుతుంది.గత ఎలక్షన్ లో కూడా ఒక కార్పొరేట్ సంస్థకు చెందిన అధినేత తన అనుచరుల ద్వారా అధిక సంఖ్యలో కొత్త ఓటర్లను చేర్పించి వారిలో ఆశలు రేకెత్తించిన ఆయన విజ్ఞులైన ఓటర్ మహాశయా నిజాయితీగా సరైన అభ్యర్థిని ఎన్నుకోండి అని ప్రకటించి ఊరుకున్నారు.అయితే ఓటర్లలో అధిక శాతం ఉన్న నిరుద్యోగ యువత సదరు అభ్యర్థి నుండి ఏదో ఆశించి చివరకు ఏమీ లభించని కారణంగా కేవలం ఆయన పై కోపంతో అత్యధిక శాతం ఓటింగ్ జరిపి ఆయనను ఓడించారు.ఈ దఫా కూడా అధికార పార్టీ తరఫున పోటీ చేస్తూ అదే పొరపాటు చేసి అత్యధిక ఓటర్లను నమోదు చేయించి టెన్షన్ పడుతున్నట్లు కనపడుతుంది.పైకి మేక పోతు గాంభీర్యం ప్రదర్శిస్తూ గెలుపు తమదే అని కూటమి నేతలు బీరాలు పలుకుతున్నా. లోలోన ఆందోళన చెందుతూ అన్ని రకాల ప్రయత్నాలు సాగిస్తున్నారు.





అయితే ముందు ఎన్నికల్లో అనుభవాల దృష్ట్యా అధికార పార్టీ అభ్యర్థి ఎంత ప్రయత్నించిన వారు ప్రత్యర్థులు ఎంతమంది ఉన్న బలమైన అభ్యర్థి మాత్రం పి డి ఎఫ్ బల పరిచిన యూ.టి.ఎఫ్ అభ్యర్థి డి. వి .రాఘవులు అనే విషయం మరువరాదు. వారికి నిర్దిష్టమైన ఓట్ బ్యాంకు కలిగివుండటం ఎవరికి నెరవని ప్రలోభాలకు తలొగ్గని సైన్యం వారి సొంతం. దానికి తోడు ప్రభుత్వం వల్ల మొట్టమొదటి తీవ్రంగా నష్టపోయిన అత్యధిక ఓటర్లు వాలంటీర్లు రూపంలో పొంచి ఉన్న ప్రమాదం. వీరు విజ్ఞతతో తమ వ్యతిరేక ఓటు చీలిపోకుండా తమ కసిని కోపాన్ని ప్రదర్శించేందుకు మరో బలమైన అభ్యర్థికి సహకరించి ప్రభుత్వానికి తమ సత్తా చాటి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పడం కోసం ఎదురుచూడటం. అసంతృప్తి తో లోలోపల రగిలి పోతున్న సచివాలయ సిబ్బంది మరో వైపు.నిరుద్యోగ భృతి.. డిఎస్సీ ప్రకటించక పోవడం..ఇక పోతే రాష్ట్రంలో అధికారం కోల్పోయినప్పటికీ 42 శాతం పైగా ఓట్ బ్యాంక్ తో బలంగా ఉన్న వై.సి.పి ఎలాగూ కూటమి అభ్యర్థి ఓటమికి శాయశక్తులా ప్రయత్నించి .. కూటమి ఓటమికి తమ మద్దతు యిచ్చి సహకరిస్తుంది. కర్ణుడు చావుకు శతకోటి కారణాలు అన్న చందాన ఇన్ని రకాల కారణాలతో కూటమి అభ్యర్థి విజయం నల్లేరు పై నడక కాబోదు.ఏది ఏమైనా పోటీ మాత్రం నువ్వా.. నేనా.. అనే విధంగా కూటమి అభ్యర్థి రాజశేఖరం మరియు డి.వి. రాఘవులు మధ్యే ఉంటుంది అనడంలో సందే హం లేదు. కూటమి నేతలు నిరుద్యోగ యువత సమస్యలపై దృష్టి సారించి తమ నేతతో వారికి భరోసా కల్పించి రాజశేఖరం విజయానికి బాటలు వేస్తారో..చాప కింద నీరులా యుటిఎఫ్ నేతల అభ్యర్థి రాఘవుల విజయానికి కృషి చేస్తున్న వారి పన్నాగం ఫలిస్తుందో వేచి చూడాల్సిందే.

# ధర్మవరంలో నివురు కప్పిన నిప్పులా విభేదాలు

**టిడిపి, బిజెపి క్యాడర్ మధ్య అగాధం**

**మంత్రి మంచోడేగాని ఓ పిఎ చెప్పిందే వేదం**

**ముదిగుబ్బ మండలంలో బిజెపి, టిడిపి మధ్య పెరిగిన గొడవలు**

**ఫీల్డ్ అసిస్టెంట్లు, స్టోర్ డీలర్లు నియామకాలు ఎక్కడికక్కడే**





**అనంతపురం, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త బ్యూరో:** రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ తరఫున టిడిపి, బిజెపి, జనసేన కూటమి ప్రభుత్వంలో ఏకైక మంత్రిగా ఉన్న సత్య కుమార్ యాదవ్ తాను ప్రాతినిధ్యం వహిస్తున్న ధర్మవరం నియోజకవర్గంలో టిడిపి, బిజెపి వర్గీల మధ్య నిరుగప్పిన నిప్పులా పరిస్థితులున్నాయి. ముఖ్య నేతలు వేదికలపై నవ్వుతూ మాట్లాడుకుంటున్నప్పటికీ అంతర్గతంగా నియోజకవర్గంలో పట్టు కోసం ఎవరి ప్రయత్నాలు వాళ్ళు చేస్తున్నారని అభిప్రాయం ఉంది. కొందరు స్థానిక బిజెపి నాయకుల చర్యల వల్ల తమ పనులు జరగడం లేదని తెలుగు తమ్ముళ్లు అసంతృప్తితో ఉన్నారు.. మంత్రి సత్య కుమార్ యాదవ్ బాగా రిసీవ్ చేసుకుంటాడని, సామాన్యులను కూడా చక్కగా మాట్లాడిస్తాడని అభిప్రాయం ఉంది.. అయితే కీలక మంత్రిగా రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో పర్యటించేందుకు , రాజధాని లో ఉండేందుకు ఎక్కువ సమయం కేటాయిస్తున్నారని,, స్థానికంగా తక్కువ సమయం కేటాయిస్తున్నందున స్థానికులు తమ బాధలు చెప్పుకునేందుకు సరిగా అవకాశం ఉండడం లేదని అభిప్రాయం ఉంది. మంత్రి స్థానికంగా ఎక్కువగా లేకపోవడం వల్ల ఆయా మండలాల్లో కొందరు నాయకులు పైన, ధర్మవరంలో కొందరు పర్సనల్ అసిస్టెంట్ ల పైన ఆధారపడుతున్నారని, ఈ పరిస్థితుల్లో ధర్మవరంలో ఉంటున్న ఒక పిఏ తనదైన చక్రం తిప్పుతున్నాడని , ఆ పిఏ చెబితేనే అధికారులు పనులు చేస్తున్నారని, అధికారంలోకి వచ్చిన తమ పనులు జరగడంలేదని తెలుగు తమ్ముళ్ల అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు తెలియ వచ్చింది.. ధర్మవరంలో బిజెపిని బలోపేతం చేసేందుకు వైసిపి క్యాడర్ను కూడా లాక్కునేందుకు ఆ పిఎ ప్రయత్నం చేస్తున్నాడని అది టిడిపి వారికి నచ్చడం లేదని వాదించే మంత్రి వర్గీయులు కూడా ఉన్నారు.. ధర్మవరం పట్టణంలో మాత్రం ఒక మంత్రి పిఏ తీరు పై స్థానిక టిడిపి నేతలు గుర్రుగా ఉన్నారు. ఇదే సమయంలో ధర్మవరం నియోజకవర్గంలో ధర్మవరం మున్సిపాలిటీ, ధర్మవరం రూరల్, బత్తలపల్లి, తాడిమర్రి, ముదిగుబ్బ మండలాలు ఉన్నాయి. మిగతా మండలాల్లో టిడిపి, బిజెపి వర్గీల మధ్య అక్కడక్కడ చిన్నచిన్న సమస్యలు ఉన్నాయి.. అయితే ముదిగుబ్బ మండలంలో పట్టు కోసం టిడిపి, బిజెపి వర్గీయులు గట్టిగా ప్రయత్నించడంతో అక్కడ అభివృద్ధి కార్యక్రమాలు స్తంభించిపోయాయి.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలు అవుతుంది ఇప్పటివరకు ఆ మండలంలో ఉపాధి హామీ పథకం కింద ఫీల్డ్ అసిస్టెంట్లు, స్టోర్ డీలర్లు నియామకం అస్తవ్యస్తంగా ఉంది.. ఉపాధి హామీ పథకం కింద పనులు జరగడం లేదు అన్న విమర్శలు ఉన్నాయి. ముదిగుబ్బ మండలంలో 32 ఫీల్డ్ అసిస్టెంట్లు పోస్టులు ఉన్నాయి.. అందులో 9 బిజెపి వర్గీయులకు ఇవ్వాలని అడుగుతున్నట్లు తెలిసింది.. దీనికి టిడిపి మద్దతు దారులు ఒప్పుకోవడం లేదు.. మండలంలో 54 చౌక ధాన్యపు డిపోలు ఉన్నాయి.. వీటి కోసం కూడా గొడవలు ఉన్నాయి.. చౌక ధాన్యపు డిపో నడపడం కూడా ఇక్కడ కష్టంగా ఉంది.. టిడిపి, బిజెపి వర్గీల మధ్య ఉన్న ఆధిపత్య పోరు తో మండల అధికారులు ఇక్కట్ల గురవుతున్నారు.. ఎన్నికలకు ముందు వైసీపీలో ఉన్న ముదిగుబ్బ మండల అధ్యక్షులు ఆదినారాయణ యాదవ్ బిజెపి అభ్యర్థిగా సత్య కుమార్ యాదవ్ ఖరారు అయిన తర్వాత బిజెపి తీర్థం పుచ్చుకున్నారు. సహజంగానే మండల అధ్యక్షుడిగా ఉన్న తన పరిచయాలు, మంత్రి అండదండలతో తనవారికి ఫీల్డ్ అసిస్టెంట్లు, స్టోర్ డీలర్లు ఇప్పించాలని ఆదినారాయణ యాదవ్ తదితరులు పట్టుబడుతున్నం తో ఆ మండలంలో తెలుగు తమ్ముళ్లు జీర్ణించుకోలేకపో తున్నారు. ఇదే సమయంలో తెలుగుదేశం పార్టీలో ఉన్న రెండు వర్గాల్లో ఒక వర్గం వారిని , వైసీపీలో అసంతృప్తి వర్గీయులను తన వైపు తిప్పుకునేందుకు మంత్రి సత్య కుమార్ యాదవ్ మద్దతుదారులు ప్రయత్నాలు చేస్తున్నట్టు ఆరోపణ లేకపోలేదు.. ధర్మవరం నియోజకవర్గం టిడిపి ఇన్చార్జిగా పరిటాల శ్రీరామ్ ఉన్నారు. పలు సందర్భాల్లో తమ ఇబ్బందులను పరిటాల శ్రీరామ్ దృష్టి తీసుకెళ్లినా స్పందించడం లేదని, కూటమి నాయకులు మధ్య గొడవలు వస్తే పార్టీ అధినేత, సీఎం చంద్రబాబు నాయుడు సీరియస్ అయితాడని అభిప్రాయంతో శ్రీరామ్ ఉన్నట్లు తెలియ వచ్చింది. ఏదేమైనా ధర్మవరం నియోజకవర్గంలో టిడిపి, బిజెపి మద్దతు దారుల మధ్య అసంతృత్తులు నిప్పులా ఉన్నాయి..



మంగళవారం జూబ్లీహిల్స్‌లోని నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మహాశివరాత్రి ఉత్సవాల ఆహ్వానపత్రికను అందజేస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, వేములవాడ దేవస్థానం అర్చకులు

## వేములవాడ మహాశివరాత్రి ఉత్సవాలకు రండి

**ముఖ్యమంత్రి రేవంత్‌కు ఆహ్వానం**

**హైదరాబాద్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:** మహాశివరాత్రి ఉత్సవాలకు హాజరు కావాలని సిఎం రేవంత్‌రెడ్డిని వేములవాడ దేవస్థానం అర్చకులు, అధికారులు ఆహ్వానించారు. ఈ మేరకు వారు మంగళవారం జూబ్లీహిల్స్‌లో నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి ఆయనకు మహాశివరాత్రి ఉత్సవాలకు సంబంధించిన ఆహ్వానపత్రికను అందచేశారు. సీఎంను కలిసిన వారిలో ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే ఆదిశ్రీనివాస్, శ్రీరాజరాజేశ్వరస్వామి దేవస్థానం అర్చకులు, ఆలయ అధికారులు ఉన్నారు. తెలంగాణలోనే అతి పెద్ద పుణ్యక్షేత్రమైన వేములవాడ శ్రీరాజేరాజేశ్వరిస్వామి వారికి దేవస్థానంలో మహాశివరాత్రి వేడుకలు ఈ నెల 25 నుంచి 27 వరకు అత్యంత వైభవోపేతంగా నిర్వహించనున్నారు. ఇప్పటికే భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లను అధికారులు చేశారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం కూల్చివేతకు బిజెపి, బిఆర్ఎస్ లోపాయికారి ఒప్పందం

**ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్**

**హైదరాబాద్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:** తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం కూల్చివేతకు బిజెపి బీఆర్ఎస్ లోపాయికారి ఒప్పందం చేసుకున్నారని ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్ ఆరోపించారు. కాంగ్రెస్ శాసనసభ పక్ష కార్యాలయంలో విలేఖరులతో ఆయన మాట్లాడుతూ తెలంగాణ బీజేపీ నాయకులు రాహుల్ గాంధీ కులం గురించి బరితెగించి మాట్లాడుతున్నారని విమర్శించారు. దమ్ము, ధైర్యం ఉంటే కేంద్ర మంత్రులు గా కిషన్ రెడ్డి, బండి సంజయ్ రాష్ట్రానికి నిధులు తీసుకురావాలని కోరారు.సీఎం రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీ ని తిట్టడమే కేంద్ర మంత్రుల పనిగా మారిందని ఆవేదన చెందారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతుందని కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతున్నాడని మా ప్రభుత్వానికి రాజ్యాంగబద్ధంగా కావాల్సిన సీట్లు ఉన్నాయని కూలదని ధీమా వ్యక్తంచేశారు.ఐదేళ్ల పాటు ఇందిరమ్మ రాజ్యం ఉంటుందని ఆయన తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ లోపాయికారీ ఒప్పందం చేసుకున్నాయని పట్టభద్రుల ఎన్నికల్లో కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డి గెలవబోతున్నారని జోస్యంచెప్పారు.కేంద్ర మంత్రి బండి సంజయ్ చరిత్రను వక్రీకరించేలా మాట్లాడుతున్నారని అన్నారు. ఫిరోజ్ జహింగీర్ ఘాండీ(గాంధీ) 1912 సెప్టెంబరు12 అప్పటి బాంబే ప్రెసిడెన్సీలో జొరాష్ట్రియన్ మతానికి (రతన్ టాటా కుటుంబం పాటించే మతం) చెందిన పార్సీ కుటుంబంలో జన్మించాడని తెలిపారు. తండ్రి 'ఫరీదుయన్ జహింగీర్ ఘాండీ' తల్లి 'రతిమయి కమిషరట్ ఘాండీ' జొరాష్ట్రియన్ మతస్తులు పూర్వపు పర్షియా (ఇరాన్) నుంచి భారత దేశానికి వలస వచ్చారు.భారతదేశంలో జైన, బౌద్ధ క్రైస్తవ పేర్లు హిందువుల పేర్లకు ఎలా దగ్గరగా ఉంటాయో అలాగే పార్సీ ల పేర్లు కూడా ముస్లిం పేర్లకు దగ్గరగా ఉంటాయని అన్నారు.ఫిరోజ్ జహంగీర్ ఘాండీ ని మహాత్మ గాంధీ దత్తత తీసుకోలేదు. భారత స్వాతంత్ర్య పోరాటంలో మహాత్మా గాంధీ అనుచరుడిగా ఆయన మీద అభిమానంతో ఫిరోజ్ ఘండి ఫిరోజ్ గాంధీ అని పేరు మార్చుకున్నాడని చరిత్రను వివరించారు.1942 మార్చి 26 ఫిరోజ్ గాంధీ ఇందిరా ప్రియదర్శిని ల వివాహం హిందూ సాంప్రదాయం ప్రకారం జరిగిందని గతం నెమరేసుకొన్నారు. అప్పటినుండి ఇందిరా గాంధీ బ్రాహ్మణుడైన నెహ్రూ వారసత్వాన్ని కొనసాగిస్తూ వస్తున్నారని ఆయన తెలిపారు.. వారి పేరు చివరన గాంధీని జోడించుకొని బ్రాహ్మణులు గానే ఉన్నారు.1960 సెప్టెంబర్ 8 న ఫిరోజ్ గాంధీ గారి అంత్యక్రియలు పార్సీ సాంప్రదాయం ప్రకారం అలహాబాద్ లో జరిగాయని అన్నారు.

## పర్యాటక శాఖ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

**మంత్రి జూపల్లికి సంఘం నాయకుల వినతి**

**హైదరాబాద్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త :**పర్యాటక శాఖలో ఉద్యోగులు సమస్యలు పరిష్కరిచాలని తెలంగాణ పర్యాటక శాఖ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యో గుల సంఘం నాయకులు పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు విజ్ఞప్తి చేశారు మంగళవారం ఉద్యోగులు సంఘం నాయకులు మాజీ ఎమ్మెల్యే చాడా వెంకటరెడ్డి ఆధ్వర్యంలో మంత్రిని కలిసి వినతిపత్రం అందచేశారు. ఉద్యోగుల క్రమబద్ధీకరణ,జీతాల పెంపు తదితర సమస్యల గురించి మంత్రితో చర్చించామని, ఇందుకు ఆయన సానులకూంగా స్పందించినట్లు తెలిపారు. జీత భత్యాల పెంపునకు తన వంతు కృషి సహకారం అందిస్తామని ఈ సందర్భంగా వారికి హామీ ఇచ్చినట్లు తెలిపారు.

## బిసి జనాభాను తగ్గించి చూపుతున్న ప్రభుత్వం

**బిసి రిజర్వేషన్లపై కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదు: బిజెపి ఎంపి ఈటల**

**ఖమ్మం బ్యూరో, ప్రభాతవార్త:** బిసి కులగణన తప్పుల తడకగా రానుందని బిసి జనాభాను తగ్గించి చూపించారని ఇది కాంగ్రెస్ చేసిన కుట్రలో భాగమేనని మల్కాజ్‌గిరి ఎంపీ బిజెపి రాష్ట్ర నాయకులు ఈటెల రాజేందర్ పేర్కొన్నారు. బిజెపి ఉపాధ్యాయుల ఖమ్మం నల్గొండ వరంగల్ జిల్లాల ఎమ్మెల్సీ అభ్యర్థి సర్వోత్తమ రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ ఖమ్మంలో మంగళవవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌కు బిసి కులగణన నిజాయితిగా చేయాలనే ఉద్దేశ్యం లేదని విమర్శించారు. 2011లో రాష్ట్ర జనాభా 3కోట్ల 60లక్షలు ఉండగా 2025కు కూడా అదే జనాభాను చూపించారని కోటి జనాభాను తగ్గించి చూపిస్తున్నారని నిజాయితిగా మీరు కులగణనను చేసి ఉంటే మళ్లీ రెండవ సారి ఎందుకు చేయిస్తున్నారని ఆయన ప్రశ్నించారు.బిసి జనాభాను 46శాతం చూపిస్తూ కాంగ్రెస్ మోసం చేస్తుందని ఆయన ధ్వజమెత్తారు.

బిసి కులగణనను ఆ పార్టీ స్వాగతిస్తుందని కేంద్ర ప్రభుత్వం ఆయా రాష్ట్రాలు తమ పరిస్థితులను బట్టి కులగణనను చేసుకోవచ్చని తేల్చి చెప్పిందని తమిళనాడులో బిసి కులగణనను శాస్త్రీయ బద్ధంగా చేసి అమలు చేస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వం మాత్రం బిసిలను మోసం చేస్తూ డ్రామా కంపెనీల తయారైందని విమర్శించారు.

47 ఏళ్ల పాటు కాంగ్రెస్ పాలనలో బిసిలను సీఎంగా, ప్రధానమంత్రిగా చేయలేకపోయిందని చెప్పారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండు కూడా ప్రజా వ్యతిరేకమైన పార్టీలని బీఆర్ఎస్ అమలు చేసిన విధానాలను కాంగ్రెస్ చేస్తుందని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 12 నెలలు కావస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు ఇవ్వాల్సిన 5డిఏలు ఇవ్వలేదని, పిఆర్‌సి అమలు చేయలేకపోయిందని చివరకు రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్లు, పదవి విరమణ పొందిన ఉద్యోగులు దాచుకొన్న సొమ్మును కూడా ఇచ్చే స్థితిలో లేదని పేర్కొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లకు ఉచిత ఇసుక

**మైనింగ్ శాఖ ముఖ్యకార్యదర్శి శ్రీధర్**

**హైదరాబాద్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్లకు ఉచితంగా ఇసుక అందిస్తామని ప్రభుత్వం గతంలో ప్రకటించింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ నిర్ణయం మేరకు ఇందిరమ్మ ఇళ్లకు ఉచితంగా ఇసుకను అందించాలని తెలంగాణ మైనింగ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 24 గంటల పాటు, స్లాట్ బుకింగ్ సదుపాయం కల్పించాలని, ఇసుక అక్రమ రవాణా కట్టడి చేయాలని కలెక్టర్లకు,అధికారులకు స్పష్టం చేసినట్లు తెలిపారు.అతి త్వరలో తెలంగాణలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఉచితంగా ఇసుకను అందించనున్నారు. కాగా రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చే పనిలో పడింది.

## వర్గీకరణతో మాలలకు తీరని అన్యాయం

**మాల సంఘాల జెఎసి ఛైర్మన్ చెన్నయ్య**

**హైదరాబాద్ (సైఫాబాద్), ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం చేసిన వర్గీకరణ వల్ల మాలలకు తీవ్రంగా అన్యాయం జరుగుతుందని, ఈ వర్గీకరణను మాలలు అంగీకరించరని మాల సంఘాల జెఎసి ప్రకటించింది. 2011 జనాభా లెక్కల ఉపకులాల వారీగా వర్గీకరణ జరగలేదని, తప్పుడు లెక్కలతో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కమిటీ మాలలను అణిచివేసే ప్రయత్నం చేస్తున్నదని జెఎసి ఆరోపించింది. ఈ మేరకు జెఎసి ఛైర్మన్ జి.చెన్నయ్య ఆధ్వర్యంలో ఒక ప్రతినిధి బృందం మంగళవారం పిసిసి అధ్యక్షుడు బి.మహేష్ కుమార్‌గౌడ్‌కు వినతిపత్రం సమర్పించింది. ఈ సందర్భంగా జి.చెన్నయ్య మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడిన తరువాత 2014 నుంచి 2024 వరకు ఎస్సీలలో విద్యా, ఉద్యోగాలు, ఎస్సీ కార్పోరేషన్ రుణాలు, ధలిత బంధు, భూమి, సబ్సీడీలు, రాజకీయ పదవుల్లో ఎవరు ఎక్కువగా పొందారో లెక్కలు తీస్తే ఎవరూ అభివృద్ధి చెందారో తెలుస్తు ందన్నారు. రాష్ట్రంలో మాలల కంటే మాదిగలే ఎక్కువగా అన్ని రంగాలలో అభివృద్ధి చెందారని చెప్పారు. పిసిసి అధ్యక్షుడిని కలిసిన వారిలో జెఎసి కో-ఛైర్మన్‌లు బూర్గుల వెంకటేశ్వర్లు, కరణం కిషన్, గోపాజు రమేష్, చెరకు రాంచందర్, బేర బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.

## అటవీ, రెవెన్యూ శాఖల సరిహద్దు సమస్యల పరిష్కారం దిశగా ముందడుగు

**మారిటైమ్ బోర్డుకు భూ కేటాయింపుపై స్పష్టత నిచ్చిన సమావేశం**

**అటవీ శాఖకు ప్రత్యామ్నాయ భూమి కేటాయింపునకు ఆదేశాలు**

**విజయవాడ,ఫిబ్రవరి18,ప్రభాతవార్తప్రతినిధి:** న్యాయపరమైన వివాదాలకు తావు లేకుండా ప్రభుత్వ శాఖల మధ్య నెలకొన్న భూసమస్యలకు ముగింపు పలికేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నట్లు రెవిన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (భూపరిపాలన, సర్వే సెటిల్ మెంట్, స్టాంపులు రిజిస్ట్రేషన్లు, విపత్తుల నిర్వహణ), ఆంధ్రప్రదేశ్ మానవవనరుల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ జనరల్ ఆర్ పి సిసోడియా అన్నారు. అటవీ, రెవిన్యూ శాఖల మధ్య నెలకొన్న భూవివాదాల పరిష్కారం ధ్యేయంగా మంగళవారం రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయంలో అత్యున్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. రెవిన్యూ, సర్వే సెటిల్ మెంట్, అటవీ, మారిటైమ్ బోర్డు, ఎపిఐఐసి ఉన్నతాధికారులతో నిర్వహించిన ఈ సమావేశాన్ని భూపరిపాలన విభాగపు చీఫ్ కమీషనర్ జయలక్ష్మి సమన్వయ పరిచారు. ఈ సందర్భంగా సిసోడియా మాట్లాడుతూ ఉన్నత స్థాయి అధికారులు క్షేత్ర స్థాయికి వెళ్లి వాస్తవ సరిస్థితులను అధ్యయనం చేసినప్పుడే సరిహద్దు వివాదాలకు ముగింపు లభిస్తుందన్నారు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను ఇబ్బంది కలిగిస్తున్న భూవివాదాలకు సత్వరమే పరిష్కారం చూపవలసి ఉందని, మంచి నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు.శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం రాజాపురం గ్రామం మూలపేటలో 408.67 ఎకరాల ప్రభుత్వ భూమిని ఎపి మారిటైమ్ బోర్డుకు బదలాయించే అంశాన్ని ఉన్నత స్థాయి సమావేశం చర్చించింది. సర్వే నెంబర్ 299, 304, 305లలోని ఈ భూమిలో మూలపేట గ్రీన్ ఫీల్డ్ పోర్టు నిర్మాణం చేయాలన్న ప్రతిపాదనకు కమిటీ సమ్మతి తెలిపింది. ఈ భూమికి సంబంధించి అటవీ, రెవిన్యూ శాఖ మధ్య నెలకొన్న వివాదాలను పరిష్కరించే దిశగా సిసిఎల్ఎ వ్యవహరించాలని సిసోడియా స్పష్టం చేసారు. మారిటైమ్ బోర్డు కోరుతున్న భూమిలో అటవీ భూమి కూడా ఉన్నందున ఆ శాఖకు ప్రత్యామ్నాయంగా ఎక్కడ భూమి చూపాలన్న దానిపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. నెల్లూరు రూరల్ మండలం అమనచర్ల గ్రామం లోని సర్వే నెంబర్ 303/1 లోని 502.12 ఎకరాల భూమి విషయంలో ఎపిఐఐసి, అటవీ శాఖ మధ్య యాజమాన్య హక్కుల విషయంలో వివాదం నెలకొంది. సుదీర్ఘ చర్చ అనంతరం ఈ అంశం న్యాయ పరమైన వివాదాలతో అను సంధానం అయి ఉన్నందున ఈ అంశంపై మరింత స్పష్టత అవసరమని సమావేశం అభిప్రాయపడింది. మరింత సమాచారం, న్యాయ సలహా మేరకే తగిన చర్యలు తీసుకోవాలని సిసోడియా, జయ లక్ష్మి స్పష్టం చేసారు.

కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం బ్రాహ్మణపల్లి, శకునాల గ్రామాల పరిధిలోని 365.66 ఎకరాల విషయంలో నెలకొన్న సరిహద్దు వివాదంపై కూడా సమావేశం లోతుగా చర్చించింది. గని రిజర్వ్ ఫారెస్ట్ కు, అక్కడ నిర్మాణం కావాలసిన గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టు భూములకు మధ్య సరిహద్దు రేఖ పరంగా అస్పష్టత నెలకొంది. ఈ అంశంపై సిసోడియా స్పష్టత నిస్తూ రెవిన్యూ, అటవీ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో రీసర్వే నిర్వహించాలని అదేశించారు. రికార్డులను పూర్తి స్థాయిలో అధ్యయనం చేయాలని, సర్వే సమయంలో జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయికి వెళ్లి వాస్తవ స్థితి గతులను పరిశీలించి సిసిఎల్ఎకు నివేదిక సమర్పించాలని స్పష్టం చేసారు.

ఈ సమావేశంలో ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (వైల్డ్ లైఫ్), చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్ అజయ్ కుమార్ నాయక్, సర్వే సెటిల్ మెంట్ అదనపు సంచాలకులు గోవిందరావు, కర్నూలు జిల్లా కలెక్టర్ రంజిత్ భాషా, శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దిన్ కర్ పుండ్కర్, నెల్లూరు జిల్లా జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

## అప్పుల కెసిఆర్ పాలన ఎలా గొప్పది?

**ఆంధ్రా కాంట్రాక్టర్లుకు దోచిపెట్టారు: మంత్రి జూపల్లి కృష్ణారావు**

**హైదరాబాద్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త :** కెసిఆర్ పదేళ్ళ అప్పుల పాలన గొప్పపాలన ఎలా అవుతుం దని ఎక్సైజ్ పర్యాటక సాంస్కృతిక పురవస్తు మంత్రి జూపల్లి కృష్ణారావు సందేహం వ్యక్తం చేశారు. మంగళవారం సిఎల్‌పిలో మాట్లాడుతూ మంత్రి జూపల్లి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. తెలంగాణ సాధనలో కేసీఆర్ పాత్ర మాత్రమే ఉందా? వందల మంది ప్రాణాల త్యాగం లేదా? అని ప్రశ్నించారు. రాజకీయంగా దెబ్బతింటాం అని తెలిసి సోనియాగాంధీ తెలంగాణ ఇచ్చారన్నారు. తెలంగాణ ఏర్పాటులో ఎవరి పాత్ర వాళ్లకు ఉందని అన్నారు. కేసీఆర్ మళ్ళీ రావాలని కొందరు కోరుకుంటున్నారని, ఎందుకు అప్పులు చేయడానికా అని నిష్ఠూరాలు పలికారు. 10యేళ్ల తర్వాత కూడా నిరుద్యోగ సమస్య ఎందుకు ఉందని దుయ్యబట్టారు. ధనిక రాష్ట్రం 8 లక్షల కోట్ల అప్పుఎలా అయ్యిందని ఆయన ప్రశ్నించారు.నెలకు రూ.65000కోట్లు ఈఎం ఐలు కడుతున్నామని తెలిపారు. ఇదేనా గొప్ప పాలనా? కేసీఆర్ మళ్ళీ వస్తే రూ.20 వేల కోట్ల అప్పులు చేసి పెడతారని విమర్శించారు. కేసీఆర్ శాసన సభకి రావడంలేదు, కన్న తల్లి తండ్రులను చంపి, జడ్జి ముందు తల్లితండ్రులు లేని అనాథని అన్నట్టు కేటీఆర్ మాట్లాడుతున్నా డని మంత్రి జూపల్లి విమర్శించారు. కేటీఆర్‌కి సిగ్గుం డాలి బకాయి పెట్టింది ఎవరు? అని నిలదీశారు. మీరు చేసిన అప్పులు కట్టడానికి అప్పుతేవాల్సి వస్తుందని అన్నారు. ప్రజలు తెలివైన వాళ్ళు, అమాయకులు కాదని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు.

## నన్ను అవమానించినందుకే హత్య చేశా

**తాతను చంపిన కేసులో ముగిసిన మనవడు కీర్తితేజ పోలీస్ కస్టడీ**

**హైదరాబాద్ (పంజగుట్ట), ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:** నగరంలో సంచలనం రేకెత్తించిన వృద్ధుడు హత్య కేసులో ఆయన మనవడే ముద్దాయి అని పంజగుట్ట పోలీసులు అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించారు. హత్యకు సంబంధించి పూర్తి వివరాలు తెలుసుకోవడానికి నిందితుడిని కోర్టు అనుమతితో కస్టడీకి తీసుకుని మరిన్ని విషయాలను రాబట్టి కస్టడీ ముగియడంతో మళ్లీ రిమాండ్‌కు తరలించారు. వివరాల ప్రకారం.. పంజగుట్ట పోలీసు స్టేషన్ పరిధిలో ఇటీవల తాతను హత్య చేసిన మనవడు నిందితుడైన కీర్తితేజను పోలీసులు కస్టడీలోకి తీసుకుని మూడురోజులపాటు విచారించారు. మొదటిరోజు పోలీసుల ప్రశ్నలకు మౌనంగా ఉన్న కీర్తితేజ తర్వాత నోరు విప్పాడు. తనను అవమానించినందుకే తాతను చంపినట్లు పోలీసుల విచారణలో నిందితుడు కీర్తితేజ తెలిపాడు.

హత్యకు వాడిన బట్టలు, కత్తి తగల బెట్టేందుకు కీర్తి ప్రయత్నం దగ్గర నుంచి పూర్తి వివరాలను పోలీసులు సేకరించారు. కస్టడీలో కీర్తితేజ చెప్పిన విషయాలు ప్రకారం.. హత్యకు దారితీసిని పరిస్థితులను వివరించినట్లు సమా చారం. తనను యూ బెగ్గర్ అంటూ ప్రతిరోజూ తాత అవమానించేవాడు. ఏరోజూ నన్ను సొంత మనిషిగా చూడలేదు. కుటుంబసభ్యుడిగా కూడా చూడలేదు. అందరికంటే హీనంగా చూస్తూ దారుణంగా వ్యవహరించేవాడు. ప్రతీరోజూ నన్ను బెగ్గర్ అంటూ పిలిచేవాడు. ఆఫీసుకు వెళ్తే అక్కడ కూడా అవమానించేవాడు. తాత అలా తిట్టడం వల్ల ఆఫీస్ స్టాఫ్ కూడా చిన్నచూపు చూసే వారు. ఆస్తి పంపకాలు, పదవుల కేటాయింపుల్లోనూ తక్కువ చేశాడు. చివరకు డైరెక్టర్ పదవి కూడా రెండో కుమార్తె కొడుకుకు ఇచ్చాడు. అప్పటి నుంచి తనకు, తాతకు మధ్య గొడవలు పెరిగాయి. అందుకే తాతను చంపేయాలని నిర్ణయించుకున్నా.

ఇన్‌స్టామార్ట్ నుంచి కత్తి కొనుగోలు చేశా. హత్య జరిగిన రోజు నాకు, తాతకు మధ్య పెద్దఎత్తున గొడవ జరిగింది. ఆస్తిలో వాటా కావాలని అడిగితే ఇవ్వను అన్నాడు. కోపంతో కత్తితో కసితీరా పొడిచా. హత్య చేసిన తర్వాత బిఎస్‌మక్తా ఎల్లమ్మగూడ పక్కనే ఖాళీ స్థలంలో కత్తి, రక్తంతో ఉన్న నా బట్టలను తగులబెట్టాను అని వివరించినట్లు సమాచారం. మంటల్లో సగం కాలిన కత్తిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.



## మెదడు, కాలేయం ట్యూమర్ శస్త్ర చికిత్సల ప్రత్యేక విభాగం ప్రారంభించిన బాలకృష్ణ

**హైదరాబాద్ (పంజగుట్ట), ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:** బసవతారకం ఇండో అమెరికన్ కేన్సర్ హాస్పిటల్స్ 25 యేళ్లు పూర్తిచేసుకొని రజతోత్సవాలు జరుపుకొంటున్న సమయంలో కేన్సర్ రోగులకు మరింత మెరుగైన సేవలు అందించడానికి వీలుగా అత్యాధునిక వైద్య సదుపాయాలను అందుబాటులోకి తీసుకొని రావాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా ఇప్పటికే 4వ జనరేషన్ డావిన్సి రొబోటిక్ శస్త్రచికిత్స వ్యవస్థతోపాటు పిల్లల కోసం కొత్తవార్డు, పీడియాట్రిక్ ఐసియును కూడా ఇటీవల ఏర్పాటు చేసింది. దీనికి కొనసా గింపుగా మంగళవారం మెదడు, కాలేయంలో ఏర్పడే ట్యూమర్లకు సంబంధించిన అత్యాధునిక శస్త్రచికిత్స పరికరం ఇంటెగ్రా అల్ట్రాసోనిక్ డైసెక్టర్‌ను అందు బాటులోకి తీసుకొచ్చింది. రూ. 90 లక్షల ఖరీదుతో కూడిన ఈ అత్యాధునిక వ్యవస్థను సంస్కృతి శిఖర్ ట్రస్టు వారు పూర్తిస్థాయిలో అందించిన ఆర్థిక సహా యంతో హాస్పిటల్ ఏర్పాటు చేసింది. ఈ అత్యాధునిక సర్జికల్ వ్యవస్థ అయిన ఇంటెగ్రా అల్ట్రాసోనిక్ డైసెక్టర్‌ను మంగళవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆస్పత్రి ఛైర్మన్ నందమూరి బాలకృష్ణ చేతుల మీదుగా సంస్కృతి శిఖర్ ట్రస్టు ప్రతినిధులైన తోరల్ దేశాయి, మేనేజింగ్ ట్రస్టీ - జిన్నీ, ఛైర్‌పర్సన్ - నిషా షా, కోశాధికారి సమక్షంలో ప్రారంభించారు. బాలకృష్ణ మాట్లాడుతూ స్థాపించిన నాటి నుండి రోగులకు అవసరమైన అత్యాధునిక వైద్యసదుపాయాలు అందిం చడంలో ముందంజలో ఉందని వివరిస్తూ ఎంతో సున్నిత భాగాలకు సంబం ధించిన గడ్డలను తొలగించడానికి ఎంతగానో ఉపయోగపడే ఇంటెగ్రా అల్ట్రాసోనిక్ డైసెక్టర్‌ను రోగుల కోసం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. దీని కారణంగా కాలేయం, మెదడుకు సంబంధించిన ట్యూమర్లను మరింత కచ్చితత్వంతో శస్త్ర చికిత్స ద్వారా తొలగించడానికి వీలువుతుందని చెప్పారు.



ఆమనగల్లులో నిర్వహించిన రైతు నిరసన దీక్ష సభలో మాట్లాడుతున్న బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కెటిఆర్

## రైతులను మోసగిస్తున్న రేవంత్ సర్కారు

**బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కెటిఆర్**

**ఆమనగల్లు, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:** అమలు కానీ హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతులను పూర్తిగా మోసం చేస్తున్నాడని బిఆర్ఎస్ కార్యనిర్వహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. యేడాదిన్నర కాలంలో రైతు ప్రయోజనాల కోసం ఎటువంటి కార్యక్రమాలు, పథకాలు ప్రవేశపెట్ట లేదని, కేసీఆర్ అమలు చేసిన పథకాలను కూడా సక్రమంగా అమలు చేయలేపోతున్నారని ఆయన విమర్శించారు. ఆమనగల్లులో మంగళవారం బిఆర్ఎస్ పార్టీ నిర్వహించిన రైతు నిరసన దీక్షలో మాజీ మంత్రులు సబితాఇంద్రారెడ్డి, నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి సర్కారును దుయ్యబట్టారు. రేవంత్‌రెడ్డి పాలన పూర్తిగా విఫలం చెందిందన్నారు. ఏ ఒక్క వర్గ ప్రజలు కూడా సంతోషంగా ఉండటం లేదని విమర్శించారు. రైతులు, ఆటోరిక్షా కార్మికులు, విద్యార్థులు, రియల్‌ఎస్టేట్ వ్యాపారులు ఆవేదనకు లోనై బలిదానాలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంట పెట్టుబడికి ఇవ్వవలసిన రైతుభరోసా డబ్బులు సకాలంలో సక్రమంగా అమలు చేయలేక పోతుండడం రేవత్‌రెడ్డి వైఫల్యానికి నిదర్శనమన్నారు. రైతుభరోసా డబ్బులు సక్రమంగా వేయకపోవడంతో రాష్ట్రంలో ప్రతిరైతుకు ఎకరానికి రూ. 17,500 రాష్ట్ర ప్రభుత్వం బాకీ పడిందన్నారు. పదేళ్ల బిఆర్ఎస్ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలతో వ్యవసాయరంగాన్ని స్వర్ణ యుగంగా మార్చి రైతును రాజుగా తీర్చిదిద్దాడని కొనియాడారు. నాడు ప్రభుత్వం ఇచ్చిన ప్రోత్సహంతో ధాన్యం దిగుబడులలో తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే ద్వితీయ స్థానంలో నిలిపిన ఘనత కేసీఆర్‌కు దక్కిందన్నారు. కానీ నేడు రేవంత్‌రెడ్డి 90 శాతం పూర్తి అయిన పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టును కూడా పూర్తి చేయలేకపోయడని విమర్శించారు. 14 నెలల కాలంలో 35సార్లు ఢిల్లీకి తిరిగిన రేవంత్‌రెడ్డి గల్లీని కూడా అభివృద్ధి చేయలేకపోయా రన్నారు. ఢిల్లీ ప్రయాణాలతో ప్రజాధనం దుర్వినియోగం తప్ప రేవంత్‌రెడ్డి సాధించిందేమి లేదని ఆరోపించారు. స్వప్రయోజనాల కోసమే రేవంత్‌రెడ్డి ఫోర్తుసిటీ తెరపైకి తీసుకువచ్చారని, సీఎం కుటుంబసభ్యులు రియల్‌ఎస్టేట్ దందాతో రైతుల నుండి భూములు లాక్కుంటున్నారన్నారు. రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ, అన్నదాతలు, ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ సర్కారుకు రానున్న స్థానిక ఎన్నికల్లో గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు తదితరులు ఉన్నారు.

19-2pg10-f.qxd:19-2pg10-f.qxd 01/01/01 8:22 AM Page 1





## రంజీ ట్రోఫీ: తొలి ఇన్నింగ్స్‌లో
# విదర్భ 383 రన్స్
### 365 రన్స్ వెనుకబడిన ముంబయి

**న్యూఢిల్లీ:** రంజీ ట్రోఫీలో విదర్భతో జరిగిన సెమీ ఫైనల్ మ్యాచ్‌లో ముంబై 365 పరుగులు వెనుకబడి ఉంది. విదర్భ భారత స్టార్ ఆల్‌రౌండర్ శివమ్ దూబె ఈ మ్యాచ్‌లో చెలరేగిపోయాడు. విదర్భతో జరుగుతున్న మ్యాచ్‌లో ముంబై తరపున దూబే 5వికెట్ల ప్రదర్శనతోమెరిశాడు. దూబే ధాటికి విదర్భ తొలిఇన్నింగ్స్‌లో 383 పరుగులకు ఆలౌటైంది. ఓవర్‌నైట్ స్కోర్ 308/5 వద్ద రెండో రోజు ఆటను ప్రారంభించిన విదర్భ మరో 75పరుగులు మాత్రమే జోడించి మిగతా 5 వికెట్లు కోల్పోయింది. తొలిరోజు ఆటలో 2 వికెట్లు తీసిన దూబే రెండో రోజు చెలరేగిపోయి మరో 3 వికెట్లు తీశాడు. ఈ మ్యాచ్లో దూబే పార్థ్ రేఖడే, కీలకమైన కరుణ్ నాయర్, హర్ష్ దూబే, భూటే, యశ్ ఠాకూర్ వికెట్లు తీశాడు. ముంబై బౌలర్లలో షమ్స్ ములానీ, రాయ్‌స్టన్ డయాస్ తలో 2, శార్దూల్ ఠాకూర్ 1 వికెట్ తీశారు. విదర్భ ఇన్నింగ్స్‌లో ధృవ్ షోరే (74), దినిశ్ మాలేవార్ (79), యశ్ రాథోడ్ (54) అర్ధ సెంచరీలతో రాణించగా, కరుణ్ నాయర్ (45), కెప్టెన్ అక్షయ్ వాద్కర్ (34) ఓ మోస్తరు స్కోర్లు చేశారు. అథర్వ తైడే4, పార్థ్ రేఖడే 23, హర్ష్ దూబే 18, భూటే 11, యశ్ ఠాకూర్ 3 పరుగులు చేసి ఔట్ కాగా, దర్శన్ నల్కండే 12 పరుగులతో అజేయంగా నిలిచాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన ముంబై 18 పరుగుల వద్దే తొలి వికెట్ కోల్పోయింది. దర్శన్ నల్కండే బౌలింగ్‌లో దనిశ్ మలేవార్‌కు క్యాచ్ ఇచ్చి ఆయుశ్ మాత్రే (9) ఔటయ్యాడు. ప్రస్తుతం ఆకాశ్ ఆనంద్ (7), సిద్దేశ్ లాడ్ (0) క్రీజ్లో ఉన్నారు. విదర్భ తొలి ఇన్నింగ్స్ స్కోర్‌కు ముంబై ఇంకా 365 పరుగులు వెనుకపడి ఉంది.

# నేటి నుండి ఛాంపియన్స్ ట్రోఫీ



### భారత్‌కు గ్రూప్ స్టేజ్ మ్యాచ్‌లే కీలకం
### పాకిస్థాన్, న్యూజిలాండ్‌తోనే అగ్ని పరీక్ష

**న్యూఢిల్లీ:** ప్రతిష్టాత్మకమైన ఛాంపియన్స్ ట్రోఫీకి సర్వం సిద్ధమైంది. ఇంగ్లాండ్‌తో జరిగిన వన్డే సిరీస్ క్లీన్‌స్వీప్ చేసిన టీమ్‌ఇండియా ఈ నెల 19 నుంచి జరిగే ఛాంపియన్స్ ట్రోఫీ కోసం సన్నద్ధమవుతోంది. ఈ ఛాంపియన్స్ ట్రోఫీలో 8 జట్లు పోటీపడుతున్నాయి. ఈ సారి వన్డే ఫార్మాట్‌లో ఛాంపియన్స్ ట్రోఫీ జరగనుంది. టీమ్‌ఇండియా మ్యాచులన్నీ దుబాయ్ లోనే జరగనున్నాయి.

ఇక గ్రూపు దశ మ్యాచ్‌లే భారత్‌కు కీలకం కానుంది. ఈ ట్రోఫీకి ఆతిథ్యం ఇస్తున్న డిఫెండింగ్ ఛాంపియన్ పాకిస్థాన్, తాజాగా ముక్కోణపు సిరీస్‌ను సొంతం చేసుకున్న న్యూజిలాండ్, సంచలనాలు సృష్టించే బంగ్లాదేశ్‌తో గ్రూప్ దశలో భారత్ తలపడనుంది. ముఖ్యంగా పాకిస్థాన్, న్యూజిలాండ్ నుంచి టీమ్‌ఇండియాకు పెద్ద అగ్ని పరీక్షే. గ్రూప్ దశలో టాప్2లో నిలిచే జట్లే సెమీస్‌కు అర్హత సాధించనున్న నేపథ్యంలో ప్రతీ మ్యాచ్ కూడా భారత్ జట్టుకు కీలకంగా మారింది. గ్రూప్ ఎ లో భారత్, పాకిస్థాన్, న్యూజిలాండ్, బంగ్లాదేశ్ ఉన్నాయి. గ్రూప్ ఎ లో భారత్ మూడు మ్యాచ్‌లు ఆడనుంది. టాప్2 జట్లు సెమీస్‌కు చేరుకుంటాయి. గ్రూప్ దశలో ఒక్క మ్యాచ్ ఓడినా సెమీస్ అవకాశాలు సంక్లిష్టంగా మారతాయి. ఏ మాత్రం భారీ ఓటమి ఎదురైనా సరే ఇంటి ముఖం పట్టాల్సిందే. ఈసట్రోఫీలో సెమీస్‌కు చేదాలంటే భారత్ మూడు మ్యాచుల్లోనూ గెలవాలి. ఏమాత్రం ఒక్క ఓడినా ఇతర జట్లు ఆడే మ్యాచ్‌ల ఫలితాలపై ఆధారపడాల్సి వస్తుంది. గ్రూప్ స్టేజ్‌ను దాటడం కష్టమవుతుంది. కాగా గ్రూప్ ఎ లో భారత్ తొలి మ్యాచ్ 20న బంగ్లాదేశ్‌తో ఆడనుంది. 2023 వన్డే ప్రపంచకప్ తర్వాత ఆడిన 12 వన్డేల్లో కేవలం 4 మ్యాచ్‌లనే బంగ్లాదేశ్ నెగ్గింది. 2007 వన్డే ప్రపంచకప్‌లో టీమ్‌ఇండియాకు బంగ్లా షాకిచ్చింది. అయితే బంగ్లా క్రికెటర్లకు 50 ఓవర్ల క్రికెట్ ప్రాక్టీస్ కూడా లేదు. వీరంతా నేరుగా బంగ్లాదేశ్ ప్రీమియర్ లీగ్ నుంచి వచ్చారు.

కెప్టెన్ షాంటోతో పాటు, మహ్మదుల్లా, ముష్ఫికర్ రహీం, ముస్తాఫిజుర్‌పైనే బంగ్లా ఎక్కువగా ఆధారపడి ఉంది. దీంతో బంగ్లాదేశ్‌తో మ్యాచ్‌లో భారీ విజయం సాధించి సెమీస్ అవకాశాలు మెరుగుపర్చుకోవాలని భారత్ భావిస్తోంది. ఇక 23న దుబాయ్ వేదికగా దాయాదులు తలపడనున్నాయి. డిఫెండింగ్ ఛాంపియన్‌గా పాకిస్థాన్ బరిలోకి దిగుతోంది. 2017 ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌లో భారత్‌పైనే పాక్ విజయం సాధించి టైటిల్‌ను నెగ్గింది. ఆ మ్యాచ్ ఓటమికి ఇప్పుడు ప్రతీకారం తీర్చుకోవాలని భారత్ పట్టుదలతో ఉంది. కెప్టెన్ మహ్మద్ రిజ్వాన్, సల్మాన్ అఘా మంచి ఫామ్‌లో ఉండటం పాక్‌కు కలిసొచ్చే అంశం. స్టార్ బ్యాటర్ బాబర్ అజామ్ పరుగులు చేయడంలో ఇబ్బంది పడుతున్నాడు. ఫామ్‌లో ఉన్న యువ సంచలనం సయీమ్ అయుబ్ గాయం కారణంగా వైదొలగడం పాక్‌కు నష్టమే. పాక్ పేస్ త్రయం షహీన్, రవూఫ్, నసీమ్ భారత్‌పై అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చేందుకు ఎదురు చూస్తున్నారు. మరోపక్క భారత్‌కు న్యూజిలాండ్ నుంచి కఠిన సవాల్ తప్పదు. ఆ జట్టులోని ప్రధాన బ్యాటర్లు డేవన్ కాన్వే, టామ్ లేథమ్, కేన్ విలియమ్సన్, డారిల్ మిచెల్, గ్లెన్ ఫిలిప్స్ మంచి ఫామ్‌లో ఉన్నారు. అయితే, ప్రధాన పేసర్లు టిమ్ సౌథీ, ట్రెంట్ బౌల్ట్, లాకీ ఫెర్గూసన్ లేకుండానే ఆడనున్న నేపథ్యంలో న్యూజిలాండ్ పేస్ విభాగం కాస్త బలహీనంగానే ఉంది. కివీస్ బౌలింగ్‌తో పోలిస్తే బ్యాటింగ్ బలంగా ఉంది.

## పింక్ లేడీస్ కప్ ఫుట్‌బాల్ టోర్నీకి..
# భారత్ జట్టు ఖరారు
### తెలంగాణ అమ్మాయికి చోటు

**న్యూఢిల్లీ:** నాలుగు దేశాలు పాల్గొనే పింక్ లేడీస్ కప్ అంతర్జాతీయ మహిళల ఫుట్‌బాల్ టోర్నమెంట్ కోసం భారత జట్టును ప్రటించారు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని షార్జాలో ఈ నెల 20 నుంచి 26వ తేదీ వరకు ఈ టోర్నీ జరుగుతుంది. 23 మంది సభ్యులతో కూడిన భారత జట్టులో తెలంగాణ అమ్మాయి, నిజామాబాద్ జిల్లాకు చెందిన గుగులోత్ సౌమ్య చోటు సంపాదించింది.



7 నుంచి అనంతపురంలో శిక్షణ శిబిరంలో పాల్గొంటున్న భారత జట్టు మంగళవారం యూఏఈకి బయలుదేరివెళ్లింది. భారత జట్టు తమ తొలి మ్యాచ్‌ను ఈనెల 20న జోర్డాన్‌తోను, రెండో మ్యాచ్‌ను 23న రష్యాతో, మూడో మ్యాచ్ 26న దక్షిణకొరియా జట్టుతో ఆడుతుంది. ఈ ఏడాది మే-జూన్‌లో జరిగేఆసియా కప్-2027 క్వాలిఫయర్స్ టోర్నీకి సన్నాహాల్లో భాగంగా పింక్ లేడీస్ కప్‌లో భారత జట్టు బరిలోకి దిగుతోంది. పింక్ లేడీస్ కప్ టోర్నీ ద్వారా భారత క్రీడాకారిణులకు తమ సామర్థ్యమేంటో తెలుస్తుంది. కాగా రష్యాతో పోలిస్తే దక్షిణ కొరియా జట్టు పూర్తి భిన్నంగా ఉంటుంది. రష్యా శైలితో పోలిస్తే కొరియా ఆటలో చాలా వేగం ఉంటుంది. ఈ జట్ల బలా బలాలను పరిగణనలోకి తీసుకుని భారత జట్టు రెండు రకాలుగా వ్యూహాలు రచించి ఆడాల్సి ఉంటుంది. ఇక ఈ పింక్ లేడీస్ కప్‌లో తలపడే భారత మహిళల ఫుట్‌బాల్ జట్టులో ఎలాంగ్‌బమ్ పంథోయ్ చాను, పాయల్ బసుదె, శ్రేయా హుడా (గోల్కీపర్లు), అరుణ బాగ్, కిరన్ పిస్దా, మార్టినా థోక్‌చోమ్, నిర్మలా దేవి ఫాన్‌జుబమ్, పూర్ణిమ కుమారి, సంజు, సిల్కీ దేవి హేమమ్, స్వీటీ దేవి ఎన్‌గాంగ్బమ్ (డిఫెండర్లు), బబీనా దేవి లిషామ్, గ్రేస్ డాంగ్మె, మోసుమి ముర్ము, ప్రియదర్శిని సెల్లాదురై, ప్రియాంక దేవి నోరెమ్, రత్నబాల దేవి నోంగ్మైథెమ్ (మిడ్ ఫీల్డర్లు), కరిష్మా పురుషోత్తమ్, లిండా కోమ్ సెర్టో, మనీషా, రేణు, సంధ్య రంగనాథన్, సౌమ్య గుగులోత్ (ఫార్వర్డ్స్) ఉన్నారు.

# ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్‌గా రాహుల్

**న్యూఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)-2025 సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ ఫ్రాంచైజీ తమ జట్టుకు కొత్త సారథిని నియమించనుంది. తాజా సమాచారం ప్రకారం, భారత క్రికెట్ జట్టు వికెట్‌కీపర్, బ్యాట్స్‌మన్ అయిన కేఎల్ రాహుల్‌ను ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్‌గా ఎంచుకోనుంది. ఇప్పటి వరకు, రాహుల్ లక్నో సూపర్ జెయింట్స్ జట్టుకునాయకత్వం వహించాడు. అయితే 2025 ఐపీఎల్ మెగా వేలంలో ఢిల్లీ క్యాపిటల్స్ రాహుల్‌ను రూ. 14 కోట్లకు కొనుగోలు చేసింది. రాహుల్‌కు ఐపీఎల్‌లో విశేష అనుభవం ఉంది. 2013లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టుతోతన ఐపీఎల్ ప్రయాణాన్ని ప్రారంభించిన రాహుల్, సన్‌రైజర్స్ హైదరాబాద్,కింగ్స్ ఎలెవన్ పంజాబ్ (ప్రస్తుతం పంజాబ్ కింగ్స్), లక్నో సూపర్ జెయింట్స్ వంటి జట్లకు ప్రాతినిధ్యం వహించాడు. 2022 సీజన్‌లో లక్నో జట్టుకు కెప్టెన్‌గా నియమితులైన రాహుల్, 3సీజన్లపాటు ఆ జట్టుకు నాయకత్వం వహించాడు. 2025 సీజన్‌కు ముందు, లక్నో సూపర్ జెయింట్స్ జట్టు రిషభ్ పంత్‌ను కెప్టెన్‌గా నియమించుకుంది, దీంతో రాహుల్ ఢిల్లీ క్యాపిటల్స్ జట్టులో చేరాడు. రాహుల్ మిడిల్ ఆర్డర్ బ్యాటింగ్‌ను మెరుగుపరచే అవకాశం ఉంది. అతని స్థిరత, క్లాస్ బ్యాటింగ్ శైలి జట్టుకు చాలా బలాన్ని అందించగలదు. ఐపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ టీమ్: అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్, ట్రిస్టన్ స్టబ్స్, అభిషేక్ పోరెల్, మిచెల్ స్టార్క్, రీలి రాహుల్, హ్యారీ బ్రూక్, జేక్ ఫ్రేజర్‌మెక్‌గుర్క్, గి. నటరాజన్, కరుణ్ నాయర్, సమీర్ రిజ్వీ, అశుతోష్ శర్మ, మోహిత్ శర్మ, ఫాఫ్ డు ప్లెసిస్, ముఖేష్ కుమార్, దర్శన్ నల్కాండే, విప్రజ్ నిగమ్, దుష్మంత చమీర, డోనోవన్ ఫెర్రీరా, అజయ్ మండల్, మన్వంత్ కుమార్, త్రిపురాన విజయ్, మాధవ్ తివారీ.



## మహిళల ప్రీమియర్ లీగ్‌లో దూసుకుపోతున్న
# రాయల్ ఛాలెంజర్స్
### రాణించిన స్మృతి, రేణుక
**8 వికెట్ల తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్‌పై గెలుపు**

**ఢిల్లీ:** ఉమెన్ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) టి20 క్రికెట్ టోర్నీలో డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు దూసుకుపోతోంది. టోర్నీ తొలి పోరులో గుజరాత్ జెయింట్స్‌ను అలవోకగా ఓడించిన బెంగుళూరు టీమ్ వరుసగా రెండో విజయాన్ని అందుకుంది. వడోదరలో ఏకపక్షంగా సాగిన పోరులో గత ఏడాది రన్నరప్ ఢిల్లీ క్యాపిటల్స్‌ను చిత్తు చేసింది. ముందుగా పదునైన బౌలింగ్‌తో ప్రత్యర్థిని కట్టడి చేసిన రాయల్ ఛాలెంజర్స్ ఆ తర్వాత స్మృతి వ్యాట్ దూకుడైన బ్యాటింగ్‌తో మరో 22 బంతులు మిగిలి ఉండగానే గెలుపు పూర్తి చేసుకుంది. దీంతో ఈ మ్యాచ్‌లో బెంగళూరు 8 వికెట్ల తేడాతో ఢిల్లీపై గెలిచింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ 19.3 ఓవర్లలో 141 పరుగులకే ఆలౌటైంది. జెమీమా రోడ్రిగ్స్ (22 బంతుల్లో 34; 4 ఫోర్లు, 2 సిక్సు) టాప్ స్కోరర్‌గా నిలవగా, సారా బ్రైస్ (19 బంతుల్లో 23; 2 ఫోర్లు) కాస్త పోరాడింది. మిగతా బ్యాటర్లంతా విఫలం కావడంతో జట్టు తక్కువ స్కోరుకే పరిమితమైంది. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ రేణుకా సింగ్ (3/23), జార్జియా వేర్‌హామ్ చెరో 3 వికెట్లు పడగొట్టగా గార్త్, బిష్ట్ చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం బెంగళూరు 16.2 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 146 పరుగులు చేసింది. స్మృతి మంధాన (47 బంతుల్లో 81; 10 ఫోర్లు, 3 సిక్స్‌లు), డానీ వ్యాట్ (33 బంతుల్లో 42; 7 ఫోర్లు) తొలి వికెట్‌కు 65 బంతుల్లోనే 107 పరుగులు జోడించి జట్టు విజయాన్ని సునాయాసం చేశారు. స్కోరు వివరాలు చూస్తే ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్‌లో లానింగ్ (సి) పెరీ(బి) గార్త్ 17; షఫాలీ (సి) స్మృతి (బి) రేణుక 0; జెమీమా (స్టంప్డ్) రిచా (బి) వేర్హామ్ 34; నెదర్లాండ్ (సి) స్మృతి (బి) రేణుక 19; కాప్ (సి) వ్యాట్ (బి) బిష్ట్ 12; జొనాసెన్ (సి) కనిక (బి) బిష్ట్ 1; బ్రైస్ బ్రై (స్టంప్డ్) రిచా (బి) వేర్హామ్ 23; శిఖా (సి) బిష్ట్ (బి) రేణుక 14; రాధ (సి అండ్ బి) వేర్హామ్ 0; అరుంధతి రెడ్డి (సి) పెరీ (బి) గార్త్ 4; మిన్ను మణి (నాటౌట్) 4; ఎక్స్‌ట్రాలు 12; మొత్తం (19.3 ఓవర్లలో ఆలౌట్) 141. రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్‌లో స్మృతి (సి) అరుంధతి (బి) శిఖా 81; డానీ వ్యాట్ (సి) జెమీమా (బి) అరుంధతి 42; ఎలీస్ పెరీ(నాటౌట్) 7; రిచా (నాటౌట్) 11; ఎక్స్ట్రాలు 5; మొత్తం (16.2 ఓవర్లలో 2 వికెట్లకు) 142 పరుగులుగా ఉంది.

# వాణిజ్యం

# బంగారం దిగుమతులు పైపైకి

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18:** జనవరిలో దేశంలో బంగారం దిగుమతులు 40.79శాతం పెరిగి 2.68 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. దేశీయ డిమాండ్ పెరగడం వల్ల బంగారం దిగుమతులు పెరిగాయి. ఈ సమాచారం వాణిజ్య మంత్రిత్వ శాఖ డేటా నుంచి అందింది. ఒక సంవత్సరం క్రితం జనవరి 2024లో బంగారం దిగుమతులు 1.9బిలియన్ డాలర్లు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్-జనవరి కాలంలో బంగారం దిగుమతులు 32శాతం పెరిగి 50 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఇది 37.85 బిలియన్ డాలర్లుగా ఉంది. దిగుమతుల పెరుగుదల ఈ విలువైన లోహాన్ని సురక్షితమైన ఆస్తిగా పెట్టుబడిదారుల బలమైన విశ్వాసాన్ని కూడా సూచిస్తుంది. ప్రపంచ అనిశ్చితుల కారణంగా పెట్టుబడులను వైవిధ్య పరచడానికి బంగారంలో పెట్టుబడి పెట్టడం, బ్యాంకుల నుంచి డిమాండ్, కస్టమ్ డ్యూటీ తగ్గింపు ఇతర కారణాలు. దేశ రాజధాని ఢిల్లీలో ఈ యేడాది ఇప్పటి వరకు బంగారం ధర 11శాతం పెరిగి 10గ్రాములకు రూ.88,200కి చేరుకుంది. 2023-24లో భారత దేశ బంగారం దిగుమతులు 30శాతం పెరిగి 45.54బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. బంగారం దిగుమతులు దేశ కరెంట్ లోటుపై ప్రభావం చూపుతాయి. బంగారం దిగుమతులలో స్విట్జర్లాండ్ అతిపెద్ద వనరుగా ఉంది. దీని వాటా దాదాపు 40శాతం. దీని తర్వాత యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (16శాతం కంటే ఎక్కువ), దక్షిణాఫ్రికా (సుమారు 10శాతం) ఉన్నాయి. దేశ మొత్తం దిగుమతుల్లో ఈ విలువైన లోహం వాటా ఐదు శాతం కంటే ఎక్కువ. బంగారం దిగుమతుల పెరుగుదల జనవరిలో దేశ వాణిజ్య లోటు (దిగుమతులు, ఎగుమతుల మధ్య వ్యత్యాసం) 23 బిలియన్ డాలర్లకు చేరుకుంది. చైనా తర్వాత భారతదేశం ప్రపంచంలో రెండవ అతిపెద్ద బంగారం వినియోగదారు దేశం. దిగుమతులు ప్రధానంగా ఆభరణాల పరిశ్రమ అవసరాల కోసమే. గత నెలలో రత్నాలు, ఆభరణాల ఎగుమతులు వార్షిక ప్రాతిపదికన 15.95శాతం పెరిగి దాదాపు 3 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. జనవరిలో దేశంలో వెండి దిగుమతులు 82.84 శాతం పెరిగి 883.2 మిలియన్ డాలర్లకు చేరుకున్నాయి.



# నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ముంబై, ఫిబ్రవరి 18:** దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం ఫ్లాట్‌గా ముగిసాయి. అంతర్జాతీయ మార్కెట్లలో మిశ్రమ సంకేతాల మధ్య ఉదయం ఫ్లాట్‌గా ప్రారంభమైన సూచీలు కాసేపటికే నష్టాల్లోకి జారుకున్నాయి. రోజంతా తీవ్ర ఒడుదుడుకులు ఎదుర్కొన్న సూచీలు, చివరికి ఫ్లాట్‌గా ముగిసాయి. సెన్సెక్స్ 20 పాయింట్లు క్షీణించి 75,967 పాయింట్ల వద్ద నిలిచింది. నిఫ్టీ కూడా 14 పాయింట్లు నష్టపోయి 22,945 పాయింట్ల వద్ద నిలిచింది. ఇండస్ ఇండ్ బ్యాంకు, మహీంద్రా అండ్ మహీంద్రా, అల్ట్రాటెక్ సిమెంట్, హిందుస్థాన్ యూనిలీవర్, ఐటిసి, టిసిఎస్, సన్‌ఫార్మా, ఏసియన్ పెయింట్స్, ఐసిఐసిఐ బ్యాంకు, టాటా మోటార్స్ వంటి షేర్లు నష్టాల్లో ముగిసాయి. ఎన్‌టిపిసి, టెక్ మహీంద్రా, జొమాటో, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, కోటాక్ మహీంద్రా బ్యాంకు, హెచ్‌సిఎల్ టెక్నాలజీస్, ఇన్ఫోసిస్, బజాజ్ ఫైనాన్స్ వంటి షేర్లు లాభాల్లో ముగిసాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడాయిల్‌బ్యారెల్ ధర 75.84డాలర్ల వద్ద ట్రేడవగా, బంగారం ఔన్సు 2,925.20 డాలర్ల వద్ద నిలిచింది. అదేవిధంగా డాలరుతో మారకంలో రూపాయి విలువ రూ.86.96 వద్ద స్థిరపడింది.



# ఇన్ఫోసిస్‌పై కాగ్నిజెంట్ ధ్వజం

**ముంబై, ఫిబ్రవరి 18:** ప్రముఖ ఐటిదిగ్గజ సంస్థలైన కాగ్నిజెంట్, ఇన్ఫోసిస్‌ల మధ్య పోరు కొనసాగుతోంది. యుఎస్‌లో ఓ దావాపై ఈ ఇరు సంస్థలు గత కొంతకాలంగా పోరాడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇన్ఫోసిస్‌పై కాగ్నిజెంట్ పెద్ద ఎత్తున ఆరోపణలు చేసినట్లు తెలుస్తోంది. తమ హెల్త్ కేర్ సాఫ్ట్‌వేర్ ట్రైజెట్టో నుంచి వాణిజ్య రహస్యాలని ఇన్ఫీ దొంగిలించిందని విమర్శించింది. ఈ విషయాన్ని ఉటంకిస్తూ కొన్ని కథనాలు వెలువడ్డాయి. నాన్ డిస్‌క్లోజర్ అండ్ యాక్సెస్ అగ్రిమెంట్ ద్వారా ట్రైజెట్టో వాణిజ్య రహస్యాలను దుర్వినియోగం చేస్తూ ఇన్ఫోసిస్ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడిందంటూ కాగ్నిజెంట్ ఆరోపించింది. అంతేకాదు, ఈ విషయంపై ఆడిట్ చేసేందుకు ఆ కంపెనీ నిరాకరించిందని కాగ్నిజెంట్ తెలిపింది. హెల్త్ కేర్ సాఫ్ట్‌వేర్ ట్రైజెట్టో నుంచి వాణిజ్య రహస్యాలను ఇన్ఫోసిస్ దొంగిలించిందని ఆరోపించిన కాగ్నిజెంట్ 2024 ఆగస్టులో అమెరికా కోర్టులో దావా వేసింది. ఈ ఆరోపణల్ని ఇన్ఫోసిస్ తిరస్కరించింది. కాగ్నిజెంట్ హెల్త్‌కేర్ సొల్యూషన్స్ బహిరంగంగా ఉన్నాయని తెలిపింది. అంతేకాకుండా ప్రస్తుతం కాగ్నిజెంట్‌లో ఉన్న రవికుమార్, తమవద్ద పనిచేసిన సమయంలో హెల్త్‌కేర్ సాఫ్ట్‌వేర్ విడుదల చేయడాన్ని ఆలస్యం చేశారని



ఇన్ఫోసిస్ ప్రత్యారోపణలు చేసింది. కాగ్నిజెంట్‌లో ఉద్యోగం కోసం ఆయన చర్చలు జరిపారని పేర్కొంది. ఇన్ఫోసిస్ అధ్యక్షుడిగా వ్యవహరించిన రవికుమార్ 2022 అక్టోబర్‌లో ఆసంస్థను విడిచిపెట్టారు. ఆ మరుసటి యేడాది జనవరిలోనే కాగ్నిజెంట్‌లో సిఇఒగా చేరారు. ఈ రెండు ఐటి కంపెనీలు ఆరోగ్య సంరక్షణ సేవల రంగంలో పోటీపడుతున్నాయి. ఇన్ఫోసిస్ ఆదాయంలో దాదాపు 7.5శాతం లైఫ్ సైన్సెస్ విభాగం నుంచి పొందుతోంది.


# భారత్‌లో టెస్లా నియామకాలు షురూ

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18:** టెక్ దిగ్గజం టెస్లా భారత్ మార్కెట్లోకి అడుగుపెట్టేందుకు ఎంతో కాలంగా ప్రయత్నాలుచేస్తోంది. కానీ సుంకాలు, ఇతరత్రా కారణాలతో ఆ ప్రణాళికలు ఇప్పటివరకూ కార్యరూపం దాల్చలేదు. ఇప్పుడు అందుకు సంబంధించి కీలక ముందడుగు పడినట్లు తెలుస్తోంది. తాజాగా ఈ కంపెనీ భారత్‌లో నియామకాల ప్రక్రియ చేపట్టి, ఎంట్రీపై సంకేతాలిచ్చింది. భారత ప్రధాని నరేంద్రమోడీతో టెస్లా అధినేత ఎలాన్ మస్క్ భేటీ అయిన కొన్ని రోజులకే ఈ పరిణామాలు చోటు చేసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. కస్టమర్ రిలేటెడ్, బ్యాక్‌ఎండ్ జాబ్ సహా 13 ఉద్యోగాల భర్తీకి అభ్యర్థులు కావాలంటూ టెస్లా సోమవారం తమ లింక్డిన్ పేజీలో ఓ ప్రకటన చేసింది. ఇందులో సర్వీస్ టెక్నీషియన్, అడ్వైజరీ సహా కనీసం ఐదు పొజిషన్లకు ఉద్యోగులను ముంబై, ఢిల్లీ రెండు చోట్లా నియమించుకోనున్నట్లు కంపెనీ తెలిపింది. ఇక కస్టమర్ ఎంగేజ్‌మెంట్ మేనేజర్, డెలివరీ ఆపరేషన్స్ స్పెషలిస్ట్ వంటి ఉద్యోగులను కేవలం ముంబై కేంద్రంగా తీసుకోనున్నట్లు ఆ ప్రకటనలో పేర్కొంది. టెస్లా భారత మార్కెట్లోకి ప్రవేశించేందుకు 2021 నుంచి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇందుకోసం 'ఇవి'లపై దిగుమతి సుంకాలను గణనీయంగా తగ్గించాలని మస్క్ కంపెనీ డిమాండ్ చేసింది. ఇందుకు కేంద్రప్రభుత్వం కొన్ని షరతులు విధించింది. దేశీయంగా తయారీ ప్రారంభించడంతో పాటు ప్రాంతీయంగానే విడిభాగాలు కొనుగోలు చేయాలన్న కండీషన్ పెట్టింది. ఇందుకు మస్క్ అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. దీంతో టెస్లా ఎంట్రీ ఆలస్యమవుతూ వస్తోంది. ఈ క్రమంలోనే ఇటీవల 40వేల డాలర్ల కంటే ఎక్కువ ఖరీదైన హైఎండ్ కార్లపై బేసిక్ కస్టమ్స్ సుంకాన్ని 110 శాతం నుంచి 70శాతానికి తగ్గించింది. మరోవైపు గత వారం అమెరికా పర్యటనలో ఉన్న ప్రధాని మోడీతో మస్క్ భేటీ అయ్యారు. ఈ సమావేశంలో సుంకాల అంశం చర్చకు వచ్చినట్లు తెలిసింది. తాజా పరిణామాలతో త్వరలోనే దేశీయ రోడ్లపై టెస్లా కార్లు చక్కర్లు కొట్టే అవకాశాలున్నట్లు ఆటో రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.




# రూ.81వేల కోట్లు బిగ్ ఇన్వెస్టర్ల సంపద హుష్‌కాకి!

**ముంబై, ఫిబ్రవరి 18:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు గత కొన్ని నెలలుగా తీవ్రమైన అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. ముఖ్యంగా విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు (ఎఫ్‌ఐఐ) విక్రయాలతో సూచీలు భారీగా పతనమయ్యాయి.దీంతో చాలా మంది రిటైల్ ఇన్వెస్టర్ల పోర్ట్ ఫోలియోలు కరిగిపోయాయి. ముఖ్యంగా కొత్తగా మార్కెట్లోకి వచ్చినవారు ఈ నష్టాలు చూసి తలలు పట్టుకుంటున్నారు. సాధారణ ఇన్వెస్టర్లే కాదు, దేశంలోని పెద్ద పెద్ద ఇన్వెస్టర్లుగా పేరొందిన వారి పోర్ట్‌ఫోలియోలూ ఇందుకు మినహాయింపు కాదని తాజా డేటా చెబుతోంది. సెన్సెక్స్ గతేడాది గరిష్ఠంగా 85వేల మార్కు దాటింది. నిఫ్టీ కూడా 26వేలమార్కును అందుకుంది. ఆ తర్వాత మొదలైన అమ్మకాల ఒత్తిడితో రెండు బెంచ్‌మార్క్ సూచీలు భారీగా పతనమయ్యాయి. సెన్సెక్స్ 11శాతం కరెక్షన్‌కు లోనైంది. నిఫ్టీ ఏకంగా 15శాతం క్షీణించి 22,800 పాయింట్ల స్థాయి వద్ద కొనసాగింది. డీమార్ట్ పేరుతో రిటైల్ చైన్ నిర్వహిస్తున్న రాధాకృష్ణ దమానీ వ్యాపారవేత్తే కాదే, ప్రఖ్యాత ఇన్వెస్టర్ కూడా. ఆయన సంపద అక్టోబరు 1 నుంచి దాదాపు 28వేల మేర క్షీణించింది. అంటే దాదాపు రూ.64వేల కోట్లు కోల్పోయారు. ఆయన పోర్ట్‌ఫోలియో విలువ రూ.2.31 లక్షల కోట్ల నుంచి రూ.1.67 లక్షల కోట్లకు తగ్గింది. ఒక్క దమానీ మాత్రమే కాకుండా ప్రముఖ ఇన్వెస్టర్ల దివంగత రాకేష్ ఝున్‌ఝున్‌వాలా కుటుంబం కూడా 18శాతం విలువను కోల్పోయింది. ప్రస్తుతం ఆ కుటుంబం పోర్ట్‌ఫోలియో విలువ రూ.59,709 కోట్లుగా ఉంది. వీరితో పాటు హేమంత్ కొఠారి 28శాతం, ఆకాష్ బన్సాలీ 15శాతం చొప్పున వారి పోర్ట్‌ఫోలియోలు క్షీణించాయి. ముకుల్‌అగర్వాల్, ఆశిష్‌ధావన్, నిమేశ్ షా, యుసప్పాలీ కదేర్, ఆశిష్ కచోలియా, అనిల్‌కుమార్ గోయల్ వంటివారు ఈటాప్-10 జాబితాలోఉన్నారు.వీరితోపాటు విజయ్‌కేడియా, హితేష్ దోషి, విశ్వాస్ పటేల్, అనుజ్ సేథ్ వంటి పేరొందిన ఇన్వెస్టర్ల సంపదా ఆవిరైంది.



# జియో థింగ్స్‌తో ప్యూర్ 'ఇవి' టైఅప్

**ముంబై, ఫిబ్రవరి 18:** ప్రముఖ ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన తయారీదారు ప్యూర్ 'ఇవి' తన ఉత్పత్తుల్లో స్మార్ట్ డిజిటల్ క్లస్టర్లను ఏకీకృతం చేయడానికి జియో ప్లాట్‌ఫామ్ లిమిటెడ్ అనుబంధ సంస్థ జియో థింగ్స్ లిమిటెడ్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ భాగస్వామ్యం వల్ల అధునాతన ఐఒటి పరిష్కారాలు, అంతరాయం లేని కనెక్టివిటీ, పూర్తి డిజిటల్ ఇంటిగ్రేషన్‌ను అందించేందుకు తోడ్పడుతుందని కంపెనీ తెలిపింది. జియోథింగ్స్ ఇంటిగ్రేషన్ సాయంతో ద్విచక్రవాహనంలో ఎంటర్‌టైన్‌మెంట్, నావిగేషన్ సేవలు వంటి వాటిని వాయిస్ ద్వారా నియంత్రించవచ్చని సంస్థ తెలిపింది. వాహనదారులు వారి ప్రాధాన్యతలకు అనుగుణంగా వాహనంలోని టెక్నాలజీ ఇంటర్‌ఫేస్‌ను మార్చుకోవచ్చు. అందుకోసం వాయిస్ కమాండ్లను ఉపయోగించవచ్చు. దాంతో మెరుగైన రైడింగ్ అనుభూతిని పొందవచ్చని కంపెనీ స్పష్టం చేసింది. ప్యూర్ 'ఇవి' జియోథింగ్స్ స్మార్‌డిజిటల్ క్లస్టర్ల సాయంతో ఎండ్-టు-ఎండ్ ఐఒటి పరిష్కారాలు అందించేందుకు ప్రయత్నిస్తుంది. వాహనాల పనితీరును ట్రాక్ చేయడానికి 4జి కనెక్టివిటీ ఎనేబుల్ చేసిన టెలిమాటిక్స్ ద్వారా రియల్ టైమ్‌లో వాహనంకండిషన్‌ను పర్యవేక్షించవచ్చు.



ఇందుకోసం జియోథింగ్స్ 4జి స్మార్ట్ డిజిటల్ క్లస్టర్ ఆండ్రాయిడ్ ఓపెన్ సోర్స్ ప్రాజెక్ట్ (ఎఒఎస్‌పి) 'అవ్ని ఒఎస్'ను ఉప యోగిస్తుంది. ఇది రియల్ టైమ్ డేటా అనలిటిక్స్, టూ వీలర్ ఇంటర్‌ఫేస్ కస్టమైజేషన్, ఫుల్ హెచ్‌డి టచ్‌స్క్రీన్ డిస్ప్లే కంపాటబిలిటీని అందిస్తుంది. జియోస్టోర్, మ్యూజిక్ స్ట్రీమింగ్, వెబ్‌బ్రౌజింగ్, హ్యాండ్స్ ఫ్రీవాయిస్ అసిస్టెన్స్, నావిగేషన్, గేమింగ్‌తో పాటు మరెన్నో సదుపాయాలను అందిస్తున్నారు. జియో థింగ్స్ ఐఒటి టెక్నాలజీసాయంతో ప్యూర్ 'ఇవి' ఉత్పత్తులను పరిశ్రమ అత్యున్నత ప్రమాణాలకు తీసుకెళ్లేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు సంస్థ వ్యవస్థాపకులు, ఎండి డాక్టర్ నిశాంత్ దోంగారి అన్నారు. వాహనాల సామర్థ్యం, ఎలక్ట్రిక్ మొబిలిటీని పెంచాలనిలక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. సంస్థ వినియోగదారులకు సాంకేతికతసాయంతో మెరుగైన కనెక్టివిటీ,ఫంక్షనాలిటీని అందించనున్నట్లు చెప్పారు.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14